
# ఆదివాసులు

## వైద్యం సంస్కృతి అణచివేత



కె.బాలగోపాల్

# ఆదివాసులు

## వైద్యం సంస్కృతి అణచివేత

కె. బాలగోపాల్

ప ర్ స్పె క్టి వ్స్

ఆదిలాబాద్ నేలలు నిన్న మొన్నటి దాకా దట్టమయిన అడవిని మోసిన ఎగుడు దిగుడు నేలలయినప్పటికీ చాలా సారవంతమయిన నల్లరేగడి నేలలు. కొంచెం శ్రద్ధ పెట్టే పాలకులుంటే బంగారం పండించగలవు. కానీ ఇక్కడి జనం అత్యధికంగా ఆదివాసులు కావడం వల్ల వీరి విషయంలో శ్రద్ధ పెట్టవలసిన అగత్యం ఉన్నట్టు ఈ రాష్ట్రాన్ని ఏలిన ఏ పార్టీ భావించలేదు. నిజానికి ఇది ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ తాలూకాలకే కాదు మొత్తంగా ఆ జిల్లాకే వర్తిస్తుంది. ఆ జిల్లాలో బలమైన స్థానిక శూద్ర వ్యవసాయదారుల కులమేదీ లేదు. దేశంలో అటువంటి ప్రాంతాలేవీ గడచిన యాభై ఏళ్లలో వ్యవసాయ అభివృద్ధిని సాధించలేదు...

కార్గిల్‌లో భారత సైనికులు ఎంతమంది చనిపోయారన్నది వివాదాస్పదంగా ఉండవచ్చునుగానీ విశాఖపట్నంలో మాత్రం ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం కూడా అంతకంటే ఎక్కువ మంది ఆదివాసులు 'విషజ్వరాలకు' చనిపోయారు. అయితే వీళ్ల కోసం ఎవరూ నిధులు వసూలు చేయలేదు, ఏ సినీ తారలూ సంఘీభావంగా ఊరేగింపులు తీయలేదు, ఏ ప్రభుత్వ ఉద్యోగులూ ఒక రోజు జీతం ఇవ్వలేదు, ఏ చంద్రబాబూ సానుభూతి ప్రదర్శన నిర్వహించలేదు. సైన్యం కంటే ఏజెన్సీ ఆదివాసులకే ఇవి ఎక్కువ అవసరం (చంద్రబాబు సానుభూతి మినహాయించి) అని వేరే చెప్పనవసరం లేదు. కానీ మన 'దేశభక్తి' స్వరూపం అట్లాంటిది.

*- కె. బాలగోపాల్*

ఒక ఇంద్రవెల్లి (1981 ఏప్రిల్ - ఆదివాసులపై రాజ్యం హత్యాకాండ), ఒక చింతపల్లి (1987 మార్చి/మే - ఆదివాసీ గూడేల దహనం), ఒక వాకపల్లి (2007 ఆగస్టు - గ్రేహౌండ్స్ అమానవీయ అత్యాచార దాడి) - ఇదీ ఆదివాసుల పట్ల స్వతంత్ర భారతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రెస్ రిపోర్ట్. ఆదివాసులకు, ఆధునిక ప్రపంచానికి మధ్యనున్న అంతరం తగ్గించేందుకు కృషి చేయాల్సిందిపోయి ప్రభుత్వాలు అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాలు, కార్పొరేటీకరణ ఆదివాసుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వాళ్ళ జీవన విధ్వంసంతో ప్రారంభమైన దాడి వాళ్ళ సాంస్కృతిక మూలాలను విచ్ఛిన్నం చేస్తోంది. ఆదివాసీలంటేనే రాజ్యానికి నేరస్తులుగా కనిపిస్తున్నారు. నిత్య అనుమానితులుగా, పూర్తి అభద్రతలో వారి జీవితాలు కునారిల్లుతున్నాయి. వాళ్ళ కాళ్ళ కింది భూమి, వాళ్ళు జీవించిన ప్రకృతి వాళ్లకి పరాయిదై పోయింది. విద్య, వైద్యం వాళ్ళ దరిదాపులకే చేరడం లేదు. డయేరియా, మలేరియా లాంటి నయం కాగల జబ్బులకు కూడా ఏటేటా క్రమం తప్పకుండా వందలాది మంది ఆదివాసులు మరణించడం మరో పెద్ద విషాదం. ''రాజ్యానిదీ, న్యాయస్థానానిదీ ఒకే వైఖరి అయినప్పుడు బాధితులకు మిగిలిన ప్రత్యామ్నాయం ఏమిటనేది పౌర సమాజం చర్చించాల్సిన సమస్య'' అన్నాడు బాలగోపాల్. ఇంత అధికార హత్యాకాండ మన పక్కన జరుగుతుంటే, చైతన్యవంతమైన సమాజం అడుగులు ఎటువైపు సాగాలో దిశా నిర్దేశం చేసుకోవాలని బాలగోపాల్ హెచ్చరిస్తున్నాడు.

**- ఆర్ కె**

పర్‌స్పెక్టివ్స్

బాలగోపాల్ జననం - బళ్ళారి (కర్ణాటక)లో. తండ్రి కందాళ పార్థనాథశర్మ, తల్లి నాగమణి. జర్నలిస్ట్ వేమన వసంతలక్ష్మి జీవిత సహచరి. చదివింది ఎమ్.ఎస్.సి. (ఆర్.ఇ.సి.-వరంగల్) గణితంలో డాక్టరేట్ - న్యాయవాద శాస్త్రం. కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర ఉపాధ్యాయుడు (1981-1985). ఆం.ప్ర. పౌరహక్కుల సంఘంలోనూ (1981-1998), ఆ తర్వాత చివరివరకూ మానవహక్కుల వేదికలోనూ పని చేశారు. లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. చాలాకాలం విరసం సభ్యుడు. ప్రజాబంధు అనే ముసుగు సంస్థ 1989లో కిడ్నాప్ చేసింది. అనేక స్వతంత్ర రచనలతో పాటు, చిన్న పత్రికలలో కూడా కాలమ్స్ రాశారు. ఇంగ్లిషులో ఈ.పి.డబ్ల్యు ఇంకా ఇతర మాగజైన్లలోనూ, అనేక తెలుగు పత్రికల్లోనూ వ్యాసాలు రాశారు. బాలగోపాల్ పర్‌స్పెక్టివ్స్ సంస్థాపక సభ్యుడు.

బాలగోపాల్ పుట్టింది 10.06.1952.     మరణం : 08.10.2009

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# ఆదివాసులు


## వైద్యం సంస్కృతి అణచివేత

## కె. బాలగోపాల్



ప ర్ స్పె క్టి వ్స్
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాద్
2015

for E book : www.kinige.com




ISBN-978-93-81172-09-4

ప్రచురణ సంఖ్య : **52**

**ఆదివాసులు**

వైద్యం సంస్కృతి అణచివేత

[Writings on Adivasi Culture, Repression and Neglect]

ప్రథమ ముద్రణ : అక్టోబర్ 2015

రచన : **కె. బాలగోపాల్**

సోల్ డిస్ట్రిబ్యూటర్స్ :

**నవోదయ బుక్ హౌస్**

ఆర్యసమాజ్ ఎదురు వీధి

కాచిగూడ చౌరాస్తా,

హైదరాబాద్ - 500 027

ఫోన్ నెం. 040-24652387

పబ్లిషర్స్ :

**ప ర్ స్పె క్టి వ్స్**

సామాజిక శాస్త్రం / సాహిత్యం

ప్లాట్ నెం 305

ఇ.నెం. 2-2-647/182/ఎ3

హిమశివ అపార్ట్‌మెంట్స్

బాగ్ అంబర్‌పేట్

హైద్రాబాద్ - 500 013

సెల్ : 8332934548

వెల : **₹100/-**

ప్రింట్ సపోర్ట్ :

**వేమన వసంతలక్ష్మి**

మన్నం బ్రహ్మయ్య

కవర్ డిజైన్ :

**రమణజీవి**

హైదరాబాద్

9951618021

లేఅవుట్ & కంపోజింగ్ :

**ఆర్. భాగ్యలక్ష్మి**

హైదరాబాద్

9542247373

ముద్రణ :

చరిత ఇంప్రెషన్స్

ఆజామాబాద్,

హైదరాబాద్ - 500 020

ఫోన్ : 040-27678411



# ఇందులో


| | | |
|---|---|---|
| 1. | గిరిజనులు - గిరిజన సంస్కృతి | *7* |
| 2. | ఆదిలాబాద్ గిరిజన పోరాటాలు | *24* |
| 3. | ఏజెన్సీలో పోలీస్ క్యాంపులు | *38* |
| 4. | గృహ విధ్వంసనం | *45* |
| 5. | సత్యం సహించరానిదయ్యే వేళ | *52* |
| 6. | పొరకల దొర కథ | *60* |
| 7. | అటవీశాఖ అధికార్లకు తుపాకులు: ఆత్మకూరు అడవుల్లో శవాలు | *66* |
| 8. | బందిపోటు దొంగలు - హక్కులు | *74* |
| 9. | కరువు, కరువు పనులు, కరువు దాడులు | *79* |
| 10. | వాకపల్లి : ఒక పరామర్శ | *83* |
| 11. | వాకపల్లి - కోర్టులు | *87* |
| 12. | 'వాకపల్లి' వార్షిక దినం! | *97* |
| 13. | అతి రాజకీయ సారం! | *101* |
| 14. | అతిసారం, మలేరియా, విషజ్వరాలు ఆదివాసులకే ఎందుకొస్తాయి? | *105* |
| 15. | మెదడువాపుకు పందులు కారణమా? | *109* |
| 16. | దోమ ఒక్కటే కారణం కాదు | *113* |
| 17. | జ్వరం ఆదిలాబాద్‌కా వైద్యశాఖకా? | *119* |
| 18. | వర్షాలు - వ్యాధులు - వనవాసం | *123* |
| 19. | నిత్య మరణానికి నివాళి ఎక్కడ? | *127* |
| 20. | ఆదివాసీ హక్కులకు గండ్లు | *131* |
| 21. | మన్నెవార్‌లకు మద్దతు ఇద్దాం | *135* |
| 22. | హిందుత్వ అజెండాలో ఆదివాసులు | *139* |
| 23. | ఆదివాసీ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను తిరస్కరిద్దాం | *144* |

# గిరిజనులు - గిరిజన సంస్కృతి

ప్రతి దేశానికి తన నైసర్గిక, చారిత్రక, సామాజిక ప్రత్యేకతలు కొన్ని ఉంటాయి. భారతదేశానికి గల ప్రత్యేకతలలో 'గిరిజనులు' అనేది ఒకటి. ఇతర దేశాలలో గిరిజనులు లేరని కాదు గాని, మన దేశంలో గిరిజనులకు ఒక ప్రత్యేకమయిన స్థానం ఉంది. సంఖ్యరీత్యా జనాభాలో 7 శాతమే అయినా గిరిజనులు దేశంలోని అన్ని రాష్ట్రాలలోను నివసిస్తున్నారు. బ్రిటిష్ వాళ్ళ కాలం నుండి ఇప్పటి దాకా మన దేశం సాధించిన 'అభివృద్ధి' వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజనులే. అత్యధికంగా ఈ 150 సంవత్సరాలలో తిరుగుబాట్లు చేసింది కూడా గిరిజనులే.

గిరిజనులు అనగానే తలలో ఈకలు, మొలలో గజ్జెలు ఉండే విచిత్ర జీవులని సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులలో నివసిస్తూ తెల్లబట్టలు కనబడగానే పారిపోయే భయస్తులు అని కొంత చదువుకున్నవాళ్ళు భావిస్తారు. గిరిజనుల భావనలో చెప్పాలంటే వాళ్ళు తమను తాము 'కొండ మనుషులు'గాను, 'అడవి మనుషులు'గాను భావించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్లకు మనం పెట్టుకున్న గిరిజనులు, ఆటవికులు అనే పేర్లు వాళ్ల చైతన్యం యొక్క సంస్కృతీకరణే.

హిందీ తదితర ఉత్తర భారతదేశపు భాషలలో ఈ రెండు పేర్ల బదులు 'ఆదివాసులు' అన్న పేరు ప్రయోగిస్తారు. గిరిజనులే

ఈ దేశంలో నిజమయిన ఆదివాసులని, 'మనం' అంతా ఎప్పుడో ఒకప్పుడు బయట నుండి వచ్చి ఆదివాసులను అడవులలోకి తరిమేశామని ఈ ప్రయోగం వెనక ఒక సిద్ధాంతం ఉంది. ఇంకొంచెం విడమర్చి చెప్పాలంటే, మొదట ద్రావిడులు వచ్చి ఆదివాసులను అడవులలోకి తరిమివేయగా, తరువాత ఆర్యులు వచ్చి ద్రావిడులను దక్షిణానికి తరిమేసారని చెపుతుంది ఈ సిద్ధాంతం. ఏ పుస్తకంలోనూ ఈ సిద్ధాంతం రాయకున్నా దీన్ని నమ్మేవాళ్ళు చాలామంది ఉన్నారు.

మన దేశానికి బయటి నుండి మొదట ద్రావిడులు (అంటే ద్రవిడ భాష మాట్లాడేవాళ్ళు), తరువాత ఆర్యులు వచ్చినమాట వాస్తవమే. ఇవ్వాళ వీళ్ళ భాషలు ప్రబలంగా ఉండడాన్ని బట్టి చూస్తే ఇక్కడి ఆదివాసుల మీద వాళ్ళు ఆధిపత్యం నెలకొల్పినట్టు కూడా తోస్తుంది. అయితే వీళ్ళు ఆదివాసులను అడవులలోకి తరిమేసి తాము మైదానాలను ఆక్రమించుకున్నారన్న సిద్ధాంతానికి ఋజువు దొరకదు. వీళ్ళు 'శుద్ధంగా' ఎన్నడు ఉండలేదు. ఇక్కడి ఆదివాసులతో కేవలం సామాజికంగానే కాక భౌతికంగా కూడా కలిసిపోయారు. ఈ సందర్భంలో గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే ఇవ్వాళ మైదానాలుగా ఉన్న ప్రాంతాలు ఎల్లప్పుడూ మైదానాలుగా లేవు. ఒకప్పుడవి దట్టమయిన అడవులుగా ఉండేవి. విదేశాల నుంచి వచ్చిన ద్రావిడుల 'అంశ' ఇవాళ్టి గిరిజనేతరులలోనే కాదు, గిరిజనులలోనూ ఉంది. అలాగే ఆదివాసుల 'అంశ' కూడా ఇద్దరిలోనూ ఉంది. ఇవాళ్టి తెగలలో కొన్నింటిని శాస్త్రజ్ఞులు ద్రవిడపూర్వ (Pre-Dravidian) తెగలుగా గుర్తిస్తే మరికొన్నింటిని ద్రవిడ తెగలుగా గుర్తిస్తారు. నీలగిరి కొండలలోని తోడ (Toda) అనే పశుపోషక తెగ ద్రవిడపూర్వ తెగ గాని, ద్రవిడ తెగ గాని కాదని, బహుశా పశ్చిమ ఆసియా నుండి వచ్చి ఇక్కడ స్థిరపడ్డ తెగ అని భావిస్తారు. బంజారా (లంబాడా)లు కూడా పశ్చిమ ఆసియా నుండి వచ్చిన తెగ అనే అభిప్రాయం ఉంది. మరయితే ఇవ్వాళ కనిపించే గిరిజన గిరిజనేతర విభేదానికి మూలం ఎక్కడ చూడాలంటే దానికి సమాధానం వేరే ఉంది.

మన దేశమంతా ఒకప్పుడు అడవే అయినట్టు మనం అంతా కూడా ఒకప్పుడు ఆటవికులమే. వేట, పశుపోషణ, ఆహారసేకరణ, పోడువ్యవసాయం (మనందరికీ కూడా) జీవనాధారాలుగా ఉండేవి. ద్రావిడులయినా ఆర్యులయినా మన దేశానికి వచ్చినపుడు ఈ స్థాయిలో ఉన్నవారే. సామూహిక శ్రమ, సమిష్టి జీవనం, సమానత్వం, ఆ స్థాయికి తగ్గ సామాజిక సంబంధాలు... అందరిలోను అవే లక్షణాలు ఉండేవి. ఇవి క్రమంగా విచ్ఛిన్నమవుతూ వచ్చి, నదీ డెల్టా

ప్రాంతాలలోనూ, లోయలలోనూ, ఇతరత్రా వ్యవసాయ యోగ్యమయిన ప్రాంతాలలోనూ స్థిర వ్యవసాయం ప్రారంభమయి, ఆదిమ ఆటవిక సమాజం నశించి అడవులు క్రమంగా మైదానాలయ్యాయి. ఆటవిక సమాజం కూడా ఒకరినొకరు దోచుకునే వ్యవసాయిక వర్గ సమాజంగా మారింది. ఆనాటి వ్యవసాయ పద్ధతుల పరిధిలో అంతగా వ్యవసాయ యోగ్యం కాని కొండలూ, పీఠభూములూ అడవులుగానే ఉండిపోయాయి. మైదాన ప్రాంతాల ప్రజలు ఆటవిక సామూహిక సంబంధాలు వదులుకొని మన దేశపు వర్గ సమాజానికి ప్రత్యేక లక్షణమయిన కుల సంబంధాల నిర్మాణంలోకి వచ్చారు. ఇట్లా నాగరికులయిన వాళ్ళు ఎప్పటికప్పుడు విస్తరిస్తూ, చుట్టూ ఉన్న అడవులను ఆక్రమించుకొని మైదానాలను చేస్తూ, అక్కడి ఆటవికులను వర్గ సమాజపు అధోభాగంలో బలవంతంగా కలుపుకుంటూ, వాళ్లను కూడా ఆ విధంగా నాగరికులను చేస్తూ వచ్చారు.

మన దేశ సామాజిక-నైసర్గిక లక్షణాలను దృష్టిలో ఉంచుకుంటే ఈ చారిత్రక క్రమాన్ని పునర్నిర్మించుకోవచ్చు. మూడు నుండి నాలుగు వేల సంవత్సరాల క్రితం సముద్ర తీరంలోని నదీ డెల్టాలలోనూ, నదీలోయలలోనూ, ఇతరత్రా అనుకూలమయిన ప్రాంతాలలోనూ ఆటవిక సమాజం నశించి వ్యావసాయిక వర్గ సమాజం ఏర్పడడం ప్రారంభమయింది. సముద్రతీరంలోని పల్లపు భూములు, కృష్ణ, గోదావరి, కావేరి, మహానది, నర్మద, తపతి, ఇతర ఉత్తర భారతదేశపు నదులు - ఒక్కొక్కటీ ఒక్కొక్క కేంద్రమయింది. ఈ ఒక్కొక్క కేంద్రంలో ఏర్పడ్డ వర్గ సమాజం ఒక్కొక్క 'జాతి'కి (తెలుగు, తమిళ, మలయాళ, మరాఠా, ఒరియా వగైరా) బీజమయింది. ఈ జాతులు ఆ కేంద్రం నుండి వీలైనంత దూరం విస్తరిస్తూ అడవులను మైదానాలుగా మారుస్తూ అక్కడి ఆటవికులను తమలో బలవంతంగా కలుపుకుంటూ పోయాయి. ఈ విధంగా ఒక్కొక్క ఆధునిక జాతి ఏర్పడింది. ఒక జాతికీ మరొక జాతికీ మధ్య ప్రాంతంలో వాటి విస్తరణకు ఇంతవరకు లొంగని కొన్ని అడవులు, పీఠభూములు మిగిలిపోయాయి. అక్కడ నివసించే ఆటవికులు ఆర్థికంగా ఇప్పటికీ ఆటవికులుగానూ, సాంస్కృతికంగా ఏ జాతికీ చెందని వారుగానూ మిగిలిపోయారు. అందుకే మన దేశంలో ఏ రెండు పరిసర రాష్ట్రాలను తీసుకున్నా వాటి సరిహద్దులో అడవులు, కొండలు, పీఠభూములు, అక్కడ నివసించే గిరిజనులు కనబడతారు. ఏ రాష్ట్రంలోనూ రాష్ట్ర గర్భంలో గిరిజనులు కనబడరు. మన రాష్ట్రాన్నే తీసుకుంటే ఉత్తర సరిహద్దుకు ఒక చివరనున్న శ్రీకాకుళం నుండి పడమట ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్ దాకా దట్టమయిన

అడవులు, కొండలు ఉంటాయి. ఆ అడవులలో నివసించే సవర, జాతాపు, కోయ, కొండరెడ్డి, నాయకపు, గోండు, కొలాం తదితర గిరిజనులు కనబడతారు. ఈ సరిహద్దు దాటితే ఒరియా, హిందీ, మరాఠీ భాషలు మాట్లాడే నాగరికులు తగులుతారు. అలాగే దక్షిణాన ఉన్న రాయలసీమ జిల్లాలలో తూర్పు కనుమలు, నల్లమల కొండలు, ఆ అడవులలో నివసించే చెంచు, యానాది, ఎరుకల గిరిజనులు కనబడతారు. ఆ సరిహద్దు దాటితే తమిళ, కన్నడ జాతులు తగులుతాయి.

ఇది ఏ రాష్ట్రానికయినా వర్తిస్తుంది. ఒరిస్సాకు దక్షిణ సరిహద్దు జిల్లా అయిన కోరాపుట్‌లో సవర, బొండా, గదబ తెగలు నివసిస్తాయి. అటు చివర ఒరిస్సాను బీహార్ నుండి వేరుచేసే ఛోటానాగ్‌పూర్ పీఠభూమి అడవులలో కోల్, ఒరవాన్, సంథాల్, ముండా తెగలు నివసిస్తాయి. తూర్పు పశ్చిమ బెంగాల్ సరిహద్దులోని చిటగాంగ్ కొండలలో చక్మా గిరిజనులు నివసిస్తారు. గుజరాత్ - రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దు పీఠభూమిలో భిల్లులు నివసిస్తారు. మహారాష్ట్ర దక్షిణ సరిహద్దులో వర్లీలు, తమిళనాడు-కేరళ సరిహద్దుల్లోని పడమటి కనుమలలో పాలియన్‌లు, తమిళనాడు-కర్నాటక సరిహద్దు దగ్గరున్న నీలగిరి కొండలలో తోడ తెగ గిరిజనులు, మహారాష్ట్ర-మధ్యప్రదేశ్ సరిహద్దు అడవులయిన సిరోంచ, బస్తర్‌లలో గోండులు, కోయలు నివసిస్తారు.

ఈ గిరిజనులందరూ కూడా ఇప్పటివరకు ఆయా ప్రాంతాల వర్గ సమాజ విస్తరణకు లొంగనివాళ్ళు. ఈ విస్తరణే మన దేశ చరిత్రలోని ముఖ్యమైన భౌతిక క్రమాలలో ఒకటి. నాలుగు వేల సంవత్సరాలుగా మైదానాలు, అడవులను ఆక్రమించుకుంటూ సాగిన విస్తరణ అది. ఇది ఇప్పటికీ అంతరించని క్రమం. ఇది శాంతియుతంగాను, మర్యాదగాను సాగిందని అనుకుంటే భ్రమే అవుతుంది. కాంట్రాక్టర్ల ద్వారా, ప్లాంటేషన్‌ల ద్వారా, వడ్డీ వ్యాపారస్తుల ద్వారా, గిరిజనేతర భూస్వాముల భూ ఆక్రమణ ద్వారా ఇవ్వాళ ఎంత దౌర్జన్యంగా సాగుతున్నదో గతంలో కూడా అంతే దౌర్జన్యంగా సాగింది. మౌర్య చక్రవర్తి అశోకుడి ఘనతను కీర్తించే చరిత్రకారులు ఆయన అడవులను వ్యవసాయం కిందికి తీసుకురావడానికి చేసిన ప్రయత్నాన్ని ప్రముఖంగా ప్రస్తుతిస్తారు. ఆయన చేసిందేమిటంటే కొత్తగా భూములు వ్యవసాయం కిందికి వస్తే రాజుగారికి రెవెన్యూ పెరుగుతుంది కాబట్టి, అడవులను నరికి వ్యవసాయ యోగ్యం చేసి కొత్త గ్రామాలను ఏర్పరచే వాళ్ళకు ప్రోత్సాహం ఇచ్చేవాడు. అట్లా కొత్తగా ఏర్పడ్డ గ్రామాలకు కొంత కాలం శిస్తు

మాఫీ చేసేవాడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో కూడా ఇటువంటి ఎత్తుగడల ప్రస్తావన ఉంది. ఈ విధంగా రాజుగారి ప్రోత్సాహంతో చాలామంది నాగరికులు అప్పటికింకా దట్టమయిన అడవులతో నిండివున్న గంగా, యమునా లోయలను వ్యవసాయ యోగ్యం చేశారు. అప్పటి ఆటవికులు ఈ క్రమానికి లొంగిపోయి తమ స్వతంత్ర జీవితాన్ని వదిలిపెట్టి కూలీలుగా మారిపోయారు. హిందూ సమాజపు నిమ్నకులాలలో (ఎక్కువగా మాల మాదిగ కులాలలో) కలిసిపోయారు. ఈ మార్పును ప్రతిఘటించదలుచుకున్న వాళ్ళకు సారవంతమయిన మైదానాలను వదిలి ఛోటానాగపూర్ వంటి పీఠభూమి ప్రాంతాలకు వెళ్ళడం తప్ప గత్యంతరం లేదు కాబట్టి కొంత ప్రతిఘటించినా, అంతిమంగా చాలామందే లొంగిపోయే ఉంటారు. అశోకుడి కాలంలో చక్రవర్తి ప్రోత్సాహంతో జరిగిన ఈ దౌర్జన్యం ఇతర కాలాలలో చాలా మామూలుగా జరుగుతూనే వచ్చింది.

ఆటవికులను నాగరికులను చేస్తూ, నాగరిక వర్గ సమాజపు అధోభాగంలో (కూలివర్గంగా, తక్కువ కులాలుగా) కలుపుకుంటూ వచ్చిన అత్యంత ప్రధానమయిన ఈ క్రమానికి మనకు ప్రత్యక్షమయిన సాక్ష్యాలుగానీ ఆధారాలుగానీ దొరకవు. ముస్లిం రాజవంశాల పరిపాలనకు పూర్వం మన దేశంలో ప్రజల చరిత్ర అటుంచి రాజుల చరిత్ర సహితం ఎవ్వరూ రాయలేదు. అయితే ఈ క్రమం యొక్క ప్రతిబింబం మన పౌరాణిక సాహిత్యంలోనూ, గిరిజనుల పురాణ గాథలలోనూ కనబడుతుంది. గిరిజనుల దేవతలు, వాళ్ళ 'ఆదిపురుషులు' హిందూ పురాణాలలో ప్రవేశించి హిందూ దేవతలతో సమానంగా కాకపోయినప్పటికీ వాళ్ళ సేవకులుగా, భక్తులుగా, వాళ్ళ కరుణా కటాక్షాల చేత పునీతులయిన పాపులుగా లేదా హిందూ పౌరాణిక హీరోలకు రెండవ భార్యలుగా కనబడతారు. హిందువుల వర్గ సమాజంలోకి అల్ప స్థాయిలో ప్రవేశించినవారు వాళ్ళ సాహిత్యంలోకి కూడా అల్పస్థాయిలో ప్రవేశించక తప్పలేదు.

రాముడి దర్శనం కోసం పడిగాపులు పడి అతడు తాను ఎంగిలి చేసిన ఫలాల్ని తినగానే జన్మ తరించిందనుకున్న శబరి సవర తెగకు చెందిన స్త్రీ. రాముడు అరణ్యాలకు పోతున్నప్పుడు దారిలో అతని సేవచేసిన గుహుడు ఛోటానాగపూర్ ప్రాంతానికి చెందిన సంథాల్, కోల్ లేక ఒరవాన్ తెగ గిరిజనుడు అయి ఉండాలి. ద్రోణుడు విలువిద్య నేర్పడానికి నిరాకరిస్తే అతని విగ్రహాన్ని ప్రతిష్ఠించి తానే విలువిద్య అభ్యసించి, చివరికి ఆ గురువుగారికి గురుదక్షిణగా తన బొటనవేలు ఇచ్చిన ఏకలవ్యుడు భిల్లు తెగకు చెందినవాడు. అడవిలో పడుకున్న కృష్ణుడిని

దూరం నుండి చూసి మృగం అనుకుని బాణం వేసి చంపిన జంఢుడు (జరా) కూడా భిల్లు తెగకు చెందిన వాడే. ఈ విధంగా హిందూ పురాణాలలోకి హేయమయిన స్థానంలో ప్రవేశించడమేకాక, తమ పౌరాణిక గాథలలో సైతం గిరిజనులు వాటిని ఆమోదించిన దాఖలాలున్నాయి. కృష్ణుడిని చంపిన పాపం వల్ల భిల్లులకు విల్లంబులు వాడరాదనే శాపం తగిలిందని, అందుకే భిల్లులు విల్లంబులు వాడలేరని నమ్ముతారు. పాండవులు లక్క ఇంటి నుండి తప్పించుకొని అడవులలో తలదాచు కుంటున్నప్పుడు భీముడు హిడింబ అనే ఆటవిక స్త్రీని పెళ్ళి చేసుకొని ఆమె వల్ల ఒక కొడుకు పుట్టగానే ఆమెను తరిమేస్తాడు. మన దేశంలోని అన్ని గిరిజన తెగలలోకి అత్యధిక సంఖ్యాకులయిన గోండులు తమను తాము ఆ హిడింబ సంతానంగా భావించుకుంటారు. గోండులకు 'భీము' ముఖ్యమయిన దేవుళ్ళలో ఒకడు. 'భీము' అనేది వారిలో చాలా సామాన్యమయిన పేరు. ప్రతి సంవత్సరం భీమ హిడింబల వివాహాన్ని గోండులు విప్ప సారాతో వేడుకగా జరుపుకుంటారు. నల్లమల కొండలలో నివసించే చెంచులలో కూడా ఇటువంటి పురాణమే ఉంది. అడవులలో తిరుగుతున్న నరసింహుడు ఒక చెంచు యువతిని పెండ్లి చేసుకొని ఆమెకు చెంచులక్ష్మి అని నామకరణం చేసి వైకుంఠానికి తీసుకుపోతాడు. అక్కడి ఆదిలక్ష్మి (మార్వాడీల లక్ష్మి) ఈ సవతిని ఒల్లకపోయేసరికి నరసింహుడు విధి లేక ఆమెను వదిలిపెడతాడు. అందువల్ల చెంచు స్త్రీలకు అందవికారంగా ఉండాలనే శాపం కూడా ఉందని చెంచులు నమ్ముతారు. అంటే నాగరిక సమాజానికి లొంగిపోయే క్రమంలో ఆటవిక స్త్రీలు 'అందగత్తెలు' కారన్న నాగరిక ప్రమాణాన్ని తాము కూడా ఆమోదించడమే కాక దానికి ఇటువంటి కథ ద్వారా పౌరాణిక 'వివరణ' కూడా ఇచ్చుకుంటున్నారు. సాంస్కృతిక దౌర్జన్యం ఎంత బలంగా ఉండగలదో దీనివల్ల అర్థమవుతుంది.

రామాయణం రాసిన వాల్మీకి కూడా భిల్లు తెగకు చెందినవాడే. అతడు 'బందిపోటు' అనీ, రామాయణం రాసి పునీతుడయ్యాడనీ మనం చదువుకున్నాం. వాస్తవానికి భిల్లులు చాలావరకు ఆహార సేకరణ (food-gathering) మీద ఆధారపడి జీవించే తెగ. అంటే కనబడ్డ ఆహారాన్ని ఏరుకొని (జంతువయితే పట్టుకొని) జీవిస్తారు. స్వంత ఆస్తి మీద ఆధారపడే వర్గ సమాజం ఆహార సేకరణను దొంగతనంగా భావిస్తుంది. భావించడమే కాదు, ప్రతీ వస్తువునూ ఎవరో ఒకరి ఆస్తిగా ప్రకటించడం వల్ల వాళ్ళను బలవంతంగా దొంగలుగా మారుస్తుంది. శాసనాలంటే చాలా ప్రేమ ఉన్న బ్రిటిష్‌వాళ్ళు వీళ్ళకు criminal tribes అని

పేరు కూడా పెట్టారు. భిల్లుడయిన వాల్మీకి ఈ విధంగా నాగరికుల చేత బందిపోటుగా గుర్తించబడ్డాడు. గుర్తించబడి, ఆ నాగరికులకు పవిత్ర గ్రంథమయిన రామాయణాన్ని రాసి పవిత్రుడయ్యాడు!

వర్గ సమాజం గిరిజనులను లోబరుచుకునే క్రమంలో వాళ్ళ దేవుళ్ళనూ గుళ్ళనూ కూడా స్వంతం చేసుకుంది. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, అహోబిలం దేవాలయాలు ఒకప్పుడు చెంచులవేనని చరిత్రకారులు నమ్ముతారు. అలాగే కొండలలోనూ, అడవులలోనూ ఉన్న తిరుపతి, భద్రాచలం మొదలైన దేవాలయాలు చాలావరకు ఒకప్పుడు గిరిజనులవేనని చెప్పవచ్చు. అడవులను ఆక్రమించుకొని, అక్కడి ఆటవికులను కూలివాళ్ళుగానూ, శిస్తు చెల్లించే రైతులుగానూ లోబరుచుకునే క్రమంలో భాగంగా వాళ్ళ దేవుళ్ళకు ప్రమోషన్ ఇచ్చి విష్ణు అవతారంగానో ఈశ్వరుడి ప్రతిరూపంగానో గుర్తించాల్సిన అవసరమే లేకపోతే, అంతటి మారుమూల ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించాల్సిన అవసరం ఏ రాజుగారికయినా ఎందుకు కలుగుతుంది? అయితే ఇదంతా ప్రయత్న పూర్వకంగా చేసిన కుట్ర అనుకుంటే పొరపాటవుతుంది. చరిత్రలో 90 శాతం కుట్రలు ఎవ్వరి ప్రయత్నం లేకుండా చరిత్రగమనంలో భాగంగా జరిగేవే. జరిగిన తరువాత వాటిని వివరించే పౌరాణిక గాథలు కూడా 90 శాతం ఎవరి ఉద్దేశ్యం లేకుండ కల్పించబడతాయి. పూరీ జగన్నాథుడి దేవాలయం ఇవ్వాళ హిందువులకు ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి. కాని ఆ గుడిలో జగన్నాథుడి బొమ్మను చూసిన వారెవరికైనా అతడు ఆటవికుల దేవుడని నిస్సందేహంగా తెలుస్తుంది. మామూలుగా హైందవ దేవుళ్ళ విగ్రహాలకుండే అంగసౌష్టవంగాని, కూర్పుగాని ఆ దేవుడికి ఉండదు. చాలా 'ఆటవికంగా' ఉంటుంది. ఆ గుడి ఒకప్పుడు బీహార్ - బెంగాల్ - ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులలో నివసించే లోథా తెగ గిరిజనులది. ఆ లోథా తెగను లోబరచుకొని కోస్తా ఒరిస్సాకు పాకిన హైందవ వర్గ సమాజం ఆ గుడిని స్వంతం చేసుకుంది. ఈ దురాక్రమణను లోథాలు ఒక కథ ద్వారా పురాణీకరించుకున్నారని కమలాదేవి ఛటోపాధ్యాయ అంటుంది. అదేమిటంటే పూరీ మహారాజు జగన్నాథుని విగ్రహాన్ని లోథాల దగ్గరి నుండి దొంగిలించేందుకు తన మంత్రిని పంపాడట. ఆ మంత్రి లోథా రాజు కుమార్తెను ప్రేమిస్తున్నట్లు నటించి ఆమెను పెళ్ళి చేసుకొని కొంతకాలం అక్కడే నివసించాడట. నెమ్మదిగా వాళ్ళ విశ్వాసం సంపాదించి విగ్రహాన్ని చేజిక్కించుకొని భార్యను వదిలిపెట్టి వెళ్ళిపోయాడట.

ఇవ్వాళ మనం మన కళ్ళముందు ఇటువంటివెన్నో చూడగలుగుతాం. ఒకప్పుడు కేవలం గిరిజనుల పుణ్యతీర్థాలయినవి (ఉదాహరణకు తెలంగాణలోని కేస్లాపురం, మేడారం వగైరా) ఇప్పుడు క్రమంగా గిరిజనేతరుల జాతరలవుతున్నాయి. కొంత కాలానికి అక్కడి గిరిజన దేవుళ్ళు హిందూ దేవుళ్ళ అవతారాలుగా పరిణామం చెంది గిరిజన దేవుళ్ళ గుళ్ళ స్థానంలో హిందూ దేవాలయాలు వెలిసినా ఆశ్చర్యం లేదు. (ఆదిలాబాద్‌లోని గోండ్ల పుణ్యస్థలమయిన కేస్లాపురంలో శివుడి ఆలయం నిర్మించాలని కిందటి సంవత్సరం అక్కడి కాంగ్రెసు (ఐ) యువగూండాలు సూచించారు.) గిరిజనుల అడవులను ఆక్రమించుకొని వాళ్లను భూమిలేని రైతులుగాను, వేతన కూలీలుగాను మారుస్తున్న క్రమానికి ఇది సాంస్కృతిక ప్రతిబింబమే తప్ప వేరే కాదు. ఈ క్రమం ప్రాచీనమయినదే అయినా ఇప్పుడు మరింత వేగంగా సాగుతోంది. ఫ్యూడల్ రాచరిక ప్రభువులకు అడవుల వల్ల ఉండే ఉపయోగాలు చాలా పరిమితమయినవి. సామ్రాజ్యవాదం అలా కాదు. అడవులలో కలప నుండి ఖనిజాల వరకు ఎన్ని రకాల వనరులుంటే అన్నీ సామ్రాజ్యవాదానికి కావాలి. అందుకే గత 150 సంవత్సరాలలో మారినంత వేగంగా గిరిజనుల జీవితం ఎన్నడూ మారలేదు. గతంలో కొన్ని వేల సంవత్సరాల పరిణామ ఫలితంగా గిరిజనులు కూలీలగాను, రైతులగాను మారి వర్గ సమాజపు వర్ణచక్రంలో ఇరుక్కున్నారు. ఇవ్వాళ ఒక్క గని తవ్వకమయినా, ఒక్క ప్రాజెక్టు నిర్మాణమయినా, ప్లాంటేషన్ల కోసం అడవుల సంరక్షణ అయినా కొద్ది సంవత్సరాల వ్యవధిలోనే కొన్ని వేలమంది గిరిజనుల జీవితాలను అది ఛిన్నాభిన్నం చేస్తున్నది. గోదావరి మీద ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే ఒక్క దెబ్బతో అక్కడి గోండు, కోయ తెగల జీవితాలలో అది రెండు శతాబ్దాల పరిణామాన్ని తీసుకొస్తుంది.

ఈ పరిణామం పట్ల ఇవ్వాళ చాలా విస్తృతంగా వ్యతిరేకత కనబడుతోంది. భౌతికవాద దృక్పథంతో చూసేవాళ్ళకు దీన్ని విమర్శించే విషయంలో ఎటువంటి సందేహం ఉండదు. కలప పరిశ్రమ, ఖనిజ పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్ల దేశానికి లాభం కాబట్టి ఈ పరిణామాలను వ్యతిరేకించకూడదని పాలకవర్గాలు బోధిస్తాయి. అయితే ఈ ప్రాజెక్టుల వల్ల, ఈ కలప పరిశ్రమ వల్ల, ఈ గనుల తవ్వకం వల్ల 'దేశానికి' లాభం కలుగుతోందని అంగీకరించడం కష్టం. లాభపడుతున్నది 'దేశమే' అయితే మరి గిరిజనులు కూడా దేశంలో భాగమే కదా, వాళ్ళెందుకు నష్టపోతున్నారు? గిరిజనులకే కాదు, అడవుల సమీపంలో నివసించే సామాన్య గిరిజనేతరులకు కూడా లాభం కలగడం లేదు. లాభమంతా

పెద్ద వ్యాపారస్తులకు, సామ్రాజ్యవాద దేశాలకూ కలుగుతోంది. అడవుల నుండి బయటకు వెళ్ళే కలప అయినా, తునికాకయినా, బొగ్గు ఇనుము తదితర ఖనిజాలయినా అంతిమంగా ఎక్కడికి చేరుకుంటాయో, మార్గమధ్యంలో ఎవరెవరికి ఎంతెంత లాభాలు సమకూరుస్తాయో పరిశీలిస్తే ఈ 'దేశానికి లాభం' అనేది ఎంత బూటకమో అర్థమవుతుంది. అడవుల నుండి కూలివాళ్ల ద్వారా సరుకును సేకరించే కాంట్రాక్టర్లు, ఫారెస్ట్ అధికార్లు, వాటిని అక్కడి నుండి రవాణా చేసే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, ఆ సరుకును వినియోగించే టింబర్ మిల్లులు, బీడీ కార్ఖానాల నుండి ఇనుము ఉక్కు ముడిసరుకును వినియోగించే పెద్ద పరిశ్రమల దాకా - వివిధ పరిశ్రమల యజమానుల యజమానులయిన విదేశీ గుత్తపెట్టుబడిదారీ కంపెనీలు, ప్రభుత్వాలు - వీళ్లకే తప్ప 'దేశానికి' లాభం ఎంత మాత్రం ఉండదు. దేనివల్లనయినా 'దేశానికి' లాభం కలిగించే వ్యవస్థ మన దగ్గర లేదు. ఆస్తిపరులయిన దోపిడీవర్గాలకు మాత్రమే ఈ వ్యవస్థ లాభం కలిగిస్తుంది. శ్రామికులకు లాభం అటుంచి వాళ్ళు చేసిన శ్రమకు సగం ఫలమే తప్ప పూర్తి ఫలం కూడా ఎప్పుడూ దక్కదు.

ఈ రకంగా భౌతికవాద దృక్పథంతో చూసేవాళ్లే కాకుండా గాంధీవాదులు తదితర నానారకాల భావుకులూ కూడా ఈ మార్పును వ్యతిరేకిస్తున్నారు. దీనికి వాళ్ళలో చాలామంది చూపించే కారణమేమిటంటే గిరిజనుల సంస్కృతిని కాపాడాలన్నది. గిరిజనుల సంస్కృతిలోని 'ఉన్నత'మయిన లక్షణాలను వీళ్ళు ఎత్తి చూపుతారు. పెట్టుబడిదారీ సమాజం పూర్తిగా నాశనం చేసిన కళాత్మక, సామూహిక జీవనం గిరిజనులలో ఇంకా ఉన్నాయి. వీటిని నాశనం చేయకూడదని, పదిలంగా కాపాడాలని, 'మనం గిరిజనుల నుండి నేర్చుకోవలసినది చాలా ఉందని' వీళ్ళు సవినయంగా చెప్తారు. భౌతిక జీవితాన్ని గురించి పట్టించుకోకుండా సంస్కృతిని గురించి మాట్లాడడం విచిత్రమయిన విషయమే అయినప్పటికీ, భౌతికవాదులు కూడా సంస్కృతిని తక్కువ చేయరు కాబట్టి గిరిజనుల సంస్కృతిని కొంత పరిశీలించవలసిన అవసరం ఉంది.

భౌతికంగా గిరిజనులలో మూడు రకాల తెగలుంటాయి. వేటమీద, ఆహార సేకరణమీద (hunting and food-gathering) ఆధారపడి జీవించేవాళ్ళు, పశుపోషకులు (pastoral tribes), ఆహారాన్ని ఉత్పత్తి చేసేవాళ్ళు (food-producers). మొదటి రకానికి చెందిన తెగలు ఇప్పుడు చాలా తక్కువ. ఉన్న కొద్దిమందీ బ్రిటిష్ వలస పాలన తాకిడికి తట్టుకోలేక 'వృత్తిదొంగల'గానో లేక అతి చవకగా

పనిచేసే కూలీలగానో మారిపోయారు. వడ్డెర, ఎరుకల, యానాది తెగలు దీనికి మంచి ఉదాహరణ. పశుపోషకులలో చెప్పుకోదగ్గ తెగ నీలగిరి కొండలలోని తోడ తెగ. ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయదారులయిన తెగలు మాత్రమే ఇప్పటికీ ఏదో ఒక మేరకు నిలిచి ఉన్నాయి.

ఆర్థిక జీవితం ఏదయినా, సామాజిక సంబంధాలలో మాత్రం గిరిజనులలో సమగ్రమయిన 'ఐక్యత' ఉంటుంది. దీనికి మూలం గిరిజనులలో భూమి, తదితర ఉత్పత్తి సాధనాలలో స్వంత ఆస్తి అనేది లేకపోవడం. బ్రిటిష్ పాలకులు దేశంలో ప్రతి గుంట భూమికీ ఒక యజమానిని గుర్తించాలని ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ఈ సమిష్టి ఆస్తి సంబంధాల ఛాయలు గిరిజనులను ఇప్పటికీ వదలలేదు. ఎవరి వ్యవసాయం వాళ్ళదే అయినా సమిష్టి పద్ధతిలో చేసినట్టు అనిపిస్తుంది. అందరూ వ్యవసాయం ఒకేసారి మొదలుపెడతారు. దానికి చేయవలసిన పూజల తంతు గ్రామం అంతా కలిసి సమిష్టిగా చేస్తారు. పంట ఒకేసారి కోస్తారు. అంగడికి గ్రామం అంతా కలిసే పోతారు. పెళ్ళయినా చావయినా సమిష్టిగానే జరుపుకుంటారు. నిర్ణీత కాలంలో పండుగలూ వేడుకలూ కూడా ఉమ్మడిగా జరుపుకుంటారు. పంట వేసేటప్పుడు పండుగ, కోతలప్పుడు పండుగ, విప్పచెట్టు పూతవేసేటప్పుడు పండుగ, వేసవి తరువాత మొదటి వర్షం కురిసేటప్పుడు పండుగ... ఇట్లా వాళ్ల భౌతిక జీవితంలో ఒక్కొక్క ప్రముఖ సందర్భంలోనూ ఒక్కొక్క పండుగ గ్రామం అంతా కలిసి జరుపుకుంటారు. కొన్ని పండుగల విషయంలో వాటి భౌతిక ప్రాముఖ్యతను స్పష్టంగా గుర్తించగా, కొన్నిటిని భీమదేవర పెళ్ళిగానో మరొక పురాణ పురుషుడి పుట్టుకగానో జరుపుకుంటారు.

గిరిజనుల జీవితంలోని ఈ 'కట్టడి' చాలామందిని ఆకర్షిస్తుంది. ఎందుకంటే సామ్రాజ్యవాద బూర్జువా సంస్కృతి నాగరిక సమాజాన్ని ముక్కలు ముక్కలు చేసింది. పక్కవాడు మన కళ్ళముందు చనిపోయినా మనం పట్టించుకోనంత ఒంటరి వాళ్ళను చేసింది మనల్ని. అందుకే ఈ సామ్రాజ్యవాద యుగంలో భావుకులు చాలామంది గిరిజన సంస్కృతిలోని సమిష్టితత్వానికి ఆకర్షితులవుతున్నారు. కాని గిరిజన సంస్కృతి ఇక్కడితో ఆగిపోదు. వాళ్ళ భౌతిక జీవితానికి ఉండే పరిమితులన్నీ అందులో ప్రతిఫలిస్తాయి. వాళ్ళకు ప్రకృతి గురించి ఉండే పరిజ్ఞానం చాలా పరిమితమయినది కాబట్టి చాలా విచిత్రమయిన భ్రమలు ఏర్పరచుకుంటారు. కదిలే ప్రతి వస్తువులోనూ (కొన్ని కదలని వస్తువులలో కూడా) తమకున్నట్టే ప్రాణం ఉందని భావిస్తారు. గాలిలో చెట్లలో నదులలో భూమిలో

పైరులో ఉన్న ఈ 'జీవి'తో మంచిగా ఉండడం అవసరం అనుకుంటారు. దానికి తిండి పెడతారు. దానికి ఏ తిండి ఇష్టం అనుకుంటారో ఆ తిండి వెతుక్కొచ్చి పెడతారు. ఇదే క్రమంగా బలులకు (నరబలులకు సహితం) దారి తీస్తుంది. ఆ జీవిని ప్రసన్నం చేసుకోవడం కోసం నృత్యాలు చేసి పాటలు పాడతారు. గిరిజనుల నృత్యాలూ పాటలూ చాలావరకు ఈ రకంగా చిల్లర దేవతలను ప్రసన్నం చేసుకోవడం కోసమే. లౌకికమైన (సెక్యులర్) నృత్యంగాని, పాటగాని, కళగాని గిరిజనులలో అరుదు. అందుకే కొన్ని నృత్యాలు ఎప్పుడుబడితే అప్పుడు చేయమంటే చేయరు. నిర్ణీత సమయంలోనే నిర్ణీత పద్ధతిలోనే చేస్తారు.

ఒక్క నృత్యం మాత్రమే కాదు, అన్నీ నిర్ణీతమయిన పద్ధతిలోనే జరుగుతాయి. 'భయంతో బిగుసుకుపోవడం' అనే నుడికారం ఉంది. గిరిజనుల జీవితం అట్లా బిగుసుకుపోయి ఉంటుంది - భయంతో కాకపోవచ్చుగాని, తమకే అర్థంకాని విశ్వాసాలతో బిగుసుకుపోయి ఉంటుంది. పుట్టుక, పెళ్ళి, చావు, ఆట, పాట, వ్యవసాయం అన్నీ కూడా కచ్చితమయిన, నిర్ణీతమయిన పద్ధతిలోనే జరగాలి. ఏ మాత్రం తప్పినా ఉపద్రవం ముంచుకొస్తుంది. ఈ ప్రపంచాన్ని శాసించే అదృశ్యశక్తులను ప్రసన్నం చేసుకోవడం కోసం తామే ఏర్పరచుకున్న నియమాలు తమ నుండి పరాయీకరణ చెంది ఈ ప్రపంచాన్ని నిలబెట్టే ఒక మానవాతీతమయిన చట్రంగా మారిపోతాయి. ఆ చట్రాన్ని కదిపితే ప్రపంచమే కూలిపోతుంది. ఈ మానసిక స్థితిని అర్థం చేసుకోవాలంటే ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనలో ఆస్తికులైన వాళ్ళు కూడా తమ చుట్టూ ఎల్లప్పుడూ అదృశ్యశక్తులు మూగి ఉంటాయని నమ్మరు (రాత్రిపూట తప్ప). గిరిజనులు అట్లా కాదు. వాళ్ళ దృష్టిలో ఈ ప్రపంచమంతా అద్భుతమయిన అదృశ్యశక్తులతో నిండి ఉంటుంది. చివరికి తాము కూడా చనిపోయిన తరువాత ఎక్కడో దూరంగా ఉండే కైలాసానికో వైకుంఠానికో పోరు. వివిధ పేర్లతో పిలుచుకునే వారి మరణానంతర నివాసస్థలం దగ్గరిలోనే ఉంటుంది. (సాధారణంగా నేలకింద 'పాతాళం'లో ఉంటుంది.) చనిపోయినవాళ్ళు అక్కడ జీవిస్తూ ఇక్కడి నిత్య జీవితంలో కలగజేసుకుంటూ ఉంటారు. (అందుకే భోజనం చేసేటప్పుడు - ముఖ్యంగా పండగలప్పుడు - చనిపోయిన పూర్వీకులకు రెండు ముద్దలు 'పిండం' తీసి పక్కకు పెడతారు.) ఈ అసంఖ్యాకమైన అదృశ్యశక్తులను ఎప్పటికప్పుడు మంచి చేసుకుంటూ ఉండాలి. వాటికి కోపం తెప్పించకూడదు. తమకు ఏదయినా మంచి జరిగినా అది ఈ అదృశ్యశక్తుల ఈర్ష్యకు గురికాకుండా ('దృష్టి' తగలకుండా)

చూసుకోవాలి. కొన్ని తెగలలో పంట బాగా పండినా సరే ఆ విషయం బయటికి తెలిస్తే అదృశ్యశక్తుల దృష్టి తగులుతుందేమోనని ఒక పూటంతా రోదిస్తూ పంట నాశనమయిపోయిందని పాటపాడుతూ నృత్యం చేస్తారు.

సవర తెగ గిరిజనులు పెళ్ళి చేసే ముందు అమ్మాయికి మొదట విల్లంబుతో పెళ్ళి చేసి, దానిని నదిలోకి పారేసి, ఆ విధంగా అమ్మాయి 'విధవ' అయిన తరువాతే పెళ్ళి చేస్తారు. ఈ ఆటవిక ఆచారాలు ఫ్యూడల్ దశలో కూడా చాలావరకు కొనసాగాయి కాబట్టి ఇవన్నీ ఏదో ఒక రూపంలో మనకు కూడా పరిచయమే. (చిన్న పిల్లలను అందరూ ముద్దు చేస్తే 'దృష్టి' తగులుతుందని భయపడి చీపురుకట్ట కాల్చి బూడిదతో బొట్టుపెట్టి వీలయినంత అందవిహీనంగా తయారు చేస్తాము.) ఈ 'దృష్టి' భయం ఎంతగా ఉంటుందంటే గిరిజనులు ఏ వ్యవహారాన్నీ సూటిగా ప్రస్తావించరు. సూటిగా ప్రస్తావించడం అహంకారాన్ని సూచిస్తుంది. అది అదృశ్యశక్తుల ఆగ్రహానికి గురయి వ్యవహారం బెడిసి కొడుతుంది. (ఇది కూడా మన ఫ్యూడల్ సంస్కృతిలో ఇప్పటికీ ఉన్న వైఖరే. సూటిగా, 'బిజినెస్ లైక్'గా వ్యవహరించడం బూర్జువా అలవాటు.) ఉదాహరణకు పెళ్ళి సంబంధం కుదుర్చుకోవడానికి అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి ఇంటికి వస్తే ఇరుపక్షాలు అసలు పెళ్ళిమాట ఎత్తరు. పక్షుల మీద, పశువుల మీద పెట్టి మాట్లాడతారు. కమలాదేవి ఛటోపాధ్యాయ (Tribalism in India అనే పుస్తకంలో) ఒక ఉదాహరణ ఇస్తుంది.

*''ఎవరు మీరు?'' అని అమ్మాయివైపు వాళ్ళు గదమాయించి అడుగుతారు.*

*''మేము అడవుల లోపల వేటాడే వేటగాళ్ళం. ఇవ్వాళ మేము కొట్టిన జింక పారిపోయి మీ ఇంట్లో దాక్కుంది'' అని సమాధానం ఇస్తారు.*

*''అటువంటిదేం లేద''ని వీళ్ళు అంటారు.*

*''మేము జింక రక్తపు మరకలను వెంబడించి వచ్చాము. ఇదిగో మీ ఇంటి తలుపు దగ్గర రక్తం మరకలు, మా జింకను మాకు ఇచ్చేయండి'' అంటారు.*

*''మా యింట్లో మేము చిన్నప్పటి నుండి పెంచుకున్న జింక మాత్రమే ఉంది. మీరు కొట్టిన జింక లేదు'' అని వీళ్ళు అంటారు. ఈ విధంగా కొంత వాదన జరిగిన తరువాత అమ్మాయి తరఫువాళ్ళు లొంగుతారు. ''అయితే మీ జింకే అయివుండాలి. మీకు ఇచ్చేయక తప్పదు. కాని ఒకటి*

*గుర్తుంచుకోండి. మేము దాన్ని చాలా కష్టపడి పెంచాం. దాని తల్లి పుష్కలంగా పాలిచ్చేది. మీ దగ్గర చేలూ అడవులూ సమృద్ధిగా ఉంటే తప్ప అది సుఖంగా* ఉండదు'' అంటారు. దానికి అబ్బాయి తల్లిదండ్రులు ''మా దగ్గర అడవులూ చేలూ సమృద్ధిగా ఉన్నాయి'' అని హామీ ఇచ్చి స్త్రీ ధనం ఎంత ఇచ్చేదీ మాట్లాడుకొని పోతారు.

కళ విషయం కూడా అంతే. గిరిజనుల జీవితం చాలా కళాత్మకంగా ఉండే మాట వాస్తవమే. పాట, నృత్యం, అలంకరణ వాళ్ళ జీవితాలను పెనవేసుకొని ఉంటాయి. వాళ్ళ కళకూ శ్రమకూ మధ్య ఉండే సన్నిహితమయిన సంబంధాన్ని జార్జి థామ్సన్ లాంటి వాళ్ళు గుర్తించారు. కళ వాళ్ళు శ్రమలో పొందే ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. అలసటను మరిపిస్తుంది. శ్రమ చేయడానికి కావలసిన ఉత్తేజాన్ని ఇస్తుంది. వారి కళలలో ఉండే లయ (rhythm) వారి శారీరక శ్రమలోని లయనుండి పుట్టిందేనని థామ్సన్ అంటాడు. ఈ కారణం చేతనే - బూర్జువా సమాజంలో కళ శ్రమ నుండి పూర్తిగా వేరుపడి మార్కెట్‌లో సరుకుగా మారడంతో అసంతృప్తి చెందిన భావుకులు చాలామంది ఆటవిక జీవితాన్ని ప్రశంసిస్తారు. కాని ఇక్కడ కూడా గుర్తుంచుకోవలసిన విషయం ఒకటి ఉంది. గిరిజనుల నృత్యం, పాట, చిత్రలేఖనం, అలంకరణ మొదలైన కళలకు శ్రమ సంబంధమయిన ఆనందంతోను, అలసటతోను, ఉత్తేజంతోను ఉండే సంబంధం అవ్యక్తమయినది (implicit). కళ యొక్క వ్యక్తమయిన (explicit) పాత్ర, అంటే దాని సామాజిక పాత్ర, గిరిజనుల జీవితంలో దాని ప్రాముఖ్యత వేరే ఉంది. అదేమిటంటే వాళ్ళు నమ్మిన దేవతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా గానీ, మంత్రం (Magic) ద్వారా గానీ శ్రమ ఫలాన్ని ఇనుమడింపజేయడం.

వేటాడే గిరిజనులు తమ ఇళ్ళ గోడలమీద జంతువులను వేటాడి చంపుతున్నట్టు బొమ్మలు వేస్తారు. వ్యవసాయం చేసేవాళ్ళు పంట చేతికొచ్చే సమయం ఆసన్నమయితే పంట కోస్తున్నట్టు అభినయిస్తూ నృత్యం చేస్తారు. ఇందులో తమ శ్రమకు కళాత్మకరూపం ఇచ్చుకోవడం అనే మానవీయ ప్రక్రియ అవ్యక్తమయినది. దానివల్ల వాళ్లు పొందే ఉత్తేజం కూడా అవ్యక్తమయిన ఫలమే. వీటి వ్యక్తమయిన ప్రయోజనం గిరిజనుల మూఢనమ్మకాలతో ముడిపడి ఉంటుంది. వేట జంతువులను చంపుతున్నట్టు బొమ్మ వేస్తే నిజంగానే ఆ ఫలితం దక్కుతుందన్న నమ్మకం గిరిజనులలో ఉంటుంది. పంట కోస్తున్నట్టు అభినయిస్తే పంట నిజంగానే పుష్కలంగా పండుతుందని ఆశిస్తారు. ఆదిమ మానవ మనస్తత్వం

ఒక వస్తువుకూ ఆ వస్తువు యొక్క ప్రతిరూపానికీ (అది చిత్రపటం గాని, నృత్య అభినయంలోని దృశ్యమే గాని, చివరికి కృత్రిమంగా తాము ఏర్పరచుకున్న సంకేతాలయినా గాని) తేడా చూడదు. ప్రతిరూపానికి ఏం జరిగితే వస్తువుకూ అదే జరుగుతుందని నమ్ముతుంది. ఇది చాలా ఆదిమమయిన మంత్రం. (ఇంగ్లిష్‌లో sympathetic magic అంటారు. చేతబడి దీని అవశేషం.) తరువాతి కాలంలో చిలవలు పలవలై అభివృద్ధి చెందిన మంత్రతంత్రాలన్నిటికీ మూలం.

గిరిజనుల కళా జీవితమంతా కూడా ఇంతే. ముగ్గులు పెట్టడంలో ఉన్న సౌందర్య దృష్టి అవ్యక్తమయింది. వాటి అసలు ఉద్దేశ్యం దుష్ట శక్తులను దూరంగా ఉంచడం. అలాగే పచ్చలు పొడిపించుకోవడంతో వాళ్ళ అసలు ఉద్దేశం చనిపోయిన తరువాత దయ్యాలు తినకుండా శరీరాన్ని కాపాడుకోవడం. మరి వీటిలో కళ లేదా, సృజనాత్మకమయిన ఆనందం లేదా అంటే ఉన్నాయి. కాని ఆ కళ, ఆ ఆనందం వాళ్ళ విశ్వాసాల పరిభాషలోనే రూపం తీసుకుంటాయి. గిరిజనుల ఆలోచనలలో వాళ్ళ విశ్వాసాలు ఎంత బలంగా అల్లుకుపోయి ఉంటాయంటే వాళ్ళ శ్రమను, కళాకాంక్షను, సృజనాత్మకతను, విశ్వాసాలను వేరు చేయడం సాధ్యం కాదు. కళను నిజంగా శ్రమ యొక్క ప్రత్యక్ష వ్యవస్థీకరణగా ఒక గిరిజనుడు సృష్టించదల్చుకొన్నా అది అతని విశ్వాసాల నుడికారంలోనే రూపం తీసుకుంటుంది. అంతిమంగా ఆ నుడికారంలోనే అతనికి అది అర్థవంత మవుతుంది.

ఈ నుడికారం నుండి గిరిజనుల జీవితాన్ని వేరుచేయటం సాధ్యం కాదు. ఈ విశ్వాసాలను తొలగించి వాళ్ళ సమిష్టి జీవనాన్ని, కళాత్మక జీవితాన్ని మాత్రమే కాపాడాలనుకోవడం అర్థరహితం. గులాబి పువ్వు నుండి గులాబి రంగు తొలగించటం లాంటి ప్రయత్నం అవుతుంది అది. గిరిజనుల జీవితంలోని భౌతిక వెనుకబాటుతనమే వాళ్ళ జీవితాలలో మనకు కనిపించే 'ఉన్నత' లక్షణాలకూ మూఢవిశ్వాసాలకూ రెండింటికీ కూడా కారణమని గుర్తించాలి.

కాని ఆ భౌతిక జీవితం మారవలసింది కాంట్రాక్టర్ల ద్వారా, కలప వ్యాపారస్తుల ద్వారా, సామ్రాజ్యవాద దళారీ పెట్టుబడుల ద్వారా, గిరిజనేతరుల భూ ఆక్రమణల ద్వారా, ఇతర దౌర్జన్యాల ద్వారా కాదు. దానివల్ల గిరిజన సంస్కృతిలోని మానవీయ అంశ నాశనమవుతుందే తప్ప వాళ్ళ భౌతిక జీవితమూ అభివృద్ధి కాదు, వాళ్ళ మూఢవిశ్వాసాలూ నాశనం కావు. ఈ దేశ సంపద మొత్తాన్నీ శ్రామికుల పరం చేసే విప్లవంలో గిరిజనులు భాగం కావాలి. ఆ విప్లవం

విజయవంతమై, ఒక్క అడవులలోనే కాదు, దేశవ్యాపితంగా సమిష్టి జీవనాన్ని నెలకొల్పి కళనూ సంస్కృతినీ బజారు నుండి బయటకు తెచ్చి తిరిగి శ్రామికుల పరం చేసినప్పుడే దేశంలోని అందరితోపాటు గిరిజనులు కూడా తమ సంస్కృతిలోని మానవీయ లక్షణాలను కాపాడుకోగలుగుతారు. తమ సంస్కృతిలోని ఉన్నత లక్షణాలను కాపాడుకోగలుగుతారు. గిరిజనుల సంస్కృతిలోని ఉన్నత లక్షణాలు కాపాడబడాలంటే అవి మొత్తం సమాజంలో నెలకొల్పబడాలి. అంటే సమాజాన్ని మొత్తం ఆటవికులను చేయటం కాదు. ఇవ్వాళ కొందరు దోపిడీదారుల ఆస్తిగా ఉన్న విజ్ఞానం అందరి సంపదా కావాలి. ఆ సంపద ప్రాతిపదికగా, కొందరు సంపన్నులుగా ఉండే సమాజం కాక మొత్తం సంపన్నమయ్యే సమాజం ఏర్పడాలి. ప్రకృతిని చూసి భయపడవలసిన అవసరం పోవాలి. ఆ ఉన్నతమైన మానవీయ స్థాయిలో తిరిగి సమిష్టి జీవనాన్నీ కళాత్మక జీవితాన్నీ ఇతర మానవీయ విలువలనూ సాధించాలి.

*'అడవిలో వెన్నెల' కథల సంకలనానికి రాసిన ముందుమాట*
*కరీంనగర్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ - మార్చి 1985*

అణచివేత

# ఆదిలాబాద్ గిరిజన పోరాటాలు

"గిరిజనుడికి అడవి తన స్వగృహంలాంటిది. అతని పురిటిల్లయినా ఉయ్యాల అయినా అడవే. చెట్లతో బాటు, జంతువులతో బాటు, గిరిజనుడు ఆ అడవి వెచ్చటి ఒడిలో పెరుగుతాడు. ఒకరి హక్కులను ఒకరు భంగపరచుకోకుండ, సామరస్యంగా ఈ ప్రాణులన్నీ అడవిలో జీవిస్తాయి. చేపకు నీరెలాంటిదో గిరిజనుడికి అడవి అలాంటిది. ప్రతీ అడవి శబ్దాన్నీ గుర్తించ గలడు, ప్రతీ పక్షి పేరు, మొక్క పేరు, జంతువు పేరు, చివరికి కీటకాల పేర్లు కూడా చెప్పగలడు. అతను అడవిని ప్రేమిస్తాడు, ఆ అడవి ప్రేమకు, ఆరాధనకు పాత్రుడవుతాడు. కేవలం షికారు (వేట) కోసం అతనెన్నడూ జంతువులను చంపడు. ఉబుసుపోకకు ఎన్నడూ ఒక్క చెట్టునూ నరకడు. అతను ప్రకృతి బిడ్డ. ప్రేమమయి అయిన తల్లిలాగా ప్రకృతి అతన్ని పోషించి, లాలించి, సంరక్షిస్తుంది".

*(వెన్నెలకంటి రాఘవయ్య)*

ఆధునిక విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్రవేత్తలకూ వెన్నెలకంటి రాఘవయ్య గారికీ ఒక తేడా ఉంది. ఆయనలో శాస్త్రీయ పరిశోధన ఎక్కడ అంతమవుతుందో, ఆవేశ అభిమాన అతిశయం ఎక్కడ ప్రారంభమవుతుందో చెప్పడం కష్టం. అది గాంధీ భక్తిగానీ, హాయిగా స్వేచ్ఛగా అడవులలో జీవిస్తారని పట్టణ ప్రాంత మేధావుల చేత ఊహించబడే గిరిజనులపట్ల ప్రేమగానీ - వాటి వ్యక్తీకరణకు ఇబ్బందికరమయిన వాస్తవాలను అడ్డం రానివ్వడు.

రాజ్యం, లేక ప్రభుత్వం నాగరిక సమాజంలో ఒక బలమయిన నిర్బంధక శక్తి. అది గిరిజనుల ఆదిమ వ్యవస్థలో ఉండదు. ఆ కారణంగా నాగరికులు - మరీ ముఖ్యంగా విశృంఖలతను ప్రేమించే పెటీబూర్జువా మేధావులు - గిరిజనులు 'స్వేచ్ఛ'గా జీవిస్తారనుకుంటారు. కాని రాజ్యం కేవలం ఒకానొక నిర్బంధక శక్తి మాత్రమే. అది ప్రత్యక్షంగా కనిపించడం వల్ల, మన విశ్వాసాలలో భాగం కాకుండా బయటి నుండి మన మీద పెత్తనం చేయడం వల్ల అదొక్కటే నిర్బంధకశక్తిగా కనిపించడం సహజం. నిజానికి దానికంటే బలీయమయిన ఆచారాలు గిరిజనులను కట్టి వేస్తాయి. అజ్ఞానం నుండి, భయం నుండి పుట్టిన ఈ ఆచారాలు వారికి అన్ని విషయాలలోనూ ప్రామాణికతను నిర్దేశిస్తాయి. వేటాడినా, వ్యవసాయం చేసినా, వయసొచ్చినా ఏదీ 'స్వేచ్ఛ'గా జరగదు, ఆచారాలను అనుసరించి జరగాలి. అయితే ఆ నియమాలు గిరిజనుడి మీద బయటి నుండి చొప్పించబడవు. అతని విశ్వాసాలలోనే అవి భాగమయి వుంటాయి కాబట్టి నిర్బంధశక్తులుగా కనిపించక పోవచ్చు. కాని కనిపించేదే వాస్తవమనుకోవడం చాలా పేలవమయిన దృక్పథం. అంతేకాకుండా, గిరిజనుడు ప్రకృతితో పూర్తి సామరస్యంలో జీవించడు. సామరస్యమూ ఉంటుంది, ప్రకృతితో పోరాటమూ ఉంటుంది. నిజానికి పోరాటమే ప్రధానంగా ఉంటుంది. ఈ విషయాలన్నీ చెప్పడం కీర్తిశేషులయిన రాఘవయ్యగారి ఆత్మకు విద్యాబోధ చేయడానికి కాదు, విప్లవ రచయితలు గిరిజనుల జీవితాన్ని romanticise చేయకూడదని హెచ్చరించడానికి.

కొద్ది అభివృద్ధి చెందిన దశలో ప్రకృతితో గిరిజనుడి పోరాటం ప్రధానంగా భూసారాన్ని ఆవరించుకొని ఉంటుంది. భూమి ఎక్కడ సారవంతమయి ఉంటుందో అక్కడే అడవి దట్టంగా ఉంటుంది. వ్యవసాయం కూడా అక్కడే ఫలవంతమవుతుంది. ఉబుసుపోకగా గిరిజనుడు చెట్లను నరకడన్నది వాస్తవమే. కాని సారవంతమయిన భూమి కోసం అతనికి అడవితో పోరాటం తప్పదు. భూమి అంతగా సారవంతం కాని చోట అడవి పల్చగా ఉండవచ్చు కాని ఆ నేల మీద కూడా భుక్తిని పొందడం కోసం పోరాటం చేయకతప్పదు. ఇది మరీ నికృష్టమయిన పోరాటం. ఫలమివ్వని నేలమీద ఫలం కోసం శ్రమపడే ఆరాటం.

ప్రకృతితో పోరాటంలో ఆదిలాబాద్ గిరిజనులు ఒక రకంగా అదృష్టవంతులు. ఎందుకంటే ఆదిలాబాద్ నేల చాలా సారవంతమయినది. లోతుగా దున్నవలసిన అవసరం లేకుండా తమకు అలవాటయిన పోడు వ్యవసాయంతోనే వారు జీవితం వెళ్ళదీసుకోవచ్చు. మొదట కొంత ప్రాంతంలో అడవిని నరకడం, మూడో నాలుగో

పంటలు తీయడం, తరువాత ఆ ప్రాంతంలో భూసారం క్షీణిస్తుంది కాబట్టి దాన్ని బీడు పెట్టి మరికొంత అడవిని నరకడం, అక్కడి నుండి మరొక ప్రాంతానికి పోవడం, ఇట్లా నడుస్తుంది పోడు వ్యవసాయం. ఇట్లా ఎన్ని శతాబ్దాల పాటు ఆదిలాబాద్ గిరిజనులు జీవించారో గాని, 20వ శతాబ్దం వరకు వాళ్ళను ఎవ్వరూ ఇబ్బంది పెట్టినట్టు కనిపించదు. 20వ శతాబ్దంలోనయినా వాళ్ళను ఇబ్బంది పెట్టడానికి వాళ్లను అప్పటి దాకా కాపాడిన ఆ భూసారమే కారణమయింది. ఆదిలాబాద్ అడవులు ప్రధానంగా టేకు అడవులు. నేల నల్లరేగడి నేల. వాటిని చూసి ఎవరికయినా నోరూరడం సహజం. నిజాం నవాబుల నోరు 20వ శతాబ్దం వరకు ఊరలేదంటే ఫ్యూడల్ ప్రభుత్వానికుండే సహజమయిన అలసత్వమే దానికి కారణం. అయితే చుట్టూ ఉన్న బ్రిటిష్ పాలిత ప్రాంతాలను చూసి, ఈ నేలలో పత్తి పండిస్తే, ఈ అడవులను కలప వ్యాపారానికి వాడుకుంటే తనకెంత రెవెన్యూ వస్తుందో అని నిజాం నవాబు కూడా ఒకరోజు లెక్కలేసుకున్నాడు.

పత్తిని వ్యాపార పంటగా పండించే అలవాటు మన దేశానికి బ్రిటిష్ వాళ్ళ వల్ల వచ్చింది. చాలా ప్రాచీన కాలం నుండి మన దేశం నాణ్యమయిన నూలు బట్టల ఉత్పత్తికి ప్రసిద్ధమే కాని గతంలో రవాణా సౌకర్యాలు అపరిణతంగా ఉండడం వల్ల ఏ గ్రామానికి ఆ గ్రామం కాకున్నా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతం తనకు అవసరమయిన పత్తి మాత్రమే పండించుకునేది. ఇవ్వాళ పత్తి పంట సాపేక్షికంగా అరుదయిపోయిన బెంగాల్ కూడా ఒకప్పుడు ఢాకా నూలు వస్త్రాలకు అవసరమయిన పత్తిని తానే పండించుకునేది. బ్రిటిష్ వాళ్ళు రైల్వే లైన్లు వేసిన తరువాత ఈ పరిస్థితి మారింది. పత్తి పంటకు లాయకయిన (అనువైన) ప్రాంతాలలో పత్తిని మాత్రమే విస్తృతంగా పండించడం ప్రారంభమయింది. దాంతో బెంగాల్ వంటి ప్రాంతాలు తమకు కావలసిన పత్తిని మొత్తం దాదాపుగా దిగుమతి చేసుకోవడం మొదలుపెట్టాయి. ఈ పరిణామం వల్ల ఆయా ప్రాంతాలలో భూమిశిస్తు మీద, రవాణాసుంకాల మీద బ్రతికే రాజులకూ నవాబులకూ జాగీర్దార్లకూ ఆదాయం పెరిగింది. కాబట్టి వాళ్ళు తమ సంస్థానాలలో పత్తి పంటను ప్రోత్సహించడం మొదలుపెట్టారు. దేశంలో నూలు మిల్లుల సంఖ్య పెరిగేకొద్దీ ఈ ప్రోత్సాహం కూడ తదనుగుణ్యంగా పెరిగింది. ఆదిలాబాద్ అడవులలోని నల్లరేగడి నేల పత్తికి లాయకయినదన్న ఆలోచన ఈ క్రమంలోనే హైదరాబాద్ నిజాంకూ వచ్చింది.

మరి దానికోసం ఏం చేయాలి? గోండ్లనూ కొలాంలనూ నాయక్‌పోడ్‌లనూ కూర్చోబెట్టి పత్తి ఎట్లా పండించాలో నేర్పించి వాళ్ళను పూర్తిగా వ్యవసాయదార్లగా

మార్చవచ్చు. అది ఒక సోషలిస్టు ప్రభుత్వం చేసే పని. కాని దోపిడీదారయిన నిజాం నవాబుకు అంత ఓపిక ఎక్కడిది? ఆయన గిరిజనుల అడవులను గిరిజనేతర భూస్వాములకు వేలంపాడి పట్టా చేయించాడు. అప్పుడే ఆసిఫాబాద్ ప్రాంతంలో (ఆదిలాబాద్ జిల్లాకు ఉత్తర భాగం) కొన్ని వేల ఎకరాలను బ్రాహ్మణ, ముస్లిం, వెలమ భూస్వాములు చేజిక్కించుకున్నారు. వీళ్ళు వ్యవసాయదారులు కారు. దొరలు. దక్షిణాన కరీంనగర్‌ను ఆనుకొని ఉన్న లక్సెట్టిపేట దొరలు కొందరు ఇల్లు కదలకుండ ఈ భూములను కొనుక్కున్నారు. కాబట్టి కొనుక్కున్న భూములను సాగుచేయడం కోసం కాపు, మరాఠా, కున్బి, తదితర కులాల రైతులను (ఆంధ్ర నుండి, మహారాష్ట్ర నుండి) రప్పించి కౌలుదార్లగా నియమించారు. గిరిజనులకు భూమి పోవడమే కాదు, కనీసం ఆ భూమిలో జీతానికో కౌలుకో పనిచేసే 'భాగ్యం' కూడా లేకుండ పోయింది. ఆసిఫాబాద్ వదిలి అడవి లోపలి ప్రాంతానికి వలస పోవలసి వచ్చింది. ఇది ఒక దెబ్బ.

రెండవ దెబ్బ దీని మీద రోకటిపోటే అయింది. కలప వ్యాపారం కోసం, దాని నుండి వచ్చే రెవెన్యూ కోసం అడవుల్ని 'సంరక్షించడం' 1920లలో మొదలయింది. గిరిజన గూడాల చుట్టూ సాగులో ఉన్న భూమిని మినహాయించి మిగిలిన అడవిని 'రక్షిత' అడవులుగా ప్రకటించారు. అయితే గిరిజనులు చేసేది పోడు వ్యవసాయం కాబట్టి ఇవ్వాళ సాగులో ఉన్న భూమిని రేపు సాగు చేయరు. లోతుగా దున్నడం, నీళ్లు పెట్టడం, ఎరువులు వేయడం ఉండవు కాబట్టి వాళ్ళు సాగు చేసే భూమి త్వరగా భూసారాన్ని కోల్పోతుంది. వాళ్ళు వ్యవసాయం చేస్తున్న భూమిని మినహాయించి మిగిలిన భూమినంతా రక్షిత అడవిగా ప్రకటించి అక్కడ చెట్లు నరకడాన్నీ, వ్యవసాయం చేయడాన్నీ నిషేధిస్తే గిరిజనుల జీవనం అసాధ్యమయిపోతుంది. 'రక్షిత' అడవిని నరికి ఫారెస్టు డిపార్ట్‌మెంటుతో ఘర్షణకయినా దిగాలి, లేదా గూడెం వదిలి అడవి లోతట్టు ప్రాంతానికయినా పోవాలి. అట్లా ఘర్షణకు దిగిన వారిలో కొమురం భీము ఒకడు.

భీముది ఆసిఫాబాద్ దగ్గరి సంకేపల్లి గ్రామం. అడవి భూములను భూస్వాములకు పట్టా చేసిన కార్యక్రమం వల్ల ఎక్కువగా దెబ్బ తిన్నది ఆసిఫాబాద్ ప్రాంతం. ఈ ఆక్రమణ గురించి ఆస్ట్రియాకు చెందిన సామాజిక శాస్త్రవేత్త హైమెండార్ఫ్ చాలా విషయాలు చెప్తాడు. మానిక్‌గడ్ కొండల దగ్గర కేవలం 10 గిరిజనేతర కుటుంబాలు 10 వేల ఎకరాలు పట్టా చేయించుకున్నాయట. మందమర్రి భూస్వామి ఈ శతాబ్ద ఆరంభంలో కరీంనగర్ నుండి వలసవెళ్ళి

1946 నాటికి 8 వేల ఎకరాలు సంపాదించుకున్నాడట. గిరిజనేతర భూస్వాములకు ఇంతటి భారీ పరిమాణంలో భూములు దొరికాయి కాని అదే అడవిలో గిరిజనులకు పట్టాలు కావాలంటే మాత్రం దొరికేవి కాదు. దానికి మూడు కారణాలు కనిపిస్తాయి. ఒకటి, ఈ పట్టాలిచ్చే కార్యక్రమం వెనక ఉన్న ఉద్దేశం పత్తి పంటను విస్తృతం చేయడం. ఆ పనికి ఆనాటికి గిరిజనులు సమర్థులు కారు. రెండవది, పట్టా రావాలంటే పట్వారీల సహాయ సహకారాలు కావాలి. దానికి పైరవీలు, లంచాలు అవసరం. గిరిజనులకు ఇవి సాధ్యం కావు. మూడవది, పోడు వ్యవసాయం చేసుకునే వారికి ఈ పట్టాలు తీసుకోవడంలో ఇబ్బంది ఉంది. స్థిరంగా ఒకే కమతం మీద వ్యవసాయం చేసేవారు పట్టా తీసుకోగలరు గాని, అడవిని నరుక్కుంటూ రెండు మూడేళ్ళకొకచోట పంట వేసేవాళ్ళు ఏ భూమికి పట్టా తీసుకుంటారు? దీనివల్లే అంతకు పూర్వం కూడా గిరిజనులు నిజాం ప్రభుత్వానికి శిస్తు చెల్లించినా వారి భూములకు పట్టాలు ఉండేవి కావు. ఆ సంవత్సరం ఎంత భూమిలో పంట వేసారో దాన్ని బట్టి శిస్తు కడుతూ ఉండేవారు. దీనిని సివా-ఇ-జమాబంది అంటారు (సివా అంటే మినహాయింపు. జమాబంది అంటే పట్టా ఇవ్వడం ద్వారా శిస్తు ఖరారు చేసే పద్ధతి. ఇంగ్లిష్‌లో revenue settlement). ఈ సౌకర్యాన్ని మొదట్లో నిజాం ప్రభుత్వమే గిరిజనులకు కల్పించింది. అడవి గిరిజనులదే అయినంత కాలం ఈ పద్ధతి బాగానే నడిచింది గాని, అడవి భూమిలో జమాబంది ప్రారంభించిన తరువాత ఈ సౌకర్యమే గిరిజనులకు ఉరిత్రాడయింది. కరీంనగర్, లక్సెట్టిపేట ప్రాంతాల నుండి భూస్వాములు వచ్చి వేలకు వేల ఎకరాలను పట్టా చేసుకుంటున్నా గిరిజనులు చూస్తూ ఊరుకోవాల్సి వచ్చింది. తరతరాలుగా గిరిజనులు ఆ భూమిని సాగు చేస్తున్నా, శిస్తు కూడా నిజాం ప్రభుత్వానికి చెల్లిస్తున్నా వారికి పట్టా మాత్రం లేదు. ఆ భూస్వాములు కూడా చాలా తెలివిగా ప్రవర్తించేవారని హైమెండార్ఫ్ అంటాడు. వాళ్లు అడవులను పట్టా చేయించుకోకుండ గిరిజనులు సాఫు చేసిన భూములను మాత్రమే చేయించుకునేవారు. ఆ భూముల నుండి బేదఖల్ చేయబడ్డ గిరిజనులు వేరే అడవికి పోయి కొంతకాలం సివా-ఇ-జమాబంది ప్రాతిపదిక మీద పోడు వ్యవసాయం చేసిన తరువాత భూస్వాములు అక్కడికి కూడా వచ్చి ఆ భూమినీ పట్టా చేయించుకునేవారు. ఈ రకంగా పులి తరిమిన లేడిపిల్లలాగా గిరిజనులు అడవులన్నీ నిస్సహాయంగా తిరిగారు.

ఇది చాలదన్నట్టు 1920 తరువాత అడవుల సంరక్షణ మొదలయింది. ఎవరి కోసం సంరక్షణ, ఎవరి నుండి సంరక్షణ అంటే కలప వ్యాపారం కోసం

సంరక్షణ, గిరిజనుల నుండి సంరక్షణ అని సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. భూస్వాముల దాడిని తట్టుకోలేక కొత్త అడవులను నరకడం మొదలుపెట్టిన గిరిజనులు ఫారెస్టు చట్టాలతోనూ అధికార్లతోనూ తలపడక తప్పలేదు. వాళ్ళను మెప్పించి, లంచాలిచ్చి 'నీ బాంచెన్' అంటూ బ్రతకాలి, లేదా మళ్ళీ వలస వెళ్ళాలి. పట్టాలు తెచ్చుకునే భూస్వాములతోనూ, ఫారెస్టు అధికార్లతోనూ నిత్యం పోరాటం చేయడం గిరిజనుల బ్రతుకయింది ఇరవయ్యవ శతాబ్దం ఆరంభం నుండి.

అటువంటి ఒక తగువులో భీము చిక్కుకున్నాడనీ, అరెస్టును తప్పించుకోవడానికి పారిపోయి చాలా ప్రాంతాలు తిరిగి వచ్చాడనీ, అస్సాం తేయాకు తోటలలో కొంతకాలం పనిచేసాడనీ, అక్కడుండగా అల్లూరి సీతారామరాజు నడిపిన మన్య పోరాటాన్ని గురించి విన్నాడనీ చెప్తారు. అదెట్లాగున్నా, 1935 ప్రాంతంలో మళ్ళీ భీము ఆసిఫాబాద్‌కు తిరిగి వచ్చాడు. వచ్చాక కొన్ని గోండు, కొలాం, నాయక్‌పోడ్ కుటుంబాలతో కలిసి బాబేఝరీలో స్థిరపడ్డాడు. బాబేఝరీ ఆసిఫాబాద్‌కు 12 మైళ్ళ పశ్చిమాన ఉంది. అక్కడ 5 సంవత్సరాలున్నాడు. వాళ్ళందరూ అడవి నరుక్కొని వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. అయితే 1940 నాటికి 'అడవుల సంరక్షణ' చట్టాలు వాళ్ళ గ్రామానికీ వచ్చాయి. పట్టాలు లేని వాళ్ళను వెళ్ళిపొమ్మన్నారు. పోనివాళ్ళ ఇళ్ళు కాలబెట్టి వాళ్ళను చెల్లాచెదురు చేసారు. అట్లా చెదిరిపోయిన వాళ్ళలో కొందరికి బాబేఝరీకి అయిదో ఆరో మైళ్ళ దూరాన ఉన్న జోడేఘాట్ (లేక జోడెన్‌ఘాట్)లో స్థిరపడడానికి అనుమతి ఇచ్చారు. వాళ్ళలో భీము ఒకడు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినా కూడా ఫారెస్ట్ అధికార్లు గిరిజనులను డబ్బుల కోసం హింసించడం మొదలుపెట్టారు. డబ్బులియ్యకపోతే భూమి పట్టా కానివ్వమనీ, ఇళ్ళు కాలబెడతామనీ బెదిరించారు. భీము హైదరాబాద్‌కు వెళ్ళి 57 ఎకరాల ప్రాంతాన్ని సాగు చేసుకోవడానికి అనుమతి తెచ్చుకున్నట్టు చెప్తారని హెమెండార్ఫ్ అంటాడు. అప్పటికీ ఫారెస్ట్ అధికార్లు కనికరించకపోయేసరికి రెవెన్యూ డిపార్ట్‌మెంటుకు భీము పిటిషన్ పెట్టుకున్నాడట. (ఇదంతా హెమెండార్ఫ్ వంటి గిరిజన సానుభూతిపరుల కథనం. ప్రభుత్వ అధికారి అయిన ఆసిఫాబాద్ ప్రధాన తాలూక్‌దారు అబ్దుల్ సత్తార్ సాహెబ్ కథనం వేరే విధంగా ఉంది. తాము గిరిజనులకు జోడేఘాట్ దగ్గర భూమి ఇవ్వడానికి సిద్ధమే గాని, తాము ఇవ్వగలిగింది భీము ఆశలకు చాలలేదనీ, అతను తనొక్కడికే 5 గ్రామాల జాగీరు కావాలని కోరాడనీ సత్తార్ సాహెబ్ ఆరోపించాడు. ఈ ఆరోపణ విషయం తరువాత చూద్దాం).

ఈ తతంగం ఒకపక్క నడుస్తుండగానే ఒక ఫారెస్ట్ రేంజర్ వీళ్ళను భూముల నుండి ఖాళీ చేయించడానికి వచ్చాడట. గిరిజనులు అతనినీ, అతనితో ఉన్న చౌకీదార్లనూ తన్ని పంపించారట. కేసయింది. అరెస్టువారంట్లు తయారయినాయి. 12 రోజుల తరువాత డి.ఎస్.పి. స్వయంగా వచ్చి, కొంత ఘర్షణ జరిగాక భీమును, మరొక ఆరుగురు గోండ్లను అరెస్టు చేసి అక్కడికక్కడే జమానత్ మీద విడిచి పెట్టాడు. కేసు మొదలయ్యాక కూడా భీము గాని, అతని తోటివారు గాని కోర్టుకు హాజరు కాకపోయేసరికి, ఆసిఫాబాద్ ఉపతాలూక్‌దారు (second taluqdar) భీము తదితరులను అరెస్టు చేయడానికి భారీ సన్నాహాలతో బయలుదేరాడు. సాయుధులయిన 94గురు పోలీసులతో వెళ్ళాడు. వెంట ఒక డాక్టరు కూడా ఉన్నాడట. పక్క గ్రామానికి చేరి, లొంగి పొమ్మని భీముకు సందేశం పంపారట. భీము మన్నించాడు కాడు. తరువాతి రోజు ఉదయం (అది 1940 సెప్టెంబర్ నెల గాని, అక్టోబర్ మొదటివారం గాని అయి ఉండాలి. ఉరుదూ లెక్కల ప్రకారం 6 అబాన్ 1349 ఫస్లీ) తాలూక్‌దారు జోడేఘాట్‌కు వెళ్ళి గోండ్ల ప్రతినిధులను రప్పించి చర్చలు పెట్టాడు. 500 మంది వరకు గోండ్లు దూరంగా నిలబడి చూస్తున్నారు. మూడు గంటలు నిష్ఫలంగా చర్చించారట. కేసు తేలేవరకు శిస్తు వసూళ్లు వాయిదా వేస్తామని హామీ ఇచ్చినట్టు తరువాత తాలూక్‌దారు చెప్పుకున్నాడు. అయినా గోండ్లు సంతృప్తి చెందలేదు. ఆ తరువాత ఏం జరిగిందన్న దాని గురించి అభిప్రాయ భేదాలున్నాయి. ప్రభుత్వ రిపోర్టు ఒక రకంగాను, తరువాతి సంవత్సరం (1941లో) అక్కడికి వెళ్ళి విస్తృతంగా సమాచారం సేకరించిన హెమెండార్ఫ్ మరొక రకంగాను, కాల్పులు జరిగిన కొద్ది రోజులకే హైదరాబాద్ నుండి నిజ నిరూపణ కమిటీగా వెళ్ళి రిపోర్టు సమర్పించిన కాంగ్రెస్ నాయకులు, పత్రికా సంపాదకులు (రామాచారి, సయ్యద్ సిరాజుల్ హసన్‌తిర్మిజి, కాశీనాధ్ వైద్య, నర్సింగరావు) మూడవ రకంగాను చెప్తారు. చర్చలు విఫలమయిన కారణంగా ఇక గోండ్లు దాడి చేస్తారని భయపడి చర్చలకు వచ్చిన ప్రతినిధులను కస్టడీలోకి తీసుకోవడం జరిగిందని ప్రభుత్వ రిపోర్టు అంటుంది. గోండ్లు పూనకం వచ్చినట్టు ఊగడం మొదలుపెట్టారనీ, అది యుద్ధ సంసిద్ధతకు సూచన అనీ వారు రిపోర్టులో రాసుకున్నారు. కాదు, వాళ్ళను అక్రమంగా కస్టడీలోకి తీసుకోవడం వల్లనే గిరిజనులు కదిలి వచ్చారని నిజనిరూపణ కమిటీ నివేదిక అంటుంది. గిరిజనులు తమ బర్మార్లతో కాల్పులు జరిపారట కాని పోలీసులలో ఒక్కరికీ దెబ్బలు తగలలేదు. ఈ విషయంలో అధికార్లు, హెమెండార్ఫ్ ఏకీభవిస్తారు. నిజనిరూపణ కమిటీ నివేదిక మాత్రం

గోండ్లు అసలు కాల్పులు జరిపినట్టే చెప్పదు. పైపెచ్చు వాళ్ళు కాల్పులు జరపకపోవడాన్నే పోలీసులు కుట్రగా భావించారట. పోలీసుల బుల్లెట్ల నుండి తన మంత్ర శక్తి ద్వారా రక్షిస్తానని భీము హామీ ఇచ్చాడు కాబట్టి ముందు పోలీసులు తమ మందుగుండునంతా నిష్ప్రయోజనంగా ఖర్చు పెట్టిన తరువాత వాళ్ళ మీదపడి చంపవచ్చుననే పన్నాగంతో గిరిజనులున్నారని పోలీసులు నిర్ణయించుకొని కాల్పులు జరిపారట. మొదటి రౌండు కాల్పులలో ఎవరికీ దెబ్బ తగలకపోయేసరికి భీము మంత్రశక్తి పట్ల పోలీసులుకే భయం పుట్టి మరింత బలమయిన తుపాకులతో కాల్చారట. (ఇట్లాంటి కథే అల్లూరి సీతారామరాజు గురించి కూడా చెప్తారు. ఆయన మంత్రశక్తి పట్ల గిరిజనులకేమోగానీ పోలీసులకు మరింత నమ్మకము ఉండిందంట. ఆయన పోలీసుస్టేషన్ మీద రెయిడ్ చేయబోతున్నాడని తెలిస్తే ఆయుధాలన్నిటినీ వదిలిపెట్టి పోలీసులే పారిపోయేవారట!) భీము, మరికొందరు అక్కడికక్కడే చనిపోయారు. కొందరు తీవ్రంగా దెబ్బలు తిన్నారు. నిజనిరూపణ కమిటీ రిపోర్టు ప్రకారం మొత్తం మృతుల సంఖ్య 14. బాబేఝరి - జోడేఘాట్ పోరాటం అక్కడితో ఆగిపోయింది. ఈ సంఘటన వెనుక గిరిజనుల విస్తృతమయిన అసంతృప్తి, అలజడి ఉన్నాయన్నది స్పష్టమే. కాని దీనిని సంథాల్ పోరాటంతోనో లేక మన్య పోరాటంతోనో సమానమయిన తీవ్రత, విస్తృతి, నిర్మాణం ఉన్న పోరాటంగా చెప్పవచ్చునా అంటే అనుమానమే. భీము చనిపోకుంటే ఏమయ్యేదో గాని, పోరాటం అపరిణతంగా ఉండగానే జోడేఘాట్ కాల్పులు జరగడం వల్ల అది పూర్తిగా ఎదగకుండానే సమసిపోయింది. చాలా పరిమితమయిన ఈ పోరాటాన్ని గిరిజన తిరుగుబాటు అనడానికి వీలు లేదని హెమెండార్ఫ్ కూడా అంటాడు.

ఈ పోరాటాన్ని గురించి, కొమురం భీము గురించి ప్రభుత్వ అధికార్లు చెప్పిన విషయాలు చాలా ఆసక్తిగొలుపుతాయి. వాటికీ, ఇవ్వాళ ప్రజా పోరాటాల గురించి ప్రభుత్వాలు చేసే వక్రీకరణలకూ అణుమాత్రం తేడా లేదు. భీముకు రాజ్యాధికార కాంక్ష ఉండిందట. అతను మిగిలిన గోండ్లలాగా అమాయకంగా నిరక్షరాస్యుడిగా ఉండిపోక (దుర్మార్గుడు) ఎక్కడెక్కడికో పోయి ప్రపంచ జ్ఞానం సంపాదించుకు వచ్చాడట. అతనికి మహదేవ్ అనే విద్యావంతుడయిన గోండు టీచరు సలహాదారుగా ఉండేవాడట. ఆ ద్రోహి సహాయం లేకపోతే భీము తన దుశ్చర్యలను కొనసాగించ లేకపోయేవాడనీ, జోడేఘాట్ కాల్పుల తరువాత మహదేవ్ ఎక్కడికో పారిపోయాడనీ, అతన్ని కూడా అరెస్టు చేసి తీరుతామనీ జోడేఘాట్ కాల్పుల గురించి రాసిన ప్రభుత్వ రిపోర్టు శపథం చేస్తుంది. ఆసిఫాబాద్ ప్రధాన తాలూక్‌దారు

అబ్దుల్ సత్తార్ మాటల్లో చెప్పాలంటే, "భీముకు ఈ ప్రాంతంలో ఒక గోండు రాజ్యాన్ని ఏర్పరచి, ఇక్కడి గోండ్లందరినీ తన పాలన క్రిందికి తెచ్చుకోవాలన్న కాంక్ష ఉండింది. తనకు 5 గ్రామాల జాగీరు ఇమ్మని కూడా అతను నన్నొకసారి కోరాడు." గోండ్లను మోసం చేయడానికి తనకు మంత్రశక్తి ఉందనీ, తనతో ఉంటే బుల్లెట్లు ఏం చేయవనీ బుకాయించేవాడట. ఇట్లా గోండ్ల మూర్ఖత్వాన్ని వాడుకొని తానొక జాగీరు పొందాలనో రాజ్యం స్థాపించాలనో పన్నాగం పన్నాడట.

అబ్దుల్ సత్తార్ సాహెబ్ ఈ ఆరోపణలు చేసి ఊరుకోలేదు. ప్రజల నాయకులకూ ప్రజలకూ మధ్య వైరుధ్యం సృష్టించే దోపిడీ వర్గాల సంప్రదాయాన్ని అనుసరించి, భీము చేత మోసపోయిన 'అమాయక గోండ్లు' తరఫున తానే స్వయంగా వకాల్తా పుచ్చుకొని నిజాం ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నాడు. "భీము నక్కజిత్తులకు ఈ గోండ్లంతా మోసపోయారు. వీళ్ళకు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు. కాబట్టి దయ ఉంచి వీళ్ళను క్షమించి కేసులు కొట్టేయాలి" అని రాసాడు. అంతటితో ఆగక గోండ్ల పేరు మీద కూడా ఒక అర్జీ రాసి అంబాదాస్‌రావు, రాంచందర్‌రావు అనే ఇద్దరు గోండ్ల చేత సంతకం చేయించాడు. అందులో, "మాకు స్వేచ్ఛగా అడవి నరుక్కునే హక్కు ఇప్పిస్తానని కొమురం భీము చెప్తే వచ్చాము. మీరు జోడేఘాట్‌కు వస్తున్నారనీ, బంజరు భూముల కోసం మీకు అర్జీ సమర్పించుకుందామనీ మాతో చెప్తే ఆనాడు జోడేఘాట్‌కు వచ్చాము. మీరు మమ్మల్ని అక్కడి నుండి వెళ్ళిపొమ్మన్నప్పుడు వెళ్ళిపోయేవాళ్ళమే గాని భీము తన చుట్టూ ఉన్న మంత్రవలయాన్ని దాటితే మా ప్రాణాలు పోతాయని బెదిరించాడు. అందుకే కాల్పులు జరిగేదాకా భయపడుతూ అక్కడే ఉన్నాం. తూటాలను తాను చేతులతో ఆపేస్తాననీ మింగేస్తాననీ భీము మాకు హామీ ఇచ్చాడు" అని వాళ్ళ చేత అనిపించాడు. అతనికి గోండ్ల పట్ల నిజంగా ప్రేమ ఉందని అనుకునే అవకాశం ఉంది కాబట్టి, గోండ్ల భూమి సమస్య గురించి అతను ఏమన్నాడో చెప్పుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వ విధానాన్ని మార్చుకోవలసి ఉంటుందా అన్న ప్రశ్నకు సమాధానంగా, "జోడేఘాట్ సంఘటనకూ ప్రభుత్వ విధానాలకూ ఏ రకమయిన సంబంధం లేదు. కాబట్టి ప్రభుత్వ విధానాన్ని సవరించే ప్రసక్తి గాని, పునరాలోచించే ప్రసక్తి గాని లేదు" అంటాడు.

భీము మీద ఆసిఫాబాద్ తాలూక్‌దార్ వేసిన ఆరోపణలో రెండు విషయాలు ఉన్నాయి. ఒకటి, భీముకు మంత్రశక్తి ఉందని నమ్మి గోండ్లు అతన్ని అనుసరించారు. రెండు, అతనికి రాజ్యాధికార కాంక్ష ఉండి ఒక జాగీరు కోసమో

సంస్థానం కోసమో పోరాటం నడిపాడు. వీటిలో రెండవ దాని గురించి హెమెండార్ఫ్ ఏమంటాడో విందాం. హెమెండార్ఫ్‌కు ఆదిలాబాద్ గిరిజనులతో ఉన్న పరిచయంగాని, వాళ్ళకు ఆయన పట్ల ఉన్న ఆదర భావం గాని వేరే ఏ గిరిజనేతరుడికీ ఆనాడు లేవు. ఆయన సంస్కరణవాదే అయినా, ఇవ్వాళ్టి మార్క్సిస్టు బిరుదాంకితులయిన సామాజిక శాస్త్రవేత్తలలాగా కాక, తాను పరిశోధించే ప్రజల కష్టనష్టాలను పంచుకోవాలనీ, వాళ్ళ కోసం చేయగలిగింది చేయాలనీ నమ్మిన వ్యక్తి. "భీముకు గోండురాజ్యం ఏర్పరచాలన్న ఆశ ఉండిందన్న వదంతి నిస్సందేహంగా అతిశయోక్తి. అతని ఉద్దేశం, అతని అనుచరుల ఉద్దేశం చాలా పరిమితమయినది. జోడేఘాట్ పరిసరాల్లో భూమిని నిరాక్షేపణీయంగా సాగు చేసుకోగలగడం, ఫారెస్టు అధికార్ల అక్రమ దోపిడీ నుండి విముక్తి పొందడం, ఇవి మాత్రమే వారు కోరింది" అని హెమెండార్ఫ్ అంటాడు. రైతాంగ పోరాటాలకు చిల్లర జమీందార్లు, జమీందార్లు కాగోరేవారు, కొన్ని సందర్భాలలో స్థానిక సంస్థానాధీశులు నాయకత్వం వహించి రైతాంగం రక్తంతో జాగీర్లు కొనుక్కోవడం మన దేశ చరిత్రలో అసాధారణ విషయం కాదు. మొఘల్ జాగీర్దారీ విధానం పట్ల, రెవెన్యూ విధానం పట్ల ఆనాటి రైతాంగంలో తీవ్రమయిన అసంతృప్తి ఉండేది. అది ఎన్నో చిన్న, పెద్ద రైతాంగ పోరాటాలకు దారి తీసింది. కొన్ని సందర్భాలలో రైతాంగంలోని ఆ అలజడిని స్థానిక సంస్థానాధీశులు, సామంతులు తమ నాయకత్వంలోకి తీసుకొని తమ అవసరాలకు అనుగుణంగా వాటిని మలచుకున్నారు. శివాజీది ఆ బాపతే. అంతకంటే చక్కటి ఉదాహరణ, యమునా నదీ తీరంలోని జాట్ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి, మొఘల్ బాద్‌షాను బెదిరించి జమీందారీలు పొందిన జాట్ నాయకులు. అక్బర్ చనిపోయిన తరువాత ప్రజ్వరిల్లిన ఈ జాట్ రైతాంగం తిరుగుబాటుకు మొట్టమొదటి చెప్పుకోదగ్గ నాయకుడు చౌరామన్. ఇతని తండ్రికి 'గ్రామాల జమీందారీ' ఉండేదట. ఇతను, ఇతనివంటి ఇతర జమీందార్ వంశీకులూ ఒక శతాబ్దం పాటు రాచకురుపులాగా మొఘల్ బాద్‌షాలను హింసించి, జాట్ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి విస్తృత ప్రాంతాలలో జమీందారీలు సంపాదించుకున్నారు. అక్బర్ కాలానికి యమునానది తీరంలో ఉన్న జమీందార్లలోని జాట్ కులస్తుల సంఖ్యను, 19వ శతాబ్దం నాటి సంఖ్యతో పోల్చి చూస్తే వీళ్లు ఈ పనిని ఎంత సమర్థవంతంగా నిర్వహించారో తెలుస్తుందని ఇర్ఫాన్ హబీబ్ అంటాడు. చివరికి ఈ రైతాంగ పోరాటానికి ముగింపుగా ఔరంగజేబు మరణానంతరం సూరజ్‌మల్ నాయకత్వాన

ఒక విశాలమయిన జాట్ రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు. ఈ చరిత్రను దృష్టిలో ఉంచుకొని భీము కూడా అట్లాంటి వాడేననుకునే అవకాశం ఉంది కాబట్టే హెమెండార్ఫ్ అభిప్రాయానికి విలువ ఇవ్వవలసి ఉంటుంది.

భీముకు మంత్రశక్తి ఉందన్న నమ్మకాన్ని గురించి కూడా హెమెండార్ఫ్ తన అభిప్రాయాన్ని చెప్పాడు. "భీము తనకు మంత్రశక్తి వుందనీ, దేవుడి మాటలు వినగలననీ ప్రకటించుకున్నట్టు చెప్తారు. ఇది అసంభవం కాదు. ఎందుకంటే, పూనకం వచ్చినప్పుడు దేవుడితో సంభాషించగల ద్రష్టలను గురించి గోండ్లలో నమ్మకాలు ఉన్నాయి." భీము ఒక సాధారణ గోండు కాబట్టి గోండు సంస్కృతిలో భాగమయిన నమ్మకాలు కలిగి ఉండడం గాని, ప్రకటించుకోవడం గాని నమ్మలేని విషయాలు కావు. అయితే భౌతిక వైరుధ్యాలను విస్మరించి, గోండ్లు భీమును అనుసరించడానికి ఈ ప్రగల్భాలే కారణమని తీర్మానించే ముందు కొన్ని విషయాలు గుర్తుంచుకోవాలి. అల్లూరి సీతారామరాజు నుండి నిన్నటి 'పోరకల దొర' వరకు గిరిజనులకు నాయకత్వం వహించిన వారందరి గురించీ ఇట్లాంటి ప్రచారమే సాగింది. సీతారామరాజు గాని, భీము గాని నిజంగానే తమకు అద్భుత శక్తులున్నాయని నమ్మి ఉండవచ్చు; వాళ్ళు నమ్మినా నమ్మకున్నా గిరిజనులు నమ్మి ఉండవచ్చు. ఇది గిరిజనులకూ గిరిజన నాయకులకూ మాత్రమే పరిమితమయిన విషయం కాదు. 1920లలో ఉత్తరప్రదేశ్‌లోని అవధ్ ప్రాంతపు రైతాంగం గాంధీ గురించి కూడా ఇట్లాంటి నమ్మకాలే కలిగి ఉండిందట. ఆ నమ్మకాల బలంతోనే వాళ్ళు కాంగ్రెస్ పిలుపును అందుకొని సత్యాగ్రహ ఉద్యమంలోకి దిగారని అంటారు. లక్నోలో ఒక గుడ్డివానికి గాంధీని విశ్వసించడం వల్ల కళ్ళు వచ్చాయనీ, సహాయనిరాకరణ చేస్తున్న ఒక సత్యాగ్రహిని అరెస్టు చేసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ తలమీద ఆకాశం నుండి ఒక ఇటుక పడి తల చిట్లిపోయిందని, విదేశీ వస్తు బహిష్కరణ చేయ నిరాకరించిన తన భర్తను ఒక గాంధీ అనుచరి శపించగా అతని విస్తరిలోని తిండి మలంగా మారిపోయిందనీ, ఇత్యాది వదంతులు గాంధీ గురించి ప్రచారంలో ఉండేవని కపిల్‌కుమార్ అంటాడు. వెనుకబాటుతనం వల్ల ప్రజలలో గుడ్డినమ్మకాలు ఉంటాయి. కాని పోరాటానికి భౌతిక వైరుధ్యాలు ప్రధాన కారణం. ప్రజలలోని గుడ్డినమ్మకాలను పోగొట్టడానికి కృషి చేయవలసిన అవసరం లేదని కాదు, కాని ప్రజా శత్రువులు చేసే దుష్ప్రచారాన్ని చారిత్రక దృష్టితో ఎదుర్కోవాలి.

జోడేఘాట్ కాల్పుల తరువాత నిజాం ప్రభుత్వానికి దడ పట్టుకుంది. హెమెండార్ఫ్ వంటి సహృదయుల సహకారంతో ఎన్నో సంస్కరణలు ప్రవేశ

పెట్టింది. గిరిజనులకు స్కూళ్లుపెట్టి, గోండీ, మరాఠీ, ఉరుదూ భాషలలో చదువు చెప్పించింది. అంతకంటే ముఖ్యంగా, భూములకు పట్టాలు ఇప్పించింది. 1946 నాటికి 1 లక్ష 60 వేల ఎకరాలను ఈ రకంగా పట్టా చేయించారనీ, మొత్తం ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులలో 85 శాతానికి పట్టాలు దొరికాయనీ హెమెండార్ఫ్ అంటాడు. కాని హెమెండార్ఫ్ (ఉదారవాది కాబట్టి) చెప్పని విషయము ఏమిటంటే, ఈ లక్షా అరవై వేల ఎకరాలనూ అడవి నుండి ఇచ్చారేగాని, భూస్వాములు గతంలో చేజిక్కించుకున్న భూమిని తిరిగి గిరిజనులకు ఇవ్వలేదు. అంటే, గిరిజనులకు భూములు దొరికాయి గాని, అడవులలోకి బలవంతంగా ప్రవేశపెట్టబడ్డ భూస్వామ్యం మాత్రం చెక్కు చెదరలేదు. ఈ సంస్కరణల వల్ల గిరిజనుల బతుకు చాలా మెరుగయిందని హెమెండార్ఫ్ అంటాడు.

అయితే సంస్కరణల ద్వారా గిరిజనులకు పట్టాలు ఇప్పించవచ్చును గాని, పెట్టుబడిదారీ సుడిగుండం నుండి ఆ పట్టాలను సంస్కరణలు రక్షించలేవు. 1950 తరువాత గిరిజనుల భూములు మళ్ళీ పరాయీకరణకు లోనయ్యాయి. గతంలో ఆసిఫాబాద్‌లో జరిగితే, ఇప్పుడు చరిత్ర నాటకరంగం ఉట్నూరుకు మారింది. ఉట్నూరు ఆదిలాబాద్ జిల్లాకు పశ్చిమ భాగాన ఉంది. ఆనాటికి దట్టమయిన అడవిగా ఉండేది. మైదానప్రాంత వ్యాపారస్తులు అప్పటికింకా ఉట్నూరుకు పోలేదు. కారణం, ఉట్నూరుకు సరయిన రోడ్డు లేదు. కాని 1950 తరువాత ఉట్నూర్‌ను గుడిహత్నూర్ ద్వారా ఆదిలాబాద్‌కు, కెరిమెరి ద్వారా ఆసిఫాబాద్‌కు కలిపే రోడ్లు వేసారు. తద్వారా వ్యాపారస్తులకు అడవిలోకి ప్రవేశించడానికి మార్గం సుగమం చేసారు. ఈ ప్రమాదాన్ని ఇవ్వాళ వెనకచూపుతో గుర్తించడం కాక, ఆనాడే గుర్తించి ప్రభుత్వాన్ని హెచ్చరించినందుకు హెమెండార్ఫ్‌ను మెచ్చుకోవాలి. ఆ వ్యాపారస్తులు ఎక్కువగా మరాఠీవాళ్లు. వాళ్లు గిరిజనులకు సరుకులమ్మి, గిరిజనుల దగ్గర పత్తి, జొన్నలు కొనుక్కుపోయేవారు. ముఖ్యంగా, పత్తిపంటను అమ్మక తప్పదు కాబట్టి పత్తి కొనుగోలులో వ్యాపారస్తులు చేసే మోసం గిరిజనులకు ప్రాణసంకటంగా తయారయింది. ఇవ్వాల్టి సంగతి చెప్పుకోవాలంటే, క్వింటాలు పత్తికి 550 రూపాయలు దొరికితే గాని గిట్టుబాటు కాదని గిరిజనుల అంచనా. కాని మార్కెటులో వాళ్ళకు 400-450 మించి దొరకదు. ఇది ఒక్క ఆదిలాబాద్ సమస్యే కాదు, పత్తిపాడు నుండి పాండుగూడెం వరకు పత్తి పండించే రైతులందరి సమస్యా ఇదే. అయితే గిరిజనులు అమ్మకంలోనే కాక కొనుగోళ్ల విషయంలో కూడా విపరీతంగా నష్టపోతారు. ఫలితంగా ఆ

వ్యాపారస్తులకే అప్పుల పాలవుతారు. అప్పుకు వడ్డీ ఎంతో, ఎంత కాలానికి ఎంత అవుతుందో ఆ షావుకార్లకే ఎరుక. తనకున్న 5, 10 ఎకరాల భూమిని అతను అప్పు కింద ఆక్రమించుకున్ననాడే గిరిజనుడికి తెలుస్తుంది. 'నాగేటిచాళ్ళలో రగిలిన రైతాంగ పోరాటం' పుస్తకంలో ఈ షావుకార్ల దోపిడీ గురించి చాలా ఉదాహరణలు ఇచ్చారు. అందులో మరీ దారుణంగా ఉన్నవి గుర్తు చేసుకుంటే ఇంద్రవెల్లి పూర్వరంగం అర్థమవుతుంది. విఠల్ అనే షావుకారు శీత్రు అనే గోండుకు 200 రూపాయలు అప్పిచ్చి కేవలం ఒక్క సంవత్సరం తరువాత 15 ఎకరాల భూమి, 9 ఎడ్లు స్వాధీనపరచుకున్నాడు.

గిరిజనుల భూములను గిరిజనేతరులు స్వాధీన పరచుకోకూడదనే కాదు, కొనుక్కోకూడదని కూడా చెప్పే చట్టాలు లేక కాదు. 1949లోనే నిజాం ప్రభుత్వం అటువంటి చట్టాన్ని చేసింది (Hyderabad Tribal Areas Regulation Act, 1949). ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తరువాత వేరే పేరుతోను, కొన్ని మార్పులతోను అటువంటి చట్టమే (A.P. Scheduled Areas Land Transfer Regulation, 1959) కొనసాగింది. 1960 వరకు గిరిజనులకు జోడేఘాట్ కాల్పుల తరువాత ఇచ్చిన పట్టాలు భద్రంగా కొనసాగాయని హెమెండార్ఫ్ అంటాడు. కాని అప్పటికే గుడిహత్నూర్-ఉట్నూర్-కెరిమెరి-ఆసిఫాబాద్ రోడ్డు నిర్మాణమయింది. ఒక చిన్నపాటి ఉప్పెనలాగా గిరిజనేతరులు ఉట్నూరుకు రావడం మొదలయింది. 1961లో ఉట్నూరు తాలూకా జనాభా 55 వేలు కాగా 1971లో అది 93,800 చేరుకుంది. అంటే 70 శాతం పెరిగింది. ఆ దశాబ్దంలో రాష్ట్ర జనాభా పెరుగుదల సగటున 16 శాతం మాత్రమే. ఈ వలస ఫలితంగా 1977లో హెమెండార్ఫ్ మళ్ళీ ఆదిలాబాద్ వెళ్ళేనాటికి గిరిజనులు షావుకార్లకు తమ భూములను ఎంత విస్తృతంగా కోల్పోయారంటే: "అప్పటి పరిస్థితి నాకు 1942 నాటి పరిస్థితికి కార్బన్ కాపీలాగా కనిపించింది" అని హెమెండార్ఫ్ అంటాడు. 25 నుండి 200 శాతం వరకు వడ్డీకి అప్పులిచ్చి గిరిజనుల భూములను గిరిజనేతరులు చేజిక్కించుకున్నారు. మరి చట్టం ఏం చేస్తోంది అని ప్రశ్నిస్తే, "1959 చట్టాన్ని అమలు చేయకపోవడమే తప్ప దీనికి వేరే కారణం లేదు" అని అంటాడు. గత సంవత్సరం హైదరాబాద్‌లో మాట్లాడుతూ ఆయనే "ఏదయినా చర్య తీసుకోకపోతే ఆదిలాబాద్‌లో అస్సాంలాంటి పరిస్థితి ఏర్పడే ప్రమాదముంది" అన్నాడు.

వీటన్నింటి ఫలితం ఇంద్రవెల్లి. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లి గ్రామంలో గిరిజన రైతుకూలీ సంఘం సభ జరపాలనుకున్నారు. ఇప్పుడు గిరిజనులకు

కొమురం భీము వంటి గిరిజన వీరుల నాయకత్వం కాక ఒక శాస్త్రీయ ప్రాపంచిక దృక్పథం గల మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీ నాయకత్వముంది. ఆ నాయకత్వాన ఉద్యమించే క్రమంలో పెట్టుకున్న సభ అది. మొదట అనుమతి ఇచ్చిన పోలీసులు ఆనాడు సెక్షన్ 144 ప్రకటించారు. ఇంద్రవెల్లికి అటూ ఇటూ గుడిహత్నూర్ - ఉట్నూర్ రోడ్డు మీద పోలీసు వ్యాన్లు తిరిగాయి. సభకు వస్తున్న గిరిజనులను చెల్లాచెదురు చేసారు. చెప్పగానే వెళ్ళిపోయిన వాళ్ళు అదృష్టవంతులు. అందరూ అంత వినయంగా ప్రవర్తించలేదు. మా సభకు మమ్మల్ని పోవద్దనే హక్కు మీకెవరిచ్చారని ఎదురడిగారు. కొందరు చేతిలోకి కంకరరాళ్ళు తీసుకున్నారు. అంత మాత్రానికే ప్రాణభయం వేసి పోలీసులు వ్యాన్లలో నుండి, జీపులలో నుండి కాల్పులు జరిపారు. బెదిరించడానికి కాదు జరిపింది, గురిచూసి యువకులయిన వాళ్ళనూ, చురుగ్గా కనిపించినవాళ్ళనూ కాల్చారు. దెబ్బతగిలి ప్రాణాలతో బయటపడ్డ వాళ్ళంతా కూడా పోలీసులు తమను గురిచూసి కాల్చినట్టు చెప్తున్నారు. ఇది రోడ్డు మీది విషయం. అడవులలో నుండి ఇంద్రవెల్లికి వస్తున్న వాళ్ళను ఆపడానికి చెట్లమీది నుంచి కాల్చారు. 13 మంది చనిపోయినట్టు ప్రకటించారు. ఇప్పటికి పేర్లు తెలిసింది 12 మందివే. అందరూ కూడా రోడ్డుకు మరీ దూరం లేని గ్రామాల వాళ్ళే. అడవిలోపలి గూడాల వాళ్ళు ఎంత మంది చనిపోయారో తెలియదు. చనిపోయినవాళ్ళు కాక మరెంతో మంది శాశ్వతంగా వికలాంగులు అయ్యారు.

ఇవాళ్టి గోండ్లు హైమెండార్ఫ్ గోండ్లు కారు. ఒకప్పుడు తెల్ల బట్టల వాళ్ళను చూస్తేనే పారిపోయిన గోండ్లు ఇవ్వాళ మన ఊహల్లోని గిరిజనుల లాగ లేరు. మైదాన ప్రాంతపు మరాఠీ రైతుల వేషభాషలు వాళ్ళకు అలవడ్డాయి. ఇవ్వాళ వాళ్ళు గిట్టుబాటు ధరల గురించి, షావుకార్ల దోపిడీ గురించి చర్చించగలరు. ఉట్నూరుకు రోడ్డు రావడంతో షావుకార్ల దోపిడీ వచ్చింది, భూమి పరాయీకరణ ఇనుమడించింది. కాని ఆ రోడ్డు వెంబడే, కొత్తగా వచ్చిన దోపిడీ నుండే కాదు, గిరిజనుడి ఆదిమ మౌఢ్యం నుండి, సంకుచిత జీవిత దారిద్ర్యం నుండి విముక్తి నివ్వగల రాజకీయం కూడా వచ్చింది. ఆదిలాబాద్ గిరిజనులు ఇవ్వాళ మంత్రశక్తితో బుల్లెట్లను భోంచేయగల కొమురం భీమును దాటి చాలా దూరం వచ్చారు.

*సృజన మాసపత్రిక*
*మే 1983*

# ఏజెన్సీలో పోలీస్ క్యాంపులు

అడవి బాట మీద ఎదురెదురయిన ఒక గిరిజనుడికీ కొందరు తెల్లబట్టల వాళ్ళకూ సంభాషణ:

'నీ పేరేందన్నా?'

'ఆఁ?'

'నీ పేరేంది?'

'ఎందుకులే...'

'ఫరవాలేదు, చెప్పు'

'నాకు పేరు లేదులే...'

అంటూ కావడి నుండి వేళ్లాడుతున్న అరటిగెలలలాగా తల ఊపుతూ చకచక బాట మలుపు తిరిగి మాయమవుతాడు. అది తెల్లబట్టల భయమో లేక తెల్లబట్టల పోలీసుల భయమో చెప్పడం కష్టం. ఆ అడవికి ముందు తెల్లబట్టలొచ్చాయి. వాటి వెనక పోలీసులొచ్చారు. ముందొచ్చిన తెల్లబట్టలు వ్యాపారానికీ అడవి నరుక్కుపోవడానికీ అడవి భూములు ఆక్రమించుకోవడానికీ వస్తే, వెనక వచ్చిన పోలీసులు వాళ్లను గిరిజనుల నుండి కాపాడడానికి వచ్చారు.

తూర్పుగోదావరి, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం చాలా దట్టమయిన అడవి. ఎగువ భాగాన ఉన్న తెలంగాణ, మహారాష్ట్ర జిల్లాల కంటె సంపన్నమయిన పచ్చటి అడవి. పెట్టుబడిదార్ల కోసం టేకు, మద్ది, వెదురు ఉంటే అడవి జనం కడుపు నింపడం కోసం

చింత, అరటి, ఉసిరి, పనస, మామిడి తోపులున్నాయి. ఈ సంపదే ఇక్కడి గిరిజనులను వెనుకబాటుతనంలో ఉంచిందన్నా లేక నాగరిక సమాజపు దాడిని ఎదుర్కోవడానికి కొంత వెసులుబాటు కలిగించిందన్నా అది ఒకే వాస్తవాన్ని రెండు కోణాల నుండి చూడడం అవుతుంది. ఆదిలాబాద్, కరీంనగర్, సిరొంచ అడవుల గిరిజనులు మైదాన ప్రాంతాల దాడికి తట్టుకోలేక క్రమక్రమంగా ఆ జీవన విధానానికి లొంగిపోతున్నారు. స్థిరవ్యవసాయానికీ వ్యాపార దోపిడీకీ వేతనకూలీకీ అలవాటు పడుతున్నారు. ఈ రకమయిన 'ప్రగతి' నుండి కోస్తా ప్రాంతపు ఏజెన్సీ గిరిజనులను అడవి సంపద కొంతమేరకు కాపాడుతున్నట్టుంది. వీళ్ళ జీవితం మీద 'ఆటవిక' ముద్ర ఇంకా చాలా బలంగా ఉంది. ఆదిలాబాద్ అడవులలో వ్యవసాయానికి భూమీ, వ్యాపారానికి ఆకూ కర్రా తప్ప వేరే ఏమీ మిగలలేదు. కాని విశాఖ అడవులలో కడుపు నింపే ఫలసంపద, పోడును పోషించే భూసారం ఇంకా చాలా మిగిలి ఉన్నాయి.

అయినా వాళ్ళకూ వీళ్ళకూ సమస్యలు ఒకటే. భూస్వామ్యం, వ్యాపార దాహం, ప్రభుత్వపు రెవెన్యూ దాహం, అటవీ అధికారుల 'మామూళ్ల' దాహం తమ అడవిని కబళించేస్తూ ఉంటే ఆ అడవులలో తమ అస్తిత్వాన్ని ఎట్లా కాపాడుకోవాలా అన్న సమస్య ఇది. కోస్తా ప్రాంతపు ఏజెన్సీ ఏరియాలో ఈ సమస్య కొత్తది కాదు. బ్రిటిష్ రెవెన్యూ విధానం ఫలితంగా పుట్టుకొచ్చిన కొత్త ఆర్థిక సంబంధాలు చాలా కాలం ముందే అక్కడి అడవులలో ఈ సమస్యను సృష్టించాయి. 1860ల నుండి అక్కడ గిరిజనులు తిరగబడుతూనే ఉన్నారు. 1920లలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో భారతదేశ చరిత్రలోనే చెప్పుకోదగ్గ తిరుగుబాట్లలో ఒకటయిన 'మన్య పోరాటం' నడిచింది. ఇట్లా తిరగబడ్డప్పుడల్లా ఈ ప్రాంతాలకు రోడ్లు వచ్చాయి. ఇవ్వాళ ఈ ఏజెన్సీ ప్రాంతమంతా ఎండలో నిగనిగలాడే తారురోడ్లున్నాయి. ఎందుకోసమంటే అటవీ అభివృద్ధి కోసం అని ప్రభుత్వం అంటుంది. పోలీసుల రాకపోకల కోసం అని ప్రజలంటారు. ఈ రెండు అవసరాలకూ వైరుధ్యం లేదు కాబట్టి ఇద్దరి మాటా వాస్తవమే. అల్లూరి సీతారామరాజు తిరిగిన ప్రాంతం, పట్టుబడ్డ ప్రాంతం, చంపబడ్డ ప్రాంతం - రంపచోడవరం, అడ్డతీగల, జెడ్డంగి, రాజవొమ్మంగి, కొయ్యూరు, మంప, కృష్ణదేవిపేట, కాకరపాడు - అంతటా మళ్లీ పోలీసు లాకప్‌లలో చిత్రహింసలు, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసుల కవాతులు. పది గ్రామాలలో సాయుధ పోలీసు క్యాంపులూ ఉన్నాయంటే అది 'అటవీ అభివృద్ధి' చేసుకున్న పుణ్యమేగదా?

విశాఖ జిల్లాకు చెందిన కొన్ని మారుమూల గ్రామాల కథలు చెప్పుకుందాం.

నేరెళ్లబంద ఎత్తయిన కొండమీద ఉన్న గ్రామం. 'చింతపల్లి ఘాటీ' ఎక్కి ముందు పెద్దవలస సంత చేరుకోవాలి. అక్కడి నుండి పచ్చటి అడవిబాట. బాటకు ఒక వైపు లోయలు, లోయలో వాగులు. మరొకవైపు కొండచరియలు. కొండచరియలు కొన్ని చోట్ల దట్టంగా చెట్లతోనూ తీగలతోనూ నిండి ఉంటాయి. అక్కడక్కడ మాత్రం ఎవరో అత్యాధునికమయిన 'వీడింగ్ మెషిన్'తో గడ్డి సహితం మిగలకుండ సాపు చేసినట్టు ఉంటాయి. అది పోడు వ్యవసాయం చేసిన గుర్తు. అక్కడి మాటల్లో చెప్పాలంటే, 'సున్నగా గెడ్డం గీసినట్టు గీసీస్తరండీ...'

నేరెళ్లబందలోని జనమంతా మూడేళ్ల క్రితం అక్కడికి పాడేరు ప్రాంతం నుండి వలస వచ్చారు. ఎందుకు వచ్చారంటే సమాధానం చెప్పలేరు. వాళ్లకు జీవితం తెలుసుగాని జీవితానికి కారణాలు తెలీవు. తెలియకుండా ఉంచాలనే ఈ ప్రయత్నమంతా.

వలస వచ్చి కొంత ఖాళీ ప్రదేశం చూసుకొని ఇళ్లు వేసుకున్నారు. వ్యవసాయం కోసం అయిదెకరాల జాగా చూసుకున్నారు. ఆ ప్రాంతపు ఫారెస్టు గార్డుతో బేరమాడి వెయ్యి రూపాయల డిమాండును ఎనిమిది వందలకు తగ్గించి ఆ ముడుపు చెల్లించుకొని ఆ ఐదెకరాలలో పోడు వ్యవసాయం మొదలుపెట్టారు. రొక్కం మాత్రమే కాకుండా అడిగినప్పుడల్లా కోళ్లు సరఫరా చేసారు. చిన్న కోళ్లిస్తే ఒప్పుకోడట. పెద్ద పెద్ద పెట్టలే కావాలట. (ఆ గార్డు పేరు లోవరాజు, అంటే లోయలకు రాజు. ఈ అదృష్ట జాతకులు లోయలకే కాదు, అడవులకూ కొండచరియలకూ కూడా రాజులే. వీళ్లకు లంచాలు పెట్టనిదే గిరిజనులు ఇళ్లు వేసుకోలేరు, వ్యవసాయం చేసుకోలేరు, మేకలను మేపుకోలేరు.) మూడేళ్ల తరువాత లోవరాజు బదిలీ అయి మరొకడు వచ్చాడు. లంచం ముట్టింది పోయిన వాడికే గాని వచ్చిన వాడికి కాదు కాబట్టి వీడు పై వాళ్లకు ఫిర్యాదు చేసినట్టున్నాడు. వాళ్లు హుటాహుటిన గ్రామానికొచ్చి గిరిజనులు సాపు చేసిన ఆ అయిదు ఎకరాలలో 'అటవీ అభివృద్ధి' ప్రారంభించారు. అంటే టేకు మొక్కలు నాటారు. గిరిజనులకు కోపం వచ్చింది. రాజుగారికో జమీందారుకో నజరానాలు చెల్లించుకొని భూమి దున్నుకునే రాచరిక నాగరికతతో వాళ్లకు పరిచయముందిగాని, సిబ్బంది బదిలీ అయినప్పుడల్లా కొత్తగా లంచాలు ఇచ్చుకోవాలనే పెట్టుబడిదారీ బ్యూరోక్రాటిక్ నాగరికత వాళ్లకు కొత్త. వాళ్ళు ఆ టేకు మొక్కలను పీకేసి తగలబెట్టారు. ఈ 'దౌర్జన్యం' ఫలితంగా నేరెళ్లబందకూ ఆ పరిసర గ్రామాలకూ పోలీసు క్యాంపులు వచ్చాయి. గిరిజనులకు స్వంత తెలివి

ఉండదనీ, ఇంత పని వాళ్లు చేసారంటే నక్సలైట్ల ప్రోద్బలం ఉండి ఉండాలనీ పోలీసుల అనుమానం. నక్సలైట్ల జాడ చెప్పమని జనాన్ని వేధించడం మొదలుపెట్టారు. బియ్యం, పప్పు, కోళ్లు బలవంతంగా తీసుకోవడం మొదలుపెట్టారు. గూడెంకు చెందిన ఒక స్త్రీని చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు రోజులుంచి విపరీతంగా కొట్టారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు కూడా అంతవరకు తిన్న లంచాల సంగతి మరచిపోయి 'అడవిలో కట్టెకొడుతున్నారు' అని కేసులు పెట్టడం మొదలుపెట్టారు. నేరెళ్లబందలో రెండుసార్లు పోలీస్ క్యాంపు పెట్టారు. అదీ గ్రామానికి తలలో నాలుకగా ఉన్న బంధు ఇంట్లో పెట్టారు. అందరిలాగే బంధుకు కూడా గోచిపాత తప్ప వేరే లేదు. అతన్ని గ్రామస్తులు తమ 'మునసబు'గా పిలుచుకున్నంత మాత్రాన పోలీసులు లెక్కించలేదు. అతన్ని విపరీతంగా చితగ్గొట్టి లేవలేకుండ చేసారు. ఈ శిక్ష అంతా అయిన తరువాత తాసీల్దారు వచ్చి, ఆ అయిదెకరాలు గిరిజనులవేననీ, అటవీ శాఖవి కావనీ తీర్పు ఇచ్చాడు. ఈ పని ఆయనగారు మొదట్లోనే చేయలేక కాదు - శిక్షపాటికి శిక్షే, న్యాయంపాటికి న్యాయమే. ప్రజలు అన్యాయాన్ని సహించకుండ తిరగబడడమే నేరం. న్యాయాన్యాయాలు తరువాత సంగతి.

తాళ్లపాలెం మరొక మారుమూల గిరిజన గ్రామం. అడవి నుండి తెచ్చుకున్న కట్టెతో కట్టుకున్న ఇళ్లు నలభయ్యో, యాభయ్యో ఉంటాయి. ఎండాకాలంలో అడవీ ఊరూ కలిసిపోతాయి. ఊరి మధ్యలో ఒక పెద్ద పాక. ఆ పాకలో కూర్చుని ఆడవాళ్లూ మగవాళ్ళూ పెద్ద పెద్ద ఆకులను ఎండబెట్టి వంద చొప్పున కట్టలు కడతారు. ఈ ఆకును అడ్డాకు అంటారు. వాటితో విస్తర్లు తయారు చేస్తారు. రూలు ప్రకారం గిరిజనులు ఈ ఆకును గిరిజన కార్పొరేషన్‌కు అమ్మాలి. కాని వాళ్లు ప్రైవేట్ వ్యాపారస్తులకే అమ్ముతారు. ఎందుకని అడిగితే, 'మాకు ప్రైవేట్ వ్యాపారస్తులే ప్రభుత్వ కార్పోరేషన్ కన్న ఎక్కువ ఇస్తారు' అని సమాధానం ఇస్తారు. ఇది చాలా మందికి చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. వ్యాపారస్తులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అడవి సంపదను కారుచవకగా కొనేస్తున్నారని గదా గిరిజన కార్పొరేషన్‌లు పెట్టింది. మరి అటువంటప్పుడు ఆ కార్పొరేషన్‌లు వ్యాపారస్తుల కంటె తక్కువ రేటుకు గిరిజనుల దగ్గర సరుకు కొనుక్కోవడమేమిటి అంటే అది 'గిరిజనులను రెచ్చగొట్టడం కోసం చెప్పే అతిశయోక్తిగా' చాలామంది లోకజ్ఞులు సహితం భావిస్తారు. కాని అది వాస్తవమే. అడ్డాకు ఒక కట్టకు (100 ఆకులు) ఇవాళ వ్యాపారస్తులు రూ॥ 3.50 నుండి 5.00 వరకు ఇస్తున్నారు (గిరిజనుల పోరాటం ఫలితంగా). కార్పొరేషన్ ఇచ్చేది రూ॥ 0-75 లేక రూ॥ 1.00. చింతపండుకు

వ్యాపారస్తులు రూ॥1-50 ఇస్తారు. కార్పొరేషన్ ఇంకా తక్కువ ఇస్తుంది. (అదే చింతపండు విశాఖపట్నం కిరాణా మార్కెట్‌లో ఒక కిలో రూ॥ 12 నుండి 15 దాకా ఉంటుంది - అది వేరే సంగతి).

ఈ విడ్డూరానికి ఒక కారణం ఉంది. వ్యాపారస్తులు గిరిజనుల నుండి చింతపండయినా అడ్డాకయినా కొనేటప్పుడు దాన్ని గిరిజనుల ఆస్తిగా పరిగణిస్తారు. అంటే వాళ్లు వస్తువుకు వెలకట్టి ఇస్తారు. (చాలా తక్కువ వెల కడతారనుకోండి, అది వేరే మాట.) ప్రభుత్వం అట్లా కాదు. ప్రభుత్వం దృష్టిలో దేశంలోని అడవి అంతా తన ఆస్తి. చింతపండయినా అడ్డాకయినా ఈతకల్లయినా ఎండుగడ్డయినా అడవి సంపదంతా తనది. అయితే తాను స్వయంగా చింతపండు ఏరలేదు కాబట్టి గిరిజనులు ఏరిపెడతారు. ఏరినందుకు ప్రభుత్వం వాళ్లకు కూలి ఇస్తుంది. అంటే కార్పొరేషన్ గిరిజనులకు ఇచ్చేది వాళ్లు సేకరించిన వస్తువు వెల కాదు, దాన్ని సేకరించినందుకు కూలి. అందుకే వ్యాపారస్తులు ఇచ్చే ముష్టి పైసలకంటే కూడా అది తక్కువ ఉంటుంది. ఇదంతా విడ్డూరంగా కనబడడానికి కారణం ఏమిటంటే, ప్రభుత్వం ప్రచారం చేసే మార్మికతలో పడిపోయి చాలామంది గిరిజన కార్పొరేషన్‌లను పెట్టింది గిరిజనుల సంక్షేమం కోసమని భావిస్తారు. అసలు ఉద్దేశం అది కాదు. అపారమయిన ఈ దేశ అడవి సంపద చిన్న చిన్న వ్యాపారస్తుల చేతుల్లోకి పోకుండ, బడాబూర్జువా వర్గానికి ప్రత్యక్ష ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వ గుత్తాధిపత్యంలో ఉండడం కోసమే పెట్టారు. గిరిజన కార్పొరేషన్లకు గిరిజనుల సంక్షేమంతో ఎలాంటి సంబంధం లేదు.

తాళ్లపాలేనికి తిరిగివద్దాం. ఈ ఊళ్లో మగవాళ్ళ కంటే ఆడవాళ్లే ఎక్కువ ఉన్నట్లు కనబడతారు. జనాభా లెక్కలు ఎలాగున్నా చొరవ మాత్రం ఆడవాళ్లదే. దొడ్డారం పంచాయితీకి తాళ్ళపాలెం నుండి 'నెంబరు' పార్వతి అనే యువతి. ఈమెను గత ఏడాదిలో నాలుగు సార్లు అరెస్టు చేసారు. కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడడం, నిర్భయంగా ఎదిరించడం, హక్కులు అడగడం - ఇవన్నీ చూస్తే పోలీసులకు ఆమెకు నక్సలైట్లతో సంబంధం ఉందని అనుమానం. నాలుగుసార్లు అరెస్టు చేయనయితే చేసారుగాని ఆమెను చూస్తే పోలీసులకు జంకే. అందుకే ఆమె మీద చేయి చేసుకోలేదు. కానీ అదే గ్రామానికి చెందిన జరమూరు వెంకన్న అనే కుర్రవాడిని మాత్రం మూడు వారాలు లేవకుండ చితగ్గొట్టారు.

ఇంతకీ ఈ ఊళ్లో గొడవేమిటి? ఆ ఊరి పక్కనే ఉన్న అడవి నుండి కర్ర స్మగుల్ అవుతూందట, లారీలతో వచ్చి తీసుకుపోతూంటారట. ఫారెస్ట్ అధికార్లూ

కాంట్రాక్టర్లూ చేతులు కలిపి, ఒక లారీకి పర్మిట్ రాసుకొని అదే పర్మిట్ మీద నాలుగు లారీలు తోలుకుపోవడం అన్ని అడవి ప్రాంతాలలోనూ చాలా మామూలు విషయం. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్‌కు నేషనల్ హైవే నెంబర్ 7 మీద నిత్యం రొద చేసుకుంటూ తిరిగే టింబర్ లారీలలో నూటికి 20 శాతం ఈ బాపతువే. అయితే తాళ్లపాలెం ప్రజలు మాత్రం దీన్ని వ్యతిరేకించారట. ఈసారి కర్రగాని స్మగుల్ చేస్తే లారీని కాలబెడతామని బెదిరించారట. దానితో వాళ్లకు నక్సలైట్‌లతో సంబంధం ఉందని పోలీసులకు అనుమానం పట్టుకుంది. ఆ గ్రామంపై దాడి చేయడం, 'నక్సలైట్లకు తిండి పెడుతున్నార'ని కొట్టడం మొదలుపెట్టి జనాన్ని బాగా భయకంపితులను చేసారు. పార్వతిని నర్సీపట్నం, కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. పోలీస్ ఆఫీసర్లను వేధించిన సందేహం ఒక్కటే 'అడవిలో కర్ర స్మగుల్ అయితే అది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. మధ్యలో ఈవిడకెందుకు?' ఈ ధర్మభూమిలో ఎవరి ధర్మం వాళ్లు చూసుకోవాలి. పరధర్మం జోలికి పోవద్దని శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పలేదా? గీతాసారం పోలీసు ఆఫీసర్లకు పట్టినట్టు వేరే ఎవ్వరికీ పట్టలేదు మన దేశంలో.

కాకరపాడు పెద్దవూరే. అక్కడ ప్రస్తుతం ఆ ప్రాంతాన్నంతా 'కవర్' చేసే పోలీసు క్యాంపు ఉంది. ఈ పోలీసు క్యాంపు వెనుక ఉన్న కథ ప్రభుత్వం వైపు నుండి బాగా ప్రచారం పొందింది. అదేమిటంటే నక్సలైట్లు ఆంధ్రా పేపర్ మిల్స్ వాళ్ల వెదురు డిపోలనూ లారీలనూ తగలబెడుతున్నారనేది.

రాజమండ్రిలో ఉన్న ఆంధ్రా పేపర్ మిల్స్ బంగూర్ అనే గుత్తపెట్టుబడిదారీ కుటుంబం యాజమాన్యంలో ఉంది. తూర్పు గోదావరి, విశాఖ అడవుల నుండి ఈ కాగితపు మిల్లుకు వెదురు (బొంగు) సరఫరా అవుతుంది. ఆ వెదురును పెంచవలసిన అవసరం కూడా బంగూర్లకు లేదు. అడవిలో పెరిగే వెదురే సరిపోతుంది. ప్రభుత్వానికి రాయల్టీ మాత్రం చెల్లిస్తారు. వెదురు నరికిన మూడేళ్లకు మళ్ళీ పెరుగుతుంది. విత్తనాలు నాటవలసిన అవసరం కూడా లేదు. ఇట్లా ఫ్రీగా దొరికే ప్రకృతి సంపదను గిరిజనులు నరికి, టన్నుల లెక్కలో కట్టలు కట్టి సరఫరా చేస్తారు. అడవిలో ఎక్కడ వెదురు దొరికితే అక్కడికి వలస పోతారు. ఉత్తరం దిక్కున పాడేరు, అరకు దాకా పోతే పడమటి వైపు ఖమ్మం అడవి దాకా పోతారు. ఒకప్పుడు పోడు కోసం వలస వెళ్ళిన గిరిజనులు ఇప్పుడు సీజన్ వస్తే వెదురును వెతుక్కుంటూ వలస పోతారు. ఉత్పత్తి అయ్యే వస్తువులోనూ, చేసే పద్ధతిలోనూ కొన్ని మార్పులు వచ్చాయి గాని ఉత్పత్తి జరిగే పరిస్థితులలో మాత్రం పెద్ద మార్పేమీ లేదు.

ఒక టన్ను వెదురు నరికి కుప్పబెట్టడానికి ఇద్దరు మనుషులకు (సాధారణంగా భార్యాభర్తలు) మూడు రోజులు పడుతుంది. దీనికి ఇచ్చే రోజు కూలీ ఒకప్పుడు 5 రూపాయలు (ఇద్దరికీ కలిపి). అదనంగా టన్నుకు 20 లేక 25 రూపాయలు (పీస్-రేట్) ఇచ్చేవారు. అంటే ఇద్దరు వ్యక్తులకు మూడు రోజులకు కూలి 40 రూపాయలు మించకుండ ఉండేది. అంటే తలసరి దిన వేతనం 6 రూపాయల చిల్లర. ప్రస్తుతం గిరిజనులు దీని గురించి తీవ్రంగా పోరాటం చేస్తున్నారు. తమ డిమాండును ఒప్పుకోకపోతే పని మానేయడం, వెదురు డిపోలనూ లారీలనూ కాలబెట్టడం చేస్తున్నారు. ప్రభుత్వం దీని గురించి చాలా ప్రచారం చేయడంతో పాటు, గిరిజనుల మీద నిర్బంధాన్ని కూడా పెంచింది. అయినా ఈ పోరాటం వల్ల వాళ్ల వేతనం 40 రూపాయల నుండి కొన్ని చోట్ల 70 రూపాయల దాకా పెరిగింది కాబట్టి గిరిజనులు భయపడినట్టు గాని, వెనకాడినట్టు గాని కనబడదు.

ఈ విధంగా వెదురు డిపోలు కాలబెట్టిన ఊళ్లలో కాకరపాడు ఒకటి. అయితే నక్సలైట్లు ఈ 'అత్యాచారం' చేయబట్టే ఆ గ్రామంలో పోలీసులు కూడా సరిసమానంగా అత్యాచారాలు చేయవలసి వస్తోందని అనుకోవడానికి వీలు లేదు. ఎందుకంటే కాకరపాడులో రాడికల్స్ సానుభూతిపరుల పైన దాడులు అంతకన్నా ముందే మొదలయ్యాయి. 1983 మార్చిలో ఒకసారి, 1984 ఫిబ్రవరిలో ఒకసారి ఈ గ్రామంలో రెండుసార్లు బహిరంగ సభలు జరిగాయి. వాటిని జరపడానికి సహాయం చేసారనే నెపం మీద నర్సీపట్నం పోలీసులు కొందరు గ్రామస్తుల మీద దాడులు చేసారు. మంచి నీళ్లు సప్లయి చేసాడని ఒక చిన్న హోటల్ యజమానిని నర్సీపట్నం లాకప్‌లో బట్టలు విప్పించి చితగ్గొట్టారు. అతని హోటల్‌లో గ్లాసులూ గిన్నెలూ కడిగే కుర్రవాడిని తరిమేసారు. గ్రామంలోని మరో ఇద్దరు యువకులు పోలీసుల వేధింపులకు తట్టుకోలేక భార్యాబిడ్డలను వదిలి పెట్టి విజయవాడకు పారిపోయారు.

ఇట్లా ఊరూరికీ ఒక కథ ఉంది. 'నాగరికత' ఇంతకాలం గిరిజనులను కేవలం దోపిడీ రూపంలో పరామర్శించింది. ఇప్పుడు పోలీసు డ్రెస్‌లో కూడా వెళ్తోంది. ఈ 'నాగరికతను' వాళ్లు అసహ్యించుకున్నారని అసెంబ్లీలో గొడవ చేయడం ఎందుకు!

*సృజన మాసపత్రిక*

*జూన్ / జూలై 1984*

# గృహ విధ్వంసనం

ఐక్యరాజ్య సమితి ప్రతి సంవత్సరం ఏదో ఒక వర్గం లేక వ్యవస్థ బాగోగులకు తనను తాను అంకితం చేసుకుంటూ ఉంటుంది. ఒక సంవత్సరాన్ని 'అంతర్జాతీయ బాలల సంవత్సరం' అనీ, మరోదాన్ని 'మహిళల సంవత్సరం' అనీ, ఇంకోదాన్ని 'పరిసరాల పరిశుభ్రత' సంవత్సరం అనీ ప్రకటిస్తూ ఉంటుంది. ఆ ప్రకటనను అనుసరించి ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు ఆయా వర్గాల లేక వ్యవస్థల అభివృద్ధి కోసం ప్రత్యేక కేటాయింపులు జరపాలని, ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారి ఉద్దేశ్యం. 1987ను International year of shelter for the Homeless అని ప్రకటించారు. అంటే నిరాశ్రయులకు ఆవాసాలు కల్పించడంపై ఈ సంవత్సరంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దాని కోసం సభ్యదేశాలు నిధులు కేటాయించాలి. పథకాలూ ప్రణాళికలూ రూపొందించాలి. ఉన్న ఇళ్ళనే కూల్చేస్తున్న ప్రభుత్వాలు ఇంక ప్రత్యేక శ్రద్ధ ఏం చూపుతాయని ఆశ్చర్యపోతారేమో. మీ సందేహం నిరాధారం కాదని ధృవపరచుకొనడానికి ఈ యదార్థ ఘటనను చదవండి.

గత మూడేళ్ళుగా - 1984 వేసవి నుండి - మన రాష్ట్ర ప్రభుత్వం 'నక్సలైట్ల ఏరివేత' కార్యక్రమంలో భాగంగా ఒక పథకాన్ని చేపట్టింది. అదేమిటంటే నక్సలైట్ పార్టీల కార్యకర్తల ఇళ్ళను, సానుభూతిపరుల ఇళ్ళను కూల్చడం, తగలబెట్టడం, పూర్తిగా నిరుపయోగమయ్యేలా ధ్వంసం చేయడం. ప్రత్యేకించి ఈ పథకం

ఆదిలాబాద్, కరీంనగర్, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో అమలులో ఉంది. కరీంనగర్‌లో పోలీసులు కూలుస్తున్నది మైదాన ప్రాంతాల గ్రామీణుల ఇళ్ళు కాగా, తక్కిన మూడు జిల్లాలలో అటవీ ప్రాంతాల గిరిజన గూడాలను ధ్వంసం చేస్తున్నారు. బహుశా ఎంత లేదన్నా ఇప్పటికి 2500-3000 ఇళ్ళ దాకా నాశనం చేసి ఉంటారేమో! సగం విరగ్గొట్టినవీ, ఇంటి సామాన్లు నాశనం చేసినవీ అందులో లెక్కపెట్టడం లేదు - పూర్తిగా ధ్వంసం చేసిన వాటి సంఖ్యే ఇది.

## విశాఖపట్నం

విశాఖపట్నం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు ఈ సంవత్సరం మార్చి నుండి మే నెల దాకా 48 గిరిజన గూడాలను మొత్తంగా తగలబెట్టారు. చింతపల్లి రెవెన్యూ మండలంలో 20 గూడాలను, గూడెం కొత్త వీధి (జి.కె. వీధి) మండలంలో 26 గూడాలను తగలబెట్టారు. ఒక 'గూడెం' అంటే అయిదు కొంపలు కావచ్చు, నలభై కావచ్చు. అంతకంటే పెద్ద గూడాలు ఈ ప్రాంతంలో ఎలాగూ ఉండవు. తగలబెట్టిన గూడాల పేర్లు, ఇళ్ళ సంఖ్య ఇక్కడ ఇస్తున్నాము.

చింతపల్లి మండలం : గంజిగెడ్డ 24, రోలంగి 4, కిక్కినబంద 14, గొడుగు మామిడి 23, సీతారాంపురం 19, పప్పుల మామిడి 24, బోయల గూడెం 20, పొర్లుబంద 12, తాడిపాలెం 17, వంట్ల మామిడి 12, కొర్రి మామిడి 9, కొత్త వీధి 8, రాచపనుకు 9, తోటమామిడి 25, జిర్రిగడ్డ 4, గానుగుల 5, ఎర్రబల్లి 5, తాటిపర్తి 11, వేనాం 11, కాగుల బండ 4. మొత్తం 20 గూడాలు, 260 ఇళ్ళు.

గూడెం కొత్తవీధి మండలం : తియ్యమామిడి 23, తెంటల వీధి 22, గంపరాయి 4, భీమల్లారం 17, జోడిమామిడి బండ 12, కట్టుపల్లి 6, కట్టుపల్లి మెట్టవీధి 5, మోడిల బండ 21, దిబ్బల మామిడి 11, అన్నవరం 9, సిగినపల్లి 14, పులుసు మామిడి 14, లింగవల్లు మెట్టవీధి 14, పారికులు 22, పొర్లుబంద 11, కవి మామిడి 11, దిబ్బ మామిడి 3, నల్లబెల్లి 37, గోమువాడ 14, చిత్తమామిడి 41, గొడుగుబండ 30, బొర్ర మామిడి 12, డేగలపాడు 6, పనుకు కొత్తూరు 6, గొర్రెలదొయి 7, గొర్రెలోయి గొందె 6. మొత్తం 26 గూడాలు, 378 ఇళ్ళు. రెండు మండలాలు కలిపి... మొత్తం 46 గూడాలు, 638 ఇళ్ళు.

ఇళ్ళు తగలబెట్టారు అంటే ఇంట్లోని సామాన్లు ఖాళీ చేయించి ఇల్లు మాత్రం తగలబెట్టారని కాదు. ఉన్నపళాన తగలబెట్టారు. జనం కాపాడుకోగలిగింది కాపాడుకున్నారు. ధాన్యం, కోళ్ళు, ధాన్యం బస్తాలలో దాచుకున్న కరెన్సీ నోట్లు

పెద్దయెత్తున ధ్వంసం అయ్యాయి. కొన్ని మేకలు, పశువులు కాలి చనిపోయాయి. ఒక మనిషి ప్రాణం కూడా పోయింది. తియ్యమామిడి గ్రామానికి చెందిన సీదరిగాసి కాలుతున్న తన ఇంట్లోని ధాన్యాన్ని బయట వెయ్యాలనే ప్రయత్నంలో ఆ అగ్గిలో చిక్కుకుని తగలబడిపోయాడు. అతనికి భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

41 ఇళ్ళు తగలబడిన చిత్తమామిడిలో ఆ ఇళ్ళలోని ధాన్యం (వడ్లు, చోళ్ళు) 500 బస్తాలు, 40 మేకలు, 100 కోళ్ళు కాలిపోయాయి. అంతకు ముందు వారమే ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులు కూడ అగ్నికి ఆహుతి అయ్యాయి. బ్యాంకు సౌకర్యం అందుబాటులో లేని కారణంగా వాళ్ళు ధాన్యం బస్తాలలోనే కరెన్సీ నోట్లు దాచుకుంటారు. అవి ధాన్యంతో పాటు తగలబడిపోయాయి. కొర్ర గురువు ఇంట్లో 10 వేల రూపాయలు, వంత రామారావు ఇంట్లో రూ. 2,500, కొర్ర దొన్ను ఇంట్లో రూ. 5,500, గుంట రాంచందర్ ఇంట్లో రూ. 3,000 తగలబడిపోయాయి. 14 ఇళ్ళు తగలబడిపోయిన గోమువాడలో 70 కోళ్ళతో పాటు రూ. 4,000 దాకా కాలిపోయాయి. 60 బస్తాల ధాన్యం తగలబడిపోయింది. 24 ఇళ్ళు తగలబడిపోయిన గంజిగెడ్డలో ఇళ్ళతో పాటు 360 బస్తాల ధాన్యమూ తగలబడిపోయింది.

ఈ గూడాలన్నీ అత్యధికంగా ఒకే ఒక తెగకు చెందినవి. ఆ తెగ పేరు సామంతులు లేక కోందులు (Konds). ఒకే తెగకు రెండు పేర్లెందుకున్నాయంటే అదొక కథ. వీళ్ళ అసలు పేరు సామంతులు. అసలు నివాసం ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా. వీళ్ళు అన్ని రకాలుగాను చాలా వెనుకబడిన తెగ. మగవాళ్ళు గోచి తప్ప వేరే బట్ట కట్టుకోరు. ఆడవాళ్ళు ఇప్పుడిప్పుడే చీర చుట్టుకోవడం నేర్చుకుంటున్నారు. వ్యవసాయాన్ని చాలా ఆదిమమైన 'పోడు' పద్ధతిలో చేస్తారు. ఎడ్లుగాని, గట్టి నాగళ్ళు గాని వాడరు. కొన్ని ఎకరాల అడవిని ఒకేసారి నరికి తగలబెడతారు. తగలబడి బూడిదయిన అడవి వర్షానికి తడిసినపుడు నేల చాలా సారవంతమవుతుంది. ఆ నేలలో అయిదారేళ్ళు ఎటువంటి ఎరువులూ అవసరం లేకుండా చోళ్ళు, వడ్లు పండిస్తారు. అప్పటికి అది సారాన్ని కోల్పోతుంది. అంతటితో దాన్ని వదిలిపెట్టి మరికొన్ని ఎకరాల అడవిని నరికి 'పోడు' చేస్తారు. ఈ రకంగా సంచరిస్తూ వీళ్ళు పెద్ద సంఖ్యలో 1950 మొదలుకుని ఒరిస్సా నుంచి విశాఖపట్నం అడవులకు వలస వస్తూ ఉన్నారు. ప్రస్తుతం విశాఖపట్నం అడవులలో ఈ సామంతుల సంఖ్య లక్షదాకా ఉంటుందని అధికారుల అంచనా.

అయినప్పటికీ మన రాష్ట్రంలో వీళ్ళకు ఒక షెడ్యూల్డు తెగగా గుర్తింపు లేదు. లక్షణాలు లెక్కగడితే వీళ్ళే రాష్ట్రం మొత్తం మీద వెనుకబడిన తెగ అయి ఉంటారు. అయినా ఒక 'తెగ'గా గుర్తింపు లేదంటే ఈ విడ్డూరానికి మన రాష్ట్ర ప్రభుత్వం వైఖరే కారణం. 1978లో ఒక ప్రతినిధుల బృందం ఈ సామంతుల తరపున హైదరాబాద్ వెళ్ళి సంబంధిత ప్రభుత్వ అధికార్లను కలవగా, మన రాష్ట్రంలో నివసించే తెగల జాబితాలో 'సామంతులు' అనే తెగ లేనే లేదు. అది 'ఒరియా' తెగ కాబట్టి వాళ్ళు ఇప్పుడు ఇక్కడ నిజంగా ఉంటున్నప్పటికీ గుర్తింపు ఇవ్వలేం అన్నారంట. అయితే వాళ్ళు తమ పేరును సామంతుల నుండి కోందులకు (Konds) మార్చుకుంటే గుర్తింపు ఇవ్వగలుగుతామన్నారంట. వాళ్ళు అలాగేనని పేరు మార్చుకున్నారు. అయినా ఇప్పటిదాకా గుర్తింపు మాత్రం రాలేదు!

ఇదిలా ఉండగా 'పోడు' వ్యవసాయం చేస్తున్నందుకు అటవీ అధికారుల నుండి, పోలీసుల నుండి బెదిరింపులూ వేధింపులూ మాత్రం వారికి నిరంతరం ఉంటూనే ఉన్నాయి. ఈ అధికారులు అడపా దడపా సామంతుల గూడాలకు పోయి, అన్నం, కోడికూర వండించుకుని తిని దొరికినంత రొక్కం చేతపుచ్చుకొని పోతూంటారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా 'అన్న'ల (అంటే నక్సలైట్ పార్టీ కార్యకర్తల) అండదండల వల్ల వాళ్ళు ఈ దోపిడీని తప్పించుకోగలుగుతున్నారు.

ఇదీ నేపథ్యం. 'నక్సలైట్ల' ఏరివేత కార్యక్రమంలో భాగంగా ఈ సామంతుల మీద చర్య తీసుకోవాలన్న ఆలోచన మన రాష్ట్ర ప్రభుత్వానికి, దాని సాయుధ బలగమయిన పోలీసులకూ ఎందుకు కలిగిందో ఇప్పుడు స్పష్టమే. ఆ చర్య గృహదహనాల రూపం తీసుకోవడం కూడా యాదృచ్ఛికం కాదు. గత మూడేళ్ళుగా మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తూన్న విధానంలో భాగమే. ఈ గృహ దహనాలను కొన్ని పత్రికలు బయటపెట్టిన పిదప మన రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ రాంమోహన్‌రావు వాటిని బాహాటంగా సమర్థిస్తూ అన్నట్టుగా ఇది ఏప్రిల్ 26న లంకపోకల వద్ద జరిగిన 'ఎన్‌కౌంటర్'లో ఒక నక్సలైట్ కార్యకర్తతో పాటు ఒక పోలీసు కానిస్టేబుల్ కూడా చనిపోయిన సంఘటనకు నిరసనగా చింతపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసులు 'ఉద్రిక్తులయి' చేసిన పని ఎంత మాత్రం కాదు. నిజానికి ఈ సంవత్సరం జనవరి నుండి కూడా ''సామంతుల గూడాలు తగలబెడతారంట'' అన్న వదంతి చింతపల్లి మార్కెట్‌లో వినపడుతూనే ఉంది. అప్పుడు కొందరు స్థానిక పెద్దలు పోలీసు అధికార్లకు లంచాలు ఇచ్చి మండల ఎన్నికలు అయిపోయేదాకా వాయిదా వేయించారు. మార్చి నెలలో, ఎన్నికలు

అయిపోగానే గృహ దహనాలు మొదలయ్యాయి. దహనాలు మార్చి నెల నుండి జరుగుతున్నట్టు చింతపల్లి ఎం.ఆర్.ఓ. స్వయంగా ఒప్పుకున్నాడు కూడ. మరి నువ్వు ఉండి - మేజిస్ట్రేట్ హోదా కలిగి ఉండి - ఏం చేస్తున్నావయ్యా అంటే గతంలో తాను ఎక్కడో తాసీల్దారుగా పనిచేసినప్పుడు ఒక పోలీసు అధికారి అక్రమ వర్తనంలో జోక్యం చేసుకోబోయి ఎంతగా చేయి కాల్చుకుని ఎంత దూరం బదిలీ అయిందీ విషాదంగా విన్నవించుకుని మన్నించమంటాడు.

మార్చి నెలలో ప్రారంభం అయిన ఈ దహనాలు మే నెల 2, 3 తేదీలలో పతాకస్థాయిని చేరుకున్నాయి. చింతపల్లి ఎస్.ఐ. అమ్మినాయుడు నేతృత్వంలో 30 మంది సాయుధ పోలీసులు 2వ తేదీ ఉదయం రెండు కొండల మధ్యనున్న లోయ ఒక కొన నుండి బయలుదేరి ఒక్కొక్క గూడెం తగలబెట్టుకుంటూ పోయారు. ధాన్యం, కోళ్ళు, ఇతర సామాన్లు బయటపడేసు కునేందుకు వ్యవధి ఇమ్మని ప్రాధేయపడినా ఇవ్వలేదు. ఈ క్రూరత్వం కొన్నిచోట్ల చాలా నాటకీయంగా ప్రదర్శించారు. తెంటాల వీధి అనే గూడెం (22 ఇళ్ళు) లోనికి పోలీసు పార్టీ ప్రవేశించగానే గూడెం పెద్ద సాగి రామారావు ఎస్.ఐ. దగ్గరికి పోయి అరగంట టైం ఇవ్వండి సామాన్లు బయట పడేసుకుంటాం అంటే ఎస్.ఐ. అతని మొర ఆలకించకపోగా, అతని దవడలు వాయించి, అతని జేబులోంచి అగ్గిపెట్టె తీసి ముందు అతని గుడిసే తగలబెట్టి అటు తరువాత తక్కిన 21 గుడిసెలు తగలబెట్టాడు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటి ఉంది. ఈ గృహ దహనాలకు కారణం ఏమిటని అధికార్లను అడగగా చింతపల్లి ఎం.ఆర్.ఓ. గారు ఏమంటారంటే "గిరిజనులు చట్ట వ్యతిరేకంగా అడవులను నరికి వ్యవసాయం చేస్తున్నారు. కాబట్టి వాళ్లను అక్కడికక్కడే తొలగించే అధికారం అటవీశాఖకూ, పోలీసులకూ ఉంటుంది" (అయినా ఇళ్ళు తగలబెట్టమని ఎక్కడా లేదు. అది వేరే సంగతి). కాని దాడికి బయలుదేరిన పోలీసు పార్టీ ఏ గ్రామంలోనూ "మీరు అడవిని నరుకుతున్నారా లేక మీ పొలాలకు పట్టాలు ఉన్నాయా" అని అడగలేదు. "మీరు నక్సలైట్లకు అన్నం పెడుతున్నారా" అని మాత్రమే అడిగారు. చెప్పేదేమో అటవీ సంరక్షణ, చేసేదేమో రాజకీయం అని దీన్నిబట్టి అర్థం అవుతుంది.

మొత్తానికి మే 3వ తేదీ నాటికి చింతపల్లి ఎస్.ఐ.గారు తన అత్యుత్సాహంతో సామంతుల గూడాలతో బాటు, పొలాలకు పట్టాలున్న బగత, గదబ తెగలకు చెందిన చిత్తమామిడి అనే గూడాన్ని కూడా తగలబెట్టాడు. తగలబడిన అన్ని

గూడాలలోకి పెద్దదీ, ఎక్కువ నష్టపోయిందీ ఆ గూడెమే. ఆ గూడెపు బగతలంతా గోలగోలగా తమ నాయకుడు, మాజీ కమ్యూనిస్టు, ప్రస్తుతం సంకాడ గ్రామానికి సర్పంచ్ అయిన వీరన్న పడాల్‌కు పోయి మొరపెట్టుకున్నారు. ఆయన చింతపల్లికి పోయి ఈ మధ్యనే అక్కడ డి.ఎస్.పి. పదవి చార్జి తీసుకున్న వెంకట్రాంరెడ్డి గారికి ఈ అన్యాయాన్ని విన్నవించుకున్నాడు. (ఈ అధికారి చరిత్ర చెప్పుకోవాలంటే మరొక రిపోర్టు రాయాల్సి ఉంటుంది. వరంగల్‌లో ఎస్.ఐగా 'అగ్గిబరాటా' అని పేరు సంపాదించుకొని, ఆదిలాబాద్‌కు సి.ఐగా ప్రమోషన్ మీద వెళ్ళి, సాత్నాలలో గోండు గిరిజనుల మీద ఉత్తపుణ్యానికి కాల్పులు జరిపి, 50 మందిని తన మీద హత్యా ప్రయత్నం చేసారని అరెస్టు చేసి జైలుకు పంపి, అక్కడి నుండి కరీంనగర్ జిల్లా రామగుండం సి.ఐగా బదిలీ మీద వెళ్ళి, అక్కడ గని కార్మికుల మీద తన ప్రతాపం చూపి, ఇప్పుడు మళ్ళీ ప్రమోషన్ మీద చింతపల్లి ఏజెన్సీకి వచ్చి గృహదహన యజ్ఞాన్ని జరిపిస్తున్నాడు.)

వీరన్న పడాల్ విన్నపం విని డి.ఎస్.పి.గారు 'మేము సామంతుల ఇళ్ళు తగలబెట్టమంటే మీ ఇళ్ళు తగలబెడుతున్నారా' అని (పాపం) బాధపడ్డారట. అట్లాగని ఒక కాగితం మీద రాసివ్వండి పోలీసు పార్టీకి చూపించి మేము మా ఇళ్ళు కాపాడుకుంటాం అని వీరన్న పడాల్ మొరపెట్టుకున్నాడు. అలాగేనని ఆయన ఆదేశం ఇవ్వగా చింతపల్లి ఎస్.హెచ్.ఓ. ఈ క్రింది ఉత్తరం రాసి ఇచ్చాడు.

> Sri
>
> Combing Party Incharge గారికి తెలియజేయునది 'కోదులు' గ్రామాలు తప్ప బగత, గడబలు గ్రామాలు కాల్చవద్దని శ్రీ డి.ఎస్.పి, చింతపల్లి దొర వార్కి శంకాడ ప్రెసిడెంటుగారు విన్నవించుకోగా పై ఉత్తర్వులు శ్రీ డి.ఎస్.పి సి.టి.పిగారు Combing Party Incharge గార్ల తెలియజేయమన్నారు. కావున బగతలు గదబలు గ్రామాలు, ఇండ్లు తగలబెట్టవద్దని శ్రీ డి.ఎస్.పి దొరవారు చెప్పినారు కావున CTP PS SHO గా మీకు తెలియజేసుకొనుచున్నాను.
>
> సం.
> HC 163 3/5/87
> స్టేషన్ హౌస్ ఆఫీసర్
> చింతపల్లి పోలీస్ స్టేషన్

(స్పెల్లింగ్ తప్పులు, వ్యాకరణం తప్పులు, వక్కాణింపులు అన్నీ పోలీసు వారివే.)

సంకాడ సర్పంచ్ అక్కడితో ఆగక పాడేరులోని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు, సబ్ కలెక్టరుకు, పత్రికా విలేఖరులకు కూడా ఈ దహనాల విషయం తెలియ జేయడంతో తాత్కాలికంగానయినా ప్రస్తుతానికి దహనాలు ఉపశమించాయి. ఆ తరువాత సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తదితర శాఖల పెద్దలు వచ్చి గిరిజనులకు ఆర్థిక సహాయం చేస్తామని, ఇళ్ళు కట్టిస్తామని అన్నారు. కాని ఒక్కొక్క కుటుంబానికి ఆస్తి నష్టం ఎంత జరిగిందో ఇప్పటిదాకా అంచనా కూడా లేదు. ఎటువంటి అంచనా లేకుండా ఒక్కొక్కరికి కేవలం 250 రూపాయల రొక్కం, ఒక చీర, ధోవతి ఇచ్చారు. ఇళ్ళు కట్టిస్తామన్నారుగాని, ఇప్పుడున్న చోట కాక ఎక్కడ పంచాయితీ బంజర్లు దొరికితే అక్కడ కడతామని చెప్పారు. అది గిరిజనుల చేలకు ఎంత దూరం అయినా కావచ్చు. అన్నిటికంటే ముఖ్యంగా అడవిని రిజర్వ్ చేసి గిరిజనులకు వ్యవసాయ భూమి ఇప్పించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదు. కాబట్టి అసలు సమస్య అలాగే ఉండిపోయింది.

*స్వేచ్ఛ మాసపత్రిక*
*జూలై-ఆగస్టు 1987*

# సత్యం సహించరానిదయ్యే వేళ

'ఎందుకొచ్చారు మీరు?'

ఈ ప్రశ్న వాళ్ళను చాలామంది అడిగారు. 60 మంది 'కొండజనం' బస్సు నిండా బిలబిలమంటూ 'వైజాగ్ వెళుతున్నాం' అని ఘాటీ దిగుతూంటే ప్రయాణీకులను టిక్కెట్లుగా తప్ప ఎన్నడూ మనుషులుగా చూడని కండక్టరుకే వింత అనిపించి అడిగాడు.

'సింహాచలం వెళ్తున్నారా?' అని కొందరు భయంగా అడిగారు.

ఆ రోజు వాళ్ళ జ్ఞాపకాలలో శాశ్వతంగా నిలిచిపోతుంది. పొద్దుటి మంచు పూర్తిగా కరగకముందే ఇద్దరు పౌరహక్కుల వాళ్ళు మోటార్ సైకిల్ మీద వాళ్ల దగ్గరకు వచ్చారు. ఒకప్పుడు అట్లా ఎవరయినా వస్తే అంతా పారిపోయేవారు గాని ఇప్పుడు కొంత నయం. పిల్లలు చెట్ల వెనక దాక్కున్నారుగాని పెద్దవాళ్లు నిలబడ్డారు. వచ్చిన వాళ్లు మాటా మంతీ లేకుండ కిందటి వేసవిలో పోలీసులు తగలబెట్టిన ఇళ్ళ మొండిగోడల ఫోటోల్ని తీసుకున్నారు. అంతా వాళ్ళనే రెప్పార్పకుండ చూస్తూ నిలబడ్డారు. కెమెరా కూడా తుపాకిలాగ ఒక యంత్రమే. జీపులు సహితం వాహనాలుగా కాక ఆయుధాలుగా కనబడే ఆ అడవిలో వాళ్ళు ఇప్పటి దాకా మనిషితో స్నేహం చేసే యంత్రాన్ని చూడలేదు.

వచ్చిన వాళ్ళు ఫోటోలు తీసుకొని మునసబు ఇంటి బయట వేసిన మంచం మీద కూర్చున్నారు. 'మీ ఇళ్ళను ఎవరు తగలబెట్టారు'

అని అడిగారు. అందరూ ఒక్క గొంతుతో 'మాకు తెల్దు' అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. ఒకరిద్దరు వివరణ ఇచ్చే ఉద్దేశంతో 'మేము లేములే' అన్నారు. అనేసి తదేకంగా వాళ్ళనే చూస్తూ నిలబడ్డారు. అయినా వాళ్లు పోలేదు. నెమ్మదిగా తాము ఎవరయిందీ ఎందుకొచ్చిందీ వివరించారు. మీ ఇళ్ళు పోలీసులు తగలబెట్టారు కదా, దాని మీద వైజాగ్‌లో విచారణ జరుగుతుంది అన్నారు. మీరందరూ వచ్చి మీ ఇళ్ళు ఎవరు తగలబెట్టారో, ఎందుకు తగలబెట్టారో, ఎంత నష్టం అయిందో చెప్పాలి అన్నారు. ఇప్పుడు మేము ఒక్కొక్కరి దగ్గరా స్టేట్‌మెంట్లు రాసుకొని వేలిముద్రలు తీసుకుంటాం కూర్చోండి అన్నారు. ఒక్కొక్కరూ మీ ఇంట్లో ఎన్ని బస్తాల వడ్లు కాలిపోయాయి, ఎన్ని బస్తాల జొన్నలు కాలిపోయాయి, ఎన్ని చీరలూ పంచెలూ కాలిపోయాయి చెప్పండి అన్నారు.

వాళ్ళు మౌనంగా విన్నారు. ఈ 'ఆఫీసర్లు' ఎట్లాంటి వాళ్ళు అని కళ్ళతో అంచనా వేస్తున్నట్టు చూశారు. మునసబు - సమాధానం చెప్పే బాధ్యత తన మీద ఉందన్న ఎరుకతో - అవునో కాదో తెలియకుండ తల ఊపాడు. చివరికి, కొంచెం చదువుకున్న కారణంగా - లోకజ్ఞానం కంటే సాహసం ఎక్కువ ఉన్న యువకులు ధైర్యం చేసి తమ స్టేట్‌మెంట్లు రాయించారు. వచ్చీరాని వంకర గీతలతో మిడిసిపడుతూ సంతకం కూడా చేశారు. వెంట వెంటనే తక్కిన వాళ్ళు కూడా తమ స్టేట్‌మెంట్స్ రాయించి వేలిముద్రలు వేశారు. పోగా పోగా తామెక్కడ మిగిలిపోతామోనన్న గాభరాతో నేను నేనంటూ ఒక్కొక్కరూ ముందుకొచ్చి రాయించారు. 'మాకు తెల్దు' అని మొదట అవిశ్వాసం ప్రకటించిన మౌనం ఆ తర్వాత మాటలలో కరిగి ప్రవాహమై ఉప్పెన అయింది. నిజమే, పోలీసులే తగలబెట్టారని చెప్పారు. వేరే ఎవరో కాదు, చింతపల్లి ఎస్.ఐ. అమ్మినాయుడు స్వయంగా నిప్పు పెట్టాడన్నారు. ఏమన్నాడా, మీరు అన్నలకు అన్నాలు పెడుతున్నారురా అని తిట్టాడు. మిమ్మల్ని చింతపల్లి ఎవరు రమ్మన్నారు, మీ దేశం పొండి, ఒరిస్సాకు పోండి అన్నాడు. మీకు మర్యాదగా చెబితే మాట వినరు, మీ ఇళ్ళు తగలబెడతాం ఖాళీ చేయండి అన్నాడు. ఖాళీ చేసే లోపలే ఇళ్ళు తగలబెట్టాడు. ఏమేం కాలిపోయాయా? అబద్ధం ఎందుకు ఉన్నమాటే చెబుతాం - 10 బస్తాల ధాన్యం, 5 బస్తాల చోళ్ళు, 4 బస్తాల కొండ కందులు... అని చెప్పుకుంటూ పోయారు. అందరి వేలిముద్రలూ తీసుకున్నాక, వైజాగ్ తప్పకుండా వస్తాం, మీరు రానుపోను బస్సు ఏర్పాటు చేసి రెండు పూటలా అన్నం పెడతాం అంటున్నారు కదా, ఎందుకురాం వస్తాం అన్నారు.

తరువాతి రోజు పొద్దున్న తలలు పండిన ముసలివాళ్ళు కుర్రవాళ్ళ తెలివి తక్కువతనానికి భయపడుతూ అడిగారు.

"ఎందుకు పోతున్నారు మీరు?" అని.

ముందునాటి ఉత్సాహం కొద్ది కొద్దిగా తగ్గుతుండగా ఎవరికి వారు ఈ ప్రశ్నే వేసుకున్నారు. కాలిపోయిన గింజలూ బట్టలూ ఇళ్ళూ తిరిగి వస్తాయనా? అది నిజం కాదు. వాళ్ళకు ప్రపంచ జ్ఞానం ఎక్కువ లేదు గానీ ఈ మాత్రం ఉంది. ఉన్నది పోకుంటే పది వేలు, పోయింది ఎన్నటికీ ఈ దేశంలో తిరిగి రాదని వాళ్ళకు తెలుసు. మరెందుకు పోతున్నారు? చింతపల్లి ఎస్.ఐ.కి శిక్ష పడుతుందనా? ఉహు, కాదు. ఆ సంగతీ వాళ్లకు తెలుసు. తమ ఇళ్లు తగలబెట్టినందుకు ప్రతిఫలంగా చింతపల్లి ఎస్.ఐ.ని హైదరాబాద్‌కు బదిలీ చేసారని వాళ్లు విన్నారు. హైదరాబాద్ అంటే ఎలా ఉంటుందో వాళ్ళకు తెలీదుగానీ వైజాగ్ కంటే పెద్దది అనీ, అక్కడ పగలనక రాత్రనక సంత రోజున చింతపల్లి కంటే ఎక్కువ సందడిగా ఉంటుందనీ, అక్కడ ఉద్యోగం చేస్తే సరదాయే సరదా అనీ వాళ్ళకు తెలుసు.

మరయితే ఎందుకు పోతున్నట్టు?

ఆలోచనలతో వాళ్ళ మనస్సులు మెత్తబడ్డాయి. వాళ్ళ తల్లిదండ్రులు కోరాపుట్‌లోనో జైపూర్‌లోనో ఉన్నప్పుడు ఎట్లా బతికారో వీళ్ళకు తెలీదు. వీళ్ళ కాలానికి ఇటు వలస వచ్చారు. మొదట అరకు, అనంతగిరి వచ్చారు. ఆ తరువాత అక్కడి నుండి పాడేరు మీదుగా చింతపల్లి చేరారు. కొందరు ఇంకా కిందికి పోయి కొండ దిగి ఇంకో కొండెక్కి కొయ్యూరు చేరుకున్నారు కూడ. ఈ వలసలో పుట్టి పెరిగారు వీళ్ళు. పుట్టిన నాటినుండి పరాయి వాళ్ళ నోట తిట్లే తప్ప ఎన్నడూ మంచి మాటలు వినలేదు. చేలలో పనిచేస్తూంటే, విత్తనాలు నాటుతూంటే, గింజలు కోస్తూంటే ఈ భూమి మీది కాదు ఇదంతా నేరం అన్నారు. ఆ భూమి వాళ్ళది కాదు కాబట్టి అందులో పోసిన శ్రమను కూడా నేరం అన్నారు. ఏరుకున్న గింజలతో ఇంట్లో పిల్లా పాపలతో కూర్చొని వండుకుంటూంటే, తింటూంటే ఈ నేల నీది కాదు, ఇక్కడ ఇల్లెందుకు వేసావన్నారు. శీతాకాలం సాయంత్రం పది ఇళ్ళ వాళ్ళు ఊరి మధ్య చేరి చలిమంట వేసుకుంటుంటే ఈ కట్టెలు మీవి కావు ఇక్కడ మంటెందుకు వేసారన్నారు. వాళ్ళ శ్రమ నేరం, వాళ్ళ ఆహారం నేరం, వాళ్ళ ఉనికే నేరం అన్నారు. వాళ్ళంతా ఇట్లానే పెరిగారు.

నువ్వు నేరస్తుడివి అని నాగరికులు తిట్టిన తిట్లు వాళ్ళ వ్యక్తిత్వాల మీద బూటు కాలిముద్రలు వేసాయి. వాళ్ళ వ్యక్తిత్వాలను వికృతం చేశాయి. వాళ్ళల్లో

వాళ్ళు మనుషులే, ప్రేమ ద్వేషం మంచి చెడు తెలిసిన వాళ్ళే. పరాయివాళ్ళ దగ్గర వాళ్ళు మనుషులు కారు. పరాయివాళ్ళు కనబడితే పారిపోవాలి. పారిపోయే వ్యవధి లేకపోతే వంగి వంగి దండాలు పెట్టాలి. మనసులో తమ భాషలో తిట్టుకుంటూ పైకి 'కొండజాతి' నవ్వు నవ్వాలి. అంతా అర్థం అవుతూనే ఉన్నా 'నాకు తెల్దు' అనే వెర్రి పలుకుతో నిర్దోషిత్వం రుజువు చేసుకోవాలి. ఏ నేరం చేయకున్నా తమ ఉనికే నేరం కాబట్టి అభిమానం చంపుకొని ఆకలి ఏడుపులు ఏడవాలి. గౌరవం దొరకదని కనికరం కోరుకోవాలి.

ఇది వాళ్ళ బతుకు. ఈ బతుకులో పుట్టి పెరిగిన వాళ్ళతో నాలుగు మంచి మాటలు మాట్లాడితే మనసు చలించి పోతుంది. వైజాగ్ రండి, న్యాయం జరుగుతుంది అన్నారు పౌరహక్కుల వాళ్ళు. అడవి నరకడం తప్పు కాదన్నారు. తప్పు చేసినా ఇళ్ళు తగలబెట్టే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. మన శ్రమ, దాని ఫలం తప్ప ఈ ప్రపంచంలో వేరే ఏదీ లేదన్నారు. మిగిలినదంతా ఈ నిజాన్ని కప్పిపుచ్చే బూటకం అన్నారు. వాళ్ళ జీవితంలో ఆత్మగౌరవానికి మొట్టమొదటిసారి ఆలంబన దొరికింది. "అందుకే వైజాగ్ వెళ్తున్నాం" అని కుర్రవాళ్ళు తమకు తాము చెప్పుకున్నారు. పెద్దవాళ్ళతోనూ చెప్పారు.

మరి కొందరు అదే ప్రశ్నను బెదిరింపుగా అడిగారు.

పౌరహక్కుల వాళ్ళు వచ్చి వెళ్ళిన రెండవ రోజు సాయంత్రం చీకట్లు ముసురుతుండగా వాళ్ళ ఊళ్ళకు పోలీసులు వచ్చారు. అడవి నుండి దొంగిలించు కొని తెచ్చిన కట్టెతో మంట వేసుకొని అందరూ చుట్టూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటూండగా ఆకులు చప్పుడు చేశాయి. తలెత్తి చూస్తే పది మంది జవాన్లు నిప్పు వెలుగులో నల్లగా కనబడ్డారు. వాళ్ళ నల్లటి తుపాకులు చేతులకు మొలిచిన చేతులలాగ ఉన్నాయి.

"ఎందుకు పోతున్నార్రా వైజాగ్‌కు?" అని కర్కశంగా అడిగారు. అది సమాధానం కోరే ప్రశ్న కాదు. అది ఆరోపణ, అది బెదిరింపు, అది తిట్టు. సమాధానం కోసం ఎదురు చూడకుండా కోళ్ళు కోయమన్నారు, అన్నం వండమన్నారు. ఆడవాళ్ళు కోళ్ళు కోశారు, కూర వండారు, అన్నం వండారు. పోలీసులు కడుపు నిండా తిని, పోతూ తమ ప్రశ్నకు తామే సమాధానం చెప్పారు. "వైజాగ్‌కు పోతే మీ కాళ్ళూ చేతులూ విరగ్గొడతాం, ఇళ్ళు మళ్ళీ తగలబెడతాం" అన్నారు. "ఈ పౌరహక్కుల వాళ్ళు ఇవ్వాళ వచ్చిపోతారు. మీరూ, మేమూ ఎప్పుడూ ఇక్కడే ఉండవలసిన వాళ్ళం" అన్నారు.

అయినా వెళ్ళవలసిన రోజున ఊరికిద్దరు తక్కువ కాకుండా చింతపల్లి సంత చేరుకున్నారు. బస్సు సమయానికి వచ్చి ఉంటే అందరూ ఎక్కేవాళ్ళే. కాని రావలసిన బస్సును పోలీసులు వెనక్కి తిప్పి నర్సీపట్నం పంపించేశారు. డ్రైవర్‌నూ, క్లీనర్‌నూ అరెస్టు చేశారు. ఈ లోపల సంతలో పోలీసులు ఒక్కొక్కరినీ పట్టుకొని బెదిరించి భయపెట్టి ఇళ్ళకు పొమ్మన్నారు. సగం మంది పోయారు. మిగిలిన వాళ్ళు తమను రమ్మని చెప్పిన పౌరహక్కుల వాళ్ళ చుట్టూ చేరారు. ఏం చేద్దాం అన్నారు. అందరూ భయపడుతున్నారు, ఇళ్ళకు పోతాం అన్నారు. అన్నారు గానీ వాళ్ళకీ తిరిగి పోవాలని లేదు. వైజాగ్‌కు పోవాలనే ఉంది. చివరికి 58 మంది ఆర్టీసీ బస్సులలో పాడేరు వెళ్ళి, అక్కడి నుండి అనకాపల్లి వెళ్ళి, అక్కడి నుండి రాత్రి 10 దాటిన తరువాత విశాఖపట్నం చేరారు.

మనిషికి మనిషి కనిపించని నియాన్‌లైట్ల వెలుగులో వైజాగ్ రోడ్ల మీద వాళ్ళకు చాలా భద్రత అనిపించింది. ఇక్కడ తమను ఎవరూ గుర్తించరు అని ధైర్యం చెప్పుకున్నారు. సాహసం అయితేనేం మంచి పని చేశాం అనుకున్నారు. భద్రత నుండి కోరికలూ పుట్టాయి. ఇక్కడ పెద్ద చెరువు ఉందంట మాకు చూపిస్తారా అని పౌరహక్కుల వాళ్ళను అడిగారు. చెరువు కాదు - సముద్రం, తప్పక చూపిస్తాం అన్నారు. మా చిన్నతనం తరువాత అడవిలో కనబడడం మానేసిన జంతువులన్నీ ఉండే కోట ఒకటి ఉందంట చూపిస్తారా అన్నారు. కోట కాదు దాన్ని 'జూ' అంటారు. తప్పక చూపిస్తాం అన్నారు. హోటల్‌లో కడుపు నిండా భోజనం తిన్నారు. సత్రం చేరుకుని రాత్రి కంటి నిండా నిద్రపోయారు.

"ఎందుకొచ్చార్రా వైజాగ్‌కు?"

పొద్దున్నే మళ్ళీ మొదలయింది ప్రశ్న. బీడీలు కొనుక్కుందామని సత్రం నుండి బయటికి వెళ్ళిన ఇద్దరిని పోలీసులు చొక్కాలు పట్టుకొని అడిగారు ఈ ప్రశ్న. నర్సీపట్నం ఇంటెలిజెన్స్ సి.ఐ.గారు రమ్మంటున్నారు రండి అని జీపులో ఎక్కించుకొని కంట్రోల్ రూంకు తీసుకుపోయారు. అక్కడ ఎవరెవరో పెద్ద పెద్ద పోలీస్ ఆఫీసర్లున్నారు. వాళ్ళ ఎదుట నిలబెట్టారు.

"ఎందుకొచ్చార్రా వైజాగ్‌కు?" అని కసిరాడు అందరికంటే పెద్ద ఆఫీసరు. ఆ పౌరహక్కుల వాళ్ళు రమ్మంటే మీరు వెంటపడి రావడమేనా అన్నాడు. కాసేపు వాళ్ళను తిట్టాడు. రాయడానికి చేతులు రాని బూతులు తిట్టాడు. తిట్టి, వస్తే వచ్చారు గాని మేము బస్సు ఏర్పాటు చేస్తాం వెళ్ళిపోండి అన్నాడు. అందరినీ తిరిగి తీసుకువెళ్ళే బాధ్యత మీ యిద్దరిదీ అన్నాడు. అని చెప్పి వదిలిపెట్టాడు.

వాళ్ళిద్దరూ సత్రానికి తిరిగి వచ్చారు. పౌరహక్కుల వాళ్ళు తక్కిన సాక్షులతో కూర్చొని సాక్ష్యం ఎట్లా చెప్పాలో చర్చిస్తున్నారు. ఏమేం ప్రశ్నలు అడుగుతారో, వాటి భావం ఏమిటో వివరిస్తున్నారు. ఈ ఇద్దరూ వెళ్ళి విషయం చెప్పారు. దయచేసి మమ్మల్ని పోనీయండి చింతపల్లికి వెళ్లిపోతాం అని అడిగారు. పౌరహక్కుల వాళ్ళ కంటే ముందు వాళ్ళ జనమే తిరగబడ్డారు. సత్రం నుండి బయటికి పోవద్దని  ఈ బాబులు చెబితే వినకుండ బీడీల కోసం ఎందుకు పోయారు అన్నారు. పోలీసులకు లొంగిపోయారు మీరు అన్నారు. వాళ్ళ కాళ్ళ దగ్గరే పడి ఉండండి అన్నారు. ఊళ్ళో పెద్ద సాహసగాళ్ళమని ప్రగల్భాలు పలుకుతారు, ఇదేనా మీ సాహసం అన్నారు. సారాంశంలో, మేము రాము మీరు పోతే పొండి అన్నారు.

ఆ రోజంతా మంతనాలు జరిగాయి. ఆ ఇద్దరు దౌర్భాగ్యులూ ఆ రోజంతా వచ్చి పోతూనే ఉన్నారు. కళ్ళలో నీళ్ళు ఒకటే తక్కువగా, 'రండి అందరం కలిసే పోదాం, పోలీసులు బస్సు ఏర్పాటు చేస్తారంట,' అన్నారు. 'లేకపోతే మన కీళ్ళు విరుగుతాయి. మన ఇళ్ళు మళ్ళీ తగలబడతాయి' అన్నారు. ఒక్కొక్కరే మరొక పదిమంది జారుకున్నారు. తక్కిన 46 మంది మాత్రం గట్టిగా నిలబడ్డారు. తమ సాహసానికి తామే సంబరపడుతూ మరింత పట్టుదలగా తయారయ్యారు.

విచారణ దినం 1987 డిసెంబర్ 11. తెల్లవారింది. రాత్రంతా తమ ప్రయత్నాలలో విఫలం అయిన పోలీసుల పట్టుదల పెరిగింది. సాక్షులుంటున్న సత్రం మీద ఒత్తిడి పెరిగింది. ఇక లాభం లేదని తెలతెలవారుతుండగానే సాక్షులు విచారణ స్థలానికి తరలి వెళ్ళారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్మానుష్యంగా ఉంది. చదువుకోడానికో కాలక్షేపానికో వచ్చే విద్యార్థుల రాకకు ఇంకా రెండు మూడు గంటల వ్యవధి ఉంది. విచారణ జరగవలసిన టి.ఎల్.ఎన్. సభ హాలు బయట సాక్షులంతా కూర్చున్నారు. దూరాన 'చెరువు' కనిపిస్తూ ఉంది. దానిని తదేకంగా చూస్తూ కూర్చున్నారు. ఇవ్వాళ సాయంత్రం అయినా 'చెరువు' దగ్గరికి పోయే వ్యవధి దొరుకుతుందా?

నెమ్మదిగా విచారణ హాలు మేలుకుంది. కటకటాల తలుపు తెరుచుకుంది. తెల్లటి గుడ్డ మీద 'భారత ప్రజల మానవ హక్కుల ట్రిబ్యునల్' అని నీలం రంగు అక్షరాలలో ఇంగ్లీషులో రాసిన బ్యానర్ తలుపును అలంకరించింది. హాలు లోపల మెత్తటి సోఫాలు బారులు తీరి ఉన్నాయి. 46 మంది సాక్షులూ వెళ్ళి

సోఫాలలో కూర్చున్నారు. హాలు నలువైపులా అద్దాల కిటికీలున్నాయి. వాళ్ళు కూర్చున్న సోఫాలే కాక చాలా కుర్చీలున్నాయి. చూస్తూండగానే చాలామంది వచ్చారు. మైకులు వచ్చాయి. పుస్తకాలూ కాగితాలూ వచ్చాయి. చివరగా జడ్జీలిద్దరు వచ్చారు. ఒక మగాయన, ఒక ఆడామె. వాళ్ళ ముఖాలకూ, తాము కూర్చున్న సోఫాలకూ పోలిక ఉన్నట్టు అనిపించింది. మెత్తగా, నల్లగా, ముసలిగా ఉన్నాయి. మళ్ళీ ఒకసారి సాక్షులందరికీ భద్రత అనిపించింది. ఈ జడ్జీలు ఇతర ఆఫీసర్లలాగ తమను తిట్టరు. వీళ్లు తమతో మాట్లాడతారు, మొరగరు. నాగరికుల భాషలన్నీ తిట్టడం కోసమే తయారు చేశారని వాళ్ళు ఇంతకాలం అనుకున్నారు. అది నిజం కాదన్న అనుమానం వాళ్లకు తొలిసారి ఈ రెండు గంటలలో కలిగింది. ఈ రెండు గంటలూ వాళ్ళనెవ్వరూ "ఎందుకు వచ్చార్రా వైజాగ్‌కు" అని అడగలేదు. వాళ్ళకు జరిగిన అన్యాయం ఏమిటో చెప్పుకోమన్నారు. అంత భద్రతలోనూ వాళ్ళు కొంత భయపడ్డారు. కొత్తదనం వల్ల భయపడ్డారు. మైకును చూసి భయపడ్డారు. అంత మంచితనం చూసి భయపడ్డారు.

చెప్పుకున్నకొద్దీ ధైర్యం పెరిగింది. తడబడుతూ మొదలుపెట్టిన గొంతులు అనర్గళంగా మాట్లాడసాగాయి. వచ్చీరాని భాషలోనే విసుర్లూ వ్యంగ్యం పలకసాగాయి. రెండు గంటల సేపు అందరూ ఒక అసత్యపు ప్రపంచంలో జీవించారు. వినదల్చుకున్న వాళ్ళతో అన్యాయాన్ని గురించి చెప్పుకునే హక్కు ప్రజలకుందన్న భ్రమను తమకు తాము కల్పించుకొని అందులో బ్రతికారు. అదృష్టవశాత్తు రెండు గంటలలోనే ఆ భ్రమ పటాపంచలయింది.

తొమ్మిదిమంది తమ సాక్ష్యం ఇచ్చారు. పదవ సాక్షి మైకు ముందర నిలబడి తన పేరూ ఊరూ తనకు జరిగిన నష్టం చెపుతున్నాడు. అంతలో బయటి నుండి పెద్దగా కేకలు పెట్టుకుంటూ ఒక మూక వచ్చింది. ముందర ఆడవాళ్లున్నారు. పిల్లల్ని ఎత్తుకున్న ఆడవాళ్ళున్నారు. వెనక మగవాళ్ళున్నారు. వాళ్ళు పోలీసులని వాళ్ళ ముఖం చూస్తూనే తెలుస్తున్నది. ఆడవాళ్ళు నినాదాలు ఇస్తూ గొడవ చేస్తున్నారు. వెనకున్న మగవాళ్ళు కుర్చీలు పైకెత్తి తిన్నగా సాక్షుల మీదికి పోయారు.

"ఎవడు రమ్మన్నాడ్రా మిమ్మల్ని వైజాగ్‌కి?"

అంటూ కుర్చీలతో వాళ్ళను దారుణంగా కొట్టారు. ఇంకింత భయం గొలిపించడానికి కుర్చీలు ఎత్తి బలంగా నేలకేసి కొట్టారు. సాక్షులంతా భయపడి బయటకు పరుగెత్తారు. సాక్షులకు భద్రత లేకుండ విచారణ ఎట్లా కొనసాగించడం అని జడ్జీలు విచారణను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఆ రాత్రి పోలీసుల పర్యవేక్షణలో యమలోకం ముందు వాకిట్లో గడిచినట్టు గడిచింది సాక్షులకు. తెల్లవారడానికి ఇంకా మూడు గంటలు ఉండగానే లేచి పోలీసుల కళ్ళబడకుండ బస్సెక్కి మధ్యాహ్నానికి చింతపల్లి చేరుకున్నారు.

దారి పొడవునా అందరూ మౌనం. అందరి మనస్సులలోనూ రాబోయే పరిణామాల గురించి భయం. అందరి మనస్సులలోనూ ఒకే అవ్యక్తమైన ప్రశ్న.

"అసలు మనల్ని వైజాగ్‌కు ఎవడు వెళ్ళమన్నాడు?" అన్న ప్రశ్న.

అవ్యక్తంగా ఉండిపోయిన ఈ ప్రశ్నకు వాళ్ళలో ఒకడు బస్సు దిగుతూ తనకు తాను చెప్పుకుంటూన్నట్టు సమాధానం చెప్పాడు.

"ఈ బాబులు మనల్ని తిట్టలేదు. మనం ఏమీ తప్పు చేయలేదని ఈ బాబులొక్కరే అన్నారు. అందుకని వెళ్ళాం వైజాగ్‌కు. అందుకనే వెళ్తాం వైజాగ్‌కు."

*అరుణతార మాసపత్రిక*
*నవంబర్ 1987 / జనవరి 1988*

***నోట్ :***

*ఈ మొదటి ప్రయత్నం విఫలమైనా కేరళ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూరి టి. చంద్రశేఖర మీనన్, కలకత్తా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జ్యోతిర్మయి నాగ్‌లతో కూడిన IPHR ట్రిబ్యునల్ 7.2.1988 నాడు మరోసారి విశాఖపట్నంలో సమావేశమై విచారణ జరిపింది. మర్నాడు చింతపల్లి ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి పోలీసులు తగలబెట్టిన కొన్ని ఆదివాసీ గూడేలను కూడా చూసి వచ్చింది. వారు 18.10.1988 నాడు విడుదల చేసిన నివేదికలో పోలీసులను దోషులుగా పేర్కొనడమే కాక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న అటవీ, ఆదివాసీ విధానాలను తీవ్రంగా విమర్శించారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను శాంతి భద్రతల సమస్యలుగా చూసే ధోరణిని తప్పుబట్టారు.*

# పొరకల దొర కథ

**1981** ఏప్రిల్ 20వ తేదీన ఇంద్రవెల్లిలో కాల్పులు జరిగినప్పుడు పత్రికలన్నీ ఆదిలాబాద్ గిరిజనుల గురించి అనేక విషయాలు రాశాయి. అప్పుడు ఒక పేరు బాగా ప్రచారంలోకి వచ్చింది. అది 'పొరకల దొర' అనే పేరు. ఆ వ్యక్తి అసలు పేరు దాసరి లక్ష్మీకాంతం. వరంగల్ వాస్తవ్యుడు. జీవనం కోసం ఆదిలాబాద్‌లో పొగాకు అమ్ముకునే వాడు. పొగాకు అమ్ముతూ గిరిజన ప్రాంతాలలో తిరిగేవాడు. అతని లాగ దేశంలోని గిరిజన ప్రాంతాలలో పొగాకు, మిల్లు బట్టలు మొదలయిన నాగరిక ఉత్పత్తులు అమ్ముతూ తిరిగే వర్తకులు ఎందరో ఉండేవారు, ఇప్పటికీ ఉన్నారు. చవకబారు సరుకుకు చాలా ఎక్కువ ఖరీదు చెప్పి గిరిజనుల నుండి రొక్కం రూపంలోనూ వస్తు రూపంలోనూ అధిక ధర సేకరించి, త్వరలోనే ధనవంతులయిన వారు చాలామంది ఉన్నారు. సంపాదించిన డబ్బుతో మళ్లీ గిరిజనుల నుండే కారుచవగ్గా భూమి కొనుక్కొని అక్కడే స్థిరపడ్డ వారూ ఉన్నారు. ఆ తరువాత కూడ గిరిజనులను వర్తకం ద్వారా, వడ్డీ వ్యాపారం ద్వారా మోసం చేయడం కొనసాగిస్తూ చాలా ఎదిగిన వాళ్లున్నారు. కొందరు ఆస్తి సంపాదనతో సంతృప్తి చెందితే మరి కొందరు రాజకీయాలలోకి దిగి గ్రామ సర్పంచ్ నుండి ఎంఎల్ఎ దాకా పదవులు నిర్వహిస్తున్నారు. ఇవ్వాళ ఆదిలాబాద్ జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల నాయకులగానూ, శాసన

సభ్యులుగానూ చెలామణి అవుతున్న వారి గతాన్ని తవ్వి తీస్తే ఏమేం కథలు కనబడుతాయో!

దాసరి లక్ష్మీకాంతం కూడ ఈ మార్గంలో సులభంగా ప్రయాణం చేసి ఉండవచ్చును. భూస్వామి గానో వ్యాపారస్తుడి గానో ఆదిలాబాద్‌లో స్థిరపడి ఉండవచ్చును. కాంగ్రెస్ నాయకుడో, తెలుగుదేశం నాయకుడో అయి ఉండవచ్చును. కానీ అతను ఆ మార్గాన పోదలచుకోలేదు. గిరిజనులను దోచుకొని తాను బాగుపడే బదులు వాళ్లకు ఆ దోపిడీని గురించి విడమరచి చెప్పేవాడు. వాళ్ల శ్రమ విలువ ఏమిటో, వాళ్ల భూమి విలువ ఏమిటో, వాళ్లు అడవి నుండి సేకరించి తెచ్చే సరుకు విలువ ఏమిటో చెప్పేవాడు. వాళ్ల కష్టాలు తెలుసుకొని బయటి ప్రపంచానికి చెప్పేవాడు. అతనంటే గిరిజనులకు గురి ఏర్పడింది. తాము నమ్మిన నాయకుల గురించి గిరిజనులు ఆనవాయితీగా చెప్పుకునే అభూత కల్పనలు అతని గురించి కూడ చెప్పుకునేవారు. మొదట లక్ష్మీకాంతం 'పారకల దొర' అయ్యాడు. అటు తర్వాత 'నక్సలైట్' అయ్యాడు. ఒక పార్టీ నుండి మరొక పార్టీకి పోయాడు. అరెస్టయి జైలుకు పోయాడు. నాలుగు సంవత్సరాల కాలంలో భారత న్యాయ వ్యవస్థలోని అన్యాయాన్నంతా రుచి చూశాడు.

అతను మొదట అరెస్టయింది 1984 నవంబర్ 16వ తేదీన. ఆసిఫాబాద్ కోర్టులో అతనిపై రకరకాల కేసులు పెట్టారు. 1987 జనవరి నాటికి ఆ కేసులన్నీ కొట్టుకు పోయాయి. ఇక బయటికి వచ్చేస్తాడనగా పోలీసులు మరొక కేసు తవ్వి తీసి మళ్లీ రిమాండు చేయించారు. దీనిని కూడా 1987 ఫిబ్రవరి 25న ఆసిఫాబాద్ కోర్టు కొట్టి వేసి కోర్టు నుండే విడుదల చేసింది. అయితే పోలీసులు కోర్టు బయటే కాపు గాసి మళ్లీ పట్టుకొని సిర్పూర్ పోలీస్ స్టేషన్‌లో 33 రోజులు అక్రమ నిర్బంధంలో ఉంచారు. మార్చి 28వ తేదీన మళ్లీ సిర్పూర్ కోర్టులో హాజరు పరచి, 'నాటు తుపాకీ చేతిలో పట్టుకొని హత్య చేయడానికి సమాయత్తమవుతుండగా నిన్నటి దినం అరెస్టు చేశాము' అని చెప్పి టెర్రరిస్టు చట్టం కింద కేసు పెట్టారు. ఈ కేసు విచారణ ప్రారంభం కావడానికి దాదాపు రెండేళ్లు పట్టింది. విచారణ 1989 ఫిబ్రవరి 6వ తేదీన ముగిసింది. ఆదిలాబాద్ డెజిగ్నేటెడ్ జడ్జి ఈ 'పారకల దొర'కు అయిదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించాడు. గిరిజనులను దోచుకొని ఆస్తులు సంపాదించుకునే సదవకాశాన్ని వదులుకొని 'న్యాయానికి పోయినందుకు' దాసరి లక్ష్మీకాంతంకు మన న్యాయవ్యవస్థ ఇచ్చిన ప్రతిఫలం ఇది!

లక్ష్మీకాంతం లాంటి వాళ్లు చాలా అరుదు. తక్కిన వాళ్లు నైతికమయిన ఆవేదన ఎంత మాత్రం లేకుండ భూమీ ఆస్తీ అన్నీ సంపాదించుకున్నారు. వాళ్లను అడ్డుకోగలిగినవి రెండు మాత్రమే. గిరిజనులలో చైతన్యం పెరిగే కొద్దీ వాళ్లను దోచుకోవడం కష్టం అవుతుంది. (యాభయి ఏళ్ల క్రితం దోచుకున్నంత సులభంగా ఇవ్వాళ దోచుకో లేకుండ ఉన్నారు.) రెండవది, తాము సంపాదించుకున్న భూమిని తిరిగి గిరిజనులకు ఇప్పించే పరిస్థితి ఏర్పడితే మొదటికే మోసం వస్తుంది. బలవంతంగా ఇప్పించే రోజులు ఇంకా ఇప్పటి దాకా రాలేదని వాళ్లకు తెలుసును. ఆ రోజు వస్తే చేయగలిగింది ఏమీ లేదని కూడా తెలుసును. అయితే ఆ లోపల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలను అమలు చేస్తానంటూ ఏ కలెక్టరయినా పూనుకుంటే భూమి పోకపోవచ్చును గానీ చాలా న్యూసెన్సు అవుతుంది (కోర్టు కేసులూ లంచాలూ ఫీజులూ...) అటువంటి కలెక్టరు దాపురిస్తే అతని మీద అపనిందలు వేసి తమ తమ పార్టీల నాయకులకు చెప్పి బదిలీ చేయించుకోవాలి. కొన్ని నెలల క్రితం ఆదిలాబాద్ జిల్లాలో ఇదే జరిగింది.

గిరిజనేతరులు - అంటే మనబోటి మైదాన ప్రాంతాల వాళ్లు - ఇవ్వాళ ఆదిలాబాద్‌లో 83 శాతం ఉన్నారు. ఒక శతాబ్దం క్రితం దాదాపు పూర్తిగా గిరిజన ప్రాంతంగా ఉన్న జిల్లాలో ఇవ్వాళ గిరిజనులు కేవలం 17 శాతం ఉన్నారంటే, గిరిజనేతరుల ప్రవాహం ఎంతగా ఉన్నదీ అర్థం అవుతుంది. వీరిలో కొందరు నిజాం నవాబు వేలం వేయగా వందల ఎకరాల భూమిని కొనుక్కొని అక్కడ స్థిరపడ్డారు. కొందరు ఈ భూస్వాముల భూములను సాగు చేయడానికి రైతులగానో పాలేర్లగానో అక్కడికి పోయి, త్వరలో తామూ నాలుగయిదు ఎకరాలు సంపాదించి స్థిరపడ్డారు. కొందరు రకరకాల వ్యాపారాల కోసం పోయి గిరిజనులను మోసగించి ఆస్తులు సంపాదించుకున్నారు. కొందరు రెవెన్యూ అధికారులకూ అటవీ శాఖ అధికారులకూ గ్రామాలలోని పట్వారీలకూ లంచాలు మేపి గిరిజనుల భూములనూ అడవి భూములనూ తమ పేరిట పట్టా చేయించుకున్నారు.

మైదాన ప్రాంతాల వారు ఈ రకంగా 'దాడి'కి పూనుకుంటే గిరిజనులకు రెండే ప్రత్యామ్నాయాలున్నాయి. ఒకటి, వారిని ప్రతిఘటించడం; రెండవది, వారి బారిన పడ్డ భూములను వదిలి పెట్టి అడవులలోకి పోయి కొత్తగా భూమిని సేద్యంలోకి తేవడం. ఈ రెండు పనులూ గిరిజనులు చేస్తూనే ఉన్నారు. ఈ రెండిటి చిహ్నాలూ మనకు చరిత్ర నిండా కనబడతాయి. అయితే ఆధునిక కాలంలో అడవుల ఆర్థిక ప్రాముఖ్యం పెరిగిన తరువాత ఇది కష్టం అయిపోయింది. ఆధునిక

నాగరికత పెరిగేకొద్దీ గృహ నిర్మాణం పెరుగుతోంది. ఇంటి దూలాలకూ స్తంభాలకూ తలుపు చెక్కలకూ కుర్చీలకూ బల్లలకూ బీరువాలకూ కలప కావాలి. ఇందులో మానవ జీవితానికి అవసరం అయింది కొంత అయితే, ధనవంతుల ఆర్భాటమయిన జీవన సరళి కోసం వృధా అయ్యేది చాలా ఎక్కువ. దీనితో పాటు కలపకు ఉండే పారిశ్రామిక ప్రాముఖ్యం కూడ పెరుగుతోంది. కాగితపు గుజ్జు కోసం కలప కావాలి, రేయాన్ వంటి కృత్రిమ నూలు ఉత్పత్తికి కలప కావాలి, రైల్వే స్లీపర్లకు కలప కావాలి, నౌకా నిర్మాణానికి కావాలి - అంటే బడా పరిశ్రమకు కూడ కలప చాలా అవసరం అయింది. దీనికి తోడు అడవులలో అనేక రకాల ఖనిజాలు దొరుకుతాయి. ఇనుము, బొగ్గు, సున్నపు రాయి అడవులలో దొరికే ప్రధానమయిన ముడి సరుకులు. వీటి తవ్వకం కూడ బడా పరిశ్రమకు అవసరం. అసలు అదే ఒక బడా పరిశ్రమ.

ఆధునిక కాలంలో ఉత్పన్నమయిన ఈ అవసరాల వల్ల అడవుల మీద నాగరికుల దాడి మరీ ఎక్కువ అయింది. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అడవులను 'రక్షిత వనాలు'గా ప్రకటించడం మొదలు పెట్టింది. ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో నాగరిక జీవితానికీ పరిశ్రమలకూ అవసరమయిన టేకు, యూకలిప్టస్ వంటి కలప రకాలను పెంచడం మొదలుపెట్టింది. దీని వలన గిరిజనులకు కొత్తగా అడవి భూములను సేద్యంలోకి తేవడం అసాధ్యం అయింది. ఒక వైపు గిరిజనేతరుల భూ ఆక్రమణ, మరొక వైపు 'రక్షిత వనాలు' పేరిట ఈ నిర్బంధం - వీటితో గిరిజనుల పరిస్థితి 'అడకత్తెరలో పోకచెక్క' అన్నట్టు తయారయింది.

దీని ఫలితంగా ఆధునిక కాలంలో గిరిజనుల ప్రతిఘటన కూడ పెరిగింది. బ్రిటిష్ కాలంలోనే అసంఖ్యాకమయిన గిరిజన పోరాటాలు జరిగాయి. తిరుగుబాట్లు వచ్చినప్పుడల్లా ప్రభుత్వం పోలీసులనూ ఇతర సాయుధ బలగాలనూ వినియోగించి వాటిని పాశవికంగా అణచివేస్తూ, అణచివేత అయిపోగానే గిరిజనుల సంక్షేమం కోసమని చెప్పి భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలను జారీ చేస్తూ వచ్చింది. గిరిజనుల భూములను మైదాన ప్రాంతాల వాళ్లు కాజేయకుండ చూడడం ఈ చట్టాల లక్ష్యం. మన రాష్ట్రంలో 1915-16 సంవత్సరాలలో మన్యం ప్రాంతంలో వచ్చిన గిరిజన తిరుగుబాటును అణచివేసిన తరువాతే మొట్టమొదటి షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు మరియు వడ్డీ వ్యాపార నియంత్రణ చట్టం (1917) వచ్చింది. ఇది అప్పటి బ్రిటిష్ పాలిత ప్రాంతమయిన కోస్తా,

రాయలసీమ జిల్లాలకు వర్తించే చట్టం. నిజాం పాలనలో ఉన్న తెలంగాణలో అప్పటి దాకా గిరిజన పోరాటాలూ లేవు, గిరిజన సంక్షేమ చట్టాలూ లేవు. 1940లో ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ ప్రాంతంలో కొమురం భీము నాయకత్వంలో పోరాటం వచ్చిన తరువాతే నిజాం సంస్థానానికి వర్తించే భూమి బదలాయింపు నియంత్రణ చట్టం 1946లో వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత 1959లో ఈ రెండింటినీ క్రోడీకరించి ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని చేశారు. అయితే అప్పటికి గిరిజన ప్రాంతాలలో సంఘటిత ఉద్యమాలేవీ లేవు కాబట్టి 10 సంవత్సరాల పాటు ఈ చట్టం అమలుకు కావలసిన నియమాలను రూపొందించలేదు. 1968లో శ్రీకాకుళ గిరిజన పోరాటం వచ్చిన తరువాతే - ఒకవైపు దానిని 'ఎన్‌కౌంటర్ల'తో అణచి వేస్తూనే - 1959 చట్టానికి రూల్సు తయారు చేశారు. అదే సమయంలో దానిని మరింత పటిష్టం చేస్తూ 1970 రెగ్యులేషన్ వచ్చింది. 1971లోనే ఆ రెగ్యులేషన్ కోర్టుకెక్కింది. 18 సంవత్సరాలు కోర్టులో గడిపి విజయవంతంగా బయటికి వచ్చిన తరువాత ఇప్పుడు ప్రభుత్వమే దానిని రద్దు చేయాలని నిర్ణయించుకుంది!

ఈ నిర్ణయాన్ని ఇవాళ ఏ పేరు పెట్టి సమర్థించుకున్నా ఒకటి మాత్రం వాస్తవం. 1917 నుండి అమలులో ఉన్న చట్టాలను వాస్తవంలో అమలు చేసింది చాలా తక్కువ. అమలు చేస్తామన్న బెదిరింపుతో రెవిన్యూ అధికారులు గిరిజనేతరుల నుండి లక్షల రూపాయల లంచాలు తిన్నారు. అమలు చేయిస్తామన్న ఆశ గిరిజనులకు చూపి నానా రకాల పైరవీకారులూ రాజకీయ నాయకులూ డబ్బులు తిన్నారు. అమలు చేసింది మాత్రం బహు స్వల్పం. ఇవ్వాళ రాష్ట్రంలోని షెడ్యూల్డు ప్రాంతాలలో గిరిజనేతరుల జనాభా దాదాపు 50 శాతం చేరుకుంది. వాళ్ల పట్టాలో ఉన్న సేద్యపు భూమి దాదాపు 56 శాతం (8.7 లక్షల ఎకరాలు). పట్టా లేకుండ వాళ్ల ఆక్రమణలో ఉన్న భూమినీ, వాళ్లు గిరిజనుల నుండి కౌలుకు తీసుకొని నిక్షేపంగా అనుభవిస్తున్న భూమినీ కూడ లెక్కబెడితే ఇది ఎంత అవుతుందో! ఇందులో కేవలం 80 వేల ఎకరాలను మాత్రమే (అంటే 9 శాతం మాత్రమే) ప్రభుత్వం భూమి బదలాయింపు నియంత్రణ చట్టాల కింద గిరిజనులకు ఇప్పించగలిగింది.

ఇది మన రాష్ట్రం కథ మాత్రమే కాదు, దేశంలోని అన్ని రాష్ట్రాల కథా ఇదే. అందుకే దేశవ్యాప్తంగా ఇవ్వాళ గిరిజనులు అలజడి చేస్తున్నారు. తమకు

ఎవ్వరు సానుభూతి చూపితే వాళ్లకు మద్దతు ఇస్తున్నారు. బీహార్ - మధ్యప్రదేశ్ - ఒరిస్సా రాష్ట్రాలలో జార్కండ్ ఉద్యమం, మన రాష్ట్రంలోని నక్సలైట్ ఉద్యమం, కొన్ని రాష్ట్రాలలో జరుగుతున్న అడవుల సంరక్షణ ఉద్యమం ఈ కారణాల వల్లనే గిరిజనులను ఆకర్షిస్తున్నాయి. ఈ ఉద్యమాల రాజకీయ స్వభావంలోనూ అవగాహనలోనూ ఎన్ని తేడాలున్నా, ఇవన్నీ కూడ గిరిజనులకు రెండు వైపుల నుండి - మైదాన ప్రాంతాల గిరిజనేతరుల నుండి, ప్రభుత్వ అటవీ విధానం నుండి వస్తూన్న దాడిని ఎదుర్కోవడంలో సాయం చేస్తున్నాయి కాబట్టే ఇవి గిరిజనుల మద్దతు పొందగలుగుతున్నాయి. మన రాష్ట్రంలో ప్రభుత్వం గిరిజనులకు చట్టాల కింద ఇప్పించిన భూమి 80 వేల ఎకరాలుంటే, గిరిజనులు నక్సలైట్ల మద్దతుతోనూ ఇతరత్రానూ సాగు చేసుకుంటున్న అడవి భూమి 1 లక్ష ఎకరాలకు పైగా ఉందన్నది ప్రభుత్వ అంచనాయే! దీనికి ప్రతిఫలంగా ప్రభుత్వం నుండి గిరిజనులు - అన్ని రాష్ట్రాలలోనూ - తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోవలసి వస్తోంది. ఇంద్రవెల్లి కాల్పులు సామూహిక కాల్పులు కాగా, ఈ మధ్యకాలంలో ఆదిలాబాద్‌లో గిరిజన యువకులను ఇళ్ల నుండి తీసుకుపోయి కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించడం మామూలయి పోయింది.

భూమి బదలాయింపు నియంత్రణ చట్టాల వలన షెడ్యూల్డు ప్రాంతాలలోని సామాన్య గిరిజనేతర రైతాంగం ఇబ్బందులకు గురి అవుతున్నదని ఒక వాదన ఉంది. అది నిజమే. అవినీతికీ అలక్ష్యానికీ ఆలవాలమయిన అధికార యంత్రాంగం ఈ చట్టాలను తన స్వలాభం కోసం వినియోగించుకుంటూ ఉంది. అయితే అందుకోసం ఆ చట్టాలనే రద్దు చేయాలనడంలో అర్థం లేదు. భూమి బదలాయింపు నియంత్రణ చట్టాలతో పాటు భూ సంస్కరణ చట్టాలనూ, కనీస వేతన చట్టాలనూ, కౌలుదారీ సంరక్షణ చట్టాలనూ కూడ సక్రమంగా అమలు చేసి, ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక అనుకూల అటవీ విధానం కాకుండా గిరిజన అనుకూల అటవీ విధానాన్ని అవలంబిస్తేనే గిరిజనుల సమస్య, దానితో బాటు గిరిజనేతర సామాన్య రైతాంగం సమస్యా కూడ పరిష్కారం అవుతాయి. అటువంటి వ్యూహంగానీ పథకంగానీ లేని ప్రభుత్వం ఒకరి పేరు చెప్పి ఒకరి పొట్ట కొడుతూంటే సమర్థించడమయినా, చూసి ఊరుకోవడమయినా ప్రజల పట్ల ద్రోహం అవుతుంది.

*మాయా ప్రపంచం*
*4 ఫిబ్రవరి 1989*

# అటవీశాఖ అధికార్లకు తుపాకులు: ఆత్మకూరు అడవుల్లో శవాలు

అటవీ సంపదను కాపాడటానికీ, వన్యప్రాణులను కాపాడటానికీ, తమ ప్రాణాలను కాపాడుకోవడానికీ కాల్పులు జరిపే అధికారాన్ని అటవీశాఖ అధికార్లకు దత్తం చేసే జీవో ఒకటి 1991లో మన రాష్ట్రంలో జారీ అయ్యింది. కనీసం అసెంబ్లీలో చర్చ జరపకుండా, బిల్లు రూపంలో ప్రతిపాదించి చట్టం చేయకుండా మనుషుల్ని చంపే అధికారం జీవో ద్వారా ఇవ్వడమేమిటని మీకు ఆశ్చర్యం కలగొచ్చు. ఆశ్చర్యపడవలసిన విషయం అదొక్కటే కాదు, ఆ జీవోలో ఇంకా చాలా ఉన్నాయి.

రాష్ట్ర ప్రధాన చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (అటవీ శాఖ ఉన్నతాధికారి) 1991 జూలై 24న జారీ చేసిన జీవో ఎం.ఎస్. 182 ఏమంటుందంటే అటవీ సంపదను దొంగిలించేవాళ్ళు, వన్య ప్రాణులను చంపేవాళ్ళు ఈ మధ్య కాలంలో ఆధునిక ఆయుధాలతో తిరుగుతున్నారు. దానివలన అటవీ శాఖ అధికార్ల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. అందువల్ల ప్రాణరక్షణ కోసం, అటవీ సంపదను కాపాడటం కోసం కాల్పులు జరిపే అధికారం అటవీశాఖ అధికార్లకు ఇచ్చి, అందుకోసం వారికి తుపాకులు కూడా ఇవ్వవలసిన అవసరం ఉంది. దొంగిలించిన అడవి సంపదను జప్తు చేసుకొనేటప్పుడు లేదా నేరస్తులను అరెస్టు చేసేటప్పుడు ప్రతిఘటించడం జరిగితే అటవీ అధికారులకు భారత శిక్షాస్మృతిలోని ఆత్మరక్షణ సెక్షన్ల కింద

కాల్పులు జరపడానికి తుపాకులు ఇవ్వాలని చెపుతుంది జీవో. అయితే జనావాసాలలో, గ్రామాలలో, అడవులలో, అటవీ సంపద ఉన్న ఇతర ప్రాంతాలలో మాత్రమే కాల్పులు జరిపే అధికారాన్ని వినియోగించుకోవాలని అంటుంది. ఎప్పుడెప్పుడు కాల్పులు జరపవచ్చుననే దానికి ఏడు ఉదాహరణలు ఇస్తుంది. (అనుబంధం, III (4))

1. మారణాయుధాలు ధరించి అటవీ సంపద దొంగిలించేస్తున్న వాళ్ళను అధికారులు సరండర్ కమ్మంటే, వాళ్ళు కాకపోతే
2. ఆయుధాలు ధరించినవారు విలువైన అటవీ సంపదను నెత్తిమీద గానీ, వాహనాలమీద గానీ తీసుకుపోతూ ఆగమంటే, ఆగకపోతే
3. వన్య ప్రాణులను హతమార్చేవారు ఆ పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు లేదా చంపిన జంతువులను తరలించే పనిలో నిమగ్నమై ఉన్నప్పుడు అటవీ అధికార్లు ఆగమనీ, చంపిన జంతువును ఇచ్చేయమనీ ఆదేశిస్తే, ఆగకపోతే
4. బయటివారు వేట కోసం ఆయుధాలతో అడవిలోకి ప్రవేశించి అటవీ శాఖవారు ఆయుధాలు అప్పగించమని ఆదేశించినా, అప్పగించకపోతే
5. నేరస్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉండి అటవీ అధికారుల ప్రాణాలకు గానీ, ఆయుధాలకుగానీ తక్షణ ప్రమాదం ఏర్పడితే
6. నేరస్తులు అటవీ అధికారులను ఆయుధాలతో చుట్టుముట్టడం వలన అధికారుల ప్రాణాలకు గానీ, ఆయుధాలకు గానీ తక్షణ ప్రమాదం ఏర్పడితే
7. నేరస్తులు ఒక అటవీ అధికారిని బందీగా తీసుకోవడం జరిగితే, వెంటనే సహాయాన్ని పిలిపించి తమ సహచరుడిని రక్షించడం అధికార్లకు సాధ్యం కానప్పుడు

ఇన్ని సందర్భాలలో కాల్పులు జరపవచ్చునని జీవో అంటుంది. ఇక్కడ గమనించవల్సిన విషయాలు చాలా ఉన్నాయి. ఈ వివరణలో 'ఆయుధం' అంటే ఏమిటనే నిర్వచనం లేదు. 'టాడా' లాంటి చట్టం సహితం తుపాకులను, గ్రెనేడ్లను, బాంబులవంటి ఆధునిక ఆయుధాలనే పేర్కొంది. ఈ జీవో అటువంటి వర్గీకరణ ఏదీ చేయలేదు. అడవిలో బతికే జనం నిత్యం ఉపయోగించే గొడ్డళ్ళు, కొడవళ్ళు, పలుగులు, బాణాలు, చివరికి దుడ్డుకర్రలు కూడా ఈ జీవో దృష్టిలో ఆయుధాలే. జీవో మొదటి పేరాలో ఆయుధాలు ఉపయోగించేవారు ఈ మధ్యకాలంలో ఆధునిక ఆయుధాలు ధరించి తిరుగుతున్నారు కాబట్టి వారి నుండి అటవీ సంపదను కాపాడటానికి అటవీ అధికారులకు కూడా ఆయుధాలు కావాలని

వివరణ రాసారు. కానీ ఆ వివరణలో పేర్కొన్న ఆధునిక ఆయుధాల ప్రస్తావన తక్కిన జీవోలో ఎక్కడా లేదు. అడవిలో కఱ్ఱ కొట్టుకొని భుజాన గొడ్డలి వేసుకొని పోతున్న గిరిజనులను రేంజర్ లొంగిపొమ్మంటే వాళ్ళు లొంగిపోకపోతే రేంజర్‌గారు కాల్పులు జరపవచ్చునన్న మాట.

ఇది ఊహ కాదు. ఈ జీవో ఇచ్చిన అధికారాన్ని వినియోగించుకొని కర్నూలు జిల్లా ఆత్మకూరు ప్రాంతంలో అటవీ అధికారులు ఇప్పటికి ఇద్దరిని కాల్చేసారు. వాళ్ళు ఆధునిక ఆయుధాలు పట్టుకొని అడవిని దోచుకుంటున్న బడా స్మగ్లర్లు కారు. ఆ పని చేస్తున్న రాజకీయ నాయకులు, అధికారులు చాలామంది ఈ రాష్ట్రంలో ఉన్నారు. రాయలసీమకు చెందిన ఫ్యాక్షన్ నాయకులు, రాజకీయ నాయకులలో చాలామంది నల్లమల అడవులలో కట్టెను దొంగతనంగా తరలించి కోటీశ్వరులైన వారే. వాళ్ళలో ఒకరు ప్రస్తుత హోం మంత్రి మైసూరా రెడ్డిగారు. ఆదిలాబాద్ అడవుల టేకు కలప కోట్లు విలువ చేసేది లక్సెట్టిపేటలో కాంగ్రెస్ నాయకుడు జి.వి. సుధాకరరావు ఇంటి పెరట్లో 10 సంవత్సరాల క్రితం దొరికింది. ఖమ్మం అడవుల నుండి కాబోలు ఈ మధ్య చనిపోయిన పోలీస్ అధికారి వ్యాస్ పురమాయింపుతో దొంగకట్టె తీసుకుపోతున్న లారీ ఆరేడేళ్ళ కింద పట్టుబడింది. ఈ కోవకు చెందిన పెద్దల జాబితా చాలా పెద్దదే.

ఆత్మకూరు అడవులలో జీవోఎం.ఎస్. 182 పుణ్యాన ప్రాణాలు కోల్పోయింది వీరు కాదు. ఇద్దరు సెటిల్‌మెంట్ వడ్డెరలు. స్టువర్ట్‌పురం, బిట్రగుంట సెటిల్‌మెంట్లలాగా ఆత్మకూరు సమీపంలో సిద్ధాపురం అని ఒక వడ్డెర సెటిల్‌మెంటు ఉంది. ఈ సెటిల్‌మెంటువాసులు క్రమంగా దొంగతనాలు మానుకొని పనిచేసుకొని బతకటం నేర్చుకుంటున్నారనీ, మహా అయితే అడవిలో కలప మట్టుకు దొంగిలించి అమ్ముకుంటారనీ పోలీసులు సహితం అంటున్నారు. ఈ కలప స్మగ్లింగ్ పెద్దఎత్తున చేయడానికి కావలసిన సంబంధాలు, స్తోమత వాళ్ళకు లేవు. చేస్తే 'సంసారపక్షంగా' చేసుకుంటారు. లేకపోతే ఆత్మకూరులో నివసించే 'పెద్దమనుషులకు' ఏజెంట్లుగా స్మగ్లింగ్ చేస్తారు. ఏ రకంగా చూసినా అడవుల నాశనానికి వీళ్ళను పెద్ద కారణంగా భావించనవసరం లేదు. కానీ పెద్ద కారణం అయిన వాళ్ళు సమాజంలో పెద్దలయినప్పుడు జీవోఎం.ఎస్. 182 ప్రతాపాన్ని ప్రయోగించగలిగింది చిన్న వాళ్ళ మీదనే. జీవో కూడా అందుకు అనుకూలంగానే ఉంది. కాల్పులు జరపగల సందర్భాలుగా జీవోలో పేర్కొన్న 7 పరిస్థితులను ఒకసారి తిరిగి చదవండి. 'నేరస్తులు' అన్న చోట సిద్ధాపురం

సెటిల్‌మెంట్ వడ్డెరలను, 'ఆయుధం' అన్నచోట గొడ్డలినీ కొడవలినీ ఊహించు కోండి - మీకే అర్థం అవుతుంది.

1992 మార్చి 15వ తేదీన కర్నూలు - గుంటూరు రాష్ట్ర రహదారి పక్కన పోతరాజుపెంట సమీపంలో వేముల మల్లయ్య అనే సిద్ధాపురం నివాసిని అటవీశాఖ అధికారులు కాల్చి చంపారు. 14వ తేదీన మల్లయ్యతో సహా 12 మంది (ఏడుగురు మగవాళ్ళు, అయిదుగురు ఆడవాళ్ళు) బండ్లు వేసుకొని అడవిలోకి వెళ్ళారు. వాళ్ళు కట్టె తెస్తుండగా అటవీశాఖ అధికార్లు ఎదురయి ఆటంకపరిచారు. వీళ్ళు తిరగబడి అధికారులను కొట్టారు. అప్పటికి అధికారుల చేతిలో తుపాకులు లేవు కాబట్టి వాళ్ళు పారిపోయి మరుసటి రోజు పొద్దున్న తుపాకులు తీసుకుని బయలుదేరారు. వాళ్ళు కర్నూలు - గుంటూరు రహదారి మీదుగా ఆత్మకూరు దాటి కొంతదూరం వచ్చేసరికి మల్లయ్య బృందం బండ్లు రోడ్డుపక్కన కనబడ్డాయి. వెనక్కి తిప్పి ఆత్మకూరుకు పదండి అని అధికార్లు హెచ్చరించారు. మల్లయ్య 'మేము రాముపొ'మ్మన్నాడు. అంతే తప్ప ముందు రోజు లాగా దాడి చేయలేదు. అధికార్లకు అపాయం కలిగించలేదు. అయినప్పటికీ వాళ్ళు తుపాకులతో నేరుగా కాల్పులు జరిపారు. మల్లయ్య గాయపడి కిందపడి పోగా మిగిలినవాళ్ళు చెదిరిపోయారు. మల్లయ్యను అటవీ అధికారులు ఆత్మకూరుకు తెచ్చేసరికి చనిపోయాడు. దారిలో కత్తితో పొడిచి చంపారని బంధువుల ఆరోపణ. గమనించదగ్గ విషయం ఏమిటంటే అటవీశాఖ అధికారులు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు ఇచ్చిన రిపోర్టులో కూడా మల్లయ్య తమమీద ఈ దినం దాడి చేసి ప్రాణాపాయం కలిగించాడని చెప్పలేదు. నిన్న దాడి చేసాడనీ, ఈ దినం వెనక్కి తిరగడానికి నిరాకరించగానే కాల్పులు జరిపామనీ మాత్రమే అన్నారు. ముందురోజు ప్రాణాపాయం నిజంగానే కలిగిందనుకున్నా, ప్రాణాపాయం కలిగిన 24 గంటలకు 'ఆత్మరక్షణ' కోసం కాల్పులు జరపడం చాలా కొత్త విషయం. అయినా వాళ్ళ చర్య ప్రతీకారం తప్ప ఆత్మరక్షణ కాదని వాళ్ళ కథనమే చెప్తుంది. ముందురోజయినా, ఆ రోజయినా మల్లయ్య బృందం దగ్గర కొడవళ్ళు, గొడ్డళ్ళు తప్ప వేరే ఆయుధాలేమీ లేవనేది కూడా వాళ్ళ కథనం నుండే స్పష్టం అవుతుంది. మొదటి దినం వాళ్ళు చేసింది నేరమే. కానీ ఆ నేరానికి శిక్ష ఏమిటి? ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇస్తే పోలీసులు అరెస్టు చేయకపోదురా? ప్రతీకారచర్యగా కాల్చిపారేసి జీవోఎం.ఎస్. 182ను అడ్డం పెట్టుకోవడం క్షమించదగ్గ చర్యా?

రెండవ సంఘటన మరీ ఘోరమయినది. ఇదే సిద్ధాపురం సెటిల్‌మెంట్‌కు చెందిన తమ్మిశెట్టి చిట్టిబాబును 1992 ఆగస్ట్ 21వ తేదీన ఆత్మకూరు సమీపంలోని బైర్లూటి దగ్గర రేంజర్ రామయ్య కాల్చి చంపాడు. రామయ్య ఆత్మకూరు రేంజర్‌గా పదవి చేపట్టిన నాటి నుండి సిద్ధాపురం వడ్డెరలను లంచాల కోసం చాలా వేధిస్తున్నాడు. అంతకు ముందు ఉన్న రేంజర్ లంచాలు తీసుకొనేవాడు కాడనీ అందువల్ల ఇతనికి ఇవ్వడానికి తమకు ఇష్టం లేదనీ వడ్డెరలు అంటారు. వారిలో చిట్టిబాబు ఊరిలో ఒక పెద్దమనిషిగా ఈ విషయంలో గట్టిగా నిలబడ్డాడు. రామయ్య ఆ కోపం మనసులో పెట్టుకున్నాడు.

చిట్టిబాబుకు లేక లేక కొడుకు పుట్టగా అతను మొక్కు తీర్చుకోవడం కోసం ఆగస్ట్ 22వ తేదీన శ్రీశైలం పోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ ప్రాంతంలో ఉన్న ఆచారం ప్రకారం ముందురోజు బైర్లూటి సమీపంలోని ముర్తుజావలీ దర్గాకు పోయాడు. పోతుండగా దారిలోనే రేంజర్ రామయ్య ఇతనిపైన నేరుగా కాల్పులు జరిపాడు. అతనితో ఉన్నవాళ్ళు అతని గాయానికి ఆకులు కట్టి ఆత్మకూరుకు తీసుకుపోయారు కానీ ఆస్పత్రికి చేరుకునే లోపలే అతను చనిపోయాడు. రేంజర్ రామయ్య కథనం ఏదయినా తక్కిన వాళ్ళందరి కథనం ఒక్కటే. కాల్పులు జరిగినప్పుడు చిట్టిబాబు దొంగకట్టె తీసుకుపోవడం లేదు. దర్గాకు పోతున్నాడు. అతని చేతిలో ఏ రకమయిన ఆయుధం లేదు. కొబ్బరికాయ మట్టుకు ఉంది.

జీవో ఎం.ఎస్. 182 వారికి ఇన్ని రకాలుగా ఉపయోగపడుతున్నది.

పోలీసులు రేంజర్ రామయ్య మీద కేసు పెట్టలేదా అని మీరు అడుగుతారేమో. వాళ్ళకు పెట్టాలని ఉన్నా పెట్టడానికి వీలులేదు. జీవోఎం.ఎస్. 182 అనుబంధం సెక్షన్ 7 ఏమంటుందంటే కాల్పులు జరిపి హత్య చేసినందుకు గానీ గాయపరిచినందుకు గానీ పోలీసులు అటవీశాఖ అధికారులను అరెస్టు చేయడానికి వీలులేదు. కనీసం ప్రశ్నించడానికి కూడా వీలు లేదు. వాళ్ళు చంపేసి రిపోర్ట్ ఇస్తే దానిని తీసుకోవాలి. పంచనామా, శవపరీక్ష జరిపించాలి. అంతా అయినాక అన్ని రిపోర్టులూ కట్టగట్టి జిల్లా కలెక్టర్‌కు పంపించాలి. వారు ఆర్.డి.వో. చేత మెజిస్టీరియల్ విచారణ జరిపించాలి. ఆ విచారణలో కాల్పులు అనవసరంగా జరిపారని తేలితే అప్పుడు ఆ నివేదికను ప్రభుత్వం పరిశీలించిన పిదప సంబంధిత అటవీశాఖ అధికారిపైన కేసు పెట్టడం జరుగుతుంది. అయితే మెజిస్టీరియల్ విచారణ నివేదిక అధికారిని తప్పు పట్టినా సరిపోదు. అనుబంధం సెక్షన్ 10 ప్రకారం, నివేదికను పరిశీలించిన పిదప ప్రభుత్వం ఆ అభిప్రాయానికి రావాలి.

కాల్పులు అనవసరంగా జరిపారని మెజిస్టీరియల్ విచారణ నివేదిక నిర్ధారించినా, దానిని ప్రభుత్వం 'పరిశీలించే' క్రమంలో కాల్పులు సక్రమంగా జరిగాయని తేలవచ్చు. అప్పుడంతా సాఫీయే.

విధి నిర్వహణ పేరిట హత్యచేసినా ప్రభుత్వం అనుమతి లేకుండా కేసు పెట్టడానికి వీలు లేదనే సంరక్షణ ఇప్పటి దాకా సైనిక అధికారులకూ పోలీసులకూ ఉంది. ఇప్పుడు తుపాకులతో పాటు ఆ సంరక్షణ అటవీశాఖ అధికారులకు కూడా సంక్రమించింది. జీవించే హక్కుకు ఎటువంటి మినహాయింపులు ఉండడానికి వీలులేదని అంతర్జాతీయ మానవహక్కుల ఒడంబడికలు నిర్ద్వంద్వంగా అంటాయి. విధి నిర్వహణ పేరిట పోలీసులూ సైనికులూ హత్యలు చేస్తే అందరు పౌరులలాగా వాళ్ళను కూడా శిక్షించకుండా 'ప్రభుత్వం అనుమతి లేకుండా వారిపైన నేరవిచారణ జరగదు' అని సంరక్షణ కల్పించినంత కాలం పౌరుల జీవించే హక్కుకు పరిమితులు ఉన్నట్లే అవుతుంది. అందువల్లనే సాయుధ బలగాలకు చట్టంలో కల్పించిన ఈ సంరక్షణను తొలగించమని అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఆ పని చేయకపోగా ఇప్పుడు మరి కొందరు ప్రభుత్వ అధికారులను కొత్తగా సాయుధులను చేసి వాళ్ళకు కూడా మన రాష్ట్ర ప్రభుత్వం అదే సంరక్షణ కల్పించింది. అది కూడా రాష్ట్ర అసెంబ్లీకీ ప్రజలకూ పత్రికలకూ తెలియకుండా ఒక జీవో ద్వారా చేసింది.

'చట్టం నిర్దేశించిన పద్ధతిలో తప్ప ఇతరత్రా ఎవరి ప్రాణం తీయడానికి వీలు లేదు' అని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 అంటుంది. ఆ చట్టం న్యాయంగా, నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా ఉండాలి తప్ప ఎట్లపడితే అట్ల ఉండడానికి వీలులేదని 1978 తరువాత సుప్రీంకోర్టు చాలా తీర్పులలో చెప్పింది. మరి ఈ జీవోలో కొత్తగా ఇచ్చిన కాల్పులు జరిపే అధికారం న్యాయంగా, హేతుబద్ధంగా ఉందా? చేతిలో గొడ్డలి, నెత్తిమీద కట్టెమోపు పెట్టుకొని పోతున్న వ్యక్తిని ఆగమంటే ఆగకపోతే కాల్చిపారేయొచ్చుననడం న్యాయమైన అధికారమా? కట్టెమోపులు మోసుకుపోతున్న వాళ్ళు ఎక్కువ సంఖ్యలో ఉంటే ఒక్కడుగా ఉన్న అటవీ అధికారికి వారి వల్ల ప్రమాదం రాగలదు కాబట్టి ముందుగానే కాల్పులు జరిపి చంపవచ్చుననే అధికారం హేతుబద్ధమయినదా? అసలు చూడగానే వాళ్ళు 'నేరస్తులు' అని ఎట్లా తెలుస్తుంది? వాళ్ళ నెత్తిమీదున్నది ఎండుకట్టెల మోపు కాదనీ చట్ట విరుద్ధంగా పచ్చి కట్టె కొట్టి తీసుకుపోతున్నారనీ తెలుసుకునే దివ్యజ్ఞానం అటవీ అధికారులకు ఉందా?

జీవించే హక్కు భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు అయినప్పుడు దానిని తొలగించే అధికారాన్ని కట్టబెట్టే శాసనాన్ని జీవో రూపంలో జారీ చేయడం సబబేనా? ఆ రకంగా జీవో రూపంలో జారీ అయిన అధికారం రాజ్యాంగబద్ధమేనా? రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు విరుద్ధమయిన చట్టం ఏదీ చెల్లదని ఆర్టికల్ 13 అంటుంది. అటవీ అధికారులకు ఇచ్చిన ఈ కొత్త అధికారాన్ని బిల్లు రూపంలో అసెంబ్లీలో ప్రవేశపెడితే దానిని కనీసం ప్రభుత్వ న్యాయ నిపుణులు, ప్రభుత్వేతర నిపుణులు పరిశీలించి దానికి ఆర్టికల్ 13 వర్తిస్తుందో లేదో నిర్ణయించే అవకాశమైనా ఉండేది. ఆ అవకాశం లేకుండా జీవో రూపంలో జారీ చేసే పద్ధతే రాజ్యాంగ విరుద్ధం కాదా? ఆస్తినీ ప్రాణాన్నీ రక్షించడం కోసం, నేరాలను నిరోధించడం కోసం కాల్పులు జరిపే అధికారాన్ని పోలీసులకు బ్రిటిష్ హయాంలో రాసిన భారత శిక్షాస్మృతి ఆనాడే ఇచ్చింది. కానీ 130 ఏళ్ళ కింద రాసిన ఆ చట్టం ఏ నేరాన్ని నిరోధించడానికి ఎంత బలప్రయోగం చేయవచ్చునని కూడా చాలా వివరంగా నిర్దేశించింది. ఈ జీవోలో అటువంటిదేం లేదు. 'కాల్పులు జరపటం నేరాన్ని అరికట్టడానికే తప్ప ప్రాణం తీయడానికి కాదు' అని టోకుగా అన్నారు గానీ (అనుబంధం, III (5)) ప్రాణం పోవడానికి వీలు లేదని అనలేదు. తీసుకుపోతున్నది ఒక టేకు మొక్కయినా, ఒక హెక్టారు టేకు తోటయినా ఒకటే. తీసుకుపోతున్న వ్యక్తి తిండికి లేక ఒక మోపు దొంగిలిస్తున్న దరిద్రుడయినా ఎకరాలకు ఎకరాలు పట్టణాలకు తరలించే స్మగ్లరు ఏజెంటయినా ఒకటే. ఎవరి మీదయినా కాల్పులు జరపవచ్చు, వాళ్ళు చస్తే చావవచ్చు.

ఒక దశాబ్దం కంటె ముందు కేంద్ర ప్రభుత్వం ఒక కొత్త అడవుల చట్టం ముసాయిదాను రూపొందించింది. దానిలో అనేక అంశాలతో పాటు, స్మగ్లింగ్‌ను నిరోధించడానికి అటవీ శాఖకు పోలీసు అధికారాలు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా ఉండేది. ఆ చట్టం పట్ల దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక శక్తులలో చాలా వ్యతిరేకత వచ్చింది. చాలా నిరసన వ్యక్తమయింది. దాంతో దానికి తాత్కాలికంగా బ్రేకు పడింది. ఇప్పుడు మనవాళ్ళు ఏ చర్చలేకుండా, ఎవరికీ తెలియకుండా ఆ చట్టంలోని ఒక అంశాన్ని (అటవీశాఖకు పోలీసు అధికారాలు ఇవ్వడం) జీవోగా చేసి గప్‌చిప్‌గా వాడుకుంటున్నారు.

ప్రజల జీవన ప్రమాణాలు రోజు రోజుకు దిగజారుతున్నాయి. కరువు అనేది ఎప్పుడో ఎక్కడో వచ్చేది కాక ప్రతి సంవత్సరం కొన్ని కోట్ల జనాభాకు నిత్యజీవిత అనుభవం అయింది. ముందునుండి వర్షపాతం తక్కువగా ఉన్న

ప్రాంతాలే కాదు, పచ్చటి అడవులు కూడా కరువు వాతపడుతున్నాయి. మరొకవైపు ప్రకృతి వనరులను ప్రజల చేతి నుండి తీసివేసి పెత్తందార్ల చేతుల్లో పెట్టే రాజకీయ ఆర్థిక విధానం సాగుతూ ఉంది. అడవులు, కాలువలు, చెరువులు, మైదానాలు, తోపులు - అన్నిటి మీదా ప్రజలు హక్కులు కోల్పోతున్నారు. అన్నీ పెత్తందార్ల పాలవుతున్నాయి. దీని ఫలితంగా ప్రజల జీవితమే ఒక నేరమయిపోతున్నది. మరొకవైపు జీవించడం కోసం నేరాలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది.

నేరాన్ని గురించి, నేర నివారణ గురించి ఆలోచించేటప్పుడు ఈ విషయాన్ని మరిచిపోతే కష్టం. మరిచిపోయి ఆలోచిస్తే అటవీశాఖ చేతికి తుపాకులు ఇవ్వడం ఎందుకు తప్పో అర్థం కాదు. దొంగతనాలు ఒప్పించడానికి లాకప్పులో బందీలకు పోలీసులు రోకలిబండలు ఎక్కిస్తే అదెందుకు తప్పో అర్థం కాదు. ఇవ్వాళ పోలీసుల తుపాకీ అటవీ సిబ్బంది చేతిలోకి వచ్చింది. రేపు ఎక్సైజ్ సిబ్బందికి, విజిలెన్స్ సిబ్బందికి, ఆఖరుకు రెవెన్యూ సిబ్బందికి కూడా ఇస్తామంటే దానిని ఎందుకు వ్యతిరేకించాలో కూడా అర్థం కాదు.

*స్వేచ్ఛ మాస పత్రిక*
*జనవరి/ఫిబ్రవరి 1993*

# బందిపోటు దొంగలు - హక్కులు

బందిపోటు దొంగలకు కూడ హక్కులు ఉంటాయా? వాళ్ళ హక్కుల గురించి మాట్లాడే హక్కు ఇతరులకు ఉంటుందా? ప్రశ్నను ఈ రకంగా వేసుకుంటే జవాబును ఒక కోణం నుండి అన్వేషిస్తాము. బందిపోటు అంటే భారత శిక్షాస్మృతి డెకాయిటీ అనే నేరంగా నిర్వచించిన దానికి పాల్పడిన వ్యక్తి. ఆ నిర్వచనంలో సామాజిక అంశం లేదు. అయినా ఆ వ్యక్తికి కూడ హక్కులుంటాయా అనే ప్రశ్నకు జవాబు సార్వజనీనమైన హక్కుల పరిభాషలో చెప్పుకోవచ్చు.

కానీ నిజానికి బందిపోటు అనేది సామాజిక అంశం లేని విషయం కాదు. బహుశా ఎక్కడా కాదేమో. మన రాష్ట్రంలో అసలు కాదు. ఒక్కొక్క జిల్లాలో, ఒక్కొక్క ప్రాంతంలో బందిపోటు అనగానే కళ్లముందు మెదిలే రూపానికి ఒక కులం ఉంటుంది. కొన్ని చోట్ల ఆ రూపానిది వడ్డెర కులం, కొన్ని చోట్ల బోయ కులం, కొన్ని చోట్ల తెలగపాముల కులం, కొన్ని చోట్ల మరాఠీ మాట్లాడే పార్ధీ కులం.

అప్పుడు బందిపోటు దొంగలకు కూడ హక్కులుంటాయా? అనే ప్రశ్నకు అర్థం వేరే ఉంటుంది. మొదటి అర్థం పూర్తిగా పక్కకు పోదు, దాని సరసన ఇంకొక అర్థం కూడ వచ్చి చేరుతుంది.

ఇంకొక అర్థం కాదు, ఇంక రెండు అర్థాలు. ఒకటి, ఏ వనరుల మీదా హక్కులు లేకుండ చేసి కూలి చేసుకునో బస్సులు దోచుకునో బతకండి అని సమాజం ఒక మూలకు నెట్టేసిన వారిలో కొందరు

రెండవ ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుంటే, వారు 'బందిపోట్లు' కాబట్టి వాళ్లకు హక్కులుండవనడం ఏ రకమైన న్యాయం అనే జవాబుకు దారి తీస్తుంది.

బ్రిటిష్ హయాంలో కొన్ని కులాలను, తెగలను మొత్తంగానే నేర స్వభావం గల జాతులుగా ప్రకటించే చట్టం ఉండింది. నేర స్వభావం జన్యు లక్షణమని ఎంతటి మూర్ఖులూ అనరు కాబట్టి మొత్తంగానే ఒక కులాన్ని లేక తెగను నేరస్తులుగా ప్రకటించాలని పాలకులకు - ఎంతటి పరాయి పాలకులయినా కానియ్యండి - తోచిందంటే ఆ ప్రజలను ఆ స్థితికి నెట్టిన చారిత్రక క్రమం ఒకటి ఉండి ఉండాలి. యానాదులు, ఎరుకల గురించి వెన్నెలకంటి రాఘవయ్య వంటివారు ఒకనాడు చేసిన పరిశోధన తరువాత, దానికి కొనసాగింపుగా నయినా ఎవరైనా ఏమైనా చేసారో లేదో తెలీదు. ఇప్పటికి చేయకపోతే ఇక మీదట చేసే అవకాశమూ ఎక్కువ లేదు. ఎందుకంటే దొంగతనాలు - అందులోనూ చాలా క్రూరమైన డెకాయిటీలు - చేసేవారి పట్ల 'సెంటిమెంటల్‌గా' ఆలోచించే ఓపిక ఇప్పుడెవరికీ లేదు. కానీ ఎక్కువ పరిశోధన అవసరం లేకుండానే ఈ ప్రజల గురించి కొన్ని విషయాలు చెప్పవచ్చు. వీరికి భూమితో సహా ఏ సహజవనరుపైనా యాజమాన్య హక్కు ఎంత మాత్రం ఉండదు. చాతుర్వర్ణంలో అంటరాని వారు కాకపోయినప్పటికీ దళితులకంటే వీరినే దూరంగా ఉంచుతారు. వీరి ఆచారాలూ అలవాట్లూ చుట్టుపక్కల ఉన్న సమాజం కంటే భిన్నంగా ఉంటాయి. ఒక్కోసారి వేరే భాష కూడ మాట్లాడతారు. ఎవ్వరూ తినని లేక ఎన్నడో తినడం మానేసిన జంతువులను వేటాడి తింటారు.

ఈ ప్రజలలో మెజారిటీ ఎన్నడూ దొంగలయి ఉండే అవకాశం లేదు గానీ, మనం దొంగతనాలు చేస్తే పోలీసులూ లాయర్లూ బాగుపడతారు తప్ప దొంగతనాలు చేసి బాగుపడ్డ వాడెవడూ లేడని గ్రహించే కొద్దీ దొంగతనాలు చేసే వారి సంఖ్య తగ్గిపోతున్నది.

కానీ ఈ కులాలు లేక తెగలలో అందరినీ దొంగలుగా భావించి వేధించే 'నేరపరిశోధన' పద్ధతి పోలీసులు వదులుకోకపోవడం వల్ల సాధారణ జీవితం వీరికి సులభం కాదు. కూలీ చేసుకుంటే చేసుకోవచ్చును గానీ చిన్నాచితక వ్యాపారాలు చేసుకుంటామంటే నమ్మి సరుకులు అప్పు పెట్టేవాడెవడు? ఆరు నెలలకొకసారి రెండో నాలుగో వారాలు పోలీస్‌స్టేషన్‌లో గడిపి వచ్చే వాళ్లకు అడ్డామీద కూలీల బతుకు తప్ప ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి?

ఈ కులాలు, తెగల కోసం ప్రభుత్వం సంక్షేమ చట్టాలు, వ్యవస్థలు రూపొందించక పోలేదు. ఎటొచ్చీ అవి ఈ ప్రజల దగ్గరకు రాలేదు. ప్రకాశం,

నెల్లూరు (కొంతవరకు చిత్తూరు) జిల్లాలలోని మెట్ట ప్రాంతాలలో బతికే యానాదులనే ఉదాహరణగా తీసుకోవచ్చును. చట్టం వీరిని షెడ్యూల్డు తెగగా గుర్తించింది. వీరికి ఉద్యోగాలలోనూ విద్యాలయాలలోనూ రిజర్వేషన్లు కల్పించింది. ప్రత్యేక విద్యాలయాలు, హాస్టళ్లు, శిక్షణా కేంద్రాలు నెలకొల్పింది. సాంఘిక సంక్షేమ శాఖను అడిగితే ఇవన్నీ ఏకరవు పెడతారు.

కానీ వాళ్ల గ్రామాలకు పోయి చూస్తే వీటి ఛాయలు సహితం కనిపించవు. యానాదుల దగ్గరికి సాంఘిక సంక్షేమ శాఖ ఎన్నడూ పోదు. పోలీసులు మాత్రమే పోతారు. వాళ్లకు ఇళ్ళ స్థలాలున్నాయో లేదో కనుక్కోవడానికి రెవెన్యూ సిబ్బంది ఎన్నడూ పోరు. వాళ్ల ఇళ్లను సోదా చేయడానికి మాత్రం పోలీసులు పోతారు.

డ్యూటీ చేయడంలో ఏ ప్రభుత్వ శాఖకూ లేని ఉత్సాహం పోలీసు శాఖకు మాత్రం ఎక్కడి నుండి వచ్చిందా అని సందేహించవద్దు. పోలీసులు చేస్తున్నది డ్యూటీ కాదు. ఒక ఊరి దగ్గర నివసించే యానాదులను పట్టుకొని ఫలాన బస్సు దోపిడీలో నువ్వు దోచుకొని తెచ్చిన సొమ్ము మీ ఊరిలో ఏ రైతుకు అమ్మావో చెప్పు లేదా ఏ రైతు దగ్గర పెట్టావో చెప్పు - అని రోజుల తరబడి నిర్బంధించి వేధిస్తే ఏదో ఒక పేరు చెప్తారు. ఏ పేరు చెప్పాలో కూడ పోలీసులే చెప్తారు. ఆ తరువాత ఆ రైతు దగ్గర పోలీసులు ఆ మొత్తం వసూలు చేసుకొని పేరు చెప్పిన యానాది కులస్తుడి మీద కేసు పెట్టి రిమాండ్ చేయించి స్వామికార్యం, స్వకార్యం సంతృప్తిగా పూర్తి చేసుకుంటుంటారు.

వసూలు చేసుకోవడానికి ఏ రైతూ దొరకకపోయినా, యానాదులే రెండు మూడు వారాల నిర్బంధం గడచిన తరువాత రెండు వేలో మూడు వేలో తీసుకొచ్చి తమ స్వేచ్ఛను కొనుక్కోరా? కొనుక్కుంటారు. ఇటువంటి అవకాశాలున్నచోట ఒక్క పోలీసులేమి, ఏ ప్రభుత్వ శాఖ అయినా ఉత్సాహంగా డ్యూటీ చేస్తుంది.

కానీ ప్రజలను మొత్తంగానే నేరస్తులుగా చూసే సంస్కృతి పోలీసు వ్యవస్థలో మాత్రమే లేదు. అది సమాజంలో ఏదో ఒక మేరకు ఉండబట్టే పోలీసు వ్యవస్థలో అంతగా స్థిరపడగలిగింది.

దీనిని వాళ్ళు చాలా రకాలుగా అవకాశంగా తీసుకోవచ్చును. 'బందిపోటు' కులానికి చెందిన వ్యక్తి గ్రామ రాజకీయాలలోనో ఆర్థిక జీవితంలోనో మీకు ఎదురు తిరిగాడనుకోండి - అవకాశం చూసి అతని మీద ఒక బస్సు దోపిడీ కేసు పెట్టి నోరు మూయించవచ్చు.

నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలంలో కానిచెరువు అనే ఊరుంది. ఈ మండలంలోని 13 గ్రామాలలోని దాదాపు 300 యానాది కుటుంబాలు గడచిన

అయిదారేళ్లుగా పోలీసుల నుండి ఈ రకమైన వేధింపులు తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్నారు. అరెస్టు చేస్తే 30 నుండి 50 రోజులకు తక్కువ ఉంచుకోరు. ఊరూరా తిప్పి చావగొట్టి 'బస్సు కేసులు' ఒప్పిస్తారు. మగవాళ్లను పట్టియ్యమని వారి కుటుంబాల స్త్రీలను పట్టుకుపోయినట్టయితే వారి అగచాట్లు చెప్పతరం కాదు.

రెండు మూడేళ్ల కింద వరమ్మ అనే స్త్రీని నాలుగయిదు పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించి మూకుమ్మడిగా అత్యాచారం చేసిన ఘటన అప్పట్లో చాలా సంచలనం సృష్టించింది. విషయం బయటికొచ్చిన తరువాత జిల్లా కలెక్టరు ఆదరాబాదరాగా ఏదో విచారణ ప్రకటించాడుగానీ ఏమీ జరగలేదు.

ఈ గ్రామాలు ఉదయగిరి తాలూకాలోని సీతారాంపురం అడవుల అంచున ఉన్నాయి. ఇవి నల్లమల అడవులకు కొనసాగింపు. అయితే వర్షాభావ ప్రాంతం కావడం వల్ల అడవి దట్టంగా ఉండదు. చిన్న చిన్న కొండచరియల మీద చిట్టడవుల రూపంలో విస్తరించి ఉంటుంది. ఆ అడవులలో కుందేళ్లతో మొదలుపెట్టి అన్ని రకాల చిన్న జంతువులనూ వేటాడడం, కట్టె కొట్టి తీసుకొని ఊర్లలో అమ్ముకోవడం, బొగ్గు చేయడం, భూములున్న వాళ్ల పొలాలలో కూలీ చేయడం, ఇండ్లల్లో పాచి పని చేయడం, 'అదృష్టం' బాగున్నవాళ్లు హైదరాబాద్ దాకా పోయి బేల్దారిపని చేయడం - ఇదీ వారి జీవనాధారం.

ఆ ఊర్లలో స్కూళ్లు ఎక్కువ కనిపించవు. స్కూలు పిల్లల కోసం గిరిజన సంక్షేమ హాస్టళ్లు కనిపించవు. ప్రత్యేక వృత్తులలో శిక్షణ ఇచ్చే సంస్థలు లేవు. రిజర్వేషన్లు పొంది పెద్ద చదువులు చదువుకున్నవారూ లేరు.

ప్రభుత్వం నుండి ఈ ఊర్ల యానాదులకు వచ్చింది ఒక్కటే - ఇళ్ళ కాలనీలు. అయితే కానిచెరువు గ్రామంలో అందులోనూ మోసం జరిగింది. ప్రభుత్వం 11 ఇళ్ళు మంజూరు చేయగా యానాదులు ఏడు మాత్రమే కట్టుకున్నారు. మిగిలిన నాలుగిళ్లు గిరిజనేతర బి.సి కులాల వాళ్లు ఇళ్లు కట్టుకోకుండ కట్టినట్టు రాయించి డబ్బులు తిన్నారు.

ఆ ఊరికి చెందిన యానాది కులస్తుడు సవరం తిరుపాల్ ఈ 'స్కాం'ను బయటికి తీసాడు. గొడవ చేసాడు. కలెక్టర్‌కు అర్జీ పెట్టి, వివిధ సంఘాల వాళ్లకు చెప్పి పత్రికలలో రాయించి అల్లరి చేసాడు. దీని ఫలితంగా ప్రభుత్వం ఆ ఊరి గిరిజనేతరులు ఆరుగురిపైన క్రిమినల్ కేసుపెట్టి అరెస్టు చేసింది. ఒకరిద్దరు ఉద్యోగులపై చర్య తీసుకుంటున్నట్టు కూడ వినికిడి.

ఈ దుస్సాహసం ఫలితాన్ని తిరుపాల్ ఇప్పుడు అనుభవిస్తున్నాడు. ఆరు నెలల కిందనే వరికుంటపాడు ఎస్.ఐ. తిరుపాల్ ఇంటికొచ్చి అతని భార్య వెంకటమ్మతో 'నీ మొగుడి దగ్గర రెండు కేజీల బంగారం, నాలుగు లక్షల రొక్కం వసూలు చేస్తాను' అని బెదిరించాడు. మొన్నటి అయిదవ తేదీ రాత్రి ఉదయగిరి సి.ఐ గారి 'ఐడీ పార్టీ' పోలీసులు తిరుపాల్‌ను ఇంటి నుండి బలవంతంగా తీసుకుపోయారు. వరికుంటపాడు, ఉదయగిరి స్టేషన్ల మధ్య తిప్పుతూ 'బస్సు కేసులు' ఒప్పించడానికీ, వసూళ్ల కోసం ఎవరైనా రైతుల పేర్లు చెప్పించడానికీ చావగొడుతున్నట్టు వినికిడి.

'బందిపోట్ల'కు హక్కులు లేవందామా?

*ప్రజాతంత్ర వారపత్రిక*
*15 సెప్టెంబరు 2002*

# కరువు, కరువు పనులు, కరువు దాడులు

ఇరుగు పొరుగున ఉన్న నాలుగు మండలాలలో మినహాయింపు లేకుండ ప్రతీ ఒక్క ఇంటికీ తెల్లకార్డుందంటే నమ్ముతారా? తెల్లకార్డు ఉండడమంటే ప్రభుత్వం గుర్తించిన దారిద్ర్యరేఖకు దిగువన ఉండడం. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు డివిజన్‌లోని జైనూర్, నార్నూర్, సిర్‌పూర్ (యు), తిర్యాని మండలాలలో ప్రతీ ఇంటికీ తెల్లకార్డు ఉందని ఆయా మండలాల ఎం.ఆర్.వో.లే అంటున్నారు.

'ప్రతీ ఇంటికీ' అంటున్నామే తప్ప 'ప్రతి కుటుంబానికీ' అనడం లేదు. కార్డులు ఇచ్చిన నాడు కుటుంబాలనే గుర్తించి ఉండవచ్చును గానీ అవి ఇచ్చి ఎంతలేదన్నా 12 ఏళ్లు గడిచాయి. ఇచ్చిన తరువాత 'బోగస్ కార్డులను' ఏరి వేసారే తప్ప కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒక్కొక్క ఇంటికి కేటాయించిన బియ్యం కోటా పెంచలేదు. ఈ 12 ఏళ్లలో పిల్లలు పుట్టారు. అంతకు ముందు పిల్లలుగా ఉన్న వారు పెరిగి పెద్దవారయి వేరు పడ్డారు. పెళ్లి చేసుకొని పిల్లల్ని కన్నారు. కానీ ఆ ఇంటికిచ్చిన బియ్యం కోటా పెంచలేదు, పెరిగి పెద్దవారయి తామే కుటుంబ పెద్దలయిన వారికి కొత్త కార్డులు ఇయ్యలేదు. ఒకనాటి కుటుంబానికి ఇంటి నెంబర్ మాత్రమే చిహ్నంగా మిగిలింది. అందుకే కార్డు ఉన్నది ఇంటికే నంటున్నారు తప్ప కుటుంబానికి కాదు.

ఇక్కడి నేలలు నిన్న మొన్నటి దాకా దట్టమయిన అడవిని మోసిన ఎగుడు దిగుడు నేలలయినప్పటికీ చాలా సారవంతమయిన

నల్లరేగడి నేలలు. కొంచెం శ్రద్ధ పెట్టే పాలకులుంటే బంగారం పండించగలవు. కానీ ఇక్కడి జనం అత్యధికంగా ఆదివాసులు కావడం వల్ల వీరి విషయంలో శ్రద్ధ పెట్టవలసిన అగత్యం ఉన్నట్టు ఈ రాష్ట్రాన్ని ఏలిన ఏ పార్టీ భావించలేదు. నిజానికి ఇది ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ తాలూకాలకే కాదు మొత్తంగా ఆ జిల్లాకే వర్తిస్తుంది. ఆ జిల్లాలో బలమైన స్థానిక శూద్ర వ్యవసాయదారుల కులమేదీ లేదు. దేశంలో అటువంటి ప్రాంతాలేవీ గడచిన యాభై ఏళ్లలో వ్యవసాయ అభివృద్ధిని సాధించలేదు.

ఆదివాసీ ప్రాంతమయిన ఉట్నూర్ డివిజన్ పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉండడంలో ఆశ్చర్యపోవలసింది లేదు. ఆ ప్రజల కష్టాలను మొదట బయటపెట్టి అప్పటి నిజాం సర్కారు చేత కొన్ని సంస్కరణలు చేపట్టించిన ఘనత పాశ్చాత్య సామాజిక శాస్త్రవేత్త హెమెండార్ఫ్‌ది కాగా, తరువాతి తరంలో ఆ ప్రజల రాజకీయ చైతన్యానికి తన నమూనాలో నుంచి వారికొక గొంతునందిచ్చింది పీపుల్స్‌వార్.

1989లో కాబోలు ఈ రోజు వచ్చినట్టే తీవ్రమైన కరువు వచ్చింది. ఉట్నూర్ డివిజన్‌లోని ఆదివాసులు తీవ్రమైన ఆకలికీ అనారోగ్యానికీ గురయ్యారు. పీపుల్స్‌వార్ దళాల ప్రోత్సాహంతో తిర్యాని, సిర్పూర్ (యు), జైనూర్ మండలాల ఆదివాసులు తూర్పు వైపు గుట్టలు దిగి దంతేపల్లి షావుకార్లపైన దాడి చేసి ధాన్యం, విత్తనాలు తీసుకుపోయారు. అప్పట్లో పోలీసులు వంద మందికి పైగా ఆదివాసుల్ని 'టాడా' కింద అరెస్టు చేసారు. ఆ కేసు కిందటి సంవత్సరం దాకా (అంటే ఒక దశాబ్దం పైగా) నడిచి చివరికి అందరూ నిర్దోషులుగా ప్రకటించబడ్డారు. కానీ కేవలం జైలు నిర్బంధం, కోర్టు కేసుల కారణంగా ముద్దాయిలయిన ఆ ఆదివాసులు అనుభవించిన ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

ఇది నక్సలైట్ ఉద్యమం ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగిన మొదటి కరువు దాడి. ఆనాడు పోలీసులు దానిని నేరం అని ఉండవచ్చు. టెర్రరిస్టు నేరమనీ అని ఉండవచ్చు. కానీ స్థానిక ప్రజలలో - ఆదివాసీయేతరులలో సహితం - ఆ కరువు దాడి పట్ల వ్యతిరేకత రాలేదు. దంతేపల్లి షావుకార్లకు ఎవరూ సానుభూతి చూపించలేదు.

ఆ తరువాత కూడ కరువులొచ్చాయి. ఇక్కడా అక్కడా కరువు దాడులూ జరిగాయి. కానీ వాటిలో ప్రజా బాహుళ్యం భాగస్వామ్యం కంటే దళ సభ్యులు, మిలిటెంట్ల భాగస్వామ్యం ఎక్కువ ఉండింది. 1995-96 సంవత్సరాలలో కరీంనగర్ జిల్లా కాటారం ప్రాంతంలో ఒక కొత్త ఒరవడి మొదలయింది. ఒక ఊరిలో జరిగే

కరువు దాడిలో ఆ ఊరి ప్రజలు పాల్గొనరు. చుట్టుపక్కల ఊర్ల ప్రజలు పాల్గొంటారు. అంతేకాక కరువు దాడిలో ధాన్యం గింజలే కాక డబ్బు, బట్టలు, బంగారం, రేడియోలు ఇత్యాది కూడా ఎత్తుకుపోవడం, తీసుకుపోని వస్తువుల్ని ధ్వంసం చేయడం మొదలయింది.

ఈ సంవత్సరం ఉత్తర తెలంగాణ వెలుపల జరిగిన కరువు దాడులలో ఈ లక్షణాలన్నీ పునరావృతమయ్యాయి. పుస్తెల తాళ్లు తెంపడం గురించి రాద్ధాంతం చాలా జరిగింది గానీ (దాని బదులు) ఒక రాజకీయ పార్టీ నిర్వహించే కరువు దాడులలో ప్రజలకు ఇయ్యవలసిన మార్గదర్శకత్వం గురించి కొంచెం ఎక్కువ చర్చ జరిగి ఉంటే బాగుండేది. పుస్తెలకే విమర్శ పరిమితం కావడం వల్ల దబాయించి నోరు మూయించే అవకాశం పీపుల్స్‌వార్ నాయకత్వానికి లభించింది.

ఉట్నూర్‌కు తిరిగివద్దాం. ఈ సారి ఉట్నూర్‌లోనే కాదు, ఉత్తర తెలంగాణలో ఎక్కడా కూడా నక్సలైట్ల ఆధ్వర్యంలో గానీ ఇతరత్రా గానీ కరువు పీడిత ప్రజలు కరువు దాడులు చేయలేదు. కరువు లేక కాదు, ఆకలి లేక కాదు, దోచుకోవడానికి షావుకార్లు లేకా కాదు. నిజానికి విప్లవ కమ్యూనిస్టు పార్టీల ప్రచారం కారణంగా పోరాడే జిల్లాగా పేరు పొందిన ఆదిలాబాద్ జిల్లా ప్రజాజీవిత సంస్కృతిలో స్వతహాగా మిలిటెన్సీ చాలా తక్కువ. ఆదివాసీలయినా, ఇతరులయినా వారి జీవన సంస్కృతి నెమ్మదయినది. ఇది మంచిదా చెడ్డదా అనే విషయంలో అభిప్రాయ భేదాలకు తావు ఉంటుంది గానీ, ఇది మాత్రం వాస్తవం.

ఏమయితేనేం, ఉట్నూర్ ఆదివాసులు అల్లరికి దిగకుండ ప్రభుత్వం ఇచ్చిన నాలుగు బియ్యం గింజలు వండుకొని తింటున్నారు. గింజలు దొరకని నాడు పస్తులుంటున్నారు. కరువు జన్మభూమి అనీ, గ్రామసభలనీ ప్రజలను పదే పదే సమీకరించి మీలో ఎంతమందికి పనులు కల్పించాలో, ఎంతమందికి ఉచిత బియ్యం ఇయ్యాలో తేల్చండని చెపుతున్న ప్రభుత్వం ఇప్పటి దాకా చేసింది చాలా స్వల్పం. కరువు జన్మభూమిలో నమోదు చేసుకున్న వారి సంఖ్యను బట్టి లెక్కగడితే ఎన్ని దినాల పని ప్రభుత్వం కల్పించవలసి ఉండిందో అందులో సగటున 7 లేక 8 శాతం మాత్రమే 'పనికి ఆహారం' పథకం కింద కల్పించింది. కిలో 3 రూపాయలకు ఇచ్చే చవక బియ్యం (దీనికి 'అంత్యోదయ అన్న యోజన' అని పేరు) దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఈ ప్రజలలో నూటికి పది మందికే ఇస్తున్నారు. ఉచితంగా ఇచ్చే 'అన్నపూర్ణ' బియ్యం నూటికి ఒకరికే ఇస్తున్నారు.

అవసరానికి ఎంత మాత్రం సరితూగని ఈ సంక్షేమం అట్లాగుంచి ఆదివాసీ ప్రజలే అనేదేమిటంటే, మాకు నికరమైన ఉపాధి కల్పిస్తే ఇవి అవసరమే ఉండవు కదా అని. అంటే పొలాలకు సాగు నీరు, యువతకు ఫ్యాక్టరీలలోనో వేరొక చోటనో ఉద్యోగాలు కల్పించమంటున్నారు. సాగునీటి వ్యవస్థను పెంపొందించడానికి ఉట్నూరు పీఠభూమి పైన ఉన్న ఎగుడు దిగుడు నేలలలో అవకాశం పుష్కలంగా ఉంది. ఏ గ్రామానికి పోయినా తమ పొరుగున ఉన్న ఒక వాగు గురించో, ఒక వంక గురించో, దానిపైన కట్టగల ఆనకట్ట గురించో చెప్తారు. పదే పదే జరిగే 'జన్మభూముల' పైన పెట్టే ఖర్చు వీటిపైన పెడితే ఈ పొలాలకు సాగునీరు లభిస్తుంది కదా, అప్పుడు వర్షాభావం ఉన్న సంవత్సరాలలో సహితం తినడానికి ఇంత ఉంటుంది కదా అంటారు. ఐటిడిఏ స్కూళ్ల పుణ్యాన అంతో ఇంతో చదువుకుంటున్న ఆదివాసీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే 'పనికి బియ్యం' పథకం కోసం ఎదురుచూడరు కదా అంటారు. ఈ మాటలు వినడానికి మన రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. పోనీ తాను ఆర్భాటంగా ప్రకటించుకునే కరువు సహాయ పథకాలనయినా సమగ్రంగా అమలు చేస్తుందా అంటే పది శాతం కూడ చేయదు. మరి ప్రజల గతి ఏం కావాలి?

*ప్రజాతంత్ర వారపత్రిక*
*19 మే 2003*

# వాకపల్లి : ఒక పరామర్శ

వాకపల్లి అత్యాచారం ఉదంతం అనేక రకాలుగా బాధాకరం. ఘటన సరే, దాని తరువాత జరిగిన ఒక్కొక్క విషయమూ ఆందోళన కలిగించేదే. ఒకటి అప్పుడే పలువురి నిరసన ప్రకటనలకు దారి తీసింది. అది డిజిపి, హోంమంత్రి ఏ విచారణా జరపకుండా 'ఇది మావోయిస్టులను కాపాడడానికి కల్పించిన కథ' అని ప్రకటించడం. బాధితురాళ్ళు ఆదివాసులు కాక వేరే ఎవరై ఉన్నా అంత లేమిగా మాట్లాడి ఉందురా అని చాలామంది ఆ రోజు ప్రశ్నించారు. ఈ ప్రశ్న మొత్తం ఉదంతానికి వర్తిస్తుంది. వాళ్ళు ఆదివాసీ మహిళలు కాకపోతే వారిచ్చిన ఎఫ్ఐఆర్ నమోదు చేసి కూడా ఇన్నాళ్ళు కనీస విచారణ జరపకుండా ఉందురా? కనీసం బాధితురాళ్ళ వాంగ్మూలాలు నమోదు చేసుకోకుండా ఉందురా? హైకోర్టు వేరే ఏ ఆదేశం కాకున్నా ఈ మేరకు నేరపరిశోధన జరిపి పోలీసులు తమ డ్యూటీ నిర్వహించాలని వెనువెంటనే ఆదేశించకుండా ఉండునా? రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఇంతే నిశ్చేష్టంగా ఉండునా?

పోలీసులు చేసే నేరాలు వేరు, పౌరులు చేసే నేరాలు వేరు అనే వైఖరికి భారత రాజ్యాంగంలో ఎక్కడా చోటు లేదు. అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలలోనూ లేదు. కానీ పోలీసు యంత్రాంగంలోనూ, న్యాయవ్యవస్థలోనూ ఈ వైఖరి క్రమంగా స్థిరపడిపోతున్నది. పాలనా యంత్రాంగం విషయంలో ఆశ్చర్య

పోయేదేమీ లేదుగానీ న్యాయవ్యవస్థ ఈ వైఖరి అవలంబించడం ఆశ్చర్యం కలిగించే విషయం కాకున్నా ఆందోళన కలిగించే విషయం. వేరే వాళ్ళమీద నేర అభియోగాలు వస్తే కేసు నమోదు చేసి నేరపరిశోధన జరుపుతారు కానీ పోలీసుల మీద కేసు పెట్టాలంటే మాత్రం వాళ్ల మీద వచ్చిన అభియోగాలు తిరుగులేనంత బలంగా ఉండాలి. స్వతంత్రమైన సాక్ష్యాలూ మెడికల్ రిపోర్టులూ వగైరా ఉండాలి. ఆపైన హైకోర్టులోనో, సుప్రీంకోర్టులోనో బాధితులు కేసు వేసి ఇవన్నీ చూపించాలి. వారు అన్నీ పరిశీలించి వెనకా ముందూ ఆలోచించి 'కేసు నమోదు చేయండి' అని ఆదేశించాలి. కేసు అప్పుడు నమోదవుతుంది. బాధితులు అంత శ్రమ తీసుకోకపోతే కేసు ఉండదు.

ఆదివాసులు అంత శ్రమ తీసుకోలేరు. అయినా నేరానికి ఆధారాలు నేరపరిశోధనలో తేలాలి. దానికి కావలసిన నైపుణ్యం నేరపరిశోధకులకు తర్ఫీదులో ఇస్తారు. బాధితులు తాము చూసిందీ, అనుభవించిందీ మాత్రమే చెప్పగలరు. దాని ఆధారంగా కేసు కట్టి నిపుణులయిన వారు నిజాయితీగా నేరపరిశోధన చేసి ఆధారాలు సేకరిస్తారని నేరస్మృతి భావిస్తుంది. అంతే తప్ప బాధితులే నేరపరిశోధన జరిపి నేరం నిజంగానే జరిగిందనీ ఫలానా వాళ్ళు చేశారనీ సగం రుజువు చేసినట్లయితేనే తర్ఫీదు పొందిన పరిశోధకులు రంగంలోకి దిగుతారనేది చట్టమూ కాదు, న్యాయమూ కాదు.

పైగా - నైపుణ్యం సంగతీ, తర్ఫీదు సంగతీ అట్లా ఉంచి వాకపల్లి నేరానికి బాధ్యులయిన వారెవరో గ్రేహౌండ్స్ అధికారులకు తెలుసు. వారికి మాత్రమే తెలుసు. ఎందుకంటే గ్రేహౌండ్స్ సిబ్బంది పేర్లూ, వారికి డ్యూటీ వేసిన ఊర్లూ వేరెవరికీ తెలీవు. ఏదైనా ఒక సమాచారం ఒకరికి మాత్రమే అందుబాట్లో ఉంటే దానిని ఉపయోగించుకొనే బాధ్యత ఎవరికైనా ఉంటుందనేది కామన్‌సెన్స్ దృక్పథమేకాక భారత సాక్ష్యాల చట్టంలోని నియమం కూడా. కాబట్టి ఆ ఉదయం వాకపల్లి వైపు పోయిందెవరు అన్నది విశాఖ ఏజెన్సీలోని గ్రేహౌండ్స్ బలగాల అధినేత ప్రకటించాలి. అది వారి బాధ్యత. ప్రకటించిన తరువాత వారినందరినీ వాకపల్లి బాధితురాళ్ళ ముందు ప్రవేశపెట్టాలి. వారు ఎవరెవరిని గుర్తుపడతారో ఆ సిబ్బందిని పోలీసులు దోషులుగా ప్రాథమికంగా గుర్తించి నేరపరిశోధన కొనసాగాలి. తమ వారి తోలు కాపాడే కర్తవ్యం మీద వేసుకున్న పోలీసు పెద్దలకివన్నీ తోచకపోవచ్చును గానీ హైకోర్టుకూ రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కూ తోచకపోవడాన్ని ఏమనాలి? ఆ సంస్థలకు చట్టం తెలియకపోలేదు. మరి ఎందుకు ఆలోచన చేయలేదనుకోవాలి?

ఎందుకు తదనుగుణమైన ఆదేశం ఇవ్వలేదను కోవాలి? కోందు గిరిజనులే కదా, వెంటనే కేసు కట్టకపోతే ఏం మునిగి పోయిందిలే అన్న వైఖరే కారణమా?

తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీమంత్రులు రాష్ట్రమంతటా చేస్తున్న వీరంగం చూస్తున్నాం. పోలీసులు వాళ్ళనప్పుడప్పుడు అటకాయించినా, అరెస్టు చేసినా మర్యాద తప్పడం లేదు. ఎప్పుడయినా కొంచెం తప్పినా చంద్రబాబు నాయుడు, వారి అభిమానులయినవారు నానాయాగీ చేస్తుండటం చూస్తున్నాం. మరి పాడేరు ఏజెన్సీలో తెలుగుదేశంకు చెందిన మాజీమంత్రి మణికుమారి వాకపల్లి బాధితులకు మద్దతుగా ఉన్నందుకు కాల్చేస్తామని బెదిరించిన సంగతి మీరెవ్వరయినా ఎక్కడైనా చదివారా? టీవీల్లో చూశారా? చదివి ఉండరు, చూసి ఉండరు. నాయకురాలయినా, మాజీమంత్రి అయినా, ఆదివాసీయే కదా ఆమె కూడా?

మావోయిస్టులకు మేలు చేయడానికి ఆ స్త్రీలు అబద్ధపు ఆరోపణ చేసారని నమ్మేందుకు సిద్ధంగా ఉన్నవాళ్లు సమాజంలో లేకపోలేదు. అయితే వేరే ఎవరి మేలు కోసమో తాము లైంగిక అత్యాచారానికి గురయ్యామన్న నిందవేస్తే వారికొచ్చే కష్టాలేమిటో పత్రికలలో అందరూ చదివారు. వారి భర్తలు వారిని కొంతకాలం వెలి వేసి సంప్రదాయం ప్రకారం జరగవలసిన తంతు జరిగిన తరువాతే ఇంట్లోకి రానిచ్చారు. ఒకవేళ రేప్ ఆరోపణ నాటకమైతే వారి భర్తల చర్య కూడ నాటకమే అయి ఉండాలి. ఆదివాసీ తెగలలో అతి వెనుకబడిన తెగ వారైన కోందులు మావోయిస్టుల మేలు కోసం ఇంత పెద్ద నాటకం ఆడుతున్నారని నమ్మగలమా? ఈ స్క్రిప్టు ఎవరు రాసారనీ, దర్శకత్వం ఎవరు నెరపారనీ అనుకోవాలి?

ప్రభుత్వం వైఖరిలో ఏ కదలికా రాకపోయేసరికి చివరికి ఆ పదకొండు మంది స్త్రీలు పాడేరులో ఆమరణ నిరాహారదీక్షకు కూర్చున్నారు. నాటకం చాలా దూరం పోయినట్టే మరి. వారిపైన అత్యాచారం చేసినవారు సురక్షితంగా, కనీసం పేర్లు కూడా బయటకు పొక్కకుండా ఉండిపోగా, బాధితురాళ్లు తిండి మానుకుని నిరసన దీక్షకు కూర్చున్నారు. అయినప్పటికీ జిల్లా కలెక్టరుతో సహా ఏ అధికారీ వారి దగ్గరకు పోలేదు, వారిని పలకరించలేదు. విచిత్రం ఏమిటంటే భూతలం మీదనున్న అన్ని విషయాల గురించీ ఆందోళన చేస్తున్న సిపిఐ(ఎం) వారు వాకపల్లి ఆందోళన నుండి నెమ్మదిగా నిష్క్రమించారు. తెలుగుదేశం వారు కనిపించీ కనిపించకుండా పాల్గొంటున్నారు. దళిత సంఘాలన్నీ మిన్నకున్నాయి. ఆదివాసీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని పేరుబడ్డ స్వచ్ఛంద సంస్థలేవీ ఆ దాపులకు రావడం లేదు.

ఒక సామాజిక వర్గానికి జరిగితే అన్యాయం, వేరొకరికి జరిగితే వార్త మాత్రమేననేది సంకుచిత వైఖరి. సామాజిక వర్గాలుగా చీలిపోయి ఎవరి న్యాయం కోసం వారు పోరాడుకుంటున్న రాజకీయ వాతావరణం దీనికి దారితీసింది. ఆ 'పోరాటాలు' విజయవంతం కావడానికి వైఎస్ ప్రాపకం అవసరం అనుకుంటున్న వారు కొన్నాళ్లు పోయాక వాకపల్లి బాధితులనే తప్పుపట్టినా ఆశ్చర్యపోలేము. ముదిగొండ కాల్పుల తరువాత బియస్పీ, మాలమహానాడు, మాదిగ దండోరాలు సిపిఐ(ఎం)నే ఎక్కువ తప్పుపట్టడం చూడలేదా!

వాకపల్లి ఆందోళన ఉధృతమయ్యే కొద్దీ పాడేరు ఎమ్మెల్యే రాజారావుకే ప్రయోజనం ఎక్కువ అనే కుళ్లుబోతుతనం కొన్ని పార్టీలు మౌనంగా ఉండడానికి కారణమా? ఈ సందేహం నిజమైతే అది చాలా బాధాకరం. అయితే ఈ రకమైన కుళ్ళుబోతుతనానికి లోబడ్డవారు గుర్తించవలసిన సత్యం ఒకటుంది. లకే రాజారావు ఆందోళనకారుడిగానే ఎమ్మెల్యే అయ్యాడు. అతని దగ్గర పైసలు లేవు. బలమైన పార్టీ లేదు, కండ బలం లేదు. ఆదివాసీగా పుట్టి ఆదివాసుల మేలుకోసం శ్రమించి ఎమ్మెల్యే అయ్యాడు. ఆ మార్గంలో అతనిని ఓడించడం నిజమైన రాజకీయ స్పర్ధ అవుతుందిగానీ, కుళ్లుబోతుతనంతో ఉద్యమాలను దెబ్బతీసేది విధ్వంసక రాజకీయం అవుతుంది.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*29 సెప్టెంబర్ 2007*

# వాకపల్లి - కోర్టులు

హైకోర్టు నుంచి ఏదో ఒక ఆర్డర్ వస్తుంది; దోషులను అరెస్టు చేస్తారు; నేర పరిశోధన, నేర విచారణ జరుగుతాయి అన్న ఒక అభిప్రాయం ఉండింది ఇన్నాళ్లూ. కాని హైకోర్టు చాలా విచిత్రంగా, ఆశ్చర్యంగా వాకపల్లిలో ఏమైనా జరిగిందో లేదో మేము చెప్పలేకపోతున్నాం కాబట్టి కేసు మూసేస్తున్నాము అని కేసు మూసేయడంతో సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. నేరం జరగలేదు అని మేము అనుకుంటున్నాము కాబట్టి మూసేస్తున్నాము అంటే అది అబద్ధమైనా అది ఒక తీర్పు అనుకోవచ్చు. కాని హైకోర్టు నేరం జరగలేదు అని చెప్పలేదు. జరిగిందనీ చెప్పలేదు. మాకు అర్థం కావడం లేదు కాబట్టి కేసు మూసేస్తున్నాము అనేది న్యాయస్థానాల పాత్ర గురించి తెలిసిన వాళ్ళకి ఎవరికైనా చాలా ఆశ్చర్యమూ, బాధా, ఆవేదనా కలిగించే టటువంటి విషయం.

అయినా హైకోర్టును ఎవరడిగారు నేరం జరిగిందా లేదా నువ్వు చెప్పు అని. హైకోర్టు డ్యూటీ ఏమిటి? అన్ని వ్యవస్థలూ సక్రమంగా పని చేసేటట్లు చూడటమే హైకోర్టు చేయాల్సిన పని. ఒక నేరం జరిగినప్పుడు పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చెయ్యాలి, చార్జిషీటు వెయ్యాలి - అది వాళ్ళ డ్యూటీ. డాక్టర్లు, వైద్యులు సక్రమంగా వైద్య పరీక్షలు జరపాలి, ఆ రిపోర్టు ఇవ్వాలి - అది వాళ్ళ డ్యూటీ. ఈ లోపున మేజిస్ట్రేటు కోర్టు దోషులకు రిమాండ్

ఇచ్చి, వాళ్ళు తప్పించుకొని పారిపోకుండా, నేరపరిశోధనకు అందుబాటులో ఉండేటట్లు చూడాలి - అది కింది కోర్టు డ్యూటీ. ఎస్.సి, ఎస్.టి కేసు కాబట్టి ప్రభుత్వమే 1989లో జారీ చేసిన జీవో ప్రకారం బాధితురాళ్ళకు తక్షణం కొంత ఆర్థిక సహాయం ఇచ్చి, చార్జిషీటు వేసిన తరువాత మరికొంత ఇచ్చి, వాళ్ళుగానీ పునరావాసం కోరుకుంటే పునరావాసం ఇవ్వాలి - అది ప్రభుత్వం డ్యూటీ. వీళ్ళందరూ వీళ్ళ వీళ్ళ డ్యూటీలు సక్రమంగా చేసేటట్లు చూడటమే హైకోర్టు డ్యూటీ. రాజ్యాంగంలో దాని పాత్రే అది.

హైకోర్టును మనం అడిగింది తమ విధి నిర్వహణను పోలీసులు చెయ్యడం లేదు - చెయ్యించండి వాళ్ళ చేత అని; తన విధి నిర్వహణను ప్రభుత్వం చెయ్యడం లేదు - చెయ్యించండి దాని చేత అని. అత్యాచారం జరిగింది అని పదకొండు మంది మహిళలు ఫిర్యాదు చేసినప్పుడు, ఏ ఏ వ్యవస్థలు ఆ ఫిర్యాదు మీద ఏమేమి చెయ్యాలో వాళ్ళెవ్వరూ అవేమీ చెయ్యలేదు. అంతా పడుకొన్నారు, నిద్రపోతున్నారు, నేరాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్ళ చేత చట్టం వాళ్ళకు నిర్దేశించినటువంటి బాధ్యతలను నిర్వర్తింపచెయ్యండి అని హైకోర్టుకు పోతే హైకోర్టు కూడా తన డ్యూటీ మర్చిపోయింది. తను ఎందుకోసం ఉందో హైకోర్టు కూడా మర్చిపోయింది.

హైకోర్టు కేసు తీసుకున్న వెంటనే ఏం చెప్పాలి? చాలాసార్లు అన్నాం ఈ మాట - మీరూ అన్నారు, మేమూ మొదటి నుంచీ అంటూనే ఉన్నాం - ఆ రోజు కూంబింగ్‌కు పోయిన పోలీసులు ఎవరు? వాళ్ళ పేర్లు బయట పెట్టాలి అని హైకోర్టు ఆదేశించాలి అని అడిగాం. ఆ పని హైకోర్టు చెయ్యలేదు. వాళ్ళ పేర్లు ఎవరికి తెలుస్తాయి? మనకు తెలియదు. బాధితురాళ్ళకూ తెలియదు కదా. మరి తెలిసింది ఎవరికి? పోలీసులకే కదా. పోలీసులకు హైకోర్టు ఆదేశం ఇచ్చి వాళ్ళ పేర్లు బయటపెట్టు, ఎఫ్.ఐ.ఆర్.లో వాళ్ల పేర్లు రాయి, రిమాండ్‌కు పంపు అనొచ్చు కదా! వేరే ఎవరైనా రేప్ చేసినా, మర్డర్ చేసినా, నేరం చేసినా ఏం జరుగుతుంది? అరెస్టు చేస్తారు, రిమాండ్ చేస్తారు. ఆ పనే చెయ్యాలి మీరు అని హైకోర్టు పోలీసు ఎస్.పిని గానీ, గ్రేహౌండ్స్ ఎస్.పిని గానీ ఆదేశించవలసి ఉండింది. ఆ పని హైకోర్టు చెయ్యలేదు. వెంటనే బాధితురాళ్ళ వాంగ్మూలాలు నమోదు చెయ్యి అని ఆదేశం ఇయ్యవలసి ఉండింది. ఆ పని హైకోర్టు చెయ్యలేదు. మొట్టమొదట జరగవలసింది ఒక ఫిర్యాదు చేసినప్పుడు - ఫిర్యాదు చేసినవాడు, సాక్షులు, బాధితులు వాళ్ళందరి వాంగ్మూలాలూ నమోదు చెయ్యాలి. వాళ్ళు విషయం మర్చిపోయే లోపల, వాళ్ళు భయపడిపోయే లోపల, వాళ్ళు బెదిరిపోయే లోపల,

వాళ్ళను బెదిరించే లోపల, వాళ్ళను ఇంకొక రకంగా నోరు మూయించే లోపల త్వరత్వరగా వాళ్ళ వాంగ్మూలాలు నమోదు చెయ్యాలి. పోలీసులు చెయ్యలేదు. ఆ పని చెయ్యమనే ఆదేశము హైకోర్టూ ఇవ్వలేదు. హైకోర్టు ఏం చేస్తూ వచ్చిందంటే వీళ్ళ ఫిర్యాదు నిజమా కాదా అని తాను పరిశీలించడం మొదలుబెట్టింది. తన డ్యూటీ అది కాదు. విచిత్రంగా బాధితురాళ్లు దోషులయి కూర్చున్నారు. దోషులు స్వేచ్ఛగా ఉన్నారు. నేరం చేసినోడు స్వేచ్ఛగా ఉన్నాడు. నేరానికి గురయిన వాళ్ళు దోషులయ్యారు. నిజమైన ఫిర్యాదా, అబద్ధమైన ఫిర్యాదా అని పరిశీలించడం మొదలుపెట్టింది. అన్ని ఫిర్యాదులూ అట్లే చేస్తారా? ఆదివాసుల మీద అడవిలో చెట్లు నరికారని కేసు పెడతారు. పోడు కొట్టారని కేసు పెడతారు. దోషులు ఆదివాసులా, ఫారెస్టు వాళ్ళా? ఆదివాసులే అవుతారు కాని ఫారెస్టు వాళ్ళు కారు కదా. ఫారెస్టు వాళ్ళు సక్రమంగా కేసు పెట్టారా అని పరిశోధన చేస్తారా ఎవరైనా? ఆ ఆదివాసుల మీదే కేసు పెడతారు. జైలుకు పంపిస్తారు. నేర విచారణ ఏదో జరుగుతుంది. సరిగ్గా చేశారా లేదా అనేది కోర్టు నిర్ణయిస్తుంది. ఇదీ ఎక్కడైనా జరిగేది.

కాని మొదలుపెట్టడం పెట్టడమే ఇచ్చిన ఫిర్యాదు రైటా కాదా అనేది కోర్టు పరిశీలన చేయడం చాలా అన్యాయమైన వైఖరి. పదే పదే అంటూ వచ్చాం - ఆదివాసులు కాకపోతే, ఆదివాసీ మహిళలు కాకపోతే ఇలా జరిగేది కాదని. వేరే ఎవ్వరయినా ఈ రకమైనటువంటి ఫిర్యాదు చేస్తే సీరియస్‌గా తీసుకునే వాళ్ళు. అరెస్టులు చేసేవాళ్ళు. కేసు పెట్టేవాళ్ళు. నేర విచారణ జరిగేది. ఇంత నిర్లక్ష్యం, ఇంత లోకువ ఎందుకూ అంటే ఆదివాసులు కాబట్టి, ఆదివాసీ మహిళలు కాబట్టి, ఏజెన్సీలో బతికే అమాయకులు కాబట్టి. ఆ లోకువ, ఆ నిర్లక్ష్యం ఎస్.ఐకు ఉంటే దుర్మార్గుడు అనుకుంటాం. పోలీసు వ్యవస్థ సంస్కృతే అట్లా ఉంది అనుకుంటాం. ఇతర అధికారులకు ఉంటే పాలనా వ్యవస్థ సంస్కృతి అట్లా ఉంది అనుకుంటాం. న్యాయస్థానం వైఖరే అట్లా ఉంటే ఏం చేయాలి? రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వైఖరీ అదే రకంగా ఉంటే ఏం చేయాలి? అప్పుడు ఏమనుకోవాలి... మొత్తం సమాజమే ఇట్లా ఉందని అనుకోవాలి. వాళ్ల దృష్టిలో మనుషులందరి విలువా ఒక్కటి కాదు. బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పూలమాల వేశాం ఇప్పుడే. ఆయన పదే పదే అన్నాడు - మనుషులందరికీ ఒకే విలువ ఉండే సమాజం కావాలి మనకు అని. అందరికీ తిండి కావాలి, అందరికీ బట్టలు కావాలి, అందరికీ పనులు కావాలి - అవన్నీ జరగాలంటే వాటి మూలం అందరికీ

ఒకే విలువ ఇవ్వడంలో ఉంది అన్నాడు. అందరికీ ఒకే విలువ ఉండే సమాజం కావాలి అని ఆయన కోరుకున్నాడు. అందుకోసమే రాజ్యాంగం రాసుకున్నాం అన్నాడు ఆయన. రాజ్యాంగంలో కోర్టులు, ఎన్నికలు, పార్లమెంటు, అసెంబ్లీ ఇవన్నీ ఎందుకోసం పెట్టాము అంటే అందరికీ ఒకే విలువ ఉండే సమాజం రావడం కోసం అన్నాడు. అది ఇప్పటికీ రాలేదు. దరిదాపుల్లోకి కూడా రాలేదు అనడానికి ఈ వాకపల్లి అత్యాచారం ఉదంతమే ఉదాహరణ. చాలా ఘోరమైన, బాధాకరమైనటువంటి ఉదాహరణ.

చివరకి హైకోర్టు ఏం చేసింది? ఇక్కడ ఎస్.సి, ఎస్.టి చట్టం తెలిసిన వాళ్ళు చాలామంది ఉన్నారు. మీకు తెలుసు, ఆ చట్టం కింద నమోదు అయిన నేరంలో నేరపరిశోధన, ఇతర చర్యలు ఏవైతే చేపట్టాలో అవి సక్రమంగా చేపట్టని అధికారి కూడా నేరస్తుడే అని ఉందని. వేరే ఏ చట్టంలో అట్లా లేదు. మన దేశంలో ప్రభుత్వ ఉద్యోగి తన డ్యూటీ చేయకపోతే నేరం కాదు. చేస్తే చేస్తాడు లేకపోతే లేదు. అయినా జీతం వస్తూనే ఉంటుంది. ఒక్క ఎస్.సి, ఎస్.టి చట్టంలో మాత్రమే ఉంది అది. ఈ చట్టం కింద నమోదైన నేరం విషయంలో ఎవరెవరు ఏమేమి చెయ్యాలో, ఎవరెవరు ఏమేమి పాత్ర నిర్వర్తించాలో - అది నిర్వర్తించకపోతే కూడా నేరమే. దానికి ఒక సంవత్సరం జైలు శిక్ష కూడా ఉంటుంది. ఈ సంగతి హైకోర్టుకు తెలియదా? రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు తెలియదా? ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసిన తరవాత నేరపరిశోధన చెయ్యనటువంటి ఆ పోలీసు అధికారి దీని కింద నేరస్తుడే కదా? అలాగే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసిన తరవాత జీవో 3 ప్రకారం బాధితురాళ్ళకు నష్ట పరిహారం ఇవ్వనటువంటి ప్రభుత్వ అధికారులు - వాళ్ళూ నేరస్తులే కదా? గ్రేహౌండ్స్ దళం అక్కడకి పోయింది అని ఒప్పుకొంటూ కూడా వాళ్ళ పేర్లు బయట పెట్టనటువంటి గ్రేహౌండ్స్ ఎస్.పి - అతనూ నేరస్తుడే కదా? వీళ్ళందరూ నేరస్తులే అయినపుడు వీళ్ళమీద కూడా కేసు పెట్టండనే ఆదేశం హైకోర్టు ఇవ్వవలసి ఉండె. మరి ఎందుకు ఇవ్వలేదు హైకోర్టు? ఆ మాత్రం చట్టాలు తెలియని జడ్జీలేమీ లేరు అక్కడ. వాటిని ఎవరికి వర్తింపచేస్తారు, ఎవరికి వర్తింపచేయరనేది నిర్ణయించుకుంటారు వాళ్ళు. ఎప్పుడు వర్తింపచేస్తారు, ఎప్పుడు వర్తింపచేయరో కూడా నిర్ణయించుకుంటారు. ఇది చాలా దురదృష్టకరం.

రాజకీయాలకు, ప్రభుత్వాల అవసరాలకు, ప్రభుత్వాల మీద ఉండే ఒత్తిళ్ళకు అతీతంగా న్యాయవ్యవస్థ పని చెయ్యాలి. అప్పుడప్పుడు చేస్తుంది కూడా. అందుకే ఇంకా కొంచెం గౌరవం మిగిలి ఉంది. అప్పుడప్పుడు ప్రభుత్వానికి

ఇబ్బందయిన తీర్పులు ఇస్తూ ఉంటారు కాబట్టే ఆ గౌరవం ఇంకా మిగిలి ఉంది. కానీ ఇక్కడికొచ్చేసరికి ప్రభుత్వ యంత్రాంగం దగ్గర మొదలుపెట్టి న్యాయవ్యవస్థ దాకా అందరిదీ ఒకే ఆలోచన. గ్రేహౌండ్స్ పోలీసులను అరెస్టు చేస్తే, వాళ్ల మనోస్థైర్యం దెబ్బతింటే - నక్సలైట్ల మీద పోలీసులు చేస్తున్న యుద్ధం, ప్రభుత్వం చేస్తున్న యుద్ధం ఆగిపోతుందేమో, దెబ్బ తింటుందేమో అని. కానీ దానికీ, వాకపల్లి కేసుకూ ఏమిటి సంబంధం? ఆ భయాన్నో, ఆ ఆందోళననో, ఆ శంకనో మీరు అడ్డం పెట్టుకొని పదకొండు మంది స్త్రీలు తమపైన అత్యాచారం జరిగింది అని చెపుతుంటే నేరపరిశోధన జరిపించము, జరపము అంటే అది ఏ రకంగా న్యాయం అవుతుంది? నీ పోరాటం నువ్వు చేసుకో నక్సలైట్ల మీద. సరయినటువంటి పద్ధతుల ద్వారా, క్రమశిక్షణ కలిగినటువంటి పోలీసు యంత్రాంగం ద్వారా, ప్రజలను అత్యాచారాలకు, హింసకు గురి చేయని పోలీసు యంత్రాంగం ద్వారా ఆ పని చెయ్యి. ఎవ్వరూ కాదనరు. కానీ దానికోసం ఒక రౌడీ మూకను తయారుచేసి... వాళ్ళు ప్రజలను హింసించినా, వేధించినా, అత్యాచారాలు చేసినా కేసు పెట్టము, విచారణ జరపము - ఆ పని చేస్తే వాళ్ళ మనోస్థైర్యం దెబ్బతిని తీవ్రవాదానికి వ్యతిరేకంగా చేస్తున్న మహత్తర కార్యక్రమం దెబ్బతింటుందీ అనంటే మరి ప్రజలు దీంట్లో పావులా? ప్రజలేమన్నా గొర్రెలు, మేకలా? బలి పశువులా? చాలా అన్యాయమైన వైఖరి ఇది. ప్రభుత్వానికుంటే ఏమో అనుకోవచ్చు, న్యాయస్థానానికీ ఇదే వైఖరి ఉంటే ఏమనుకోవాలి?

మేము చాలా కేసులు వేస్తుంటాం కోర్టులో. న్యాయస్థానాన్ని మేము ఏవేవో అభ్యర్థిస్తాం - అవన్నీ మమ్మల్ని అడగవద్దు, ఒకటే అడగండి మమ్మల్ని. చట్టం ఏమిటో చెప్పండి. ఆ చట్టాన్ని అమలు చేయమని ఆదేశాలు ఇస్తాం - అంటారు. వేరే విషయాలు మా దగ్గరికి తీసుకురావద్దు అంటారు. ప్రజల తరఫున అడుగుతాము అప్పుడప్పుడు. ఏమని? అయ్యా! చట్టం పరిధికే పరిమితం కావద్దు మీరు, చట్టాన్ని దాటిపోయి చూడండి, ప్రజల కష్టాలు చూసి కొంచెం అధికంగా ఒక ఉత్తర్వు ఇవ్వండి అని కోర్టును అడుగుతాం. అప్పుడు మా న్యాయమూర్తులు ఏమంటారు? మాకు అవన్నీ చెప్పొద్దు మీరు. మీ కష్టాలు, మీ సమస్యలు మాకనవసరం. మాకు చట్టం ఒకటే కావాలి. చట్టం అమలు చేయించడం ఒక్కటే మా డ్యూటీ అని చెప్తారు. మరి ప్రభుత్వానికి ఆ మాట చెప్పలేకపోయారే వాళ్లు? ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి వాళ్ళను అరెస్టు చెయ్యి, పేర్లు బయటపెట్టు, చార్జిషీటు వెయ్యి, విశాఖపట్నంలో ఉండే ఎస్.సి, ఎస్.టి ప్రత్యేక కోర్టు నేరపరిశోధన చేస్తుంది

అని ఎందుకు హైకోర్టు ఆదేశం ఇవ్వలేకపోయింది? చాలా అన్యాయమైనటువంటి వైఖరి ఇది. చివరకు సి.బి.సి.ఐ.డిని నేరపరిశోధన చేసి రెండు వారాలలో నివేదిక ఇవ్వమన్నారంట. చాలా ఆశ్చర్యమనిపించింది నాకు దీన్ని చూసినప్పుడు. రెండు వారాలలో ఎట్లా ముగిస్తారు వాళ్ళు? అంటే మీ అభిప్రాయం ఏమిటి? ఏదో ఒక రిపోర్టు ఫైల్ చెయ్యమనా? వాళ్ళు ఆ ప్రకారమే నివేదిక ఇచ్చారు. సి.బి.సి.ఐ.డి నేరపరిశోధన ఎట్లా సాగిందంటే నేరం చేసినవాడి మీద కాదు, ఫిర్యాదుదారుల మీద పరిశోధన చేశారు. 'మొదట్లో ఏం చెప్పారు - గుర్తు పట్టగలం అన్నారు. తరవాత ఏం చెప్పారు - గుర్తుపట్టలేం అన్నారు' అని సి.బి.సి.ఐ.డి నెపం వాళ్లమీదే పెట్టింది. అవును కాలం గడిచింది. జరిగిన తెల్లవారి ముఖాలు జ్ఞాపకం ఉండి గుర్తు పడతామని ధైర్యంగా అన్నారు. మూడు నెలలు కావస్తుంది, ఏమో గుర్తుపట్టలేమేమో అనడం తప్పా! అయినా ఇదంతా ఎందుకు? వాళ్ళను ప్రవేశపెట్టండి. గుర్తు పట్టగలరో లేదో తేలిపోతుంది కదా. ఈ మీమాంస ఎందుకు? వాళ్ళ పేర్లు చివరకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాగిరెడ్డిగారు తన నివేదికలో బయటపెట్టారు. ఆ రోజు కూంబింగ్‌కు పోయినటువంటి ఆ గ్రేహౌండ్స్ సిబ్బంది ఎవరో ఆయన తెలియజేశారు. సి.బి.సి.ఐ.డి వాళ్ళు వాళ్ళను తీసుకొచ్చి ఈ పదకొండు మంది స్త్రీల ముందు ప్రవేశపెట్టి గుర్తు పడతారా లేదా అని అడిగి చూడొచ్చుగా! వాళ్ళు చెప్పే వాళ్ళు కదా. గుర్తుపడతారో లేదో తేలిపోయేది అక్కడే. ఆ పని చేయకుండా మొదటేమో గుర్తుపడతామూ అన్నారు, ఇప్పుడేమో గుర్తుపట్టలేమూ అంటున్నారు కాబట్టి మాకు అనుమానంగా ఉంది అన్నారు. వెంటనే తేలిపోయే విషయానికి ఈ తర్కమెందుకు? ఇందులో మీమాంస ఏముంది?

అక్కడ పడి ఉన్న గాజులు ఆమె సైజువి కాదు అని అనడమేమిటి? అయినా నువ్వు ఎప్పుడు చూశావు ఆ గాజులను - రెండున్నర నెలల తరువాత. కృత్రిమంగా అక్కడ గాజులు పగలగొట్టి వేసే ఉద్దేశం ఉన్నవాళ్లు ఆమె నిజమైన గాజుల్నే వెయ్యగలరు కదా! చిన్నగాజులు తెచ్చి వేస్తారా, కృత్రిమంగా వెయ్య దల్చుకుంటే! చిన్న గాజులు ఎవరు వేసి ఉండవచ్చును? ఫిర్యాదు తప్పు అని రుజువు చేసే ఉద్దేశం ఉన్నవాళ్ళు వేసి ఉండవచ్చును కదా! నీకు ఆ అనుమానం ఎందుకు రాలేదు? బాధితుల మీద అనుమానం ఎందుకు వచ్చింది నీకు? ఎందుకంటే వారు దర్యాప్తు చేస్తున్నది దోషులను కాదు, ఫిర్యాదుదారుల్ని. చాలా విచిత్రంగా ఉంది. ఒక ఫిర్యాదు వచ్చినప్పుడు నేరపరిశోధన జరగాల్సింది దోషిపైన, ఫిర్యాదిపైన కాదు. నాగిరెడ్డిగారు తన నివేదికలో నేరం జరిగినట్టే భావిస్తున్నాను

అనడానికి చూపించిన ఆధారాలలో ఒకటి "ఒక చిన్నబ్బాయి చెప్పాడు, నేను చూశాను" అని, "11, 12 ఏళ్ళ పసిబాలుడు అబద్ధం చెప్తాడు అని నేను అనుకోవడం లేదు కాబట్టి జరిగిందని నేను అనుకుంటున్నాను" అని అన్నారు. కాని సి.బి.సి.ఐ.డికి ఆ మాట తోచలేదు. హైకోర్టుకూ తోచలేదు. హైకోర్టు దగ్గర రెండు రిపోర్టులు ఉన్నాయి. సి.బి.సి.ఐ.డి రిపోర్టూ ఉంది, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాగిరెడ్డిగారి నివేదికా ఉంది. అయినా హైకోర్టు మాకేమీ అర్థం కావడం లేదు అంది. అర్థం కాకపోతే ఏం చెయ్యాలి అది? చిన్న విషయం ఇది. దీనికి లోతయిన ఆలోచనేమీ అక్కర్లేదు, రాజ్యాంగం చదవనక్కర్లేదు, మనం అంబేద్కర్లం కానక్కరలేదు.

సి.బి.సి.ఐ.డి వాళ్ళు ఏమీ జరగలేదు అన్నారు. ఫిర్యాదుదారులు జరిగింది అన్నారు. కోర్టు నాకు అర్థం కాలేదు అంది. మూసేస్తారా కేసు? సి.బి.సి.ఐ.డి కంటే ఇంకా నిష్పక్షపాతంగా నేరపరిశోధన చెయ్యగల సంస్థకు అప్పగించి నువ్వు పరిశోధన చెయ్యి అని చెప్పాలి. ఆ ఆలోచన ఎందుకు రాదు న్యాయస్థానానికి? చాలా అన్యాయమైనటువంటి వైఖరి ప్రదర్శించింది. అసలు కోర్టుకే పోకపోతే ఎట్లా ఉండేదో అట్లా ఉంది ఇవ్వాళ. ఇంత కష్టపడి కోర్టుకు పోయి కేసువేస్తే, కేసు వేసిన రోజు నుంచి కూడా ఫిర్యాదుదారులే ముద్దాయిలు అయినట్టుగా, వాళ్ళే దోషులయినట్టుగా కోర్టులో విచారణ జరిగింది. మీ ఫిర్యాదు న్యాయమా కాదా, నిజమా కాదా మేము తేలుస్తాం అని మొదలుపెట్టి అవునో కాదో చెప్పలేక పోతున్నాం కాబట్టి మూసేస్తాం కేసు అనే వైఖరి కోర్టులు ప్రదర్శించడం వల్ల ఇవ్వాళ చివరికి మళ్ళీ మొదటకొచ్చింది కేసు.

హైకోర్టు చిన్న ఆదేశం ఇచ్చి ఉండాల్సింది - నేర పరిశోధన జరపండి, రిపోర్టు ఫైల్ చెయ్యండి అని. ఒకవేళ పోలీసులు కానీ, సి.బి.సి.ఐ.డి కానీ ఫిర్యాదు అవాస్తవం అంటే ఆ కాపీలు బాధితురాళ్ళకు ఇవ్వండి. వాళ్ళు దాని మీద - చట్టం పరిభాషలో ప్రొటెస్టు పిటిషన్ - ఇది తప్పుడు నివేదిక అని వాళ్ళు దాని మీద పిటిషన్ వేసుకుంటారు. లాయర్‌ను పెట్టుకుంటారు, కేసు నడుపుకుంటారు. ఇది మామూలుగా జరిగేది. చివరకు మనం అక్కడికే వచ్చాం. మిత్రులు అడుగుతున్నారు ఏముంది ఇంకా, ఏం చెయ్యాలి అని.

సరే సి.బి.ఐ పరిశోధన కావాలి అని అడిగాము. హైకోర్టు ఆ ఆదేశం ఇవ్వలేదు కాని, ఇవ్వకపోయినా ప్రభుత్వం ఆ పని ఇప్పటికీ చేయవచ్చు. ప్రతిపక్ష పార్టీలు వరికి మద్దతు ధర కావాలని, ఇంకొకటని, మరొకటని ఏ స్థాయిలో ఆందోళన చేస్తున్నాయో - అవన్నీ అనవసరమని నేను అనడం లేదు - ఆ స్థాయిలోనే

ఈ పదకొండు మంది ఆదివాసీ మహిళల ఫిర్యాదు తమపైన అత్యాచారం జరిగింది అన్న ఫిర్యాదు - మీద కూడా జరగాలి. దీనిపైన రాష్ట్ర ప్రభుత్వమే - ఎందుకంటే హైకోర్టు తేల్చలేకుండా ఉన్నానని చెప్పింది కాబట్టి - కేంద్రానికి లెటర్ రాసి సి.బి.ఐ చేత దర్యాప్తు జరిపించాలి. ప్రతిపక్ష పార్టీలన్నీ ముందుకొచ్చి ఆదివాసీ ఐక్యవేదిక, ఇతర సంఘాలు, హక్కుల సంఘాలు అందరితోనూ కలిసి ఈ డిమాండు పెట్టి, ఒత్తిడి పెట్టి సి.బి.ఐ దర్యాప్తు జరిగేలా చేయాలి. ఒక రాజకీయ ఉద్యమంగా దానిని మనం కొనసాగించాలి. చేద్దాం. అసాధ్యమేమీ కాదు.

పశ్చిమ బెంగాల్ హైకోర్టు నందిగ్రామ్ కాల్పులకు సంబంధించి ఈ ఆదేశం ఇచ్చింది. అది ఇవ్వకపోయినా కేంద్ర ప్రభుత్వం ఇవ్వడానికి రెడీగా ఉంది, ఆ నిర్ణయం రాజకీయంగా కూడా తీసుకోవచ్చును కాబట్టి. ముఖ్యంగా హైకోర్టు ఎటూ తేల్చలేను అని చెప్పి మూసేసింది కాబట్టి మనం ఆ ఉద్యమం చేద్దాము. ఒకవైపు ఆ ప్రయత్నం చేద్దాము. ఇంకొకవైపు మామూలుగా అందుబాటులో ఉండే మార్గంలోనూ ప్రయత్నిద్దాం. అదేమిటంటే బాధితురాళ్ళే ముందుకు వచ్చి వాళ్ళలో ఒకరు ప్రైవేట్ కంప్లైంట్ వేసి దీనిని కొనసాగించడం. ఎట్లాగూ సి.బి.సి.ఐ.డి వాళ్ళ రిపోర్టు ఒకటుంది ఇప్పుడు. దానిని హైకోర్టు చూసిన తరువాత వాళ్ళు మీ పాడేరు మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫైల్ చేస్తారు, మొబైల్ మేజిస్ట్రేట్ చట్ట ప్రకారం అయితే. వారికి ఈ చట్టం తెలియకపోతే నేనేమీ చెయ్యలేను. అట్లే అనాల్సి వస్తుంది. హైకోర్టుకే తెలియకపోతే ఇంకా మేజిస్ట్రేట్‌కి తెలియకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. చట్ట ప్రకారం అయితే వారు ఫిర్యాదికి అంటే ఎ.పి. గిరిజన సంఘానికి కాపీ పంపించాలి, వారు తీసుకొచ్చి మీకు ఇస్తారనే అనుకుంటున్నాను. దాని మీద అంటే సి.బి.సి.ఐ.డి నివేదిక మీద మన అభ్యంతరాలు తెలియజేస్తూ వివరంగా పదకొండు మంది స్త్రీల వాంగ్మూలాలను జత చేసి మేజిస్ట్రేట్ కోర్టులో ఫైల్ చేసి, ప్రైవేట్ కేసుగా దాన్ని కొనసాగించవచ్చు. విడిగా అయినా మనం ప్రైవేటు కేసు వేసుకోవచ్చు. ఆ నిర్ణయం గాని మీరు తీసుకుంటే మేము మానవ హక్కుల వేదిక తరఫున, మా మిత్రులు పౌరహక్కుల సంఘం వారు, అందరం కలిసి సహాయం చేస్తాము. విశాఖపట్నంలో న్యాయవాదులు ఉన్నారు, నేనూ వస్తాను. ఇక్కడే కూర్చుందాము. వాంగ్మూలాలు తయారు చేసి, ఫిర్యాదు తయారు చేసి వేద్దాము, ప్రైవేటు కేసుగా కొనసాగిద్దాము.

శంకరన్‌గారి చేత ఎంక్వయిరీ చేయిస్తే బాగుండునని అడిగారు. శంకరన్‌గారిని ఎవరూ అడిగినట్లు లేదు ఇప్పటి దాకా. నిజానికి ఆయన ఆరోగ్యం

అసలు బాగాలేదు. అయినప్పటికీ ఒక మచ్చ లేనటువంటి, ప్రజలను ప్రేమించే అధికారిగా ఆయనకున్న గుర్తింపు, పేరు రీత్యా అదీ చేద్దాం. కానీ చట్టపరంగా శిక్షపడే విచారణ కాదు అది. శిక్ష పడాలి అంటే పోలీసులు దర్యాప్తు చెయ్యాలి లేదా బాధితులయినా కోర్టులో కేసు వేసుకోవాలి. అదైతేనే శిక్షకు దారి తీస్తుంది. శంకరన్‌గారు విచారణ జరిపి నివేదిక ఇచ్చినా, నాగిరెడ్డిగారి నివేదిక అయినా నిజంగా అన్యాయం జరిగిందనే అభిప్రాయం సమాజంలో కలిగించడానికి మాత్రమే ఉపయోగపడతాయి. వాళ్ళు పెద్దమనుషులు. నాగిరెడ్డి గారికి ఆఫీసరుగా మంచి పేరే ఉంది. శంకరన్‌గారి స్థాయి కాదనుకోండి. శంకరన్‌గారికి ఇంకా మంచి పేరుంది. ఆయనగానీ ఒక పరిశోధన జరిపి వాస్తవాలను బయటకు తీసుకొస్తే సమాజంలో ఒక గుర్తింపు వస్తుంది. నిజమే అన్యాయం జరిగింది ఇక్కడ, వ్యవస్థ విఫలం అయ్యింది న్యాయం చెయ్యడంలో అని గుర్తిస్తారు. అంతవరకే అవి ఉపయోగపడతాయి. ఆ ఘోరానికి పాల్పడిన వాళ్ళకు, ఆ అత్యాచారానికి పాల్పడిన వాళ్ళకు శిక్ష పడాలి అంటే మాత్రం దానికి రెండే రెండు మార్గాలు. ఒకటి సి.బి.ఐ దర్యాప్తు జరిపించాలి లేదా బాధితురాళ్ళు ప్రైవేట్ కేసు వేసి కొనసాగించాలి. ఈ రెండూ కూడా మీరు తీసుకునే నిర్ణయాన్ని బట్టి, ఇక్కడున్నటువంటి ఆదివాసీ సంస్థలు, బాధితురాళ్ళు, వాకపల్లి గ్రామస్తుల నిర్ణయాన్ని బట్టి ఉంటుంది. మీరు నిర్ణయం తీసుకోండి, అందరం సహకరిస్తాము.

నయం కాగల రోగాల వల్ల మనుషులు వేల సంఖ్యలో చనిపోవడమనేది మీరు చూస్తూనే ఉన్నారు చాలా కాలంగా. వాటికి మేము చాలా బాధపడుతున్నాం - ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోతున్నాం. వాకపల్లి విషయంలో అట్లా కాకుండా పట్టుదలగా ఇక్కడ దాకా ఉద్యమాన్ని తీసుకొచ్చారు అందరూ కలిసి. ప్రధానంగా ఇక్కడి ఆదివాసీ సంఘాలు, వాకపల్లి మహిళలు, వాకపల్లి గ్రామస్తులు, వారికి అండగా నిలబడినటువంటి ప్రజా సంఘాలు, మీడియా, పత్రికలు ఇక్కడ దాకా తీసుకొచ్చాయి. ఇక్కడ మనం వదిలేయకుండా ముందుకు తీసుకుపోయి, ప్రజా చైతన్యం వల్ల, సంకల్పం వల్ల, పట్టుదల వల్ల ప్రభుత్వ యంత్రాంగం నుంచి న్యాయవ్యవస్థ దాకా, తమ విధి ఏమిటీ, తమ కర్తవ్యం ఏమిటీ అని అందరూ మర్చిపోయినా కూడా వాళ్ళచేత వాళ్ళ విధులు జ్ఞాపకం చేయించగలము, నిర్వర్తింప చేయించగలము అనే సంకేతాన్ని ప్రభుత్వానికి పంపుదాం. ఇప్పటిదాకా చేస్తూ వచ్చింది వదిలేయకుండా దాన్ని ముందుకు తీసుకుపోదాము. కనీసం ఇక మీదటైనా సరే ఈ వ్యవస్థకు, ఈ వ్యవస్థలో అధికారం ఉండే వ్యక్తులకు,

అధికారం చెలాయించే పెద్దమనుషులకు - న్యాయమూర్తులతో సహా - ఆషామాషీగా తీసి పారెయ్యడానికి వీలు లేదు వీళ్ళను, ఏం జరిగినా చెల్లుతుందిలే, ఏం చేసినా చెల్లుతుందిలే అనుకోనివ్వకూడదు. అసెంబ్లీలో చర్చలు తీసుకోండి; సెక్రటేరియట్‌లో, ప్రభుత్వ ఆఫీసుల్లో అధికారుల వైఖరి తీసుకోండి; కోర్టుల్లో న్యాయమూర్తుల వైఖరి తీసుకోండి - ఒకటే ధోరణి. బలవంతుల సమస్యలు, ధనవంతుల సమస్యలు వాళ్ళ దగ్గరకు వస్తే - అసెంబ్లీ కానివ్వండి, ప్రభుత్వ కార్యాలయాలు కానివ్వండి, కోర్టులు కానివ్వండి - చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తారు. ఎందుకంటే వీడికి బలముంది, వీడికి సంబంధాలు ఏవో ఉన్నాయి, వీడు ఒత్తిడి పెట్టగలడు, నా ఉద్యోగం పోతుందేమో, నన్ను ట్రాన్స్‌ఫర్ చేస్తారేమో అన్న భయం వాళ్ళలో ఉంటుంది. రచ్చ చేస్తారు, అల్లరి చేస్తారు, నేను నా డ్యూటీ సక్రమంగా చెయ్యలేదు అని చెప్పి నా మీద ఒక నల్లమచ్చ వచ్చేటట్టు చేస్తారేమో అన్న భయం ఉంటుంది. అటువంటి వాళ్ళ సమస్యలు వాళ్ళు పట్టించుకుంటారు. దీర్ఘంగా చర్చిస్తారు. నిర్ణయాలు తీసుకుంటారు. కోర్టులు తీర్పులు ఇస్తూ ఉంటాయి. బలహీనవర్గాల విషయానికి వచ్చేటప్పటికి - మేము చూస్తూనే ఉంటాం, కోర్టులలో చూస్తాం, బయటా చూస్తూనే ఉంటాం - రెండు నిమిషాలలో, మూడు నిమిషాలలో నిర్ణయాలు జరిగిపోతుంటాయి. ఏముందిలే, ఫర్వాలేదులే, దాటవేయవచ్చులే, పక్కకు పెట్టవచ్చులే, వాయిదా వెయ్యొచ్చులే అనుకుంటారు. అట్లా సాగడానికి వీలు లేదు అన్న ఒక భయం, ఒక హెచ్చరిక వారికి ఉండాలి. ఇప్పటి దాకా వాకపల్లి బాధితురాళ్ళు, వాళ్ళకు అండగా నిలబడ్డ ఉద్యమకారులు అటువంటిది ఇస్తూ వచ్చారు. ఈ ఒరవడిని చివరదాకా తీసుకొని పోదాము. జరిగినటువంటి ఘోరం ఏమిటనేది బయటకు రావాలి. చేసిన వాళ్ళకు శిక్ష పడాలి. బాధితురాళ్ళకు న్యాయం జరగాలి. దానికోసం మనం ప్రయత్నం చేద్దాం.

*పాడేరులో జరిగిన ఆదివాసి ఐక్య పోరాట సమితి సభలో చేసిన ప్రసంగం*
*18 నవంబర్ 2007*

# ‘వాకపల్లి’ వార్షిక దినం!

ఈ నెల 20వ తేదీ నాటికి వాకపల్లి అత్యాచారం జరిగి ఒక సంవత్సరం అవుతుంది. బాధితురాళ్లకు జ్ఞాపకం చేసుకోవడానికేముందంటే అవమానం, వైఫల్యం, అలసట, నిరాశ. పోలీసులు కేసు కట్టలేదు, నేరపరిశోధన ఇసుమంత కూడ చేయలేదు. హైకోర్టుకు వారి తరపున ఎవరో పోగా కేసు కట్టి నేరపరిశోధన జరపమనీ, నిందితుల పేర్లు బయటపెట్టమనీ పోలీసులను ఆదేశించే బదులు హైకోర్టు తానే నేరవిచారణ జరుపుతున్నట్టు కేసును వాయిదాలు వేస్తూ పోయింది. చివరికి సి.బి.సి.ఐ.డిని రిపోర్టు ఇమ్మనింది. వారు ముద్దాయిల మీదగాక బాధితురాళ్ల మీద దృష్టి పెట్టి వారి వాంగ్మూలాలలో ఏవో వైరుధ్యాలు కనిపించాయనీ, ఫిర్యాదును నమ్మలేమనీ రిపోర్టు ఇచ్చారు. హైకోర్టు ఎటూ తేల్చకుండ కేసు మూసేసింది. గ్రేహౌండ్స్ పోలీసులు ఆదివాసులయిన స్త్రీలపైన మూకుమ్మడిగా లైంగిక హింసకు పాల్పడ్డారన్న ఆరోపణ ఇన్వెస్టిగేషన్ లేకుండా మూసేయబడింది.

ఇక మిగిలింది బాధితురాళ్లే ప్రైవేట్ కంప్లైంట్ వేసుకోవడం. వారు పాడేరు మేజిస్ట్రేట్ కోర్టులో కేసు వేసారు. తమపైన అత్యాచారం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులపైనే కాక, నేరపరిశోధన జరపవలసి ఉండీ జరపని డి.ఎస్.పి, అడిషనల్ ఎస్.పిలపైన కూడ కేసు వేసారు. అయినా అత్యాచారం జరిగిన వార్షిక దినం నాటికి ఆ ఫిర్యాదుకు

నెంబరయినా దక్కుతుందో దక్కదో - కోర్టు భాషలో మేజిస్ట్రేట్ 'కాగ్నైజన్స్' తీసుకుంటారో లేదో - తెలీదు.

బలహీన వర్గాలపైన, ప్రత్యేకించి దళిత, ఆదివాసీ ప్రజలపైన జరిగే నేరాలలో నేరపరిశోధన త్వరితంగా జరగకపోతే బాధితుల మనోస్థైర్యం దెబ్బ తింటుందని గ్రహించి, సత్వర నేర విచారణ జరిపించే ఉద్దేశంతో దేశ పార్లమెంటు 1989లో ఒక ప్రత్యేక చట్టం చేసింది. దానిని ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం అంటారు. చట్టం జారీ అయిన తరువాత మన రాష్ట్రంలో దళితులపైన మొదటి పెద్ద దాడి చుండూరులో 1991లో జరిగింది. 8 మంది హతమైన ఈ దాడి కేసులో తీర్పు 2007లో వచ్చింది. అంటే సత్వర నేరవిచారణ లక్ష్యం శాసన రూపం తీసుకున్నప్పటికీ చుండూరు కేసు విచారణ 16 సంవత్సరాలు నడిచింది. వాకపల్లి జరిగి సంవత్సరం గడిచినా నేరపరిశోధన ఇంకా మొదలే కాలేదు. జాతీయ షెడ్యూల్డు తెగల కమిషన్ వాకపల్లికి వెళ్లి బాధితురాళ్లను విచారించిన పిదప ఈ అత్యాచారం కేసును సి.బి.ఐకి అప్పగించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్టు వినికిడి. కాని రాజ్యాంగ సంస్థ అయిన జాతీయ ఎస్.టి కమిషన్ సిఫారసు సహితం బుట్టదాఖలయింది. బాధితురాళ్ల ప్రైవేట్ కంప్లైంట్ ఒక్కటే ఇంకా సజీవంగా ఉన్న చట్టపరమైన ప్రక్రియ.

ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం దుర్వినియోగం అవుతున్నదని అలవోకగా ఆరోపించే వారికి ఇవి కనిపించవో లేక వాదన కోసం నేను ఎంపిక చేసుకున్న ఘటనలుగా కనిపిస్తాయో తెలీదు. ఎంపిక చేసుకున్న ఉదంతాలన్నదే అభిప్రాయమయితే ఇంకొన్ని ఎంపిక చేసి చూపించవచ్చు. మొన్నటి జూన్ 21వ తేదీన తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక గ్రామంలో కాపు యువకులు మూకుమ్మడిగా దాడి చేసి వీరపండు అనే దళిత యువకుడిని హతమార్చారు. అప్పటికే ఆ ఊరిలో కాపులకూ దళితులకూ ఘర్షణ వాతావరణం నెలకొని ఉన్న కారణంగా కడియం ఎస్.ఐతో సహా పోలీసు పికెట్ ఊరిలో ఉంది. సి.ఐ కూడ అందుబాట్లో ఉన్నాడు. వీళ్లు దాడిని ఆపకపోగా, అంతా సజావుగా ఉందన్న అభిప్రాయం కలిగించారు. దాడి చేసినవారే కాదు ఎస్.ఐ, సి.ఐ, డి.ఎస్.పిలు ముగ్గురూ కూడ కాపు కులస్తులే. (చిరంజీవి పార్టీకి తెర ఈ నెలాఖరున తిరుపతిలోనో మరెక్కడో లేవబోవడం లేదు, జూన్ 21న పొట్టిలంకలో లేచిందంటే వారి అభిమానులు దాడి చేస్తారేమో గానీ తుర్పు గోదావరి జిల్లా సామాజిక జీవితంతో పరిచయం ఉన్నవారు ఈ వ్యాఖ్యను అర్థం చేసుకోగలరు.)

బాధితులు ఆందోళన చేయగా చేయగా దాడి చేసిన వారినొక్కొక్కరినీ - ఇప్పటికి 54 మందిని - అరెస్టు చేసారుగానీ, విధి నిర్వహణలో తెలిసీ విఫలం అయిన ఎస్.ఐ, సి.ఐలపైన చర్య లేదు. ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టానికున్న అనేక ప్రత్యేకతలలో ఒకటేమిటంటే ఆ చట్టం కింద నిర్వర్తించవలసిన బాధ్యతను తెలిసీ విస్మరించడం ఒక సంవత్సరం జైలుశిక్ష వేయగల నేరం. మామూలుగా భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు - తెలిసేమి కర్మ - ఉద్దేశ పూర్వకంగానే విధి నిర్వహణలో విఫలమైనా నేరం కాదు. సాధారణ పరిస్థితులలో వారిపై శాఖాపరమైన చర్య కూడ తీసుకోరు. ఎస్.సి, ఎస్.టి (అత్యాచార నిరోధక) చట్టంలోని సెక్షన్ 4 దీనికి అరుదైన మినహాయింపు. దానికింద కడియం ఎస్.ఐ, సి.ఐలను అరెస్టు చేసి ఉండవలసింది. చేయాలన్న డిమాండ్ తొలినాటి నుండి ముందుకొస్తూనే ఉంది. అయినప్పటికీ ఫలితం లేదు.

బలహీన వర్గాలకూ పీడిత వర్గాలకూ హక్కులు కల్పించే చట్టాలను అమలు చేయవలసిన అధికారులకు తగిన సామాజిక స్పృహ లేకపోవడం అనేక ప్రజానుకూల శాసనాల వైఫల్యానికి కారణం అనేది అనుభవంలోని విషయమే. ప్రభుత్వ అధికారులకు అడపాదడపా శిక్షణ ఇస్తుంటారు గానీ ఈ విషయాలలో సరైన చైతన్యం కలిగించడం ఒక పనిగా మన ప్రభుత్వాలు పెట్టుకోలేదు. ఇక్కడ కూడ ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం ప్రభుత్వంపైన ప్రత్యేక బాధ్యత పెడుతుంది. దళితులపైన, ఆదివాసులపైన అత్యాచారాలు, దాడులు తరచుగా జరిగే ప్రాంతాలలో ఆ సామాజిక వర్గాల సమస్యల పట్ల అవగాహన, సరయిన దృక్పథం ఉన్న సిబ్బందిని వివిధ పదవులలో నియమించాలని ఈ చట్టం కింద ఒక నియమం ఉంది. సరయిన దృక్పథం, అవగాహన గల సిబ్బందిని నియమించడం అటుంచి, వ్యతిరేకభావం ఉన్న వారిని బదిలీ చేయమన్న బాధితుల ఆందోళనలకు కనీస స్పందన కూడ ఉండడం లేదు. ఆదివాసుల పట్ల తిరస్కార భావం ఉన్న ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు ఆఫీసర్‌ను బదిలీ చేయమన్న డిమాండ్‌తో ఆందోళనలు సున్నిపెంట నుండి ఉట్నూరు దాకా, రంపచోడవరం నుండి భద్రాచలం దాకా అనేకసార్లు జరిగాయి. కానీ ప్రభుత్వ అధికారిని బదిలీ చేయమనడానికి మీరెవ్వరు? అని ప్రభుత్వం ఎదురు సవాలు విసిరిందే తప్ప సదవగాహన గల వ్యక్తిని నియమించే బాధ్యత తనపైన ఉందన్న గ్రహింపు కనబరచలేదు.

ఈ చట్టం కింద పెట్టిన తప్పుడు కేసుల గురించి తరచుగా వింటూంటాం గానీ పెట్టవలసి ఉండీ పెట్టని కేసుల విషయం చర్చకెప్పుడూ రాదు. కొట్టారు, తిట్టారు అన్న ఫిర్యాదులపైన పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాకపోవడం

సరేసరి. అయితే కేసు కట్టాలన్న ఆలోచన సహితం అధికార యంత్రాంగానికి రాని అన్యాయాలనేకం ఉన్నాయి. ఎస్.సి, ఎస్.టి వర్గాలకు చెందిన వారిని తమ భూములు అనుభవించనీయకుండ అడ్డుపడడం నేరం అని ఈ చట్టం అంటుంది. ఇది అప్పుడప్పుడు జరిగే నేరం కాదు. ఒక పద్ధతి ప్రకారం నిత్యం జరుగుతూ ఉంటుంది. భూముల దురాక్రమణను నిరోధించడానికి ఉద్దేశించిన చట్టాలు రెండున్నాయి. ఒకటి, అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం (9/77 చట్టం అని దీనికి చిన్న పేరు). ఈ భూములు ఎక్కువగా ఎస్.సిలకు చెందినవి. రెండవది, ఏజెన్సీ భూములకు వర్తించే ఎల్.టి.ఆర్ చట్టం (1/70 అనేది దీని చిన్న పేరు). ఈ రెండు కోవలకు చెందిన భూములు లక్షల ఎకరాలు దురాక్రమణకు గురయ్యాయనేది తెలిసిన విషయమే. కోనేరు రంగారావు కమిటీ దీనికి సంబంధించిన గణాంకాలు ఇచ్చింది కూడ. ఈ దురాక్రమణపైన విచారణ జరపవలసిన అధికారులు అడపాదడపా ఆ పని చేస్తూనే ఉంటారు. అన్ని కేసులలో కాకపోయినా కొన్నిటిలో దురాక్రమణ జరిగిందని నిర్ధారిస్తూ ఉంటారు. నిర్ధారించినప్పుడు దురాక్రమణ దారుడిని తొలగించమని ఆదేశం జారీ చేస్తారే తప్ప ఎస్.సి, ఎస్,టి (అత్యాచారాల నిరోధక) చట్టం కింద అరెస్టు చేయమన్న ఆదేశం ఎప్పుడూ జారీ చేయరు. ఎన్ని వేల మంది దోషులు దీని వలన జైలు తప్పించుకున్నారో!

బాధితుల పునరావాస లక్ష్యం తిరిగి వారికి ఆ గతి పట్టకుండ చూడడం. అంటే ఏ భౌతిక, సామాజిక పరిస్థితులు దాడికి దారి తీసాయో వాటి నుండి రక్షణ కల్పించే విధంగా పునరావాసం కల్పించాలి. ఆచరణలో ఈ లక్ష్యాన్ని మరచిపోయి పునరావాసం అంటే కొంత డబ్బు, కొన్ని వసతులు అన్న అర్థం వచ్చింది. విచిత్రమేమిటంటే, ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం జారీ చేయకముందు జరిగిన కారంచేడు మారణకాండ బాధితులొక్కరే - అప్పటికి పునరావాస హక్కనేది చట్టంలో లేకున్నా - ఊరి నుండి వెళ్లిపోయి ఊరిలోని ఆధిపత్య సంబంధానికి దూరంగా పునరావాసం తమకు తాము ఏర్పాటు చేసుకొని ఉద్యమ బలంతో ప్రభుత్వ ఆమోదం పొందారు. ఆ చట్టం జారీ అయిన తరువాత దాడికి గురైన వారెవ్వరికీ ఆ స్వతంత్రత దక్కలేదు. వారు మళ్లీ ఎప్పుడయినా దాడికి గురి కాగలరు.

ఇంకా చాలా చెప్పుకోవచ్చుగానీ, వేసుకోవలసిన ప్రశ్న ఏమిటంటే ఆ చట్టం దుర్వినియోగాన్ని గురించి అత్యంత ఉత్సాహంగా చర్చించే తెలుగు సమాజం దాని వినియోగం ఎంత అందంగా ఉందో చర్చించడానికి సిద్ధపడుతుందా?

*ప్రజాతంత్ర వారపత్రిక,*
*17 ఆగస్టు 2008*

# అతి రాజకీయ సారం!

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఈ మధ్య హడావుడిగా నార్నూర్, సిర్పూర్ మండలాలు పర్యటించడంతో గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన వందలాది దుర్మరణాలు మరొకసారి రాష్ట్రానికి జ్ఞాపకమొచ్చాయి. 399 మంది చనిపోయారని ప్రభుత్వం ప్రతి శవాన్నీ లెక్క గట్టినట్టు చెప్తుంటే దాదాపు వెయ్యి మంది చనిపోయారని పత్రికలు అప్పట్లో రాసాయి. సోనియాగాంధీ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ వారు ఆ సంఖ్యను 2185 చేసారు.

తెలుగుదేశం ప్రభుత్వం మీద వీలయినంత పెద్ద నింద వేయాలని కాంగ్రెస్ వారు, నిందను వీలయిన మేరకు తప్పించుకోవాలని తెలుగుదేశం వారు సోనియాగాంధీ పర్యటన సందర్భంగా రేపిన దుమారంలో ఒక్క విషయం కనబడకుండా పోయింది. అదేమిటంటే ఏ పరిస్థితులయితే ఆ వందలాది దుర్మరణాలకు దారితీసాయో అవి ఈనాటికీ కొనసాగుతూనే ఉన్నాయి. తిరిగి ఈ వర్షాకాలంలో వందలాదిగా జనం చావరన్న నమ్మకం కలిగించడానికి ప్రభుత్వం ఈ సంవత్సర కాలంలో ఏమీ చేయలేదు. కాంగ్రెస్ వారు చంద్రబాబునాయుడు మీద దుమ్మెత్తి పోయడానికి ఈ చావులను వాడుకోవడమే తప్ప అవి పునరావృతం కాకుండా నివారించడానికి నిర్దిష్టమైన డిమాండ్లతో ఉద్యమమెప్పుడూ చేయలేదు.

నిజానికి నిర్దిష్టంగా పెట్టవలసిన డిమాండు ఒక్కటే. ప్రతి జనావాసానికీ రక్షిత మంచినీటి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేయాలి. గ్రామం అనే బదులు జనావాసం అనడానికి ఒక కారణం ఉంది. గ్రామానికి హామ్లెట్లు ఉంటాయి. ఆదిలాబాద్ వంటి అడవులు, కొండలు ఉన్న జిల్లాలో ఈ హామ్లెట్లు అనేకం ప్రధాన గ్రామానికి దగ్గరగా ఉండవు. కాబట్టి ప్రధాన ఆవాసాల దగ్గర నీళ్ల ట్యాంక్ ఉన్నా అందరికీ శుభ్రమైన మంచి నీరు అందదు. అందువల్లనే ప్రతీ జనావాసానికీ (అది పది గుడిసెల గూడెమే అయినప్పటికీ) ట్యాంకు గానీ చిన్నదో పెద్దదో నీళ్లతొట్టిగానీ కట్టాలి, బోర్లనుండి కరెంటు మోటారు ద్వారా వాటిని నింపాలి, తరచుగా అందులో మందు కొట్టి నీటిని శుభ్రంగా ఉంచాలి.

ఆశ్చర్యం, ఆగ్రహం కలిగించే విషయం ఏమిటంటే ఐ.టి గురించీ, హైటెక్ గురించీ మాట్లాడుకుంటున్న ఈ శతాబ్దాంతంలో ఆదిలాబాద్ జిల్లాలోని 3000 చిల్లర జనావాసాలలో కేవలం 600 చిల్లర జనావాసాలకు మాత్రమే రక్షిత మంచినీటి పథకాలు అందుబాట్లో ఉన్నాయి. అంటే నూటికి 20 శాతం జనావాసాలకు మాత్రమే శుభ్రమైన తాగునీరు ఉంది. దీనికి కాంగ్రెస్ వారూ తెలుగుదేశం వారూ ఇద్దరూ బాధ్యులే కాబట్టి వారు ఒకరినొకరు తిట్టుకుంటుంటే మనం వింటూ ఉండడంలో అర్థం లేదు.

దాదాపు అన్ని జనావాసాలలోనూ బోర్లున్నాయి. జిల్లాలో మొత్తంగా 11 వేల చిల్లర బోర్లున్నాయని ప్రభుత్వం అంటుంది. వేసవిలో అవి ఎండిపోతే జనం అడవులలోకి పోయి ఏ వాగు నుండో వంక నుండో నీళ్లు తెచ్చుకుంటారు. అవి శుభ్రంగా ఉంటాయన్న భరోసా లేదు. దీనితో అతిసార వ్యాధి మొదలవుతుంది. వర్షాకాలం వచ్చాక బోర్లు తిరిగి పని చేస్తాయి గానీ వర్షం నీటితో కొట్టుకొచ్చి భూగర్భ జలంలో భాగమయ్యే కాలుష్యమంతా బోర్లనుండి బయటికొస్తుంది. బోరు నీటిని సిమెంటు తొట్టిలోనో ట్యాంక్‌లోనో నిల్వ చేసి సరఫరా చేసేటట్లయితేనే డిడిటి చల్లడం ద్వారా దానిని శుభ్రపరచవచ్చు. అది 20 శాతం జనావాసాలలో మాత్రమే ఉందని పైన చెప్పాను. మిగిలిన ఊళ్ల జనం అశుభ్రమైన బోరు నీళ్లు, అవి కూడ లేని చోట అశుభ్రమైన వాగులు, వంకల నీళ్లు తాగాలి. ఇవి మళ్లీ అతిసార వ్యాధికి కారణం అవుతాయి. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన అతిసారం చావులు ఎక్కువగా జూలై, ఆగస్ట్ నెలల్లో జరిగాయి. ఆ పైన ఈ వర్షం నీరంతా డ్రైనేజీ లేకపోవడం వల్ల నిలవ ఉండి దోమల పోషక కేంద్రాలుగా మారతాయి. మలేరియా వ్యాధి దీని పర్యవసానం.

ఇది ప్రతీ సంవత్సరం ఉండేదే. కానీ గత సంవత్సరం ఎండలూ వానలూ కూడ చాలా ఎక్కువ కావడంతో చావులు మరీ ఎక్కువయ్యాయి. అంతకు ముందు ప్రతీ సంవత్సరం 50 మందో 60 మందో చనిపోయేది, 1998లో వందలాదిగా చనిపోయారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే గత సంవత్సరం జరిగిన అపారమైన మరణాల నుండైనా ప్రభుత్వం గుణపాఠం తీసుకుందా అనేది. ఏవేవో నిర్మాణాలకు (హైదరాబాద్‌లో ఫ్లై ఓవర్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు వగైరా) వేలాది కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం ఆదిలాబాద్ జనావాసాలలోని ప్రజలకు శుభ్రమైన మంచినీరు సరఫరా చేయడానికి ఎంత మాత్రం ఖర్చు పెట్టింది? గతంలో ఏం జరిగిందన్న సంగతి అటుంచి, ఇప్పటికైనా మేల్కొని ప్రతీ జనావాసానికీ అత్యవసర ప్రాతిపదికన రక్షిత మంచినీటి పథకం కల్పించే ప్రయత్నమేమైనా చేపట్టిందా?

ఏమంత చేయలేదు. 1998-99 సంవత్సరంలో మరొక 400 జనావాసాలకు మాత్రమే రక్షిత మంచినీటి స్కీంలు నిర్మించే ప్రణాళికను ప్రభుత్వం చేపట్టింది. అది రాబోయే వర్షాకాలం లోపల పూర్తయినా అప్పటికింకా జిల్లాలో 65 శాతం జనావాసాలకు రక్షిత మంచి నీటి పథకాలు ఉండవు. అంటే నూటికి 65 జనావాసాలు శుభ్రమైన మంచినీరు లేకుండా 21వ శతాబ్దంలోకి అడుగుపెట్టబోతాయి.

ఇది ఎట్టి పరిస్థితులలోనూ క్షమించరాని నిర్లక్ష్యం. ఆదివాసులు ఎక్కువ సంఖ్యలో నివసించే ఆదిలాబాద్ జిల్లా విషయంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యం ప్రదర్శించడం మరీ క్షమించరాని విషయం. కనీసం ఒక సంవత్సరం జరిగిన ఘోరం నుండి నేర్చుకొని ఇంకెప్పుడూ జరగకుండా ఉండడానికి కావలసిన వ్యవస్థాగతమైన ప్రయత్నాలను అత్యవసర ప్రాతిపదికన చేయకపోతే ఆ ప్రభుత్వాన్ని గురించి ఏమనుకోవాలి?

తన తప్పు కంటే ఆదివాసుల తప్పే ఎక్కువ అని బుకాయించడానికి కూడా ప్రభుత్వం చాలా ప్రయత్నం చేసింది. అతిసార వ్యాధి అంత పెద్దఎత్తున ప్రబలడానికి కారణమేమిటన్న ప్రశ్నకు జవాబు చెప్పకుండా, వ్యాధి సోకిన ఆదివాసులు మూఢనమ్మకాల వల్ల వైద్యం చేయించుకోవడానికి ఇష్టపడక చనిపోయారని ప్రభుత్వం వాదించింది. కానీ ప్రభుత్వ వైద్యాధికారుల కథనం ప్రకారమే అతిసార వ్యాధి సోకిన వారిలో నూటికి 60 శాతం మంది 24 గంటల లోపల చనిపోయారు. 24 గంటల లోపల ఆస్పత్రికి పోయి వైద్యం చేయించుకునేంత దగ్గరలో ఆదివాసులకు ఆస్పత్రులు అందుబాట్లో ఉన్నాయా?

ఉండకపోవడానికి మూఢనమ్మకాలు కారణమా లేక తెలంగాణలోని ఒక మారుమూల జిల్లా అయిన ఆదిలాబాద్ గురించి, అందులోని ఆదివాసుల గురించి మన పాలకులకు పట్టింపు లేకపోవడం కారణమా?

ఇప్పటికయినా అత్యవసర ప్రాతిపదికన ప్రతీ జనావాసానికీ రక్షిత మంచినీటి సరఫరా కల్పించాలన్న ఒత్తిడి ప్రభుత్వం మీద పెట్టడం అవసరం. ఆ ఊసు లేకుండా చంద్రబాబునాయుడును రాజశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డిని చంద్రబాబునాయుడు ఎన్ని తిట్లు తిట్టినా ఆదిలాబాద్‌కూ అక్కడ నివసించే ఆదివాసులకూ ఒరిగేదేమీ లేదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*
*18 ఏప్రిల్ 1999*

# అతిసారం, మలేరియా, విషజ్వరాలు ఆదివాసులకే ఎందుకొస్తాయి?

ఆదివాసులకు మాత్రమే రావు. ఇతరులకు కూడా వస్తుంటాయి. అయితే డబ్బుగల వాళ్ల కంటే లేని వాళ్లకెక్కువగా, కులంగల వాళ్ల కంటే లేనివాళ్లకెక్కువగా, పట్టణవాసుల కంటే పల్లెవాసుల కెక్కువగా, అందరి కంటే ఆదివాసులకెక్కువగా వస్తుంటాయి.

కిందటి సంవత్సరం ఆదిలాబాద్‌లో చూశాము. ఈ సంవత్సరం విశాఖపట్నంలో చూస్తున్నాము. ఒకవైపు అతిసార వ్యాధి, దాని పక్కనే మలేరియా/వైరల్ ఫీవర్ (తెలుగు దినపత్రికల భాషలో విషజ్వరం) వందల - బహుశా వేల - ప్రాణాలు తీశాయి. గత సంవత్సరం ఆదిలాబాద్‌లో చనిపోయింది ఎక్కువగా ఆదివాసులు కాగా ఈ సంవత్సరం విశాఖపట్నంలో చనిపోతున్నది అందరూ ఆదివాసులే. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలోని 52 మండలాల్లో 46 ఈ అకాల మరణాల బారిన పడగా ఈ సంవత్సరం విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీలోని 11 మండలాలలో ప్రతీ మండలం నుండి 'విషజ్వరం' చావుల వార్తలు వస్తున్నాయి.

కార్గిల్‌లో భారత సైనికులు ఎంతమంది చనిపోయారన్నది వివాదస్పదంగా ఉండవచ్చునుగానీ విశాఖపట్నంలో మాత్రం ప్రభుత్వ అధికారుల లెక్కల ప్రకారం కూడా అంతకంటే ఎక్కువ మంది ఆదివాసులు 'విషజ్వరాలకు' చనిపోయారు. అయితే వీళ్ల కోసం ఎవరూ నిధులు వసూలు చేయలేదు, ఏ సినీ తారలూ సంఘీభావంగా ఊరేగింపులు తీయలేదు, ఏ ప్రభుత్వ ఉద్యోగులూ ఒక రోజు జీతం

ఇవ్వలేదు, ఏ చంద్రబాబూ సానుభూతి ప్రదర్శన నిర్వహించలేదు. సైన్యం కంటే ఏజెన్సీ ఆదివాసులకే ఇవి ఎక్కువ అవసరం (చంద్రబాబు సానుభూతి మినహాయించి) అని వేరే చెప్పనవసరం లేదు. కానీ మన 'దేశభక్తి' స్వరూపం అట్లాంటిది.

ఆదివాసుల ఆరోగ్య పరిస్థితుల గురించి మన రాష్ట్ర ప్రభుత్వంలో ఒక ముఖ్య అధికారిగా ఉన్న సుజాతారావుగారు కొన్నేళ్ల క్రితం ఒక వ్యాసంలో వివరించారు. రాష్ట్రంలో మలేరియా జ్వరంతో చనిపోయేవారిలో 75 శాతం మంది ఆదివాసులేనని అంటూ, సాధారణ పరిస్థితులలో సహితం ప్రతీ 1000 మంది ఆదివాసులలో 18 మంది మలేరియా బాధితులుంటారని ఆమె అన్నారు. క్షయ రోగుల నిష్పత్తి ఆదివాసులలో రాష్ట్ర సగటు కంటే రెండు రెట్లు ఉందనీ, ప్రసవం సమయంలో చనిపోయే స్త్రీల నిష్పత్తి కూడా ఆదివాసులలో రాష్ట్ర సగటు కంటే రెండు రెట్లు ఉందనీ (కొన్ని తెగలలో ఆరు రెట్లు ఉందనీ), పసితనంలో చనిపోయే పిల్లల నిష్పత్తి సహితం అంతేనని ఆమె అన్నారు. సవర, జాతాపు, గదబ వంటి ఆదివాసీ తెగలలో సంభవించే మరణాలలో 50 శాతం 5 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలవేనని అన్నారు.

ఇది 'సాధారణ' పరిస్థితుల సంగతి. అంటే గత సంవత్సరం ఆదిలాబాద్ లోనూ ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ వచ్చిన జ్వరాల ఉప్పెన లాంటిది లేనప్పటి పరిస్థితి. పోషకాహారం లోపం (దానికి అవసరమైన వనరులు గానీ ఆదాయం గానీ లేకపోవడం), రక్షిత మంచినీటి ఏర్పాటు లేకపోవడం, పరిసరాల పారిశుద్ధ్యంలో లోపం, అందుబాట్లో (అంటే దగ్గరలో అనే కాదు, చవగ్గా అని కూడా) వైద్య సదుపాయాలు లేకపోవడం, వైద్య సదుపాయాలు ఉన్నట్టు కాగితాల మీద చెప్పుకున్న చోట కూడా డాక్టర్లు, ఇతర సిబ్బంది తరచుగా గైర్‌హాజరు కావడం, మందుల ధరలు అందుబాట్లో లేకుండా పెరిగిపోవడం ఈ పరిస్థితికి కారణంగా చెప్పుకోవచ్చు.

మామూలు సమయాలలో ఈ పరిస్థితికి ప్రభుత్వం ఏ వివరణా ఇవ్వదు. ఇమ్మని ఎవ్వరూ అడగరు. కానీ అప్పుడప్పుడు రోగాల ఉప్పెన వస్తుంది. అప్పుడు పత్రికలు రాస్తాయి. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు బాధిత ప్రాంతాల్లో పర్యటించి విషయాలు వెలికితీసి ఆందోళన చేస్తాయి.

అప్పుడు మొదట జరిగేది 'ఎంత మంది చనిపోయారు' అనే సంవాదం. నిరుడు ఆదిలాబాద్‌లో 1000 మందికి పైగా చనిపోయారని పత్రికలు రాశాయి. 2185 అని కాంగ్రెస్ వారు అన్నారు. కానీ 399 మంది 'మాత్రమే' చనిపోయారని రాష్ట్ర ప్రభుత్వం అంటుంది.

ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ అంతే. జూలై 1 నాటికి పాడేరు ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మొత్తం 418 చావులు నమోదయ్యాయి. వాటిలో 158 జ్వరాల కారణంగా (అంటే మలేరియా కావచ్చు, వైరల్ ఫీవర్ కావచ్చు) జరిగిన మరణాలని ప్రభుత్వ అధికారులు అంటున్నారు. వివిధ ప్రజా సంఘాలు మాత్రం 1000కి పైగా చనిపోయారని అంటున్నాయి.

చాలా బాధాకరమైన ఈ చావుల లెక్కల వివాదంతోనే సమస్య తెల్లవారి పోతుంది. ఈ చావులను ఆపడానికి ప్రభుత్వం ఏమీ ఎందుకు చేయదు? పోషకాహార లోపాన్నీ ఆదాయ లోపాన్నీ సవరించుకోవడానికి కొంత సమయం పడుతుందని ప్రభుత్వం అనొచ్చు. నలభై ఏళ్లుగా ఏం చేస్తున్నారని ప్రభుత్వాన్ని అడగొచ్చుగానీ మాట వరసకు కొంత సమయం కావాలని ఒప్పుకుందాం. కానీ పారిశుద్ధ్యం గురించి, వైద్య వ్యవస్థ గురించి, రక్షిత మంచినీటి పథకాల అమలు గురించి ప్రభుత్వం ఎందుకని ఏమీ చేయదు?

ఆదిలాబాద్‌లో గత సంవత్సరం సంభవించిన మరణాలకు శుభ్రమైన తాగునీటి లేమి ప్రధాన కారణం అనేది అందరికీ తెలిసిన విషయమే. ఆ జిల్లాలోని 3 వేల చిల్లర జనావాసాలలో (ఒక్కొక్క గూడేన్నీ ఒక్కొక్క జనావాసంగా లెక్క గడితే) కేవలం 20 శాతానికి రక్షిత మంచినీటి పథకాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు ఇచ్చిన నోటీసుకు జవాబుగా చెప్పింది. రాష్ట్రావతరణ జరిగిన నాలుగు దశాబ్దాల తరువాత (స్వర్ణాంధ్రప్రదేశ్‌కు కేవలం రెండు దశాబ్దాల ఇవతల) ఆదివాసీ గూడేలకు నిలయమయిన ఆదిలాబాద్ దుర్గతి ఇది. పోనీ అయిందేదో అయింది, ఇకపైన ఏం చేయబోతున్నారని అడిగితే - ఈ సంవత్సరం తీరికగా ఇంకొన్ని జనావాసాలలో రక్షిత మంచినీటి పథకాలు చేపట్టబోతున్నామనీ, వాటివల్ల మంచినీళ్లు దొరికే జనావాసాల సంఖ్య 1999 చివరికి 20 శాతం నుండి 35 శాతానికి పెరుగుతుందనీ ప్రభుత్వం అంటుంది. కానీ ఈ వేసవి నాటికి కట్టిన మంచినీటి టాంకులు వాళ్లు చెప్పిన దానిలో 10 శాతం మాత్రమే. ఈ లెక్కన ఆదిలాబాద్‌లో అందరికీ శుభ్రమైన మంచినీళ్లు దొరికేదెప్పుడు? అందరికీ ఉద్యోగాలు కాదు, అందరికీ భూములు కాదు, అందరికీ కడుపు నిండా తిండి కాదు, అందరికీ శుభ్రమైన మంచినీళ్లెప్పుడు దొరుకుతాయని అడుగుతున్నాం. సిగ్గు విడిచిపెట్టి (ఈ రాష్ట్రానికి చెందిన వాళ్లమయినందుకు) ఆ ప్రశ్న అడుగుతున్నాం. అది జరగనంత కాలం ఆదిలాబాద్ జిల్లాకు అతిసార వ్యాధి నుండి రక్షణ ఉండదు. ఈ సంగతి తెలిసి కూడా ప్రభుత్వం చొరవగా కదలకపోవడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

రక్షిత మంచినీటి వ్యవస్థలాగే ప్రభుత్వం తలచుకుంటే చేయగలిగింది పారిశుద్ధ్యాన్ని కాపాడడం, వైద్య వ్యవస్థను బాగుపరచడం. విశాఖపట్నంలో

ప్రస్తుతమున్న పరిస్థితిని నివారించడానికి ఈ చర్యలు ఉపయోగపడి ఉండేవి. ఏజెన్సీ గూడేలలో తాండవిస్తున్న మృత్యువును నిలువరించడానికి కూడా ఉపయోగపడి ఉండేవి. పైన చెప్పిన వ్యాసంలో సుజాతారావుగారు దీనికి సంబంధించి వివరమైన సూచనలిచ్చారు. ఆమె వేరే ఎవరో కాదు. మన రాష్ట్ర ప్రభుత్వంలోనే ప్రిన్సిపల్ సెక్రటరీ హోదా ఉన్న ఐఎఎస్ అధికారి. కొంతకాలం వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా ఉన్నారు. ఆమె వంటి వారి నైపుణ్యాన్ని వాడుకొని ఏజెన్సీలో వైద్య, ఆరోగ్య, పారిశుద్ధ్య వ్యవస్థలను బాగు చేయడానికి ప్రభుత్వానికి ఏం కష్టమొచ్చింది?

ఏం కష్టమొచ్చిందో గానీ చేయగల పనులు ప్రభుత్వం చేయకపోవడం వల్ల నిరుడు ఆదిలాబాద్‌లోనూ ఈ సంవత్సరం విశాఖపట్నంలోనూ కొన్ని వందల - బహుశా వేల - ప్రాణాలు పోయాయి. పోయిన ప్రాణాలను లెక్కబెట్టవచ్చునేమో గానీ తమ ఆప్తులను పోగొట్టుకున్న వారి బాధనూ, తమ కన్న పిల్లలు కళ్ల ఎదుటే జ్వరానికి బలి అవుతుంటే నిస్సహాయంగా చూడడం తప్ప ఏమీ చేయలేని ఆదివాసీ తల్లిదండ్రుల ఆవేదననూ ఎవరు లెక్కగట్టగలరు?

20వ శతాబ్దపు చివరి దశకంలో ఎవ్వరూ చావనవసరం లేని పద్ధతిలో ఈ ప్రజలు చనిపోతున్నారు. శుభ్రమైన మంచినీళ్లు లేక, శుభ్రమైన పరిసరాలు లేక, పారిశుద్ధ్యానికి అవసరమైన డిడిటి వంటి క్రిమి సంహారక మందులు లేక, ఉన్న వాటిని ఉపయోగించే శ్రద్ధగల అధికారులు లేక చనిపోతున్నారు. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లాలో 50 లక్షల రూపాయలు విలువ గల డిడిటి కాలపరిమితి లోపల వినియోగించక వృధా అయిందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక విమర్శించింది. అదే సమయంలో అతిసార, మలేరియా వంటి రోగాలకు ఆ జిల్లాలో వందల మంది బలయ్యారు. షాపుల నిండా ఉన్న మందులు, పుస్తకాల నిండా ఉన్న వైద్య నైపుణ్యం రోగులకు అందుబాట్లో లేక చనిపోయారు.

ఏ నిర్లక్ష్యం వల్ల కార్గిల్ సరిహద్దు దగ్గర నాలుగయిదు వందల మంది సైనికులు చనిపోయారని దేశమంతా చర్చిస్తోందో భారతావనిలోపల జరిగిన అటువంటి ఒక నిర్లక్ష్యాన్ని గురించి, దానికి బలయిన జనాన్ని గురించి మాత్రం ప్రశ్నలు వేసేవారు లేరు, జవాబుల కోసం నిలదీసేవారు లేరు.

వాళ్లు ఆదివాసులనే కదా?

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*

*2 ఆగస్టు 1999*

# మెదడువాపుకు పందులు కారణమా?

రాష్ట్రంలో మెదడువాపు ప్రబలింది కాబట్టి పందులను చంపండని ముఖ్యమంత్రి మూడు రోజుల క్రితం ప్రకటించాడు.

చిన్న పిల్లల ప్రాణాలు తీసే ఆ వ్యాధి పట్ల సమాజంలో తీవ్రమైన ఆందోళన ఉండడం చాలా సహజం. పైగా మురికి వాడలలో నివసించే పేద వర్గాల పిల్లలే ఈ వ్యాధికి బలి అవుతారు కాబట్టి వైద్యం కొనుక్కునే స్తోమత లేని ఆ పిల్లల గురించి ఆందోళన చెందడం మరీ సహజం.

కానీ ఒక సమస్య గురించి సమాజంలో ఆందోళన ఉందని చెప్పి అనాలోచితమైన పరిష్కారాలను బాధ్యతగలవారు ప్రచారం చేస్తే అసలు సమస్యకు తోడు కొత్త సమస్యలు పుట్టుకొచ్చే ప్రమాదం ఉంది.

పందులను చూసి భయపడే పరిస్థితి కల్పిస్తే, అది పందులు పెంచి బతికే ప్రజల మీద ద్వేషంగా మారే అవకాశం ఉంది. పందులు పెంచి బతికే ప్రజలు ఎరుకల, దొమ్మరి, యానాది మొదలైన కులాల వారు. ఈ ప్రజలను మామూలుగానే హైందవ సమాజం చాలా తక్కువ భావంతో చూస్తుంది. పిల్లలను చంపే పందులను పోషించి బతికేవాళ్లుగా వాళ్లను చిత్రిస్తే వారిపైన ద్వేషం సులభంగా పెరగగలదు. ఆ సంగతి తెలిసే అధికారులు ఈ ప్రచారం చేస్తున్నారు. ఒకసారి ఈ రకమైన అభిప్రాయం కలిగించేస్తే, ఇంక ఆ తరువాత

నల్లులనో, దోమలనో చంపినట్టు పందుల హననం కొనసాగించినా సమాజంలో ఎవ్వరూ అడగరు. తమ జీవనాధారం పోతున్నదని బాధపడే ఎరుకల, దొమ్మరి తదితర బడుగు ప్రజలకు ఎంత మాత్రం సానుభూతి దొరకదు.

కానీ నిజానికి పందులకూ మెదడువాపు వ్యాధికీ ప్రత్యక్ష సంబంధమేమీ లేదు. పందులు పిల్లలను కరవడం వల్లనో లేక తాకడం వల్లనో లేక పందులు సంచరించే చోట గాలి పీల్చడం వల్లనో ఆ రోగం రాదు.

మెదడువాపు వ్యాధి ఒక సూక్ష్మక్రిమి వల్ల వస్తుంది. మలేరియా క్రిమిలాగా ఈ క్రిమి కూడా దోమల ద్వారా ప్రసారమవుతుంది. దోమలు మనల్ని కరిచినప్పుడు ఆ క్రిమి మన రక్తంలోకి ఎక్కుతుంది. వేరే ఏ రకంగానూ - పందులు పిల్లలను కొరికినా, పందులతోనే పిల్లలు రోజంతా ఆడుకున్నా - మెదడువాపు క్రిమి మన ఒంట్లోకి ప్రవేశించదు.

అయితే మరి ఈ వ్యాధికీ పందులకూ సంబంధమేమిటంటే ఈ క్రిమిని వ్యాపింపజేసే దోమ జాతికి పందుల వంటి పెద్ద జంతువుల రక్తమంటే ఇష్టం. కాబట్టి ఈ జాతి దోమలు ఉన్న చోట పందులు ఉంటే అవి పందుల రక్తం కోసం వాటి చుట్టూ ముసురుతాయి. అక్కడ మనుషులుంటే వారిని కూడా కరుస్తాయి. ఒక్క పందులే కాదు ఏ పెద్ద జంతువులు మందలుగా ఉన్న చోటయినా ఈ జాతి దోమగానీ ఉంటే అది ఆ మంద చుట్టూ ముసరడం వల్ల ఇదే ఫలితం ఉంటుంది. అంత మాత్రం చేత ఆవుల మందలనూ, బర్రెల మందలనూ చంపేద్దామని ఏ అధికారీ ఇప్పటి దాకా అనలేదు. పందుల పెంపకం కూడ ఎరుకల, యానాది, దొమ్మరి కులాలు కాక హైందవ సమాజంలో గౌరవం గల కులాలు చేపట్టినట్టయితే ఆ జంతువుల మీద కూడా ద్వేషం రెచ్చగొట్టేవారు కాదేమో!

అసలు దోమలు ఉన్నపుడు కదా అవి పందుల చుట్టూనయినా మనుషుల చుట్టూనయినా ముసిరేది. అవి జంతువుల చర్మాల మీద గుడ్లు పెట్టవు, పొదగవు. వాటికి మురుగునీటి మడుగులు కావాలి. మురుగునీటి మడుగులు, కాలవలు లేకుండా మన ఊళ్లను శుభ్రంగా ఉంచగలిగితే ఎన్ని పందుల మందలున్నా ఏం కాదు.

అందుకే పందుల పెంపకం సంవత్సరం పొడవునా జరిగినప్పటికీ మెదడు వాపు వ్యాధి వానాకాలంలో మాత్రమే వస్తుంది. పందులే దానికి కారణమైతే సంవత్సరమంతా ఆ వ్యాధి రావాలి. కానీ మురుగునీరు మడుగులలో నిలవ

ఉండే సీజన్‌లో మాత్రమే మెదడువాపు వ్యాధి వస్తుంటుంది. కాబట్టి చేయవలసింది పందులను చంపడం కాదు, మన ఊళ్లను శుభ్రంగా ఉంచడం.

ఇవేవీ అర్థంకాకపోయినా హైకోర్టు ఆదేశాల పట్లనయినా మన పాలకులకు గౌరవం ఉండాలి. 1987లోనే ఈ విషయం మన రాష్ట్ర హైకోర్టు ముందుకు వచ్చింది. హైకోర్టు మెదడువాపు వ్యాధిని అరికట్టడానికి పందుల సంచారాన్ని తగ్గించడం అవసరమనే భావించినప్పటికీ ఇక్కడ రెండు వైపులా సమస్యలు ఉన్నాయని అర్థం చేసుకొనింది. ఒక పక్క ఈ వ్యాధికి బలయ్యే పేద, బలహీన వర్గాల ప్రజల పిల్లలున్నారు. రెండవ పక్క పందులను పోషించి బతికే ఆదివాసీ లేక సంచార కులాల ప్రజలున్నారు. ఇద్దరికీ న్యాయం జరిగేటట్టు చూడడం కోసం హైకోర్టు 9 సూత్రాల ప్రణాళికను ఆదేశించింది.

పందుల యజమాన్లను గుర్తించి వారి దగ్గరున్న పందులకు లైసెన్సులు ఇవ్వాలి. ఒక్కొక్కరి దగ్గర ఎన్ని పందులున్నాయన్న దానిని బట్టి వారికి ఊరి వెలుపల పునరావాసానికి రెవెన్యూ అధికార్లు భూమి కేటాయించాలి. ఎక్కడో ఒకచోట కేటాయించి బలవంతంగా అక్కడికి తరలించే బదులు, రెండు మూడు జాగాలు చూపించి వాటిలో ఏది వారికి సమ్మతమైతే అదే వారికి కేటాయించాలి. ఇందుకోసం అప్లికేషన్లు పెట్టుకొమ్మని అన్ని మునిసిపాలిటీలూ పంచాయతీలూ దండోరా వేసి ప్రచారం చేయాలి. తమ జీవాలకు లైసెన్సులు, తమ వ్యాపారానికి పునరావాసం తీసుకొమ్మని ప్రోత్సహించాలి.

1987లో (ఆం.ప్ర. ఆదిమజాతి సేవా సంఘం వర్సెస్ గుంటూరు మునిసిపల్ కౌన్సిల్ కేసులో) మన రాష్ట్ర హైకోర్టు చేసిన ఈ సూచనను ఏ మునిసిపాలిటీ గానీ పంచాయితీ గానీ ఇప్పటిదాకా అమలు చేయడం మొదలుపెట్టలేదు. పందుల పెంపకందార్ల పునరావాసానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఎక్కడా భూమి కేటాయించలేదు. కాని వర్షాకాలంలో మెదడువ్యాపు వ్యాధి ప్రబలినప్పుడల్లా పందులను చంపే కార్యక్రమం మాత్రం పెద్దెత్తున చేపడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సహించడం మొదలుపెట్టిన తరువాత ఇంక వాళ్లను వెనక్కి లాగేదెవరు?

పన్నెండేళ్ల క్రితం ఆ తీర్పు ఇచ్చినప్పుడు హైకోర్టు ప్రదర్శించిన విశాల దృక్పథం ఇప్పుడు కోర్టులలో సహితం కొరవడింది. పందులను మునిసిపాలిటీ వారు చంపడం మొదలు పెట్టినప్పుడల్లా పందుల కాపరులు కోర్టుకొచ్చి 'మాకు పునరావాసం కల్పించకుండా మా పందులను చంపుతున్నారు' అంటూ

మొరపెట్టుకుంటున్నారు. అయినా వాళ్లకే అసలు ఊరు విడిచిపెట్టి బయటకు పోవడం ఇష్టం లేదనీ, వాళ్లెప్పుడూ పునరావాసం కోసం అర్జీలు పెట్టుకోలేదనీ ప్రభుత్వం దబాయిస్తుంది. గతంలో హైకోర్టు జారీ చేసిన 9 సూత్రాల ఆదేశంలో బాధ్యత ప్రధానంగా ప్రభుత్వం మీదనే పెట్టిందని ప్రభుత్వం గుర్తించదు. ఇప్పుడు కోర్టులు కూడా అట్లా అనుకోవడం లేదు. పందుల పెంపకందార్లనే తప్పుపడుతున్నాయి. ఆ వృత్తి మీద బతికే కులాల పట్ల సమాజంలో సాధారణంగా ఉండే తక్కువ భావానికి న్యాయస్థానాలు సహితం అతీతం కాదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*28 నవంబర్ 1999*

# దోమ ఒక్కటే కారణం కాదు

నిరుడు విశాఖపట్నం ఏజెన్సీలో మలేరియా మరణాల గురించి తెలుగుదేశం నాయకులు అల్లరి చేసిన సంగతి, అటువంటిదేమీ లేదని కాంగ్రెస్ పాలకులు దబాయించిన సంగతీ తెలిసినదే.

రెండువేల మందికి పైగా ఆదివాసులు మలేరియా కారణంగా మరణించారని తెలుగుదేశం నాయకులు ఆరోపించగా, లేదు లేదు ఏడుగురు మాత్రమే చనిపోయారని కాంగ్రెస్ ప్రభుత్వం అనింది.

తెలుగుదేశం నాయకులు అక్కడితో ఆగిపోకుండా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కమిషన్ ఈ ఫిర్యాదుపైన విచారణ జరిపి రిపోర్టు ఇయ్యవలసిందిగా రిటైర్డు ఐఏఎస్ అధికారి కె.ఆర్. వేణుగోపాల్ గారిని పురమాయించింది.

కె.ఆర్.వేణుగోపాల్ గారు వివరంగా పరిశీలించి జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు సమర్పించిన నివేదిక సారాంశాన్ని ప్రజలకు అందియ్యడం కోసం ఈ కరపత్రం ప్రచురిస్తున్నాం. తెలుగుదేశం నాయకుల ఫిర్యాదు నిజమేనని అంటూ, దానికి కారణమైన విధాన వక్రీకరణ మాత్రం చంద్రబాబునాయుడు పాలనలో మొదలయి కాంగ్రెస్ పాలనలో కొనసాగిందని వేణుగోపాల్ గారు తెలుగుదేశం నాయకులకు మొట్టికాయ వేశారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు మలేరియా మరణాల గురించి ఎక్కడా మాట్లాడకపోవడం గమనార్హం.

2005 సంవత్సరం మొదటి ఏడు నెలలలో పాడేరు ఏజెన్సీలో నమోదయిన 2227 చావులకు ప్రధాన కారణం మలేరియాయేనా? అదేనయితే ఆ ప్రాంతంలో మలేరియా అంత విస్తృతంగా ఎందుకుంది? వైద్య వ్యవస్థ దానినెందుకు ఎదుర్కోలేకపోతున్నది? పరిసరాల పారిశుద్ధ్యాన్ని కాపాడవలసిన ప్రభుత్వ శాఖలు ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాయి? అక్కడి ప్రజలు రోగానికి తట్టుకోవడానికి కావలసిన శారీరక శక్తి ఎందుకు లేకుండా ఉన్నారు?

ఇవీ కె.ఆర్.వేణుగోపాల్ గారు వేసుకుని జవాబు వెతికిన ప్రశ్నలు. 1999 నుండీ విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీలో ఆదివాసుల మలేరియా మరణాలను చూస్తూనే ఉన్నాము కాబట్టి, ఈ సంవత్సరం అదే జరగదన్న నమ్మకమేమీ లేదు కాబట్టి, వారు ప్రకటించిన జవాబులను తెలుసుకోవడం మన వంతుగా విపత్తును ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండేందుకు ఉపయోగపడవచ్చు.

## వైద్య వ్యవస్థ

వైద్య సిబ్బంది కొరతను మలేరియా మరణాలకు ఒక ముఖ్య కారణంగా కె.ఆర్. వేణుగోపాల్ గారు గుర్తించారు.

'గడచిన ఆరేడు సంవత్సరాలుగా అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగుల నియామకమూ ఆంధ్రప్రదేశ్‌లో నిలిచిపోయింది. ఇది ఏజెన్సీ ప్రాంతంలోని వైద్య సిబ్బందికి కూడా వర్తిస్తుంది' అని వేణుగోపాల్‌గారు అన్నారు. ఇది చంద్రబాబు నాయుడు ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా జరిగిందని మనకు తెలుసు.

పాడేరు ఏజెన్సీలోని వివిధ ప్రభుత్వ వైద్యశాలలలో మొత్తం 818 పోస్టులు ఉండగా, 2001-2002లో అందులో 99 ఖాళీగా ఉన్నాయి. 2002-2003లో 106 ఖాళీగా ఉన్నాయి. 2003-2004లో 147 ఖాళీగా ఉన్నాయి. 2004-2005లో 186 ఖాళీగా ఉన్నాయి. ఈ నాలుగు సంవత్సరాలూ ఖాళీగా ఉన్న పోస్టులలో అత్యున్నత స్థాయిలోని అయిదు పోస్టులనూ పేర్కొనాలి. సివిల్ సర్జన్, సివిల్ సర్జన్ (స్పెషలిస్టు), ముగ్గురు డిప్యూటీ సివిల్ సర్జన్‌ల పోస్టులు 2001 నుండి ఖాళీగానే ఉన్నాయి.

'వైద్యరంగంలో పోస్టులు భర్తీ చేసే విషయంలో ప్రభుత్వం వైఖరి ఈ విధంగా ఉండగా ఆదివాసుల ఆరోగ్యం బాగుండడం కల్ల' అని వేణుగోపాల్‌గారు అన్నారు.

ఏజెన్సీలోని వైద్య వ్యవస్థ కాళ్ళులం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు. వీరిని ప్రవేశపెట్టింది కూడ ప్రపంచ బ్యాంకు సలహా మేరకే. పాడేరు ఏజెన్సీలో గ్రామగ్రామాన ఉన్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల సంఖ్య 3200. వీళ్లు అదే ఏజెన్సీకి చెందిన ఆదివాసీ మహిళలు. ఆదివాసులందరిలాగ వీళ్లు కూడా వారంలో రెండు రోజులు పస్తులుంటారు. కూలి చేసుకొని సంసారాలు పోషించుకుంటూ తమకే తెలియని వైద్యం చేస్తుంటారు. దీనికి వారికిచ్చే పారితోషికం నెలకు 400 రూపాయలు. అది కూడా ప్రతీ నెలా ఇవ్వడం లేదు. ఆరు నెలలకొకసారి ఇస్తారు. 'కూలి చేసుకొని అర్థాకలితో బతుకీడుస్తూ ఆరు నెలలకొకసారి పారితోషికం పొందే ఈ ఆదివాసీ మహిళలు తమ తోటి ఆదివాసులలో ఆరోగ్య స్ఫూర్తిని ప్రచారం చేస్తారనీ, మలేరియా వ్యాధిపైన పోరాటం చేస్తారనీ ఎట్లా ఆశిస్తాం?' అని వేణుగోపాల్‌గారు ప్రశ్నించారు.

అలాగని కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల నియామకాన్ని వేణుగోపాల్ గారు నిరర్థకమన లేదు. వారికి కనీస ఆర్థిక భద్రత కల్పించి తగుమాత్రం శిక్షణ ఇయ్యవలసి ఉండిందనీ, అదేమీ లేకుండా పారాసెటమాల్ బిళ్లలూ, క్లోరోక్విన్ బిళ్లలూ ఇచ్చి జనం మీద వదిలేస్తే వచ్చే ప్రయోజనమేమీ లేదనీ అన్నారు.

## పేదరికం

ఒంట్లో సత్తువ ఉంటే ఏ మందులూ లేకున్నా రోగాన్ని కొంత మేరకు తట్టుకోగలం. ఆ శక్తి ఉండాలంటే తిండి ఉండాలి. తిండి ఉండాలంటే పని దొరకాలి, తగు మాత్రం వేతనం దొరకాలి.

ప్రభుత్వ గణాంకాల ప్రకారమే పాడేరు ఏజెన్సీలోని 1,26,013 కుటుంబాలలో 1,17,834 దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయి. ఆ రేఖకు ఎగువన ఉన్న కొద్దిమందీ గిరిజనేతరులే అయి ఉంటారు కాబట్టి, ఆదివాసీ జనాభా మొత్తంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉందని భావించవచ్చు. అందులో 57,975 కుటుంబాలను 'పేదలలోకే పేదలు'గా ప్రభుత్వమే గుర్తించింది.

ఆదివాసీ కుటుంబాలన్నీ కూడా వారంలో మూడు లేక నాలుగు రోజులు ఒక పూట మాత్రమే తింటున్నట్టు తాను పర్యటించిన గ్రామాలలో తెలుసుకున్నానని వేణుగోపాల్‌గారు అన్నారు.

గ్రామాలలో కూలిపనికి ఇచ్చే వేతనం రోజుకు 20 రూపాయలు మాత్రమే (స్త్రీకయినా, పురుషునికయినా). డివిజన్ కేంద్రమయిన పాడేరులో ఏదైనా పని

దొరికినప్పుడు అంతకంటె ఎక్కువ వేతనమే ఇస్తారు గానీ పాడేరులో పని దొరికేది తక్కువ, దానికి పోటీ ఎక్కువ. మొత్తం మీద ఆదివాసులకు సంవత్సరంలో నాలుగు నెలలు మాత్రమే పని తగినంత దొరుకుతుందనీ, తక్కిన ఎనిమిది నెలలూ అర్ధాకలితో బతకవలసిందేననీ వేణుగోపాల్‌గారు నిర్ధారించారు. పోషకాహార లోపం అత్యధికంగా ఉండేది మే, జూన్, జూలై నెలలలోననీ, మలేరియా జ్వరం ఉధృతంగా వ్యాపించేదీ ఆ కాలంలోనేననీ అన్నారు.

ఈ కొద్దిపాటి ఆదాయంతోనైనా రేషన్ బియ్యం కొనుక్కొని ఆ మేరకయినా ప్రభుత్వ సహాయం పొందగలరా అంటే అదీ లేదు. డిపోలో నెలసరి బియ్యం ఒకే రోజు ఇస్తారు. కుటుంబం కోటా అయిన 20 కేజీలూ ఆ రోజు కొనుక్కోవలసిందే. ఒకేసారి అంత డబ్బు చేతిలో లేక కొనుక్కోలేకపోతే ఎంత కొనుక్కుంటే అంతే ప్రాప్తి. ఆపైన ఇంటి అవసరాలకు మార్కెట్ రేటు పెట్టి బయట కొనుక్కోవాలి, లేకపోతే బియ్యం లేకుండా బతకాలి.

ఈ పరిస్థితిలో ప్రతీ ఆదివాసీ కుటుంబమూ మండల కేంద్రాలలోని షావుకార్లకు రుణపడి ఉందంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ఒక్కొక్క కుటుంబం తలమీద ఉన్న రుణభారం రూ. 10,000/- దాకా ఉండవచ్చు. దీనికి వడ్డీ చాలా సందర్భాలలో నెలకు రూ. 100/-కు అయిదు రూపాయలు. అంటే 60%.

ఇంతటి పేదరికంలో ఉన్నవారు రోగాలనెట్లా ఎదుర్కోగలరు?

## పరిసరాల పారిశుద్ధ్యం

మలేరియా క్రిమి మన శరీరంలోకి దోమ వల్ల ప్రవేశిస్తుంది. పాడేరు ఏజెన్సీలో సంవత్సరం పొడవునా దోమలుంటాయి. అక్కడ అడవులు దట్టమైనవి. వార్షిక వర్షపాతం 1124 మి.మీ.లు. నేల ఎగుడుదిగుడుగా ఉండడం వల్ల వర్షం నీరు మడుగులలో నిలిచిపోతుంది. ప్రజలకు బహిర్భూమే మరుగుదొడ్డి కావడం వల్ల ఈ మడుగులు మలినానికి నెలవవుతాయి, దోమలకు ఆవాసాలవుతాయి. దోమలు అధికంగా ఉండే ప్రాంతాలలో మలాథియాన్ వంటి మందులు స్ప్రే చేసే బాధ్యత మలేరియా నిరోధక శాఖది. కానీ వేణుగోపాల్‌గారు పర్యటించిన అన్ని గ్రామాలలోనూ వారు గమనించిందేమిటంటే, ఇళ్ల బయట, పశువుల కొట్టాలలో స్ప్రేయింగ్ జరుగుతున్నది గానీ మురుగు నీటి కుంటల మీద, కాలవల మీద, ఊరి పక్కనున్న చేలలోను చేయడం లేదు. అది కూడా సంవత్సరంలో ఎప్పుడో ఒకటి రెండుసార్లు జరుగుతున్నది. చావులు మొదలయిన తరువాతే స్ప్రేయింగ్ మొదలవుతున్నది.

శుభ్రమైన తాగునీటి వసతి సహితం ఆదివాసీ గ్రామాలకు ప్రభుత్వం కల్పించలేదు. పాడేరు ఏజెన్సీలో 3,468 ఆవాసాలు ఉండగా, అందులో 114 ఆవాసాలలో మాత్రమే నీళ్ల ట్యాంకు, ఇంటింటికి పైపులు ఉన్నాయి. 2078 ఆవాసాలలో చేతిబోర్లు మాత్రమే ఉన్నాయి. వర్షాకాలంలో బోరు దగ్గర నీళ్లు నిలిచినట్టయితే బోరు నుండి తోడుకునే నీరు కలుషితమై ఉండే అవకాశం ఉంది. 1083 ఆవాసాలకైతే ఏ నీటివసతీ లేదు - అంటే సమీపంలోని ఏ వాగు నుండో తెచ్చుకుంటారు. అటువంటి నీటివనరుల శుభ్రత గురించి చెప్పనవసరం లేదు.

దోమల బారినుండి ప్రజలను కాపాడడానికి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తానని హామీ ఇచ్చిన దోమతెరలు మూడవ వంతు కుటుంబాలకు కూడా అందలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి సహాయంగా రావలసిన 'స్ప్రే' చేసే క్రిమిసంహారక మందు కూడా సకాలంలో అందలేదు. ఆ మందు 'స్ప్రే' చేసింది తక్కువే కాగా మొదలుపెట్టింది కూడా చాలా ఆలస్యంగా.

## చావుకు కారణం మలేరియాయేనా?

చావులకు కారణం మలేరియా కాదనీ, ఎండదెబ్బ నుండి గుండెపోటు దాకా అనేక కారణాలున్నాయనీ ప్రపంచాన్ని నమ్మించడానికి రాష్ట్ర ప్రభుత్వమూ, స్థానిక వైద్య సిబ్బందే కాక రాష్ట్ర ప్రభుత్వం పిలిపించిన నిపుణులు కూడా చేసిన ప్రయత్నాలను వేణుగోపాల్‌గారు తీవ్రంగా అభిశంసించారు. మృతులకు పోస్టుమార్టం నిర్వహించి ఎవరెందుకు చనిపోయారో నిర్ధారించే ప్రయత్నం ప్రభుత్వం చేయకపోయినా ఏజెన్సీలోని ఆస్పత్రులకు వచ్చిన రోగుల రక్తపరీక్షలో సగటు కంటే చాలా ఎక్కువ కేసులు మలేరియా జబ్బును సూచించిన మాట ప్రభుత్వ అధికారుల నివేదికలే తెలుపుతున్నాయనీ, మలేరియా అని తేలిన కేసులలో 70 శాతం కంటే ఎక్కువ ప్రాణాంతకమైన ఫాల్సిపారం మలేరియా (ఇది మెదడును దెబ్బతీసి వేగంగా చావుకు కారణం అవుతుంది) అనీ కె.ఆర్.వేణుగోపాల్ గారు అభిప్రాయపడ్డారు. వివరమయిన విశ్లేషణ అనంతరం, 'జ్వరం వల్ల చనిపోయిన వారిలో అత్యధికులు మలేరియా వల్ల, అందులో ఫాల్సిపారం మలేరియా వల్ల చనిపోయారని నేను భావిస్తున్నాను' అన్నారు.

## ముగింపు

ఇది నిజానికి ముగింపులేని సమస్య. పేదరికం, పోషకాహార లోపం, దోమల బెడద కల్పించిన సమస్యను వైద్య పారిశుద్ధ్య వ్యవస్థలను పనిగట్టుకొని నాశనం చేసిన బాధ్యతారహిత పాలనా విధానాలు ఎన్నో రెట్లు పెంచాయి. అన్ని కోణాల నుండి పరిస్థితిని చక్కబెట్టే బృహత్తర ప్రయత్నం ఇప్పటికే మొదలుకావలసి ఉండింది కానీ కాలేదు. ప్రజలయినా ఒత్తిడి పెట్టి మొదలుపెట్టించకపోతే వేసవి ఎంతో దూరం లేదు, ఆ వెనుక వచ్చే వర్షాలూ, అవి తెచ్చే రోగాలూ ఎంతో దూరం లేవు.

1. పాడేరు ఏజెన్సీలోని ఆస్పత్రులలో అన్ని పోస్టులూ వెంటనే నింపాలి. డాక్టర్లంతా విధులలో ఉండేటట్టు చూడాలి.
2. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నెలకు 1000 రూపాయల జీతంతో పాటు మలేరియా చికిత్సలో ప్రాథమిక తర్ఫీదు ఇవ్వాలి.
3. వేసవిలో ఆదివాసులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించే పథకాలు రూపొందించి అమలు చేయాలి. బియ్యం కేజీ 3.00 రూపాయలకు ఇచ్చే అంత్యోదయ పథకాన్ని ఆదివాసులందరికీ అందుబాటులోకి తేవాలి.
4. మలాథియాన్ వంటి క్రిమిసంహారక మందులు విరివిగా సరఫరా చేయాలి, క్రమం తప్పకుండా స్ప్రే చేయాలి.
5. అన్ని ఆదివాసీ గూడేలకూ శుభ్రమైన మంచినీటి వసతి కల్పించాలి.
6. ఆదివాసీ కుటుంబాలన్నిటికీ ఉచితంగా తగినన్ని దోమతెరలు సరఫరా చేయాలి.
7. ఏజెన్సీలో అసహజ మరణాల గురించి ప్రభుత్వము, ప్రభుత్వ వైద్యులు అబద్ధాలు చెప్పడం మానేయాలి.

*మానవ హక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది.*
*20 జనవరి 2006*

# జ్వరం ఆదిలాబాద్‌కా వైద్యశాఖకా?

ఆదిలాబాద్‌లో ఆదివాసులకు జ్వరాలు ఎందుకొస్తున్నాయంటే 'వాళ్లు మందులు వాడరు. ఆకులూ పసరులూ తింటారు' అని ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ వైద్యులు అన్నప్పుడు చాలామంది నమ్మే ఉంటారు. ఆదివాసుల పట్ల సానుభూతి ఉన్నవాళ్ళు కూడా నమ్మే ఉంటారు. తెలియక అట్లా చేస్తారేమో, ప్రభుత్వం వారికి తెలియ జెప్పొచ్చు కదా అనుకొని ఉంటారు.

కానీ ఆదివాసులు మొదట ప్రభుత్వ వైద్యాన్నే ఆశ్రయించి, అది పనిచేయనప్పుడు లేదా వేరే ఏ కారణంగానైనా జ్వరం నయం కానప్పుడు మాత్రమే తమకు సంప్రదాయంగా తెలిసిన పసరులూ అవీ తింటున్నారని తెలిస్తే ఆశ్చర్యపోతారేమో. ప్రజల పట్ల సానుభూతి ఉన్న వాళ్ళకూ లేని వాళ్ళకూ కూడ ప్రజల గురించి ముందుగా ఏర్పరచుకున్న అనేక సామాన్య అభిప్రాయాలు ఉంటాయి. ఒకరు వాటిని సానుభూతితో స్వీకరించవచ్చు. మరొకరు వారిని నిందించ డానికి వాడుకోవచ్చు. సానుభూతి ఎంత ముఖ్యమో, ముందుగా ఏర్పరచుకున్న అభిప్రాయాల నుండి బయటపడడమూ అంతే ముఖ్యం.

అప్పుడు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఎంత అన్యాయ మయిందనేది ఇంకా స్పష్టంగా అర్థం అవుతుంది. ఏజెన్సీ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లే కాక ప్రతీ గ్రామంలోనూ

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉంటారు. పేరు పెద్దదేగానీ ఈ వ్యక్తి ఆ ఊరికి చెందిన ఆదివాసీయే. అందరిలాగా ఆకలి బారిన, అనారోగ్యం బారిన పడి శుష్కించిన మనిషే. ఆమె (ఎక్కువగా దీనికి స్త్రీలనే ఎంపిక చేస్తున్నారు) దగ్గర జ్వరానికొక గోలి, మలేరియాకు ఒక గోలి, ఒక్కొక్కసారి మలేరియాకు రెండు గోలీలు ఉంటాయి. ఎవరికి జ్వరం వచ్చినా ఆ గోలీలు ఇచ్చేస్తుంది. అవి తింటారు.

రోగం తగ్గకపోతే దాదాపు ప్రతీ మండల కేంద్రంలోనూ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోతారు. ఎక్కువ భాగం ఎడ్లబండి కట్టుకొని పోతారు. అక్కడ డాక్టరు ఉండాలి, హెల్త్ అసిస్టెంటులు ఉండాలి. కానీ ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ పోస్టులు సగం దాకా ఖాళీ ఉన్నాయి. జ్వరాలు అధికంగా ఉన్న నార్నూరు, జైనూరు, సిర్పూరు (యు), తిర్యాని, కెరిమిరి మండలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని 15 డాక్టర్ల పోస్టులలో 8 ఖాళీ ఉన్నాయి. కొన్ని ఆరు నెలలుగా ఖాళీ ఉన్నాయి. కొన్ని ఒక సంవత్సరంగా ఖాళీ ఉన్నాయి. ఎందుకు ఖాళీ ఉన్నాయి? అని రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్‌ను ప్రశ్నిస్తే, ప్రైవేటు ఆసుపత్రులలో జీతాలు మెరుగుగా ఉన్నాయి కాబట్టి మారుమూల ప్రాంతాలలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టింగ్ ఇస్తే ఎవ్వరూ చేరడం లేదని అంటారు. ప్రైవేటు వైద్యాన్ని నివారించే ప్రయత్నం ప్రభుత్వం చేయనప్పుడు ప్రభుత్వ వైద్యుల జీతాలు తగు మాత్రం పెంచకపోతే ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యులు దొరకరు మరి. ఆ మాత్రం ఆలోచన ప్రభుత్వానికి ఉండనక్కర లేదా?

ఉండాలిగానీ లేదు. అయినా ఒకవేళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఉన్నా, కేసు ఏ మాత్రం సీరియస్‌గా ఉన్నా 'ఉట్నూరుకు తీసుకుపోండి' అంటున్నారు. రోగిని తీసుకుపోవడానికి ఆరోగ్య కేంద్రం వద్ద అంబులెన్స్ ఉండదు. రోగి బంధుమిత్రులే ఖర్చు పెట్టుకొని తీసుకుపోవాలి. ఖర్చు పెట్టుకోలేకపోతే ఏం చేయాలి? వెనక్కి పోవాలి. మళ్లీ కమ్యూనిటీ హెల్త్ వర్కర్ ఇచ్చే గోలీలు తినాలి, లేదా తమకు తెలిసిన ఆకులూ పసరులూ తినాలి. అంతకంటే ఏం చేయగలుగుతారు?

చాలా గ్రామీణ ప్రాంతాలలో కనిపించే ఆర్ఎంపిలు సహితం ఆదిలాబాద్ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ కనిపించరు. ఏ డాక్టర్ దగ్గరో కొన్నాళ్లు పనిచేసి, కొన్ని మందుల పేర్లు, ప్రయోజనాలు తెలుసుకుని మారుమూల ప్రాంతంలో దుకాణం పెట్టేవారికి సహితం ఉట్నూరు ఏజెన్సీ ఆకర్షణీయంగా కనిపించలేదంటే ఆదివాసుల ఆర్థిక స్థితి, స్తోమత అర్థం చేసుకోవచ్చు.

ఉట్నూరు ప్రభుత్వ ఆస్పత్రికి ఒకవేళ పోయినా రోగం నయమవుతుందన్న నమ్మకం లేదు. నయం చేయలేకపోతే ఆదిలాబాద్‌కో హైదరాబాద్‌కో పొమ్మని డాక్టర్ అంటాడు గానీ ఎంత సీరియస్‌గా ఉన్నా పంపించడానికి అక్కడ కూడా అంబులెన్స్ లేదు. లేనే లేదా అంటే ఉంది గానీ ఆరు నెలలుగా మూలన పడి ఉంది.

ఆదివాసులు అశాస్త్రీయ వైద్య విధానాలను నమ్ముకుంటున్నారని ప్రభుత్వం అంటుంది గానీ ప్రభుత్వ వైద్య విధానం ఎంత శాస్త్రీయంగా ఉంది? మలేరియా నివారణ కోసం గ్రామాలలో దోమలకు నెలవైన చోట్ల మందు కొట్టాలి. దానికోసం ఒక ప్రత్యేక ప్రభుత్వ శాఖ ఉంది. వారేం చేస్తున్నారంటే ఒక్కొక్క మండలంలోనూ 'హైరిస్క్' (అధికంగా 'రిస్క్' ఉన్న) గ్రామాలను ఎంచుకొని అక్కడ మాత్రం మందు కొడుతున్నారు. ఒక ఊరు 'హైరిస్క్' గ్రామం ఎప్పుడవుతుంది? ఆ ఊరిలో ఎవరైనా చనిపోయినప్పుడు అవుతుంది. ప్రతీ ఊరిలోనూ దోమల మందు కొట్టలేని 'శాస్త్రీయత'ను ఏమనాలి?

ప్రభుత్వ వైద్యులు సహితం ఆదివాసులలో రక్తహీనత చాలా ఉందని అంగీకరిస్తున్నారు. ఎర్రకణాలు సగటున ఉండవలసిన దానిలో సగమే ఉంటున్నాయి. దీనివల్ల రోగాలను ప్రతిఘటించే శక్తి క్షీణించి ఏ రోగం వచ్చినా ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉంది. దీని నివారణ హడావుడి పర్యటనతో, 'యుద్ధ ప్రాతిపదికన' జరిపే అత్యవసర తంతుతో జరగదు. ప్రజలకు పని కల్పించాలి, ఆదాయాలు పెంచాలి, సరయిన పోషకాహారాలు దొరికేటట్టు చూడాలి. దాదాపు ఒకటిన్నర దశాబ్దకాలంగా ప్రభుత్వం వ్యాపార పంటలు వేయమనీ, ఆదాయాలు పెంచుకొమ్మనీ రైతాంగాన్ని ప్రోత్సహించడం చూస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలూ క్రమంగా ప్రైవేట్‌పరం కావటం వల్ల చేతిలో నగదు ఉండవలసిన అవసరం మారుమూల ప్రాంతాలలో నివసించే వారికి సహితం పెరిగింది. దీని ప్రభావం ఆదిలాబాద్‌లో ఆదివాసులు వేసే పంటల మీద పడింది. వాళ్లు కూడా అధిక భాగం పత్తి, సోయాబీన్స్ పండిస్తున్నారు. అవి అమ్మి ఆహార అవసరాలు కొనుక్కోవాలి. ఇది అనివార్యంగా పోషకాహార లోపానికి దారి తీస్తున్నది.

ఉపాధి హామీ పథకం ద్వారా సంవత్సరంలో 100 రోజులు తప్పనిసరిగా పని కల్పించాలన్న హక్కు ప్రజలకు ఇచ్చామన్నారు గానీ ఆచరణలో అది పని హక్కు పథకంగా కాక కేవలం మరొక కరువు పనుల పథకంగా మారింది. పనులు చేపడితే అవసరమయినంత మందికి పని కల్పిస్తారే తప్ప ఒక హక్కుగా అందరికీ

పని కల్పించరు. పైగా అన్ని ప్రభుత్వ వ్యవహారాలలాగా దీనిలోనూ అవినీతి పాలు పుష్కలంగా ఉంది.

చావుల గురించి పత్రికలు అతిశయోక్తులు రాస్తున్నాయని జిల్లా అధికారులు మండిపడుతున్నారంట. నిజానికి రోగాల గురించి ఇప్పటి దాకా వార్తలొచ్చిన గ్రామాలను పరిశీలిస్తే, అవన్నీ ఏదో ఒక రహదారికి మరీ దూరంలో లేని గ్రామాలేనని తెలుస్తుంది. ఇక రహదారికి దూరంగా ఉండే తిర్యాని, కెరిమెరి లాంటి మండలాలలో ఉన్న గ్రామాల పరిస్థితి ఏమిటో ఎవరికీ తెలీదు. వాటి గురించి పత్రికలు రాయడం లేదు. అందువల్ల పత్రికల వార్తలలో 'అతిశయోక్తి' ఉందనడంలో అర్థం లేదు.

అన్నిటికంటే జరుగుతున్నదాన్ని జరగడం లేదని బుకాయించడంలో ప్రభుత్వం చూపుతున్న ఆరాటం చాలా లజ్జాకరం. మలేరియా వంటి రోగాలకు నివారణ ఉంది కాబట్టి, నివారించే బాధ్యత ప్రభుత్వం పైన ఉంది కాబట్టి, మలేరియా ప్రబలిందని ఒప్పుకుంటే ప్రభుత్వ పారిశుద్ధ్య వ్యవస్థ వైఫల్యం గురించి చర్చ వస్తుంది. దాని బదులు 'కారణం తెలియని జ్వరాలు', 'వైరల్ ఫీవర్స్' (ఇది కారణం తెలియని జ్వరానికి ఇంగ్లీషు పేరు) వంటి కారణాలు చూపిస్తే ప్రభుత్వం ఏం చేయగలదు అని దబాయించవచ్చు. ప్రభుత్వం ఒప్పుకుంటున్న 149 చావులలో 6 మాత్రమే మలేరియా వల్ల సంభవించాయనీ, మిగిలినవి వివిధ (మొత్తం 23 రకాల) జబ్బులు లేక రుగ్మతల వల్ల జరిగాయనీ ఆదిలాబాద్ జిల్లా వైద్యశాఖ అంటున్నది. అందులో 13 ఎండదెబ్బ వల్ల సంభవించిన మరణాలు కూడా ఉన్నాయి. మృతులెవ్వరికీ సరయిన వైద్యం సంగతి అటుంచి రోగనిర్ధారణ కూడ జరగనప్పుడు మరణాలకు గల కారణాలు అంత కచ్చితంగా ఎట్లా తెలిసాయో!

అన్నిటి కంటె బాధాకరమేమిటంటే చనిపోతున్న వారిలో అత్యధికులు పసిపిల్లలు. ఏ గ్రామానికి పోయినా జ్వరంతో వణుకుతూ ఏడుస్తున్న నాలుగయిదేళ్ళ పిల్లలు, వారి పక్కన దిగులుగా కూర్చున్న తల్లులూ మనకు కనిపించే దృశ్యం. చావంటే ఏమిటో కూడ తెలియని పిల్లల ప్రాణాలు అర్ధంతరంగా రాలిపోవడం ఎటువంటి వారి గుండెలనైనా పిండేయాలి గానీ 'ఆదివాసీ సమాజాలలో శిశుమరణాలు కొత్తేమీ కాదు' అని ప్రభుత్వ అధికార్లు మాత్రం దులిపేసుకో గలుగుతున్నారు.

*ప్రజాతంత్ర వారపత్రిక*

*2 డిసెంబర్ 2007*

# వర్షాలు - వ్యాధులు - వనవాసం

ఉప ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితి అనుకున్నంత ఘనంగా విజయాలు సాధించకపోవడం వల్ల నష్టాలు చాలానే ఉండగలవు గానీ ఒక లాభం కూడా ఉండగలదు. తెలంగాణ ఉద్యమకారులు ఇకనైనా ప్రజల నిత్యజీవిత సమస్యలపైన ఉద్యమాలు నిర్మించే కర్తవ్యాన్ని చేపడతారేమో. రాజకీయ లక్ష్యం ఏదైనా, ప్రజల సమస్యలపైన వారిని సంఘటితం చేస్తూ అటువైపు నడిపించడమే సరయిన మార్గమన్న స్పృహ తెలంగాణకు కొత్తకాదు గానీ, తెలంగాణ సాధనకు పోరాటాలూ త్యాగాలూ అవసరం లేదని కెసిఆర్ ఏనాడయితే అన్నాడో తెలంగాణ ఉద్యమకారులందరూ దానిని మరచిపోయారు. ఈ వెనకడుగు నుంచి మరచిపోయిన ఆ చైతన్యాన్ని మళ్లీ పొందుతారేమో చూద్దాం.

తీవ్రమైన సమస్యలయితే చాలానే ఉన్నాయి. అన్నీ ప్రాంతీయ వివక్ష నుంచీ ప్రాంతీయ ఆధిపత్యం నుంచీ పుట్టినవి కాకపోవచ్చును గానీ అన్నీ వికృతమైన పాలనా విధానాల నుంచి పుట్టినవే. పత్రికల పుణ్యాన కొన్ని వార్తలవుతుంటాయి, పత్రికలకూ పట్టనివి వార్తలూ కావు.

ఆదివాసీ ప్రాంతాలలో జ్వరాలు, మరణాల గురించి వార్తలు అప్పుడప్పుడు పత్రికలలో వస్తుంటాయి. తరచుగా ఆదిలాబాద్, విశాఖపట్నం ఏజెన్సీల నుంచి ఈ రకమైన వార్తలు వస్తుంటాయి. అప్పుడప్పుడు దక్షిణాన నల్లమల ప్రాంతం నుంచి కూడ వస్తుంటాయి.

రాష్ట్రంలో ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతం విస్తారంగా ఉండగా, ఈ రెండు మూడు ప్రాంతాల నుంచే ఈ రకమైన అకాల మరణాల వార్తలు ఎందుకు వస్తాయనేది కొంత మేరకు మిస్టరీయే. పత్రికల స్పందనలోని తేడాయే తప్ప అకాల మరణాలు ఏజెన్సీ అంతటా ఉన్నాయన్న అభిప్రాయం చాలామందిలో ఉంది. ఇది కొంతవరకు నిజం కావచ్చు. ఉదాహరణకు నల్లమల ప్రాంతపు చెంచులలో అనారోగ్యం, ఆహారలేమి, రక్తహీనత, తత్ఫలితమైన మరణాలు ఎక్కువే గానీ మీడియా స్పందన సాపేక్షంగా తక్కువ కావడం వల్ల అంతగా బయటకు రావు.

అయితే 'జ్వరాల' వార్తలు వచ్చే ఆదివాసీ ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలన్నింటిలోనికీ బాగా వెనుకబడినవి. వర్షాధార వ్యవసాయం, ఆహార సేకరణ పైన ఆధారపడి ఉండడం, సరయిన రవాణా సౌకర్యాలు లేకపోవడం, వేరే పనులేవీ దొరకకపోవడం, వైద్యం చాలా తక్కువగా అందుబాటులో ఉండడం, అధికార యంత్రాంగంలో నిర్లక్ష్యం సగటు కంటే ఎక్కువ ఉండడం ఈ ప్రాంతాల లక్షణాలు. దీనికి నైసర్గిక కారణాలు ఉండనే ఉన్నాయి. ఇవి ఎగుడుదిగుడు నేలలున్న మారుమూల ప్రాంతాలు. ఇవి కాక సామాజిక రాజకీయ కారణాలేమున్నాయో అన్వేషించాలి. కాబట్టి నిజంగానే చావులు ఇక్కడే ఎక్కువ కావచ్చు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు ఏజెన్సీ నుంచి ఈ మధ్య జ్వరాలు, అకాల మరణాల వార్తలు మళ్ళీ వస్తున్నాయి. 1998 వర్షాకాలంలో ఆ ఏజెన్సీలో ఎంత లేదన్నా 1500 నుంచి - బహుశా రెండు మూడు వేల మంది - అతిసార వ్యాధికి బలయి చనిపోవడం చాలా సంచలనం సృష్టించింది. నిరుడు వర్షాకాలం ముగిసిన తరువాత అంతటి మోతాదులో మరణాలు లేకపోయినా చిన్న పిల్లలు కనీసం 300 మంది రెండు మూడు మండలాలలో రెండు నెలల వ్యవధిలో చనిపోయారు. అప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం, నిరుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఒకే భాషలో ఏం జరగలేదని బుకాయించజూశాయి.

ఈ సంవత్సరం మే నెల మొదటి రెండు వారాలలోనే నార్నూరు మండలంలోని కోలామ గ్రామంలో 12 మంది చనిపోవడం రాబోయే వర్షాకాలంలో ఉండగల పరిస్థితికి సూచికగా వార్తలకెక్కింది. ఆ మండలంలోనూ, పొరుగున ఉన్న సిర్పూరు(యు), ఉట్నూరు మండలాల్లోనూ చాలా ఊర్లలో ముగ్గురు నలుగురు చొప్పున చనిపోయారు. చనిపోయిన వారిలో సగం దాకా పసిపిల్లలే.

1998లో అతిసార మరణాలు లేవు లేవని ప్రభుత్వం బుకాయించినప్పటికీ హైకోర్టులో కేసు వేయగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ నిజాయితీగానే నిజం

ఒప్పుకున్నారు. ఉట్నూరు ఏజెన్సీలోని అనేక గ్రామాలలో రక్షిత మంచినీటి వ్యవస్థ లేదనీ ఆ కారణంగా ప్రజలు కలుషితమైన నీళ్ళు తాగవలసి రావడం అతిసార వ్యాధికి దారి తీసిందనీ కోర్టుకు తెలిపారు. ఇన్ని సంవత్సరాల సంక్షేమ పాలన అనంతరం కనీసం శుభ్రమైన మంచి నీళ్లివ్వలేకపోవడం - అది కూడా ఒక ఊరిలో రెండు ఊర్లలో కాదు, ఆదివాసీ ప్రాంతమైన ఒక రెవెన్యూ డివిజన్ పర్యంతం- సిగ్గు పడవలసిన విషయమే అయినప్పటికీ ఆ మాత్రం కోర్టుకు రాతపూర్వకంగా చెప్పడం విశేషమే. ఇక మీదట అన్ని గ్రామాలలో గ్రౌండ్ లెవల్ స్టోరేజ్ ట్యాంక్‌ల ద్వారా శుభ్రమైన నీరిస్తామని హామీ ఇచ్చిన పిదప హైకోర్టు ఆ కేసును మూసేసింది.

ఆ హామీ కొంతవరకు అమలయిందిగానీ సమగ్రంగా కాలేదని 10 సంవత్సరాల తరువాత తెలుసుకుంటున్నాం. రెండు వారాలలో 12 మంది చనిపోయిన కోలామలో గ్రౌండ్ లెవల్ నీళ్ల ట్యాంకు ఉందిగానీ దానికి నీళ్లు చేరవేసే బోరు ఖరాబయి రెండు నెలలయింది. ఎన్ని ఫిర్యాదులు చేసినా దానిని బాగుచేసిన వారు లేరు. ఊరిజనం చేతి బోరు నీళ్లు తాగుతున్నారు. కాని దాని ప్లాట్ ఫాం విరిగిపోవడం వల్ల బోరు దగ్గరి మురుగునీరు భూమిలోకి ఇంకి ఆ నీళ్ళూ కలుషితం అయ్యాయి. అన్ని మరణాలకూ ఇదే కారణమా అంటే ఎవరు చెప్పాలి? వాళ్ళను చూసిన వైద్యుడెవరు? మరికొన్ని ఊళ్ళలో రక్షిత మంచినీటి వ్యవస్థ అమలులోకే రాలేదు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామమయిన సేడ్వాయిలో నీళ్ల ట్యాంక్ లేదు. చిత్తగూడలో మంజూరయింది గానీ ఇంకా కట్టలేదు. లోకరిలో ట్యాంక్ ఉంది, బోర్ ఉంది కానీ కరెంటు సరిగ్గా సరఫరా కాకపోవడం వల్ల ట్యాంక్ తరచుగా ఖాళీ అయిపోతుంది. ఇటువంటి ఊళ్లు ఇంకెన్ని ఉన్నాయో, రేపు వర్షాలు వచ్చిన తరువాత ఆ ఊళ్లనుంచి ఎన్ని చావుల కథలు వినవలసి వస్తుందో.

రోగాలకు ఈ కారణం ఒకెత్తయితే వారిలో తట్టుకునే సత్తా లేకపోవడం, నయం చేసే వైద్య వ్యవస్థ లేకపోవడం దానికి తోడయ్యాయి. నిజానికి ఏజెన్సీ ప్రాంతాలలో వైద్య వ్యవస్థ కాగితం మీద బాగానే ఉంది. ఒక్కొక్క మండలంలో ఒకటిగానీ అంతకంటే ఎక్కువగానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. (నార్నూరు మండలంలో మూడున్నాయి). అవికాక సబ్ సెంటర్లున్నాయి. గ్రామాలలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉన్నారు. కాగితం మీద చూస్తే ఇంతకంటే మెరుగైన వ్యవస్థ ఉండగలదా అనిపిస్తుంది. అయితే 'ఆదివాసీ ప్రాంతాలలో రోగులు వైద్యుల దగ్గరకు రారు, వైద్యులే రోగుల దగ్గరకు పోవాలి' అన్న సూత్రం ఏ మాత్రం అమలులో లేదు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, సబ్ సెంటర్లలోని హెల్త్ అసిస్టెంటులు రోగ

నిర్ధారణ తెలియనివారు. ఏ గోలీలివ్వాలో చెప్తే ఇవ్వగల వారు మాత్రమే. లేదా పైకి కనిపించే లక్షణాలను బట్టి ఇస్తారు. వైద్యుల మాటకొస్తే దాదాపు ఎవరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిత్యం అందుబాటులో ఉండరు. చాలామంది వారానికొకసారి ఆ ఊర్లో అంగడి (సంత) జరిగే రోజున మాత్రమే ఆస్పత్రికి పోవడం అలవరుచుకున్నారు. అనేక అవసరాలను అంగడికి పోయినప్పుడు తీర్చుకోవడం ఆదివాసులకు అలవాటే. సినిమా చూసి వస్తారు. హోటళ్లలో రుచికరమైన మిఠాయిలు తిని వస్తారు. రంగురంగుల రిబ్బన్లు కొనుక్కుంటారు. ఇప్పుడు డాక్టర్‌ను కూడా ఆ రోజే చూసి వస్తారు. కాని రోగానికి ఈ టైం టేబిల్ తెలీదు కదా.

రోగాలను తట్టుకోవడానికి ఒంట్లో సత్తా లేకపోవడం వారి చావులకు బహుశా అన్నిటికంటే ముఖ్యమైన కారణం. పిల్లల కళ్లలో సహజంగా ఉండే వెలుగు, చురుకుదనం ఈ ప్రాంతాలలో కనిపించవు. తీవ్ర రక్తహీనత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. దీనిని నివారించే వ్యవస్థ లేకపోలేదు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్న పిల్లలకు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా స్కూలు పిల్లలకు పౌష్టికాహారం అందించే ఏర్పాటు ఉంది. దానికి కావలసినన్ని నిధులున్నాయి. దాన్ని సక్రమంగా అమలు చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయి. ఎన్ని ఉన్నా వ్యవస్థలో సంకల్పం లేనిదే ఏం ప్రయోజనం? రెండు వారాలలో 12 మంది (అందులో సగం మంది పసిపిల్లలు) చనిపోయిన కోలామ గ్రామాన్నే ఉదాహరణగా తీసుకుంటే ఆ ఊరిలో స్కూలుంది, టీచర్ల పోస్టులు రెండున్నాయి. రెండు పోస్టులూ నింపారు కానీ టీచర్లిద్దరూ ఏ రోజూ స్కూలుకు రారు. టీచర్లే రాకపోతే మధ్యాహ్న భోజన పథకాన్ని ఎవరు అమలు చేయాలి? అంగన్‌వాడీ కేంద్రాలూ, ఉప కేంద్రాలూ చెప్పుకోవడానికి అన్ని గ్రామాలలోనూ ఉన్నట్టే లెక్క. నిరుడు పిల్లల మరణాల గురించి గొడవ జరిగినప్పుడు ఒక నెల రోజుల పాటు పల్లీలు, బెల్లం కలిపిన ఆహారం వీటి ద్వారా పిల్లలకు అందిచ్చారు. ఆ తరువాత వార్తలలో వేరే విషయాలు చోటు చేసుకున్నాక ఇంక అనవసరం అనుకున్నారు.

వర్షాకాలం ఇంకా మొదలుకాక ముందే ఈ విషయాలు చెప్పుకోవడంలో ఉద్దేశం ఈ సారయినా ముందు జాగ్రత్త వహిస్తారేమోనని. దానికోసం ఉద్యమించగల వాళ్లు ఇప్పుడయినా కదులుతారేమోనని.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*04 జూన్ 2008*

# నిత్య మరణానికి నివాళి ఎక్కడ?

ఒక చావు అన్ని చావుల్నీ కప్పేసింది. వాస్తవంలో కాదు, వార్తలలో. ఒక మరణం, ఆ మరణానికి తట్టుకోలేని మరణాలుగా వార్తలకెక్కినవి కలిసి వేరే మరణాలను వార్తల నుంచి బయటకు నెట్టేసాయి.

కప్పేయడం నిజానికి అంతకుముందే మొదలయింది. రమ్యనందినీరెడ్డి అన్న పేరు వింటే మీకేం తోస్తుంది? వస్తే స్వైన్‌ఫ్లూ రావాలి తప్ప ఏజెన్సీ మలేరియా వచ్చే పేరు లాగ తోస్తుందా? పేరుకు తగ్గట్టు స్వైన్ ఫ్లూ వచ్చి ఉంటే చచ్చినా బతికినా మొదటి పేజీలో ఫోటో అయి ఉండేది. నలుదిక్కులా వార్త అయి ఉండేది. కానీ ఈ పాప కూటికి లేని కొండరెడ్డి కొంపలో రంపచోడవరం ఏజెన్సీలో పుట్టింది. మలేరియా అని ప్రభుత్వం ఒప్పుకోని మలేరియాతో రెండేళ్లకే వందేళ్లు నింపుకుంది. గోచిపాత లేకున్నా పేర్లలో షోకులకు పోవచ్చును, దానికి కావలసిన జ్ఞానం డిష్ టివి నుంచి పొందవచ్చును, కానీ పేరుకు ఉన్న షోకు చావుకు ఎక్కడి నుంచి రావాలి?

మలేరియా మలేరియా ఎందుకు కాకుండా పోతుంది, ప్రైవేట్ ఆస్పత్రి మలేరియాగా గుర్తించినది ప్రభుత్వ ఆస్పత్రిలో వేరొకటి ఎందుకు అవుతుంది అని తెలుసుకోవడానికి సి.బి.ఐ. విచారణ కోరుదామా? ఏప్రిల్ 15న మొదలు కావలసిన దోమల మందుల స్ప్రే ఈ సంవత్సరం ఆగస్టు మొదటి వారం దాకా ఎందుకు మొదలు కాలేదో విచారించి తెలపమని సి.బి.ఐని అడుగుదామా?

రంపచోడవరం ఏజెన్సీలోని 37 మెడికల్ ఆఫీసర్ పోస్టులలో 23 ఎందుకు ఖాళీగా ఉన్నాయో శోధించి చెప్పమని సి.బి.ఐని అభ్యర్థిద్దామా? మనం అడిగితే ఒప్పుకోరు కాబట్టి కేంద్రాన్ని అడగమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుదామా?

కానీ 'రోజూ చచ్చేవాడికోసం ఏడ్చేవాడెవడు?' అంటారేమో. రోశయ్య పేరుకు ముందూ వెనకా ముఖ్యమంత్రి అర్హతకు కావలసిన రెండు పొడి అక్షరాలు లేకపోవచ్చును గానీ సామెతలు బాగా చెప్తాడు. అనుమానం ఉంటే చంద్రబాబును అడగండి. ప్రస్తుతం అతను కాంగ్రెస్ నాయకులలో దైవ లక్షణాలు కనుక్కునే మూడ్‌లో ఉన్నాడు కాబట్టి ఒప్పుకుంటాడు. నిజమే, ప్రతీ సంవత్సరం వర్షాకాలం మొదలయ్యీ కాకముందే 'ఏజెన్సీని వణికిస్తున్న జ్వరాలు' అంటూ దినపత్రికల లోపలి పేజీల్లో తిర్యాని నుంచి, మంగపేట నుంచి, అడ్డతీగల నుంచి, హుకుంపేట నుంచి నాలుగు పంక్తుల వార్తలొస్తుంటాయి. అప్పుడప్పుడు టోకున చావుల గణాంకాలు కూడ ఇస్తుంటారు. రెండు నెలలు ఊపిరి బిగపట్టుకుంటే - లేదా ఆ డేట్‌లైన్ ఉన్న వార్తలు చూడకుండ ఉంటే - అవే పోతాయి. దానికి విచారణలూ శాశ్వత పరిష్కారాలూ ఎందుకు, రాచముద్ర ఉన్న విచారణలు చేపట్టవలసిన సి.బి.ఐని చెంచుపెంటలలోనికీ గోండు గూడాలలోనికీ లాగడం ఎందుకు.

సి.బి.ఐని అవమానపరచడం నా ఉద్దేశం కాదు. రాచముద్ర కాకపోతే రహస్యమయినా ఉండాలి. ఇందులో రహస్యం మాత్రం ఏముంది? జిల్లా మలేరియా ఆఫీసర్‌గారు, ఐటిడిఎ పి.వో గారు, మలేరియా ఫైలేరియా రోగాలు లేనేలేవని చెప్పడం కోసం (సారీ, వాటి నివారణ కోసం) ప్రత్యేక హోదా ఇయ్యబడ్డ ఆరోగ్యశాఖ అదనపు డైరెక్టర్ గారు ఉత్తరాలు ప్రత్యుత్తరాలతో 'నోట్ ఫైల్స్' అని అధికారులు ఆప్యాయంగా పిలుచుకునే దస్తావేజులు నింపారు. సమాచార హక్కు చట్టం కింద వాటిని సహితం మనం చూడవచ్చు. చట్టం ఉన్నా లేకున్నా ఆ అధికార్లంటే గిట్టనివాళ్లను పట్టుకొని 'నోట్‌ఫైల్స్' ఫోటోస్టాట్ సంపాదించడం యోగ్యులయిన ఉద్యమకారులకు తెలిసిన విద్యే. గడచిన నాలుగు నెలలుగా నడిచిన ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను చూస్తే అర్థమయ్యే విషయం ఏమిటంటే నిరుడు మలేరియా విభాగానికి అందవలసిన నిధులలో రెండు కిస్తులు మాత్రమే లభించాయి. మరొక రెండు కిస్తులు ఏ కారణంగానో లభించలేదు. అందువల్ల నిరుడు రెండవసారి దోమల మందు స్ప్రే చేసిన కూలివారికి 5,22,680 రూపాయల కూలి బాకీ ఉండిపోయింది. అది ఇవ్వనిదే ఈ సారి మందు కొట్టం అని వారు మొరాయించారు. ఈ డబ్బులు ఎక్కడి నుంచి తీసి వారికి ఇవ్వాలి

అన్న మీమాంస ఈ అధికారుల 'నోట్ ఫైల్స్'లో మనకు కనిపిస్తుంది. నాలుగు నెలల పాటు తర్జనభర్జనలు జరిపినా ఆ 5 లక్షల చిల్లర ఎక్కడ నుంచి తేవాలన్న నిర్ణయం చేయలేక వేలాది ఆదివాసీ కుటుంబాలను మలేరియా పాలు చేశారు.

డబ్బులు బాకీ ఉన్న కూలివాళ్లు మొరాయిస్తే మరి వేరే వాళ్లనెందుకు పెట్టుకోలేదు? దిన కూలి ఇచ్చి చేయించుకునే పనే కదా? అది నైపుణ్యంతో కూడిన పని కాబట్టి వీలు కాదంట. నైపుణ్యంతో కూడిన పనయితే ప్రతీ సంవత్సరం వారే చేసేటట్టయితే, వారు దిన కూలీలుగా ఎందుకున్నారు? ప్రభుత్వ ఉద్యోగాలెందుకు ఇవ్వలేదు? సీజనల్ ఉద్యోగాలు ప్రభుత్వానికయినా పరిశ్రమలకైనా కొత్తేం కాదు కదా? అప్పుడొక వేళ జీతం బకాయిపడినా ఉద్యోగం నిలబెట్టుకోవడానికి పని చేసేవారు కదా? అయినా, రంపచోడవరం ఏజెన్సీలో 624 గ్రామాలను (మొత్తం గ్రామాలలో ఇది 90 శాతం కంటే ఎక్కువ) మలేరియా 'ఎండెమిక్'గా అధికారికంగానే గుర్తించినప్పుడు జిల్లా మలేరియా అధికారి వద్ద కొంతయినా కంటింజెన్సీ ఫండ్ ఎందుకు లేదు? ఆయనగారు, ఒక అసిస్టెంట్ మలేరియా అధికారి, మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రాంతాలకు కలిపి ఒక సబ్-యూనిట్ అధికారి తప్ప రోడ్ల వెంబడి తిరిగి పనిచేసే సిబ్బంది వారి కింద ఎందుకు లేరు? కూలి వాళ్ల బకాయిలకు పైసలు లేకపోవడమే కాదు, ప్రతీ సంవత్సరం మార్చి నెలలో సరఫరా కావలసి ఉన్న దోమల మందు కూడా ఈ సంవత్సరం జూన్ నెల దాకా రాలేదంట. దానికి కారణం ఎవరికీ తెలిసినట్టు లేదు కాబట్టి అడిగి ప్రయోజనం లేదు గానీ, అవసరమయినప్పుడు మార్కెట్‌లో కొనుగోలు చేసే అధికారం, దానికి విడిగా కొంత ఫండ్ జిల్లా మలేరియా అధికారి దగ్గర ఎందుకు లేవు? నాకు స్టాఫ్ లేరు అంటూ దర్జాగా బల్లకింద కాళ్ళూపుకుంటూ కూర్చునే వైభోగం అతనికెందుకిచ్చారు?

వేరొక సందర్భమయితే ఇంత వివేచించడం అనవసరం అని ఆపేద్దుము గానీ మనం గత అయిదేళ్లుగా దీనజన రాజ్యంలో బతికామని స్వపక్షం, విపక్షం, ఒక వామపక్షం, టీవీలలో దర్శనమిచ్చే పలువురు నిత్య విమర్శకులే కాక 'ఆ రెండు పత్రికలు' కూడ చెప్తున్నాయి కాబట్టి కొన్ని జ్ఞాపకాలను దూరం చేయడం కష్టం. ఏజెన్సీలో జ్వరాలనూ చావులనూ ఎందుకు ఆపలేకపోతున్నామో తెలపమని 2005లో కె.ఆర్.వేణుగోపాల్ అనే రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని జాతీయ మానవ హక్కుల కమిషన్ పురమాయించింది. ఆయన విశాఖపట్నం ఏజెన్సీలోని పరిస్థితిని వివరంగా పరిశీలించి రిపోర్టు ఇచ్చారు. ఇప్పుడు 'ఆశా వర్కర్' అని ప్రభుత్వం

ముచ్చటయిన కొత్త పేరు పెట్టిన కమ్యూనిటీ హెల్త్ వర్కర్ ఉద్యోగ భద్రత గురించి, రోగమొస్తే తట్టుకునే శక్తిని ఇచ్చే పౌష్టికాహారం పొందగల స్తోమత గురించి, పరిసరాల పారిశుద్ధ్యాన్ని గురించి, మూడవ వంతు కుటుంబాలకు కూడ అందని దోమ తెరల సరఫరా గురించి, 'మొబైల్'గా ఉండవలసిన ఏజెన్సీ వైద్య వ్యవస్థ 'మొబిలిటి' సంగతి అటుంచి సగ భాగం అసలే లేకపోవడం గురించి ఆయన తీవ్ర విమర్శ చేశారు. నిర్దిష్టమైన సూచనలు చేశారు. నాలుగేళ్ళయింది కాబట్టి ఆ నివేదిక ప్రభుత్వానికి అందే ఉంటుంది!

ఈ నాలుగేళ్లలో ఏం మారిందన్న ప్రశ్న వేసుకుంటే శూన్యం అన్న జవాబు చెప్పవలసి ఉంటుంది. కమ్యూనిటీ హెల్త్‌వర్కర్ పేరొక్కటి మారింది. ఆదిలాబాద్‌లోనయితే ఒకడుగు వెనక్కి వేసి ఏజెన్సీలో 'ఎండెమిక్'గా ఉన్న రోగాలను నయం చేయడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ వల్ల కాదని చేతులెత్తేసి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయోగం మొదలుపెట్టారు. పబ్లిక్ హెల్త్ రంగంలో ఈ విధంగా చేతులెత్తేయడమే ప్రస్తుత దుస్థితికి ఒక ముఖ్య కారణం అనేది కె.ఆర్. వేణుగోపాల్ విమర్శలో ప్రధాన అంశం కాగా, చేసిన తప్పు ఇంకొంచెం చేయడమే సమస్యకు పరిష్కారం అయినట్టు చికిత్స విషయంలోనూ అదే పని చేస్తున్నారు. ప్రైవేటీకరణతో మన అనుభవం ఏమిటంటే ఏ కారణంగానయితేనేం అది మొదట్లో కొంత ఫలితాన్ని ఇస్తుంది (ఇది కుట్ర అనేవాళ్లు లేకపోలేదు). అందువల్ల వ్యాపిస్తుంది. చివరికి దాని దుష్ఫలితాలు తెలిసేసరికి వెనక్కి తిప్పడం కష్టం అవుతుంది. పౌష్టికాహారం విషయానికొస్తే, పెద్దల సంగతి అటుంచి పిల్లలకు కనీసం ఒక పూట అన్నం పెట్టే అంగన్‌వాడీ కేంద్రాలు ఆదివాసీ ప్రాంతాలలోని సగం గూడాలలో ఆనాడూ లేవూ, ఈనాడూ లేవు. ఉట్నూరు నుంచి సీతంపేట దాకా ఏ ఏజెన్సీ గ్రామంలో వాకబు చేసినా ఈ సత్యం తెలుస్తుంది. ఏజెన్సీ మరణాలలో చిన్న పిల్లల సంఖ్య ఎక్కువ ఉండడానికి ఇదొక కారణం అని వివరించి చెప్పనవసరం లేదు.

సంగతీ స్పష్టమే, దానికి గల కారణమూ స్పష్టమే. ఆదివాసులంటే లెక్కలేకపోవడం తప్ప విచారించి బయటపెట్టవలసిన రహస్యమేదీ ఇక్కడ లేదు. ఇక విచారణలు కోరడం ఎందుకు?

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*09 సెప్టెంబర్ 2009*

# ఆదివాసీ హక్కులకు గండ్లు

నోరున్న వాళ్లకు జరిగే చిన్న చిన్న అన్యాయాలు సహితం బాగా ప్రచారం అవుతుంటాయి. కానీ నోరు లేని వాళ్లకు ఎంత పెద్ద అన్యాయం జరిగినా అది కనీసం వార్త కూడా కాదు.

ఆదివాసులలో విద్యను ప్రోత్సహించే ఉద్దేశంతో 1986లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో జారీ చేసింది. ఆదివాసీ (అంటే ఏజెన్సీ) ప్రాంతంలో ఉన్న స్కూళ్లన్నిటిలోనూ అధ్యాపకుల పోస్టులు స్థానిక ఆదివాసులకే ఇవ్వాలని ఈ జీవో చెప్తుంది.

దీని వల్ల రెండు లక్ష్యాలు సాధించాలని ప్రభుత్వం ఉద్దేశించినట్టుంది. ఒకటి - టీచర్లు స్థానిక ఆదివాసులే అయితే అక్కడే ఉండడానికి అభ్యంతరం చెప్పరు. ఇతరులకు ఏజెన్సీలో పోస్టింగ్ వేస్తే బయటికి బదిలీ చేయించుకునే పైరవీతోనే కాలమంతా గడుపుతారు. ఆదివాసీ అధ్యాపకులు కొంతమేరకైనా తమ వారి బాగోగులు కోరుకుంటారు కాబట్టి కొంచెం శ్రద్ధగా చదువు చెప్పే అవకాశం కూడ ఉంది. అవసరమైనప్పుడు తమ భాషలో కూడ (ఒక ప్రత్యేకమైన భాష ఉన్న తెగలయితే) బోధించగలరు. తమవారే అధ్యాపకులు కావడం ఆదివాసీ పిల్లలకు సహితం మానసిక స్థయిర్యాన్నీ, చదువుకోవడానికి ప్రోత్సాహాన్నీ ఇస్తుంది.

రెండవ లక్ష్యమేమిటంటే చదువుకున్న ఆదివాసులకు ఉద్యోగాలు దొరకడం ఇతరులు చదువుకోవడానికి ప్రోత్సాహం

ఇస్తుంది. ఆదివాసులకు ఉద్యోగరంగాలలో ఉన్న 6 శాతం రిజర్వేషన్ వల్ల కొద్ది మందికి మాత్రమే ఉద్యోగాలు దొరకగలవు. ఆ కొద్ది ఉద్యోగాలు ఏజెన్సీ బయట బతికే ఆదివాసీ తెగలు తీసేసుకుంటున్నాయి. ఉద్యోగాలు దొరకని చదువుపట్ల ఏజెన్సీలోని ఆదివాసులకు పెద్దగా ఆసక్తి ఉండదు. కనీసం స్థానికంగా టీచరు పోస్టులయినా దొరుకుతాయన్న నమ్మకం ఉండడం ప్రోత్సాహకంగా పని చేస్తుంది.

జీవో బాగానే ఉందిగానీ టిటిసి పూర్తి చేసిన ఆదివాసులు తగు సంఖ్యలో లేకపోతే ఏం చేయాలన్న ప్రశ్న వస్తుంది. దానికి జవాబుగా 10వ తరగతి దాకా చదువుకున్న ఆదివాసు లెవరికయినా టీచర్ పోస్టులు ఇయ్యవచ్చుననీ, ఆ తరువాత వారిని డెప్యుటేషన్ మీద పంపించి పూర్తి చేయించవచ్చుననీ ప్రభుత్వం నియమం పెట్టింది. హైస్కూల్ అధ్యాపకుల విషయంలో అది సాధ్యం కాకపోవచ్చును. కాబట్టి అక్కడ మట్టుకు అర్హత గల ఆదివాసీ అభ్యర్థులు దొరికే దాకా తాత్కాలికంగా ఆదివాసీయేతరులను నియమించవచ్చుననీ, అర్హత గల వారు దొరకగానే వీరిని తొలగించాలనీ ప్రభుత్వం మరొక జీవో జారీ చేసింది.

ఈ 'తాత్కాలికం' అనే దానిని పర్మనెంట్ చేసుకోవడానికి గిరిజనేతర అధ్యాపకులు చేసిన ప్రయత్నాల గురించి, అందుకోసం న్యాయస్థానాలను వాడుకున్న వైనాన్ని గురించి చెప్పుకోవడానికి ఇది సందర్భం కాదు కాని అసలుకే మోసం తీసుకురావడానికి స్వయంగా అధికారులే చేస్తున్న ప్రయత్నాల గురించి ఇక్కడ మాట్లాడుకోవాలి. నిజానికి ఏజెన్సీలో ఆదివాసులకే అధ్యాపక పోస్టులు ఇవ్వాలన్న నియమం వల్ల ఆదివాసులలో ఒక కొత్త తరం అధ్యాపకులు పెద్ద సంఖ్యలోనే ముందుకొచ్చారు. దీనివల్ల ప్రభుత్వం దృష్టిలో ఉన్న పై రెండు లక్ష్యాలే కాక మరొక ముఖ్యమైన సామాజిక లక్ష్యం కూడ నెరవేరింది.

రిజర్వేషన్లు పొందే అణగారిన కులాలు, తెగలలో 'క్రీమీలేయర్' గురించి మాట్లాడేటప్పుడు చాలామంది అర్థం చేసుకోని ఒక విషయం ఏమిటంటే, ఆ కులానికి లేక తెగకు ప్రత్యేకమైన పరిస్థితుల గురించి మాట్లాడడానికి, వారి ఆకాంక్షలను వ్యక్తం చేయడానికి ఒక ప్రాతినిధ్య వర్గంగా కూడా రిజర్వేషన్లు పొందినవారు ఉపయోగపడగలరు. వారందరూ అన్ని సందర్భాలలోనూ తమ తోటి వారి క్షేమాన్ని గురించి నిబద్ధతతో ఆలోచించకపోవచ్చు. తమ స్వంత బాగు చూసుకొని సంతృప్తి చెందే బాపతు చాలామంది ఉండవచ్చు. అయినప్పటికీ సామాజికంగా అత్యవసరమైన ఈ పాత్రను తొలితరం లబ్ధిదారులు ఏదో ఒక మేరకు నిర్వహిస్తారనేది గుర్తించవలసిన విషయం. వాళ్లందరినీ టోకుగా తమ

వ్యక్తిగత ప్రయోజనాలు మాత్రమే చూసుకొని తమ ప్రజల నుండి వేరు పడిపోయే 'క్రీమీలేయర్'గా చూడటం పెత్తందారీ కులాల దృక్కోణానికి చెందిన వైఖరి.

ఈ ప్రయోగానికి గండి కొట్టే ప్రయత్నం అధికారులే చేస్తున్నారన్నాను కదా. గత సంవత్సరం విశాఖపట్నం జిల్లాలో డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా పాఠశాల అధ్యాపకులను ఎంపిక చేసినప్పుడు ఏజెన్సీ వెలుపల ఉన్న స్కూళ్లతో బాటు ఏజెన్సీలోని స్కూళ్ళను కూడ కలిపేసి పై జీవోకు పూర్తిగా విరుద్ధంగా ఉమ్మడిగా ఎంపిక చేశారు. దానితో ఏజెన్సీలోని పాఠశాలలలోని 883 అధ్యాపక పోస్టులకూ గిరిజనేతరులే ఎంపిక అయ్యారు!

అదృష్టమో దురదృష్టమో గానీ వారిలో చాలామంది మారుమూల గిరిజన గూడేలలో పనిచేయడానికి ఇష్టపడక పోవడం వల్ల అందులో 300 చిల్లర పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. 534 పోస్టులలో మాత్రం గిరిజనేతరులు అధ్యాపకులుగా చేరారు.

అధ్యాపకుల నియామకం కేవలం విద్యాశాఖ ద్వారా జరిగేటట్టయితే తాము చేసిన తప్పిదానికి ఉండే సామాజిక పర్యవసానం అర్థం కాక చేసారని అనుకోవచ్చు. కానీ అధ్యాపకుల నియామకం జరిగేది జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో. వీరికి గిరిజన సంక్షేమాన్ని చూసుకునే బాధ్యత కూడ ఉంది. అయినప్పటికీ ఇది జరిగిందంటే చట్టాలలో ఆదివాసులకు అనుకూలమయిన అంశాలు కొన్ని ఉన్నా, రాజకీయాలలోనే కాక అధికార యంత్రాంగంలోనూ ఆదివాసీయేతరుల ప్రయోజనాల ప్రాబల్యం చాలా ఉండడం దానికి కారణం. వేరే ఎక్కడయినా ఒక వర్గానికి రిజర్వ్ చేయబడిన పోస్టులు 883 వేరే వాళ్లకిస్తే ఎంత గొడవ జరిగేదో! కానీ విశాఖపట్నంలో ఆదివాసులకు జరిగిన ఈ అన్యాయం నిశ్శబ్దంగా జరిగిపోయింది.

ఆదివాసులలో అంతో ఇంతో చదువుకున్నవారు సహితం మౌనంగా ఉండిపోయారు. కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఇది జరిగింది కాబట్టి చట్టం మారిందేమో అనుకున్నారంట.

కానీ ఈ అక్రమమయిన ఎంపికలు జరిగిన కొన్నాళ్లకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఏదో పని మీద విశాఖపట్నం వచ్చి ఈ విషయం తెలుసుకొని బాహాటంగానే తప్పు పట్టడంతో చట్టమేమీ మారలేదనీ, తమకు అన్యాయం జరిగిందనీ ఆదివాసులకర్థం అయింది. విశాఖపట్నంలోనే కాక వరంగల్‌లో కూడా ఇదే జరిగిందని ఇప్పుడు తెలుస్తున్నది.

చట్టాలలో ఉన్న సంక్షేమం వాస్తవంలో అందకుండా చేయడానికి సమాజంలో చాలా ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఆ సంక్షేమం పొందేవారికి నిర్ణయాధికారంలో భాగస్వామ్యం లేనంత కాలం ఇది సాగుతుంది.

ఇప్పుడు ఏజెన్సీలో నియమించిన గిరిజనేతర అధ్యాపకులను బయటికి బదిలీ చేసి ఏజెన్సీలో ఖాళీలను ఆదివాసీ విద్యావంతులతో నింపడం ఒక్కటే పరిష్కార మార్గం. ఆ పని చేస్తామని నోటి మాటగా ప్రభుత్వ అధికార్లు అంటున్నారు. కాని నిజంగా చేస్తారా?

*ప్రజాతంత్ర వారపత్రిక*
*16 మే 1999*

# మన్నెవార్‌లకు మద్దతు ఇద్దాం

మేలు చేయడానికి తొందర ఉండదు గానీ నష్టం చేయడానికి అధికారాన్ని ఉత్సాహంగా వినియోగిస్తారు.

ఈ మధ్య కేంద్ర ప్రభుత్వం దేశంలో షెడ్యూల్డు తెగల జాబితాలో ఎన్నో మార్పులు చేయాలని నిర్ణయించింది. వాటిలో కొన్ని కేవలం సాంకేతికమైన మార్పులు కాగా, మన రాష్ట్రానికి చెందిన రెండు ముఖ్యమైన నిర్ణయాలు మాత్రం చాలా ఆందోళన కలిగిస్తున్నాయి.

అవేమిటంటే మన్నెవార్, చెంచువార్ అనే రెండు తెగలను షెడ్యూల్డు తెగల జాబితా నుండి తొలగించాలన్న నిర్ణయాలు. వారిని ఎస్.టి జాబితా నుండి తొలగించమని ఎవ్వరూ కేంద్ర ప్రభుత్వాన్ని అడగలేదు. రాష్ట్ర ప్రభుత్వమూ సిఫారస్ చేయలేదు. ఎవరూ అడగకుండానే జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ ఆ రెండు తెగలను తొలగించాలని సిఫారస్ చేసిందంట. కేంద్ర కేబినెట్ ఆమోదించి బిల్లు తయారు చేసేసింది. పెట్రోల్ పంపుల గొడవ కారణంగా పార్లమెంటులో వేరే పని ఏమీ జరగకపోవడం వల్ల మన్నెవార్‌లూ, చెంచువార్‌లూ ప్రస్తుతానికి బతికిపోయారు గానీ లేకపోతే ఈపాటికి 'ఎస్.టి'లు కాకుండా పోయేవారే.

చెంచువార్‌లు ఆందోళన చేసే స్థితిలో కూడా లేనట్టున్నారు గానీ ఆదిలాబాద్ జిల్లా వాసులైన మన్నెవార్‌లు కొంత ఆందోళన

చేస్తున్నారు. అటవీ ప్రాంతవాసులైన కొలాం తెగకు మన్నెవార్‌లు సన్నిహితులు. మన్నెవార్‌లు తమను తాము తెలుగు మాట్లాడే కొలాంలుగా భావించుకుంటారు. (కొలాంలు మాట్లాడే భాష కొలామీ.) అటవీ ప్రాంతం నుండి మైదాన ప్రాంతంలోకి ప్రవేశించి, అక్కడి తెలుగు ప్రజల భాషా సంస్కృతులు కొంతమేరకు అలవర్చుకున్న కొలాంలు మన్నెవార్‌లు.

నిజానికి మన రాష్ట్ర ప్రభుత్వం మన్నెవార్‌లను కొలాంలతో పాటు అత్యంత వెనుకబడిన తెగ (ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్)గా గుర్తించింది. పిటిజిలు ఆదివాసులలో కూడా వెనుకబడిన తెగలుగా గుర్తింపు పొందిన తెగలు. నల్లమల అడవులలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని కొలాంలు పిటిజిలే. వారితో పాటు వారికి చాలా సన్నిహితులైన చెంచువార్‌లనూ మన్నెవార్‌లనూ కూడ మన రాష్ట్ర ప్రభుత్వం పిటిజిలుగా గుర్తించి చెంచులు, కొలాంలతో సమానంగా ప్రత్యేక పథకాలూ నిధులూ కేటాయించింది.

రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ఈ విధంగా ఉండగా, కేంద్ర ప్రభుత్వం వారిని ఏకంగా షెడ్యూల్డు తెగల జాబితా నుండే తొలగించాలని నిర్ణయించింది. మన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఈ సంగతి విని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మన్నెవార్‌ల పేరు మీద గిరిజనేతరులు సర్టిఫికేట్లు పెట్టి అక్రమంగా రిజర్వేషన్లు పొందుతున్నారని, అటువంటి దొంగ సర్టిఫికేట్లు చాలా దొరికాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ రెండేళ్ళ కింద జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్‌కు రిపోర్టు పంపినట్టు మాత్రం చెబుతున్నారు. బహుశా ఈ రిపోర్టు ప్రాతిపదికగానే జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ మన్నెవార్‌లను ఎస్.టి జాబితా నుండి తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారస్ చేసిందేమోనని అంటున్నారు. అంతే తప్ప మన రాష్ట్ర ప్రభుత్వం నుండి అటువంటి సూచనేదీ పోలేదంటున్నారు.

దొంగ సర్టిఫికేట్ల మాట నిజమే కావచ్చు. మన్నెవార్‌ల గూడెంలు మైదాన ప్రాంతాలలో కూడా ఉన్నాయి కాబట్టి ఆ పరిసరాలలో నివసించే గిరిజనేతరులు వారి పేరు మీద సర్టిఫికేట్లు పొందుతుండవచ్చు. కానీ దానికి మన్నెవార్‌లు ఎట్లా బాధ్యులవుతారు? తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో కొండ రెడ్ల పేరు మీద రెడ్లు, కొండ కాపుల పేరు మీద కాపులు, కొండ కమ్మర్ల పేరు మీద కమ్మరులు దొంగ సర్టిఫికేట్లతో కాలేజీలలో సీట్లు, ఉద్యోగాలు పొందిన ఉదంతాలు చాలా ఉన్నాయి. అంతమాత్రం చేత కొండ రెడ్లను షెడ్యూల్డు తెగల జాబితా నుండి తొలగించాలని ఎవరూ ఎన్నడూ అనలేదు. అంటే అది చాలా అన్యాయం అవుతుంది.

మరి మన్నెవార్‌ల విషయంలో ఈ నిర్ణయానికి ఎందుకు వచ్చినట్టు? పైగా ఈ ప్రతిపాదన ఉన్నట్టు మన్నెవార్‌లకు జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ గానీ కేంద్ర ప్రభుత్వం గానీ తెలపలేదు. వారి వివరణ, లేక ప్రతిస్పందన కోరలేదు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలిపి వారి అభిప్రాయం కోరలేదు. కనీసం జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ రిపోర్టును రాష్ట్ర అసెంబ్లీ ముందు పెట్టలేదు. జాతీయ ఎస్.సి, ఎస్.టి కమిషన్ రాష్ట్రపతికి సమర్పించే ఏ రిపోర్టునైనా పార్లమెంటులోనే కాక, సంబంధిత రాష్ట్ర అసెంబ్లీలో కూడా చర్చకు పెట్టాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 (7) అంటుంది. ఆ పనేమీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం నేరుగా మన్నెవార్‌లను, చెంచువార్‌లను ఎస్.టి జాబితా నుండి తొలగిస్తూ బిల్లు రూపొందించి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది.

ఈ కారణంగా కోర్టులు ఆ చట్టాన్ని రేపు కొట్టేయవచ్చు. కానీ ఆ 'రేపు' ఎప్పుడు? షెడ్యూల్డు తెగగా గుర్తింపు కోల్పోయిన మన్నెవార్‌లు కోర్టులో కేసు వేయాలి, అయిదేళ్ళు ఆరేళ్ళు గడిచిన తర్వాత న్యాయం పొందాలి. పెట్రోల్ పంపుల లైసెన్స్‌లు అక్రమంగా పంపిణీ చేసారని కేంద్ర ప్రభుత్వం వాటిని ఒక్క దెబ్బతో రద్దు చేయగా, మంత్రి చేసిన తప్పుకు పంపుల వాళ్ళనెందుకు శిక్షించాలంటూ కోర్టులు లైసెన్స్‌ల రద్దుపైననే స్టే ఇచ్చాయి. మరి మన్నెవార్‌లకూ స్టే ఇస్తారా? ఇవ్వకపోతే కోర్టులో తేలేవరకు వారేమవుతారు?

ఎస్.టిలుగా ఉండడానికి మీరు తగరు, కొంచెం బాగుపడిపోయారని ఎస్.టి జాబితా నుండి బయట పెట్టినట్టయితే వాళ్లు బి.సి జాబితాలోకి పోతారను కుంటున్నారేమో మీరు. అటువంటిదేమీ జరగదు. మన్నెవార్‌లు బ్రాహ్మణ, బనియా, రెడ్డి, కమ్మ కులస్తుల సరసన చేరుతారు. అంటే 'ఒ.బి.సి'లు అవుతారు. మన రిజర్వేషన్ వ్యవస్థలోని ఒక లోపం ఏమిటంటే ఎస్.సి, ఎస్.టి, బి.సి జాబితాలకు పరస్పర సంబంధం లేదు. ఒకవేళ ఎస్.సి. లేక ఎస్.టి. జాబితాలో ఉన్న ఒక కులం లేక తెగ కాలక్రమంలో నిజంగానే కొంచెం బాగుపడిందనుకోండి అప్పుడు పార్లమెంటు ఒక చట్టం చేసి ఆ కులాన్ని లేక తెగను ఆ జాబితా నుండి తొలగించ గలదు. కానీ ఆ విధంగా తొలగించిన కులాన్ని లేక తెగను బి.సి జాబితాలో అప్పటికప్పుడు చేర్చే అధికారం పార్లమెంట్‌కు లేదు. దానికి వేరే ప్రక్రియ నడవాలి. మళ్ళీ ఎప్పుడో ప్రభుత్వం ఒక బి.సి కమిషన్‌ను నియమించాలి, తొలగించబడ్డ కులం లేక తెగ ఆ కమిషన్‌కు అర్జీ పెట్టుకోవాలి, ఆ కమిషన్ ఆపైన రెండేళ్లకో మూడేళ్ళకో నాలుగేళ్ళకో తన రిపోర్టు ఇవ్వాలి. ఆపైన ఈ ప్రజలు

బి.సిలుగా గుర్తింపు పొందాలి. అంతవరకు వారు బ్రాహ్మణుల సరసన 'స్వేచ్ఛగా' పోటీపడుతూ బతకాలి.

మన్నెవార్‌లు తమ ఆందోళనలో భాగంగా వారం రోజుల కింద హైదరాబాద్‌లో ప్రదర్శన నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల వారూ వచ్చి మన్నెవార్‌లకు అన్యాయం జరగనివ్వం అని హామీ ఇచ్చిపోయారు. వారు చేయవలసింది వేరే ఏమీ లేదు. తమ పార్టీల జాతీయ నాయకులకు చెప్పి పార్లమెంటులో ఆ బిల్లు చర్చకు వచ్చినప్పుడు మన్నెవార్‌లు, చెంచువార్‌లను ఎస్.టి జాబితా నుండి తొలగించే బిల్లును ఆమోదించకుండా విధాన నిర్ణయం తీసుకునేలాగ చేయాలి. దానికి సిద్ధంగా లేనట్టయితే ఇందిరా పార్కుకు వచ్చి ఉచితంగా హామీలు ఇవ్వడం అనవసరం.

చంద్రబాబు నాయుడు సహితం, మన్నెవార్‌ల ప్రతినిధుల బృందం ఆయనను కలిసినప్పుడు ఈ ప్రతిపాదన అన్యాయమైనదనీ, తన ప్రభుత్వం ఒప్పుకోదనీ, వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాననీ అన్నాడంట! ఆయన ఇచ్చిన హామీలలో ఎన్ని నిలబెట్టుకున్నాడన్న లెక్కలు తీయడం ఈ మధ్య మన రాష్ట్రంలో ఒక రాజకీయ హాబీ అయింది కాబట్టి ఆ కేళిలో ఆసక్తి ఉన్నవారు దీనిని కూడ తమ కంప్యూటర్‌లో ఎక్కించుకోవచ్చు.

*ప్రజాతంత్ర వారపత్రిక*
*1 సెప్టెంబర్ 2002*

# హిందుత్వ అజెండాలో ఆదివాసులు

వాళ్ల నాయకులు టీవీల ముందు గంభీరంగా కనిపిస్తారు. దేశ పాలనా విధానాల గురించి తమ ఆలోచనలను ప్రకటిస్తారు. తాము అధికారానికి వస్తే ఏయే విషయాలలో ఎంత మేలు చేయబోయేదీ గొప్ప విజ్ఞత గలవారిలాగ చెప్తారు. మరికొందరు నాయకులు బహిరంగ వేదికలెక్కి చంపుతాం, నరుకుతాం అని కేకలు వేస్తారు. వారిని పోలీసులు అరెస్టు చేయరు. వారి సభలకెప్పుడూ అనుమతి నిరాకరించరు. మరికొందరు ఊర్లలో పల్లెలలో పరమతస్తులపైన దాడులు చేస్తారు. ప్రార్థనా స్థలాలను కూలుస్తారు, కాలుస్తారు. అడ్డమొచ్చిన వారిని నరుకుతారు, తగలబెడతారు.

అయినప్పటికీ వారిది గౌరవనీయమైన రాజకీయపక్షంగానే భావించబడుతుంది. వారి ప్రధాని అభ్యర్థిని వారు ముందుగానే ప్రకటించడం అభినందించబడుతుంది. వారి పాదయాత్రలు, జాతాలు నిర్విఘ్నంగా సాగుతుంటాయి. వారి గుర్తింపు ఎప్పుడూ రద్దు కాదు. ఎన్నికల ప్రచారం నుంచి సాయుధ వీధి రౌడీయిజం దాకా అన్నీ ఏక సమయంలో సాగుతుంటాయి. 'అవును, మేమే చంపాము' అని ప్రకటించి మరీ చంపినా వారిని అరెస్టు చేయరు. నిషేధాల ఛాయ కూడ వారి దరికి రాదు. తమ రాజకీయ లక్ష్యాల సాధన కోసం హింసా మార్గాన్ని ఎంచుకోవాలన్న నిర్ణయం ఇతరులకు చాలా కష్టతరమయినది. నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రహస్య

జీవితంలోకి పోవాలి. దాక్కొని పనిచేసే స్థావరాలు వెతుక్కోవాలి. ధైర్యంగా సహాయం చేసే వారిని అన్వేషించాలి. పోలీసుల వేధింపులూ అరెస్టులూ చిత్రహింసలూ ఎన్‌కౌంటర్లూ ఎదుర్కోవాలి.

వీరికి ఆ సమస్య లేదు. తామే అధికారంలో ఉంటూ కూడ ప్రత్యర్థి సామాజిక వర్గాల పైన హింసాత్మక దాడులు చేయగలరు. అప్పుడే ఇంకా బాగా చేయగలరు. అయితే దేశంలో అధిక సంఖ్యాకులు ఆరాధించే దేవుళ్ల పేరు మీద వీరి రాజకీయం నడుస్తుంది. కాబట్టి వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసే ధైర్యం వీరు అధికారంలో లేని కాలంలోనూ, లేని రాష్ట్రాలలోనూ కూడ పాలనా యంత్రాంగం చేయడం లేదు. రాముడి పేరు మీద, వినాయకుడి పేరు మీద నడిచే రాజకీయ హింసను ముఖాముఖీ ఎదుర్కొంటే ఆ దేవుళ్ల భక్తులు దూరం అవుతారేమోనని వైరి రాజకీయ పక్షాలు వెనకాడుతున్నాయి. వారి వోట్ల సంగతేమోగాని భారతదేశాన్ని నాగరిక దేశంగా చెప్పుకోవడానికి సందేహించే రోజులు దగ్గరికొచ్చాయి.

ఈ దౌర్జన్యంలో ఒక పద్ధతి ఉందన్న విషయం ఎంత మంది గ్రహించారో తెలీదు. హిందూ రాష్ట్రాన్ని మీది నుంచి నిర్మించడం కష్టమయితే కింది నుంచి నిర్మించాలన్న వ్యూహం ఇందులో ఉంది. మీది నుంచి నిర్మించడానికి రాజ్యాంగం ఆటంకం. దానిని సమీక్షించాలన్న ప్రతిపాదన పెట్టి మొదటి మెట్టుగా తమ వారు కాని వారితో కమిటీ వేసి ఒక సమీక్ష చేయించారు. ఈ సారి అధికారానికి వస్తే ఆ సమీక్షను సమీక్షించడానికి వేరొక కమిటీ వేస్తారేమో చూడాలి. అయినా ఇది చాలా సమయం తీసుకుంటుంది. దానికి ప్రత్యామ్నాయం కింది నుంచి అమలు చేయడం. మత స్వేచ్ఛ రాజ్యాంగంలో ఉంటే ఉండనివ్వండి. జై శ్రీరాం అనకపోతే బతకనివ్వరన్న భయం అన్య మతస్తులలో కలిగిస్తే సరి. ఒక్క మత స్వేచ్ఛే కాదు, అన్ని రకాల భావప్రకటనా స్వేచ్ఛ ఒక హక్కేనని రాజ్యాంగంలో రాసి ఉండవచ్చు. కానీ తమకు నచ్చని భావాలు వ్యక్తం చేస్తే 'దేశ ద్రోహులు' అని పేరు పెట్టి గుంపును పోగు చేసి పోలీసులు చూస్తుండగానే రోడ్లో నరకుతారని భయం కలిగిస్తే సరి. ఈ స్థితిని చేరుకున్న ప్రాంతాలు దేశంలోని ఉత్తర, పశ్చిమ భాగాలలో ఇప్పటికే చాలా ఉన్నాయి. ఒకసారి జాబితాలో చేరిన ప్రదేశాలు బయటికి పోవడం కష్టం. కానీ కొత్తవి చేరుతుంటాయి. ఈ దుస్థితి ఉత్తర భారతం నుంచి క్రమంగా కిందికి పాకి మన సరిహద్దు సమీపానికొచ్చింది.

ఒరిస్సాలోని కంధమాల్ జిల్లా మన సరిహద్దుకెంతో దూరంలో లేదు. ఆ రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా అధికారం పంచుకొని చలాయిస్తున్న బిజెపి పాలనలో

ఒక్క కంధమాల్ జిల్లాలోనే కాదు, ఆ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలంతటా క్రైస్తవాన్ని నమ్మడానికీ ఆచరించడానికీ వీలులేని పరిస్థితి ఏర్పడింది. చర్చిల దహనం, క్రైస్తవుల ఇళ్ల దహనం అడపా దడపా కొన్నేళ్ళుగా జరుగుతున్న ఘటనలే. గడచిన నెల రోజుల ఘటనలు పత్రికల కెక్కడానికి కారణం పరిమాణంలోని హెచ్చుదల మాత్రమే. ఆగస్ట్ నెల చివరి వారంలో కొన్ని వందల - బహుశా వేల - ఇళ్ళు, చర్చిలు, స్కూళ్లు తగలబెట్టి 27 వేల మందిని క్యాంపుల పాలు చేశారు. చాలా మందిని హతమార్చారు. ఆగస్ట్ 23 రాత్రి విహెచ్‌పి నాయకుడు లక్ష్మణానంద సరస్వతిని జాలస్ పేటలో మావోయిస్టులు చంపారు. చంపింది మావోయిస్టులేనని పోలీసులన్నారు. ఆ తరువాత మావోయిస్టులూ ప్రకటించారు. కాని లక్ష్మణానందను చంపింది మావోయిస్టులు కారనీ, క్రైస్తవులేననీ, మావోయిస్టులు మత ఘర్షణలలో జోక్యం చేసుకోరనీ విహెచ్‌పి అంటూ వచ్చింది. బహుశా మావోయిస్టులు చేసిన ఒక హత్య వారి పని కాదని హిందుత్వవాదులు ప్రచారం చేసిన ఏకైక ఉదంతం ఇదే కావచ్చు.

ఈ ఔదార్యానికి కారణం స్పష్టమే. హత్య మావోయిస్టులే చేశారని ఒప్పుకుంటే క్రైస్తవుల పైన చేస్తున్న దాడులకు బహానా ఉండదు. క్రైస్తవులే చేశారంటే ఆ తరువాత జరిగిన హింస యావత్తు లక్ష్మణానంద చేసిన సంఘ సేవ వల్ల ప్రయోజనం పొందిన ఆదివాసుల ధర్మాగ్రహం ఫలితమేనని ప్రచారం చేసుకోవచ్చు. చేసుకుంటున్నారు కూడ. కానీ క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలే లక్ష్మణానంద కూడ చేశాడని చెప్పి వాళ్లను దుర్మార్గులనడంలో అర్థం కనిపించదు. లక్ష్మణానంద ఆదివాసుల కోసం ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పాడనీ, మంచి బతుకు నేర్పించాడనీ, తాగుడు మానుకొమ్మన్నాడనీ, శుభ్రత అలవరచాడనీ అంటున్నారు. క్రైస్తవ మిషనరీలు కూడా అదే పని చేశారు మరి. వాళ్లు మత వ్యాప్తి కోసం చేశారంటే ఈయనా అందుకోసమే చేశాడు మరి. మిషనరీలు ప్రధానంగా హైందవ సమాజానికి అంటరాని వారైన దళితులలో మత వ్యాప్తి చేపట్టగా విశ్వహిందూ పరిషత్ ప్రధానంగా ఆదివాసులలో మత వ్యాప్తి చేపట్టింది. ఆదివాసులు హిందువులన్న తప్పుడు అభిప్రాయం వల్ల వీరు చేసిందీ మతవ్యాప్తేనన్న విషయం చూడలేకపోతే అది మన తప్పు. ఆదివాసులు హిందువులు కారు. క్రైస్తవులు కారు. వారిలో ఏ మత వ్యాప్తి జరిగినా అది మత మార్పిడే. అదనంగా లక్ష్మణానంద ఆధ్వర్యంలో క్రైస్తవం పుచ్చుకున్న దళితులను 'శుద్ధి' కార్యక్రమం ద్వారా వెనక్కి తెచ్చే యత్నమూ జరిగింది. దాని కోసం వారు ఆవు పేడతో కలిసిన నీళ్ళు తాగాలి,

బైబిల్‌ను చింపేయాలి, ఇంకెప్పుడైనా చర్చికి పోతే చచ్చిపోయినట్టేనని ఒట్టు పెట్టుకోవాలి. దీనికి 'పునరాగమనం' (ఘర్ వాపసీ) అని పేరు పెట్టినప్పటికీ ఇదీ మత మార్పిడే. ఒకటే తేడా - క్రైస్తవ మిషనరీలు బలవంతం చేసి మతం మార్చలేదు. కాని పునరాగమనం అని పిలవబడిన మత మార్పిడి మాత్రం తరచుగా హింసాత్మక రూపం తీసుకుంది. ఇప్పుడు అతిక్రూరమైన రూపం తీసుకుంటున్నది. నిజానికి హిందూ ధర్మ వ్యాప్తిని సాధించడం కంటే క్రైస్తవ మత వ్యాప్తిని నిరోధించడం లక్ష్మణానంద చేపట్టిన కార్యక్రమాల ముఖ్య లక్ష్యం. అదే ఘర్షణకు దారి తీసింది. ఈ అణచివేతను వ్యతిరేకించే ప్రజాతంత్ర రాజకీయ కార్యాచరణను చేపట్టే బదులు లక్ష్మణానందను హతమార్చడం ఏ పాటి విజ్ఞతతో చేసిన పని అని మావోయిస్టులు భావిస్తున్నారో తెలియదు గానీ, విశ్వహిందూ పరిషత్ దానిని అవకాశంగా తీసుకొని క్రైస్తవులపైన దాడిని ముమ్మరం చేసింది.

ఆగస్ట్ 24వ తేదీన లక్ష్మణానంద మృతదేహాన్ని జాలస్‌పేట నుంచి అతను తొలుత ఆశ్రమ పాఠశాల నెలకొల్పిన చొకాపడ వరకు ఊరేగింపుగా తీసుకు పోయారు. నేరుగా పోకుండా క్రైస్తవులు ఎక్కువగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారు. దారి పొడవునా కొంత విధ్వంసం చేసుకుంటూ పోయారు గానీ అసలు హింస తిరుగు ప్రయాణంలో జరిగింది. 25వ తేదీన అతని అంత్యక్రియలకు ప్రవీణ్ తొగాడియా హాజరయి తన మామూలు పద్ధతిలో హింసను రెచ్చగొట్టే ఉపన్యాసం ఇచ్చాడు. అక్కడి నుంచి తిరిగిపోతూ ఒక పద్ధతి ప్రకారం క్రైస్తవ గృహాలనూ చర్చిలనూ విద్యా సంస్థలనూ దహనం చేస్తూ, ధ్వంసం చేస్తూ పోయారు. వారి చేతులలో కత్తులు, పెట్రోలు, తుపాకులు ఉన్నాయి. అప్పటికి జిల్లా అంతటా కర్ఫ్యూ అమలులో ఉంది. కాని ఆ కర్ఫ్యూ బాధితులను సంఘటితం కాకుండా ఆపిందే తప్ప దుండగులకు అడ్డం కాలేదు. వారు కర్ఫ్యూలోనే చేయవలసిందంతా చేశారు. ఇవ్వాల్టికీ ఇది కొనసాగుతూనే ఉంది. మొన్నటి 18వ తేదీన కూడా రైకియా బ్లాక్‌లో రహదారి పక్కన ఉన్న అనేక గ్రామాలలో క్రైస్తవుల ఇళ్ళు, చర్చిలు తగల పెట్టారు. జనాన్ని అడవులలోకి తరిమారు. నిజానికి తలదాచుకోవడానికి చుట్టూ అడవి ఉండబట్టి వాళ్లు బతికిపోయారు. అయినప్పటికీ 29 మంది చనిపోయారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం లెక్క. 50 మందికి పైగా చనిపోయారని బాధితులు అంటున్నారు. చాలా క్రూరంగా చంపారు. కొందరిని తగలబడుతున్న ఇళ్ళలో పడేసి చంపారు. కొందరిని కాళ్ళు నరికి ఆ తరువాత మెడ నరికి చంపారు. హత్యాకాండలో ఆదివాసులు పెద్దఎత్తున పాల్గొన్నారనేది చెప్తున్నారుగానీ అడవి

ప్రాంతంలో స్థిరపడిన సవర్ణ హిందువులూ ఇందులో పాల్గొన్నారని మాత్రం చెప్పడం లేదు. ఆదివాసులకూ దళితులకూ మధ్యనున్న ఆర్థిక-సామాజిక వైరుధ్యాలను కొంత మంది వేలెత్తి చూపి, అవే హింసాకాండకు అసలు కారణం అంటున్నారు. ఆదివాసులకూ దళితులకూ కొన్ని వైరుధ్యాలున్న మాట వాస్తవమే. దళితులలో-ముఖ్యంగా క్రైస్తవులలో - చదువు స్థాయి సాపేక్షికంగా ఎక్కువే. చిన్నాచితక వ్యాపారాలు చేసే వారూ ఎక్కువే. ఆదివాసుల భూములను దళితులు స్వంతం చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. అయితే ఈ వైరుధ్యాలు క్రైస్తవ దళితులతోనే కాదు క్రైస్తవం పుచ్చుకోని దళితులతోనూ ఉన్నాయి. సవర్ణ హిందువులతో ఇంకా ఎక్కువ ఉన్నాయి.

కాబట్టి అసలు విషయం ఆ వైరుధ్యాలు కాదు. ప్రజా వర్గాల మధ్య అనేక వైరుధ్యాలు ఉంటాయి. వాటిని వాడుకొని తాము అణచదలచుకున్న వర్గానికి వ్యతిరేకంగా మరొక వర్గాన్ని సాయుధం చేసి దాడులు చేయించడం హిందుత్వవాదుల వ్యూహం. అది జరిగినప్పుడు పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తారు. మీడియా వారి పాటే పాడుతుంది. ఈ వ్యూహం లక్ష్యం ఆ ప్రజావర్గాల మధ్య న్యాయాన్ని సాధించడం కాదు తమ రాజకీయ లక్ష్యాన్ని సాధించడం. ప్రత్యేకించి, తమ వ్యూహానికి ఆదివాసులు పనికొచ్చినప్పుడు వారికి సహజమైన మిలిటెన్సీని హిందుత్వవాదులు చాలా క్రూరంగా వాడుకుంటున్నారు. గుజరాత్ మారణకాండలో ఆదివాసీ ప్రాంతాలలో ఇది చూశాం. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం రూపంలో చూశాం. ఇప్పుడు కంధమాల్‌లో చూస్తున్నాం.

ఆదివాసులు తమ కోసం తాము చేసుకున్న పోరాటాలలో ఇందులో పదో వంతు మిలిటెన్సీని ప్రదర్శించినా ప్రభుత్వాలు అతి క్రూరంగా అణచివేశాయి. హిందుత్వవాదుల అజెండాలో చిక్కుకొని ఏ ప్రజావర్గాలకూ మేలు చేయని విధ్వంసానికి పాల్పడినప్పుడు మాత్రం హిందుత్వవాదులతో ఒకటైన పాలనా యంత్రాంగాలు వారి హింసాకాండను అనుమతిస్తున్నాయి. ఇది ఆదివాసీ ప్రజల మేలుకోరేవారు ఆందోళన చెందవలసిన విషయం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*
*24 సెప్టెంబర్ 2008*

# ఆదివాసీ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను తిరస్కరిద్దాం

చాలా ఆందోళన కలిగించే కరపత్రం ఒకటి ఈ మధ్య భద్రాచలం ఏజెన్సీలో ప్రత్యక్షమయింది. దీనిని ప్రచురించిన సంస్థ పేరు 'జనజాతి సురక్షామంచ్' (గిరిజన సంరక్షణ సమితి - ఆంధ్రప్రదేశ్) అట. క్రైస్తవ మతం పుచ్చుకున్న ఆదివాసులకు ఎస్.టి రిజర్వేషన్ హక్కు వర్తింపజేయకూడదనేది ఈ కరపత్రం సారాంశం. ఇది ఆదివాసులను క్రైస్తవులు, క్రైస్తవేతరులుగా విభజించి అంతర్గత వైషమ్యాలకు కారణం అవుతుందనడంలో సందేహం లేదు.

ఆదివాసుల ఐక్యత అత్యవసరమయిన ప్రస్తుత స్థితిలో ఈ వైషమ్యాన్ని రాజేయడానికి పూనుకున్న ఈ 'మంచ్' వెనక ఉన్నదెవరు? ఒక పక్క పోలవరం ప్రాజెక్టు, మరొక పక్క సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాలోని 12 మండలాలలో ఆదివాసుల జీవితాలను కల్లోలమయం చేస్తున్నాయి. వాటిని ఎదుర్కొనడానికి కావలసిన సంకల్పం, ఐక్యత వివిధ కారణాల వల్ల ఇప్పటికే కొరవడ్డాయి. ఐక్యతను మరింత బలంగా పెంపొందించవలసిన ఈ దశలో మతం ప్రాతిపదికన ఆదివాసులను చీల్చి అనైక్యతను పెంపొందిస్తున్న వీరెవరు?

ఎస్.టి రిజర్వేషన్లలో 70 శాతాన్ని క్రైస్తవం పుచ్చుకున్న 18 శాతం మంది పొందుతున్నారనీ, 82 శాతంగా ఉన్న 'అసలైన వెనుకబడ్డ బీద గిరిజనులు' 30 శాతం రిజర్వేషన్ మాత్రమే

పొందుతున్నారనీ ఈ కరపత్రంలో అన్నారు. ఇవి ఎవరు తీసిన లెక్కలు? ఏ ప్రాంతానికి చెందినవి? ఏ జిల్లాకు చెందినవి? ఎప్పుడు తీసినవి? అసలు సత్యం ఏమిటంటే ఆదివాసీ ప్రజలకు ఉమ్మడిగా ఇచ్చిన రిజర్వేషన్ హక్కులో సింహభాగం ఏజెన్సీ ప్రాంతాలకు వెలుపల నివసించే తెగలు, వెలుపలి నుండి ఏజెన్సీలోకి ఈ మధ్యకాలంలో ప్రవేశించిన తెగలు పొందుతుండగా అనాదిగా ఏజెన్సీలో ఉంటున్న ఆదివాసులు చాలా తక్కువగా పొందుతున్నారు. దీనికి మతంతో ఏమీ సంబంధం లేదు. ఈ కారణంగా ఎస్.టి రిజర్వేషన్‌ను వర్గీకరించాలని ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసులు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నారు. అది ఎవరి మీదా ద్వేషంతో చేస్తున్న డిమాండ్ కాదు. న్యాయం కోసం చేస్తున్నది. పైగా అది ఏజెన్సీ ఆదివాసుల ఐక్యతను బలపరిచే డిమాండు. వారి సంఘటిత శక్తిని పెంచే డిమాండు. దాని స్థానంలో ఐక్యతను బలహీనపరిచే ఈ డిమాండు ఎవరి ప్రయోజనాల కోసం తీసుకొస్తున్నారు?

మతం మార్చుకున్నా ఆదివాసులు ఆదివాసులుగానే గుర్తించబడతారని రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 కింద రాష్ట్రపతి జారీ చేసిన ఆదేశం చెప్తున్న సంగతి ఈ కరపత్రం వేసిన 'మంచ్'కు తెలుసు. అయితే ఆ ఆదేశాన్ని సవరించాలన్నది వీరి కోరిక. 'సుప్రీంకోర్టు చెప్పినా' ప్రభుత్వాలు సవరించడం లేదని అన్నారు. ఇది అబద్ధం. సుప్రీంకోర్టు ఎప్పుడు చెప్పింది? ఏ తీర్పులో చెప్పింది? అసలు రాష్ట్రపతి ఆదేశాన్ని సవరించమని ఆదేశించే అధికారం సుప్రీంకోర్టుకు లేదే. అధికారం లేని ఈ పనిని సుప్రీంకోర్టు ఎందుకు చేస్తుంది?

'హరిజనుల్లో మతం మారితే ఎస్.సి జాబితా నుండి తొలగించి వేస్తారు. మరి గిరిజనులకు అలా ఎందుకు లేదు?' అని ఆ కరపత్రం ప్రశ్నిస్తుంది. దళితులు మతం మారినంత మాత్రాన ఎస్.సి రిజర్వేషన్ కోల్పోరు. బౌద్ధం, సిక్కు, జైన మతాలకు మారినా ఎస్.సిలుగానే కొనసాగుతారు. క్రైస్తవం, ఇస్లాం పుచ్చుకుంటేనే ఎస్.సి హోదా కోల్పోతారు. ఈ వివక్ష అన్యాయమనీ, దళిత క్రైస్తవులనూ దళిత ముస్లింలనూ కూడ ఎస్.సిలుగా గుర్తించాలనీ ఇవ్వాళ దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాతంత్ర శక్తులు సమర్థిస్తున్నాయి. దానికి విరుద్ధంగా ఆ వివక్షను ఆదివాసులలో ప్రవేశపెట్టాలని కోరడం ఏమిటి?

'మతం మారిన గిరిజనులు అటు అల్పసంఖ్యాకుల (మైనారిటీల) పేర, ఇటు గిరిజనుల పేర రెండు రకాల ప్రభుత్వ సౌకర్యాలు పొందుతున్నారు' అని ఆ కరపత్రం అంటుంది. మైనారిటీలుగా వారు పొందుతున్న 'ప్రభుత్వ సౌకర్యాలు'

ఏమిటి? ఒక్కటైనా చెప్పగలరా? మైనారిటీలకు మైనారిటీలుగా భారతదేశంలో ఉన్న హక్కు ఒక్కటే. అది తమ సంస్కృతినీ, సంప్రదాయాలనూ కాపాడుకునే హక్కు, తమ స్వంత విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకునే హక్కు. అయినా క్రైస్తవులెక్కడా కేవలం క్రైస్తవుల కోసమే విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకోలేదు. క్రైస్తవ విద్యా సంస్థలలో అందరికీ ఎప్పుడూ సమానంగా ప్రవేశం ఉంది.

'గిరిజనుల మౌలిక విశ్వాసాలను, సంస్కృతిని, పరంపరాగత ఆచార వ్యవహారాలను పరిరక్షించి నిలపడమే తమ లక్ష్యం' అని ఆ కరపత్రం వేసిన వారు అంటున్నారు. అది గౌరవించదగ్గ ఆలోచనే. ఒకపక్క ప్రాజెక్టులు, గనులు, పరిశ్రమల కోసం భూసేకరణ, మరొకపక్క గిరిజనేతరుల భూమి దాహం ఆదివాసుల ఉనికిపైన పెద్దెత్తున దాడి చేస్తున్నప్పుడు ఆదివాసులు ఒక్కటిగా నిలబడి ప్రతిఘటించాలంటే తమ సాంస్కృతిక గుర్తింపునూ ప్రత్యేకతనూ కాపాడుకోవడం చాలా అవసరం. అయితే దీనికి క్రైస్తవ మత మార్పిడి ఒక్కటే విరోధి ఎందుకయింది? ఆదివాసుల 'పరంపరాగత ఆచార వ్యవహారాలకు' వ్యతిరేకంగా ఎన్ని హైందవ ఆచారాలూ, ఆలోచనలూ ఇవాళ ఆదివాసుల సంస్కృతిలోకి ప్రవేశించలేదు? పట్టణాలలో ఉద్యోగరీత్యా ఉంటున్న ఆదివాసులు పెళ్లిళ్లు, పండుగలు ఆదివాసుల ఆచారం ప్రకారం కాక హైందవ సంస్కృతిని అనుసరించి చేసుకోవడం లేదా? ఇవాళ్టి ఆదివాసీ యువతరానికి హైందవ పురాణాలతో ఉన్న పరిచయం ఆదివాసీ గాథలతో ఉందా? ఇంకొంచెం చదువుకొని పెద్ద ఊర్లలో ఉంటున్నవారు పాశ్చాత్య సాంస్కృతిక రీతులకు లోను కావడం లేదా? ఒక్క క్రైస్తవ మత మార్పిడినే ఎందుకు వేలెత్తి చూపాలి? భద్రాచలం హైందవ పుణ్యక్షేత్రం కాబట్టి ఆ ఊరినీ దానిచుట్టూ 10 కిలోమీటర్ల ప్రాంతాన్నీ ఏజెన్సీ చట్టాల పరిధి నుండి తొలగించాలని ఆ ఊరిలోని గిరిజనేతరులు చేస్తున్న డిమాండు ఆదివాసీ ప్రజల ఉనికిపైన, అస్తిత్వంపైన దాడి కాదా? దాని గురించి ఈ 'మంచ్' ఏమంటుంది?

ఆదివాసీ ప్రజల ఐక్యత నిమిత్తం ఆదివాసీ సంస్కృతిపైన ఉన్న అన్ని అన్య ప్రభావాలనూ తిరస్కరించడానికి ఎవరైనా సూత్రబద్ధంగా కృషి చేసినట్టయితే, దాని సాధ్యాసాధ్యాల గురించి ఎంత సందేహం ఉన్నా ఆ కృషిని ఆదివాసీ ప్రజల మేలు కోరేవారందరూ గౌరవిస్తారు. కానీ ఒక్క క్రైస్తవాన్ని వేరు చేసి దానిపైన దాడి చేసే వైఖరిని హర్షించలేము.

ఎవరో తెలిసో తెలియకో ఒక కరపత్రం వేస్తే దాని గురించి ఇంత చర్చ ఎందుకంటారేమో. ఇది తెలిసో తెలియకో వేసిన కరపత్రం కాదు. ఆదివాసీ

సమాజాన్ని తమ అదుపులోకి తెచ్చుకోవడం కోసం దానిని రెండు వర్గాలుగా చీల్చి ఘర్షణలు పెట్టి హింసను రెచ్చగొట్టే అజెండా మన దేశంలో చాలా చోట్ల ఇప్పటికే అమలవుతున్నది. దీని వెనక ఉన్నది ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్లు. ఛత్తీస్గఢ్లో అది సల్వాజుడుం రూపం తీసుకుంది. దానిని మొదలుపెట్టింది కాంగ్రెస్ నాయకుడయినా అది ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విషయం తెలిసిందే. బిజెపి నాయకుడు వెంకయ్య నాయుడు మొన్నటి ఎన్నికలప్పుడు దేశంలో వారి కూటమిగాని అధికారంలోకి వచ్చినట్టయితే సల్వాజుడుంను ఆంధ్రప్రదేశ్లోనూ ఏర్పాటు చేస్తామన్నాడు. అది జరిగినట్టయితే ఎంత చేటు చేయగలదో భద్రాచలం ప్రాంతవాసులకు తెలుసు. ఎందుకంటే సల్వాజుడుం బాధితులు పెద్ద సంఖ్యలో భద్రాచలం డివిజన్కు వలస వచ్చి చావలేక బతుకుతున్న దీనస్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలో అదే అజెండా వేరొక రూపంలో అమలయింది. ఆదివాసులను దళిత క్రైస్తవుల పైకి రెచ్చగొట్టి అమానుషంగా దాడులు చేయించారు. అధికారిక లెక్కల ప్రకారమే 39 ప్రాణాలు పోయాయి, వేలమంది బలవంతంగా నిర్వాసితులయ్యారు.

ఆ అజెండా మరొక రూపంలో భద్రాచలంలో అమలు కావాలని మనం కోరుకుంటున్నామా? ఆదివాసీ సమాజం క్రైస్తవులు-క్రైస్తవేతరులు అంటూ రెండుగా చీలి ఘర్షించుకోవాలని కాంక్షిస్తున్నామా? ఆదివాసులలో ఈ సంఘర్షణ ఎవరికి మేలు చేస్తుంది? ఎల్టిఆర్ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్న గిరిజనేతరులకు, ఆదివాసీ ప్రాంతాన్ని బలవంతంగా ఖాళీ చేసి ఓపెన్కాస్ట్ బొగ్గు గనులు విస్తారంగా నెలకొల్పాలని చూస్తున్న సింగరేణి బొగ్గు గనుల కంపెనీకి, ఏడు ఏజెన్సీ మండలాలను ముంచి కింది ప్రాంతానికి నీళ్లిచ్చే పోలవరం డ్యాం కడుతున్న ప్రభుత్వానికీ తప్ప ఆదివాసులకేమైనా మేలు చేస్తుందా?

ఆలోచించమనీ, విచ్ఛిన్నకరమైన ఇటువంటి ప్రయత్నాలను తిరస్కరించమనీ ఆదివాసీ ప్రజానీకానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

*మానవహక్కుల వేదిక, ఖమ్మం జిల్లాశాఖ కరపత్రంగా వచ్చింది*
*28 జూన్ 2009*

# పర్‌స్పెక్టివ్స్ ఎందుకోసం

**మా**నవజాతి భవిష్యత్తును గురించి ఇవ్వాళ చాలా చర్చ జరుగుతూ ఉంది. ఏ రకమయిన అసమానతగానీ, అణచివేతగానీ లేని సమాజం కావాలని అభ్యుదయవాదులందరూ కోరుకుంటారు. కానీ ఆ సమాజ స్వరూప స్వభావాలను గురించి ఏకాభిప్రాయం మట్టుకు అభ్యుదయవాదులలో సర్వత్రా లేదు. మార్క్స్ రచనలతో ఒక ప్రామాణికమయిన రూపం తీసుకున్న చర్చ ఈనాటికీ ముగియలేదు. అణచివేతలోనూ అసమానతలోనూ కొత్త కోణాలను చరిత్ర ముందుకు తెచ్చేకొద్దీ చర్చ మరింత వాడిగా సాగుతూ ఉంది. మరింత జటిలం అవుతూ ఉంది. కొత్త కోణాలలో కొన్ని నిజానికి చాలా పాతవే కావడంతో వాటిని ఇన్నాళ్ళూ ఎందుకు చూడలేకపోయామన్న విమర్శ చర్చకు కొంత వేడిని కూడా చేరుస్తూ ఉంది.

ఆ చర్చలో అనేక రకాల దృక్పథాలు గల వ్యక్తులు పాల్గొంటున్నారు. అనేక ఉద్యమాలు పాల్గొంటున్నాయి. అసమానతకూ, అణచివేతకూ కొత్త కోణాలను ఆవిష్కరించేవారు, ఇప్పటికే ఉన్న విప్లవ సిద్ధాంతాలు వాటిని ఆకళింపు చేసుకోలేవనే వారు, అసలు కొత్త కోణాల ఆవిష్కరణే నిరుపయోగ మయిన ప్రయాస అనుకునేవారు, ఇప్పటికి ఉన్న సిద్ధాంతాలే సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ అవగాహన చేసుకోగలవనుకునే వారు, అసలు ‘సిద్ధాంతం’, ‘నిర్మాణం’ అనేవే మానవజాతి వికాసానికి అవరోధం అనుకునే వారు, అభ్యుదయం కోసం ఇప్పటిదాకా జరిగిన ప్రయత్నమంతా వృథా అనుకునేవారు, దాని మంచి చెడుల నుండి గుణపాఠాలు తీసుకోగల మనుకునేవారు, రాజకీయ ఆచరణలో నిమగ్నం అయినవారు, ఆచరణతో నిమిత్తం లేనివారు...ఇంకా అనేకులు ఇవాళ మానవ భవితవ్యాన్ని గురించిన ఈ చర్చలో పాల్గొంటున్నారు.

ఈ చర్చకు సంబంధించి ‘పర్‌స్పెక్టివ్స్’కు ఒక దృక్పథం ఉంది. మానవ సమాజం గురించీ దాని భవిష్యత్తు గురించీ బుద్ధుడి నుండి ఈనాటిదాకా అనేకులు ఊహలు చేశారు. సిద్ధాంతాలు చేశారు. ఎవ్వరూ కాదనలేని ఆదర్శాలు మన ముందుంచారు. ఆ ఆదర్శాలను సాధించే మార్గాలను ప్రతిపాదించారు. ఈ అన్వేషణకు శాస్త్రీయ ప్రాతిపదిక కల్పించి నేలమీద నిలబెట్టింది మార్క్సిజం. మార్క్స్ రచనలు చేయడం మొదలు పెట్టిన తరువాత చర్చ యావత్తూ ఆయన

ప్రతిపాదించిన అధ్యయన చట్రం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంది. అంగీకరించేవాళ్ళూ, సవరించేవాళ్ళూ, తిరస్కరించే వాళ్ళూ అందరూ దానినే ప్రమాణంగా స్వీకరించారు. ఇవ్వాళ తూర్పు యూరప్, సోవియట్ రష్యా, చైనా దేశాలలో వస్తూన్న మార్పుల ఫలితంగా చెలరేగుతున్న చర్చ స్వభావం కూడా ఇందుకు భిన్నంగా లేదు. ఇకమీదట ఉండబోతుందని మేము అనుకోవడం లేదు.

ఇప్పటికీ సిద్ధాంతం ఆచరణలకి సంబంధించిన సమస్యలని మార్క్సిజం అధిగమించిందని చెప్పలేం. పాత సమస్యలు పరిష్కరించుకునే క్రమంలో కొత్త సవాళ్ళు మార్క్సిజం ముంగిట కొస్తున్నాయి. కొత్త నిర్వచనాలు, కొత్త ప్రతిపాదనలు, ప్రత్యామ్నాయాలు రూపొందుతున్నాయి. సామాజిక పరివర్తన కోసం జరుగుతున్న మొత్తం చర్చలో భాగమే మార్క్సిజం గురించిన చర్చ కూడా. ఈ చర్చలో అన్ని కోణాలకూ అన్ని పోకడలకూ వేదిక కల్పించాలని 'పర్‌స్పెక్టివ్స్' భావిస్తూ ఉంది. ఆర్థిక పరిమితుల వల్ల అన్ని పుస్తకాలు ప్రచురించ వీలుకాకున్నా, ఆ దిశగా చర్చను ప్రతిపాదించే పుస్తకాలను ప్రచురించాలనుకుంటున్నాం.

అణచివేతనూ, అసమానతనూ వ్యతిరేకించేది ఏదయినా ప్రజాస్వామిక దృక్పథమే. మౌలికంగా అభ్యుదయ దృక్పథమే. ఆపైన ఎన్ని తేడాలున్నా వినదగినదే, చర్చించదగినదే, అధ్యయనం చేయదగినదే. ***'నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ'*** అని మావో ఒక చారిత్రక సందర్భంలో ఇచ్చిన పిలుపుకు ఈ నిర్దిష్టమయిన అర్థంలో సార్వత్రిక ప్రాతిపదిక ఉందని 'పర్‌స్పెక్టివ్స్' భావిస్తూ ఉంది. ఆ అవగాహనతో ప్రచురణలు చేపడుతోంది. ప్రజాస్వామిక స్వభావం కలిగిన సమర్థవంత మయిన రచనలను ఎక్కువగా తెలుగులో, వీలున్నప్పుడు ఇంగ్లీషు, హిందీలో కూడా ప్రచురించడం ద్వారా కొనసాగుతున్న 'గ్రేట్ డిబేట్'కు దోహదం చేయాలని మా సంకల్పం.

మే
1999

**కె. బాలగోపాల్**
**పర్‌స్పెక్టివ్స్**
సామాజిక శాస్త్రం / సాహిత్యం
హైదరాబాదు

# 1988 నుంచి 2015

# పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు

| | | | |
|---|---|---|---|
| ★ | 1. Probings in the Political Economy of Agrarian classes and Conflicts - | May 1988 | by K. Balagopal<br>Ed. G. Haragopal |
| ★ | 2. సహచరులు - | జూలై 1989 | వరవరరావు |
| ★ | 3. పతంజలి భాష్యం - | జూలై 1989 | కె.ఎన్.వై. పతంజలి |
| ★ | 4. సృజన సంపాదకీయాలు | జనవరి 1990 | వరవరరావు/సాహితీ మిత్రులు |
| ★ | 5. అభివృద్ధి వెలుగునీడలు | మే 1990 | ఆర్.ఎస్.రావు |
| ★ | 6. కఠోర షడ్జమాలు - | తొలి ముద్రణ 1990<br>మలి ముద్రణ 1996 | వసంత కన్నబిరాన్ |
| ★ | 7. మతవర్గ తత్వం - | ఫిబ్రవరి 1991 | ఎడిటర్స్ : హరి, జి. హరగోపాల్ |
| ★ | 8. ఇలా మిగిలేం - | తొలి ముద్రణ 1991<br>మలి ముద్రణ 1993 | చలసాని ప్రసాదరావు |
| ★ | 9. పరాధీన భారతం | తొలి ముద్రణ 1992<br>మలి ముద్రణ 1993 | ఎ.బి.కె. ప్రసాద్ |
| ★ | 10. డంకెల్ దుశ్శాసనం | జూన్ 1993 | నూర్ భాషా |
| ★ | 11. దినదినగండం | సెప్టెంబర్ 1993 | అనువాదం :<br>కోదండ రామిరెడ్డి |
| ★ | 12. మన చలం - | మే 1994 | ఎడిటర్ : కృష్ణాబాయి |
| ★ | 13. Towards Understanding Semi Feudal Semi Colonial Society | Jan 1995 | by R.S. Rao<br>Ed. D. Narasimha Reddy |
| ★ | 14. ఏడోసారా కథ | జూలై 1995 | బుర్ర రాములు |
| ★ | 15. శాక్కొ - వాంజెట్టి | నవంబర్ 1995 | బి. చంద్రశేఖర్ |
| ★ | 16. బంగారమ్మ కథ | జనవరి 1996 | అనువాదం - కృష్ణాబాయి |
| ★ | 17. కార్టూన్ కబుర్లు - | సెప్టెంబరు 1996 | మోహన్ |
| | 18. నాకో పిస్తోల్ కావాలి - | అక్టోబర్ 1996 | అనువాదం :<br>చలసాని ప్రసాదరావు |
| | 19. సాహిత్యంలో వస్తు శిల్పాలు | మార్చ్ 1997 | త్రిపురనేని మధుసూదనరావు |

| | | |
|---|---|---|
| ★ 20. కల్లోల కథా చిత్రాలు | డిసెంబర్ 1997 | కె. బాలగోపాల్<br>ఎడిటర్ : చలసాని ప్రసాద్ |
| ★ 21. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్కరణలు/ ప్రపంచబ్యాంక్ ఎజెండా | మార్చ్ 1998 | ఎడిటర్ : డి. నరసింహారెడ్డి |
| ★ 22. మూడు దశాబ్దాల నక్సల్బరీ గమ్యం-గమనం | తొలి ముద్రణ ఆగస్ట్ 98<br>మలి ముద్రణ అక్టోబర్ 98 | ఎడిటర్స్ :<br>ఎస్. సుధాకర్,<br>ఎం. కోదండరామిరెడ్డి |
| ★ 23. పరాధీన భారతంలో దారితప్పిన రూపాయి | డిసెంబర్ 98 | ఎ.బి.కె. ప్రసాద్ |
| ★ 24. శారద నవలలు (ఏది సత్యం, మంచీ-చెడు, అపస్వరాలు) | ఆగస్ట్ 99 | శారద (ఎస్. నటరాజన్) |
| ★ 25. సింగరేణి | నవంబర్ 2000 | ఎం.డి. మునీర్ , ఎం.డి. అన్వర్ |
| ★ 26. ఖాదర్ లేడు | మే 2001 | మహమ్మద్ ఖదీర్ బాబు |
| ★ 27. ప్రమాదంలో ప్రజారోగ్యం | ఫిబ్రవరి 2002 | డా॥ ఎస్. తిరుపతయ్య<br>డా॥ పి. జగదీశ్వర్ |
| ★ 28. ఎన్జీవోల కథ | జనవరి 2003 | బి. చంద్రశేఖర్ |
| ★ 29. జాగ్తే రహో | జూన్ 2003 | చలసాని ప్రసాదరావు<br>ఎడిటర్ : డి. వెంకట్రామయ్య |
| ★ 30. ఉదయగీతిక (రెండవ కూర్పు తొలిముద్రణ) | డిసెంబర్ 2003 | రచన - యాంగ్ మో<br>అనువాదం : ఎన్. వేణుగోపాల్ |
| ★ 31. వరల్డ్ సోషల్ ఫోరం ఆర్థిక రాజకీయాలు | జనవరి 2004 | **RUPE (MUMBAI)**<br>అనువాదం : బి. చంద్రశేఖర్ |
| ★ 32. ఎర్రమందారాలు (రెండవ కూర్పు తొలి ముద్రణ) | మే 2005 | రచన-లోకువాంగ్-పిన్ యాంగ్ యీ-యెన్<br>అనువాదం : డా॥ టి.నళిని |
| ★ 33. నూరేళ్ళ తెలుగు నవల (1878-1977) | ఆగస్ట్ 2007 | సహవాసి<br>సంపాదకులు- డి. వెంకట్రామయ్య |
| 34. అల్లంరాజయ్య సాహిత్యం -1 | జనవరి 2008 | అల్లం రాజయ్య<br>సంపాదకులు-వరవరరావు |

మూడు నవలలు- (కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం)


| | | |
|---|---|---|
| 35. విభిన్న | ఆగష్టు 2008 | హరిపురుషోత్తమరావు |
| 36. పతంజలి భాష్యం | మార్చ్ 2009 | కె.ఎన్.వై.పతంజలి |
| 37. మృగన | ఏప్రిల్ 2009 | విమల |
| 38. రాజ్యం - సంక్షేమం | అక్టోబర్ 2010 | కె. బాలగోపాల్ |
| 39. అల్లం రాజయ్య సాహిత్యం-2 సృష్టికర్తలు (కథలు) | ఏప్రిల్ 2011 | అల్లం రాజయ్య సంపాదకులు-వరవరరావు |
| 40. సంభాషణ | జులై 2011 | కె. శ్రీనివాస్ |
| 41. దళిత | అక్టోబర్ 2011 | కె. బాలగోపాల్ |
| 42. జాజిమల్లి (మొదటి ముద్రణ) | డిసెంబర్ 2011 | మల్లీశ్వరి |
| (రెండవ ముద్రణ) | ఏప్రిల్ 2012 | |
| 43. త్రిపుర (కథలు) | డిసెంబర్ 2011 | త్రిపుర |
| 44. ప్రాణహిత (మొదటి ముద్రణ) | జులై 2012 | అల్లం నారాయణ |
| (రెండవ ముద్రణ) | సెప్టెంబర్ 2012 | |
| 45. మనిషి మార్క్సిజం(మొదటి ముద్రణ) | అక్టోబర్ 2012 | కె. బాలగోపాల్ |
| (రెండవ ముద్రణ) | మార్చ్ 2013 | |
| 46. కొమురం భీము | జనవరి 2013 | సాహు అల్లం రాజయ్య సంపాదకులు-వరవరరావు |
| 47. సింహాలపేట (కథలు) | మార్చ్ 2013 | రమణజీవి |
| 48. రిజర్వేషన్లు ప్రజాస్వామిక దృక్పథం (మొదటి ముద్రణ) | అక్టోబర్ 2013 | కె. బాలగోపాల్ |
| (రెండవ ముద్రణ) | ఫిబ్రవరి 2014 | |
| 49. వసంతగీతం (నవల) | డిసెంబర్ 2013 | అల్లం రాజయ్య సంపాదకులు-వరవరరావు |
| 50 LEADERS BEYOND MEDIA IMAGES | డిసెంబర్ 2013 | K. Balagopal Ed. G. Haragopal |
| 51. స్వేచ్ఛారావం (సామాజిక రాజకీయ వ్యాసాలు) | జులై 2015 | జి. హరగోపాల్ |
| 52. ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత | అక్టోబర్ 2015 | కె. బాలగోపాల్ |

★ ప్రతులు లేవు

**Perspectives**

***Social Sciences / Literature***

**Publishing *for* Change**



Adivasulu -
Vaidyam Samskruthi Anachivetha
(Writings on Adivasi Culture,
Repression and Neglect)
essays in telugu by
K.Balagopal

మూడు నుండి నాలుగు వేల సంవత్సరాల క్రితం సముద్ర తీరంలోని నదీ డెల్టాలలోనూ, నదీ లోయలలోనూ, ఇతరత్రా అనుకూలమయిన ప్రాంతాలలోనూ ఆటవిక సమాజం నశించి వ్యవసాయిక వర్గ సమాజం ఏర్పడడం ప్రారంభమయింది. సముద్రతీరంలోని పల్లపు భూములు, కృష్ణ, గోదావరి, కావేరి, మహానది, నర్మద, తపతి, ఇతర ఉత్తర భారతదేశపు నదులు - ఒక్కొక్కటీ ఒక్కొక్క కేంద్రమయింది. ఈ ఒక్కొక్క కేంద్రంలో ఏర్పడ్డ వర్గ సమాజం ఒక్కొక్క 'జాతి'కి (తెలుగు, తమిళ, మలయాళ, మరాఠా, ఒరియా వగైరా) బీజమయింది. ఈ జాతులు ఆ కేంద్రం నుండి వీలయినంత దూరం విస్తరిస్తూ అడవులను మైదానాలుగా మారుస్తూ అక్కడి ఆటవికులను తమలో బలవంతంగా కలుపుకుంటూ పోయాయి. ఈ విధంగా ఒక్కొక్క ఆధునిక జాతి ఏర్పడింది. ఒక జాతికీ మరొక జాతికి మధ్య వాటి విస్తరణకు ఇంతవరకు లొంగని అడవులు, పీఠభూములు మిగిలిపోయాయి. అక్కడ నివసించే ఆటవికులు ఆర్థికంగా ఇప్పటికీ ఆటవికులుగానూ, సాంస్కృతికంగా ఏజాతికీ చెందనివారుగానూ మిగిలి పోయారు. అందుకే మన దేశంలో ఏ రెండు పరిసర రాష్ట్రాలను తీసుకున్నా వాటి సరిహద్దుల్లో అడవులు, కొండలు, పీఠభూములు, అక్కడ నివసించే గిరిజనులు కనబడతారు. ఏ రాష్ట్రంలోనూ రాష్ట్ర గర్భంలో గిరిజనులు కనబడరు...

బ్రిటిష్ వాళ్ల కాలం నుండి ఇప్పటిదాకా మన దేశం సాధించిన 'అభివృద్ధి' వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజనులే. అత్యధికంగా ఈ 150 సంవత్సరాలలో తిరుగుబాట్లు చేసింది కూడా గిరిజనులే.

-కె.బాలగోపాల్

ISBN 978-93-81172-09-4

Perspectives
Social Sciences/Literature
Publishing *for* Change
₹ 100/-